సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 155
సోమవారం 25-8-2025



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



పుజారా గుడ్‌బై
క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత సీనియర్ ప్లేయర్ -14లో



రుణం భారమా.. 'రాజీ' ఉందిగా!
లోన్ సెటిల్‌మెంట్‌తో బయటపడొచ్చు బాకీలో 50% వరకు తప్పదు -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గ'ఘన' రక్షణ వ్యవస్థ సక్సెస్
ఎస్–400 ప్రత్యామ్నాయంగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఐఏడీడబ్ల్యూఎస్‌ను భారత్ విజయవంతంగా పరీక్షించింది.
వివరాలు 6లో ▸



బీజేపీ, ఈసీ మిలాఖత్
బీజేపీ, ఈసీ ఒక్కటయ్యాయని, 'ఎస్ఐఆర్' ముసుగులో ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నాయని రాహుల్ మండిపడ్డారు.
వివరాలు 6లో ▸



చర్చలు జరగాలి...
చట్టసభల్లో ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరగాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆకాంక్షించారు.
వివరాలు 6లో ▸



భార్యను తగలబెట్టాడు
భర్త రూపంలోని కట్న పిశాచి పైశాచికత్వానికి మరో మహిళ బలైంది. యూపీలో గ్రేటర్ నోయిడాలో ఈ దారుణం జరిగింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

వాస్తవాలు దాచి ప్రభుత్వంపై ఆరోపణలా?



రాష్ట్రంలో యూరియా కొరత వెనుక ఉన్న వాస్తవాలను దాచి రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదని, కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు ఆయన స్థాయిని తగ్గించేలా ఉన్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు.
- వివరాలు 5లో▶

రష్యా అణు ప్లాంట్‌పై దాడి



రష్యాలోని అతిపెద్ద అణు విద్యుత్ ప్లాంట్లలో ఒకటైన కస్క్ అణు విద్యుత్కేంద్రంపై శనివారం రాత్రి డ్రోన్ దాడి జరిగింది. ఇది ఉక్రెయిన్ పనేనని రష్యా ఆరోపించింది.
- వివరాలు 6లో▶

బై ఎలక్షన్లతో కాంగ్రెస్‌కు బైబై



త్వరలోనే అసెంబ్లీ ఉప ఎన్నికలు రానున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వానికి అవే బైబై ఎన్నికలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు దమ్ముంటే రాజీనామా చేసి ఉపఎన్నికల్లో పోటీచేసి గెలవాలని సవాల్ విసిరారు.
- వివరాలు 12లో▶

ఫీజుల పెంపా? కుదింపా?




ఇంజనీరింగ్ ఫీజుల పెంపు అంశాన్ని రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ సోమవారం నుంచి తిరిగి పరిశీలించనుంది. అన్ని డాక్యుమెంట్లతో హాజరవ్వాలని ఇప్పటికే 180 కాలేజీలకు నోటీసులు పంపింది. తొలిరోజు 20 కాలేజీలతో చర్చించనున్నారు.
- వివరాలు 16లో▶

ఎక్కడ ప్లస్.. ఎక్కడ మైనస్!

ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలపై సమగ్ర సమీక్షకు ప్రభుత్వం కసరత్తు

- ➤ శాఖలవారీగా పోస్టుల మంజూరు, వర్కింగ్, వేకెంట్, డిమాండ్‌పై విశ్లేషణ
- ➤ మాజీ సీఎస్ శాంతికుమారి నేతృత్వంలో ఇప్పటికే కమిటీ ఏర్పాటు
- ➤ సరిపడా పోస్టుల్లేని శాఖలను గుర్తిస్తూనే ఎక్కువ పోస్టులున్న శాఖల సమతౌల్యానికి సిఫార్సు!
- ➤ ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లోని గణాంకాల ఆధారంగా పరిశీలన
- ➤ శాఖలవారీగా కార్యదర్శులు, హెచ్ఓడీలతో కమిటీ సమాలోచనలు
- ➤ ఈ నెలాఖరుకల్లా సమీక్షలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక.. నివేదికను పరిశీలించాకే కొత్త జాబ్ కేలండర్ ఖరారు!



సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో కేడర్ వారీగా మంజూరైన పోస్టులు, పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, ఖాళీలు, డిప్యుటేషన్, సెలవులపై వెళ్లిన ఉద్యోగులు.. ఇలా వివిధ కోణాల్లో రాష్ట్ర సర్కారు సమగ్ర సమీక్ష చేపట్టనుంది. ప్రధానంగా పనిభారానికి తగినట్లుగా పోస్టులున్నాయా? లేనట్లయితే డిమాండ్ ఎలా ఉంది? అనే అంశాల ప్రాతిపదికన సమీక్ష నిర్వహించనుంది. ఇందుకోసం మాజీ సీఎస్ శాంతి కుమారి నేతృత్వంలో ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో గత నెలలో కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. శాఖలవారీగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతోపాటు శాఖాధిపతులతో సమీక్షలు నిర్వహించాలని కమిటీని ఆదేశించింది. కమిటీకి స్పష్టమైన సమాచారాన్ని అందించాలని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్ని విభాగాల హెచ్ఓడీలకు గత వారం సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెలాఖరుకల్లా సమీక్షలు పూర్తి చేసి నివేదిక సమర్పించాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. త్వరలో
మిగతా 2వ పేజీలో ▶

త్వరలో నూతన జాబ్ కేలండర్

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నూతన జాబ్ కేలండర్ విడుదల చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి కసరత్తు కూడా ముమ్మరం చేసింది. గతేడాది విడుదల చేసిన జాబ్ కేలండర్‌కు ఎస్సీ వర్గీకరణ అంశం ప్రతిబంధకంగా మారడంతో అమలు సాధ్యపడలేదు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ కొలిక్కి రావడంతో నూతన జాబ్ కేలండర్ జారీ అవసరమైంది. దీంతో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల పరిశీలనకు నిర్దేశించిన కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా కొత్త ఉద్యోగాల గుర్తింపుపై స్పష్టత రానుంది. ఆ తర్వాత ప్రభుత్వ శాఖల ప్రతిపాదనలను ఆర్థిక శాఖ ఆమోదించాక నూతన జాబ్ కేలండర్ ఖరారు కానున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ముక్కలు చేసి మూసీలో పడేసి..

ఐదు నెలల గర్భవతిపై అనుమానంతో భర్త కిరాతకం

- మొండెం ఇంట్లో దాచి మిగిలిన భాగాలు మూసీలో పడేసిన వైనం
- ఆపై భార్య కనిపించట్లేదంటూ పోలీసు కేసు పెట్టేందుకు ప్రయత్నం
- అనుమానంతో ఇంటికి తీసుకెళ్లిన పోలీసులు.. బండారం బయటపడటంతో అరెస్ట్
- 'మీర్‌పేట్'ఉదంతాన్ని మరువక ముందే బోడుప్పల్‌లో అదే తరహా ఘటన

సాక్షి, హైదరాబాద్/మేడిపల్లి/అనంతగిరి: భాగ్యనగరంలో మరోసారి 'మీర్‌పేట్'తరహా కిరాతకం వెలుగుచూసింది. గతేడాది కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న ఓ యువకుడు భార్యపై అనుమానంతో ఘాతుకానికి పాల్పడ్డాడు. ఐదు నెలల గర్భిణి అనే కనికరం కూడా లేకుండా భార్యను పక్కా పథకం ప్రకారం హతమార్చి ఆపై మృతదేహాన్ని హాక్సా బ్లేడ్‌తో ముక్కలు చేసి పలు భాగాలను మూసీలో పడేశాడు. అనంతరం ఏమీ ఎరుగనట్లు భార్య కనిపించట్లేదంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించి పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. నిందితుడిని ఆదివారం అరెస్టు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్య సమాజ్‌లో కులాంతర వివాహం: మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజా రెడ్డి, హతురాలి కుటుంబీకుల కథనం ప్రకారం వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన సామల మహేందర్‌రెడ్డి (27) అదే గ్రామానికి చెందిన స్వాతి అలియాస్ జ్యోతి (21) ప్రేమించుకున్నారు. పెద్దలను ఎదిరించి గతేడాది జనవరిలో కూకట్‌పల్లిలోని
మిగతా 5వ పేజీలో ▶



మహేందర్‌రెడ్డి



స్వాతి (ఫైల్)

పొడిచి చంపి.. పెట్రోల్ పోసి తగలబెట్టి

- భార్య ప్రవర్తనపై అనుమానంతో భర్త దురాగతం
- ఇటీవలే భర్త చెంతకు తిరిగి రాక.. అయినా ఫోన్లు, చాటింగ్‌లలో మునిగితేలుతోందని ఆగ్రహం
- మందలించినా వినకపోవడంతో హతమార్చేందుకు స్కెచ్

5 లో

డర్టీ మర్డర్స్

మంటగలుస్తున్న మానవ సంబంధాలు
- వివరాలు 7లో



మీ అభిప్రాయం ఏంటి?

ఏజీతో సమావేశమైన మంత్రులు భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు

- స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% కోటాపై కసరత్తు షురూ
- నేడు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఢిల్లీలోని న్యాయ కోవిదుల అభిప్రాయ సేకరణ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంలో కాంగ్రెస్ పార్టీ నియమించిన మంత్రుల కమిటీ కసరత్తు ప్రారంభించింది. ఆదివారం ప్రజాభవన్‌లో కమిటీ సమావేశమై రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి అభిప్రాయం తీసుకుంది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మిగతా 12వ పేజీలో ▶



హైదరాబాద్‌లో సురవరం పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డి. రాజా, కూనంనేని, సీతక్క, పశ్య పద్మ, సంపత్, పల్లా, సత్యం, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు

సురవరం పేరును శాశ్వతం చేస్తాం

మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

- జీవితాంతం సిద్ధాంతానికి కట్టుబడిన నేత సురవరం: సీఎం రేవంత్‌రెడ్డి
- మఖ్దూమ్ భవన్‌లో సురవరంకు నివాళి
- సుధాకర్‌రెడ్డి పార్థివదేహం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగింత
- మఖ్దూమ్‌భవన్ నుంచి గాంధీ మెడికల్ కాలేజీ వరకు అంతిమయాత్ర
- భారీగా తరలివచ్చిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు

సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్/గాంధీ ఆస్పత్రి: తెలంగాణ ప్రజలకు ఆదర్శంగా నిలిచిన వ్యక్తులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తుందని, అందులో భాగంగానే దివంగత కమ్యూనిస్టు అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి పేరు శాశ్వతంగా నిలిచిపోయేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఉద్యాన వర్సిటీకి, జైపాల్‌రెడ్డి పేరును పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పెట్టామని, అలాగే సురవరం విషయంలో కూడా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. శనివారం రాత్రి మరణించిన సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి ఆదివారం మఖ్దూమ్ భవన్‌లో సీఎం నివాళులర్పించారు. అనంతరం సీపీఐ నేతలు నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బాలూనాయక్, కాంగ్రెస్ నేతలు చిన్నారెడ్డి, అంజన్‌కుమార్‌యాదవ్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. సురవరం మృతి తెలంగాణకు మిగతా 3వ పేజీలో ▶

లైఫ్ సైన్సెస్ కేంద్రంగా తెలంగాణ

- 'తెలంగాణ రైజింగ్–2047'కు ఆ రంగాలు చాలా కీలకం
- సుల్తాన్‌పూర్‌లో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్కు
- ఆసియా పసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో సీఎం రేవంత్

2 లో

పేరెంట్స్... ముందు మీరు పాటించండి

పిల్లలు మెత్తటి మట్టి ముద్దల్లాంటి వారు. వారిని చక్కగా మలచటం పెద్దల చేతుల్లోనే ఉంటుంది. 'మొక్కై వంగనిది మానై వంగునా?' అనే సామెత ఎలాగూ ఉన్నదే! వాళ్లు మొక్కలుగా ఉన్నప్పుడే.. వాళ్లు మంచి అలవాట్లు, బాధ్యతలు నేర్చుకోవాలంటే.. అవి చేసి చూపించాల్సింది, పాటించాల్సింది మొదట తల్లిదండ్రులే.
- వివరాలు 12లో



దివి నుంచి నిర్విఘ్నంగా భువికి..

గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ సక్సెస్

- బంగాళాఖాతంలో సురక్షితంగా దిగిన మాడ్యూల్
- ఇస్రో, డీఆర్డీఓ, ఎయిర్‌ఫోర్స్, నేవీ, కోస్ట్‌గార్డ్ సంయుక్తంగా నిర్వహణ

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గగన్‌యాన్ ప్రాజెక్టు'లో అత్యంత కీలకమైన 'క్రూ మాడ్యూల్ ఎయిర్ డ్రాప్ టెస్ట్'విజయవంతమైంది. అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు తిరిగి భూమిని చేరే సమయంలో వారు ప్రయాణించే మాడ్యూల్‌ను సురక్షితంగా నేలకు దింపటంలో నైపుణ్యాన్ని సాధించేందుకు ఈ పరీక్ష నిర్వహించారు. ఇస్రో, డీఆర్డీఓ, ఎయిర్‌ఫోర్స్, నేవీ, కోస్ట్‌గార్డ్ ఈ ప్రయోగంలో పాలుపంచుకున్నాయి. ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్ ద్వారా డమ్మీ
మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



..ధనిక సీఎం అని తెలియగానే పేదలందరూ దత్తత తీసుకోమని వెంటపడుతున్నారు!



బండి బీసీ కాదు.. దేశ్‌ముఖ్

- ఆయన ఎప్పుడూ దొంగ ఓట్లతోనే గెలిచారు.
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సంచలన వ్యాఖ్యలు
- కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో జనహిత పాదయాత్ర

- వివరాలు 12లో

ఆధార్‌లో తెలంగాణ ఉంటేనే... ఉచిత ప్రయాణమట!



సంగారెడ్డి–జహీరాబాద్ రూట్‌లో ఓ ఆర్టీసీ బస్సులో అతికించిన నోటీసు

బస్సుల్లో కండక్టర్ల సూచనలు.. జీరో టికెట్లు ఇచ్చేందుకు నిరాకరణ

- ఉమ్మడి రాష్ట్రంలో పొందిన ఆధార్‌లో ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ పేరే
- వాటిని సవరించుకునేందుకు ఆధార్ కేంద్రాలకు పోటెత్తుతున్న మహిళలు
- తాము అలాంటి ఆదేశాలివ్వలేదంటున్న ఉన్నతాధికారులు
- కానీ.. బస్సుల్లో పది రోజులుగా కొనసాగుతున్న అలజడి

సాక్షి, హైదరాబాద్: ఆధార్ సవరణ కేంద్రాలకు ఉన్నట్టుండి మహిళలు క్యూ కడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న ఆధార్ కార్డుల్లో ఇంటి చిరునామాలో ఆంధ్రప్రదేశ్ స్థానంలో తెలంగాణ అని మార్చుకుంటున్నారు. కొందరు ఫొటోలను అప్‌డేట్ చేసుకుంటున్నారు. మీసేవ కేంద్రాలు, పోస్టాఫీస్ ఆధార్ సెంటర్లు, ఆధార్ సవరణ కేంద్రాలు.. ఇలా ఎక్కడ వీలుంటే అక్కడ ఆధార్ కార్డులను సవరించుకునేందుకు మహిళలు పోటెత్తుతున్నారు. ఆధార్ కార్డులోని ఇంటి చిరునామాపై తెలంగాణ బదులు ఏపీ అని ఉంటే ఆర్టీసీ బస్సుల్లో
మిగతా 12వ పేజీలో ▶



మండే ఎండలు.. తెరపివ్వని వానలు!

మరో ఐదేళ్లలోగా తెలంగాణలో మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో తీవ్రస్థాయిలో వాతావరణ మార్పులు చోటుచేసుకోనున్నాయా? ప్రస్తుతానికంటే సుదీర్ఘ వేసవి, అధిక వేడి, రెండింతలు ఎక్కువగా వడగాడ్పులు, ఉక్కపోత.. అలాగే మరింత తరచుగా తెరపివ్వని వానలతో అధిక వర్షపాతం నమోదు కానున్నాయా?
- వివరాలు 2లో▶

క్లుప్తంగా...

టీచర్ల సమస్యలు పరిష్కరిస్తాం

ఎస్టీయూటీఎస్ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి రిటైర్‌మెంట్ సభలో సీతక్క



పర్వత్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మంత్రి సీతక్క.చిత్రంలో కోదండరాం, చాడ

సాక్షి, హైదరాబాద్: టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్టీయూటీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సదానందం గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ అభివృద్ధిలో ఎస్టీయూ కీలక పాత్ర పోషించిందని అన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమానికి పర్వత్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి మాట్లా డుతూ.. దేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వమే ఏర్పడి, ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ.. అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి, పాఠశాల విద్య అడిషనల్ డైరెక్టర్ కె. లింగయ్య, ఆర్జేడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండుసార్లు రన్‌వేపైకి వెళ్లి తిరిగొచ్చిన విమానం

తిరుపతి వెళ్లే ఫ్లైట్‌లో సాంకేతిక లోపం



సిబ్బందితో ప్రయాణికుల వాగ్వాదం

శంషాబాద్: తిరుపతి బయలుదేరిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఎయిర్‌లైన్స్ అధికారులు దానిని రద్దు చేశారు. అలయన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో 33 మంది ప్రయాణికులతో తిరుపతి బయలుదేరేందుకు రన్‌వేపైకి వెళ్లింది. మరికొద్ది సెకన్లలో టేకాఫ్ తీసుకునే ముందు విమానంలో సమస్యను పసిగట్టిన పైలట్లు ఏటీసీ అనుమతితో దానిని తిరిగి వెనక్కి తీసు కొచ్చారు. సాంకేతిక సమస్య పరిశీలన తర్వాత విమానం మరోసారి బయలుదేరేందుకు సిద్ధమై రన్‌వే వైపునకు వెళ్లింది. మళ్లీ సమస్యను గుర్తించిన పైలట్లు మరోసారి దానిని తిరిగి వెనక్కి తీసుకొచ్చారు. దీంతో ఎయిర్‌లైన్స్ అధికారులు విమానాన్ని రద్దు చేశారు. ఐదు రోజుల కిందట కూడా తిరుపతి బయలుదేరిన అలయన్స్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తిన విషయం తెలిసిందే.

నవంబర్ 2న మాలల రణభేరి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధంగా జరిగిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకుండా ఏకపక్షంగా వర్గీకరణ జరిపారని, దీంతో మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాలు దక్కకుండా, అణచివేసే కుట్రకు పాల్పడిందని విమర్శించారు. తమ పోరాటంలో భాగంగా నవంబర్ 2న హైదరాబాద్‌లో మాలల రణభేరి నిర్వహిస్తున్నట్లు చెన్నయ్య తెలిపారు.

2030 కల్లా తెలంగాణపై, ముఖ్యంగా హైదరాబాద్‌పై వాతావరణ మార్పుల పెను ప్రభావం

సుదీర్ఘ వేసవి, అధిక వేడి, తీవ్రమైన వడగాడ్పులు, అధిక వర్షపాతం



- ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాలపైనా ఎఫెక్ట్
- వివిధ అధ్యయనాలు, వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరికలు
- దేశవ్యాప్తంగా ప్రతి 10కి 8 జిల్లాలు ప్రభావితమయ్యే అవకాశం
- భారత్ ఏడాదికి 87 బిలియన్ యూఎస్ డాలర్ల మేర నష్టపోతుందని అంచనా
- ఈఎస్ఆర్ఐ, ఐపీఈ సంస్థల నివేదికలో కీలక అంశాలు
- సత్వర ముందుజాగ్రత్త చర్యలు అత్యంత ఆవశ్యకమంటున్న శాస్త్రవేత్తలు

తెరపివ్వని వానలు!

సాక్షి, హైదరాబాద్: మరో ఐదేళ్లలోగా తెలంగాణలో మరీ ముఖ్యంగా హైదరాబాద్ మహా నగరంలో తీవ్రస్థాయిలో వాతావరణ మార్పులు చోటుచేసుకోనున్నాయా? ప్రస్తుతానికంటే సుదీర్ఘ వేసవి, అధిక వేడి, రెండింతలు ఎక్కువగా వడగాడ్పులు, ఉక్కపోత.. అలాగే మరింత తరచుగా తెరపివ్వని వానలతో అధిక వర్షపాతం నమోదు కానున్నాయా?..అంటే అవుననే అంటున్నారు వాతావరణ శాస్త్రవేత్తలు. వివిధ అధ్యయనాలు కూడా నిజమేనని అంటున్నాయి. 2030 కల్లా హైదరాబాద్ సహా దేశంలోని ముంబై, ఢిల్లీ, చెన్నై మహా నగరాలతో పాటు పాట్నా, సూరత్, ఠాణె, భువనేశ్వర్, తదితర నగరాల్లో ఈ పరిస్థితి తలెత్తబోతోందని హెచ్చరిస్తున్నాయి. ఆ సమయానికల్లా దేశవ్యాప్తంగా 10కి 8 జిల్లాల్లో ఎడతెరపిలేని వానలు, అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పుల (క్లైమేట్ ఛేంజ్) ప్రభావం మన దేశంపై ముఖ్యంగా తెలంగాణపై పడబోతోందని పలు నివేదికల సారాంశాన్ని బట్టి స్పష్టమవుతోంది. ఇటీవల ఎన్విరాన్‌మెంటల్ సిస్టమ్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈఎస్ఆర్ఐ), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొఫెషనల్స్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ) సంస్థలు సంయుక్తంగా 'వెదరింగ్ ద స్టార్మ్ : మేనేజింగ్ మాన్‌సూన్స్ ఇన్ ఎ వార్మింగ్ క్లైమేట్'పేరిట సిద్ధం చేసిన కీలక నివేదికలో వివిధ అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నివేదిక ప్రకారం ఈ వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా పడనున్న దేశాల్లో భారత్ ప్రపంచంలో ఏడో స్థానంలో నిలుస్తోంది. అత్యంత తీవ్రంగా మారనున్న వాతావరణ పరిస్థితులు (ఎక్స్‌ట్రీమ్ వెదర్ ఈవెంట్స్) కారణంగా ఇండియా ఏడాదికి 87 బిలియన్ యూఎస్ డాలర్ల మేర నష్టపోతుందని అంచనా వేస్తున్నారు.

ఊహించని విధంగా మార్పులు..

ఇటీవలి కాలంలో తీవ్రాతి తీవ్ర ఉష్ణోగ్రతలు, అత్యంత అధిక వర్షపాతం వంటివి నమోదు కావడం ఊహించని విధంగా పెరిగింది. గత మూడు దశాబ్దాలలో (1993–2024 మధ్య) మార్చి–ఏప్రిల్–మే, అలాగే జూన్–జూలై–ఆగస్టు–సెప్టెంబర్ నెలల్లో సైతం భారత్‌లో తీవ్రమైన వడగాడ్పులు ఉండే రోజుల్లో 15 రెట్ల పెరుగుదల నమోదైంది. గత దశాబ్దాన్నే పరిగణనలోకి తీసుకుంటే ఆందోళనకరంగా తీవ్రమైన వేడి గాలుల రోజులు 19 రెట్లు పెరిగాయి. వర్షాకాలం లేని రోజుల్లో తప్ప దేశంలో రుతుపవనాల కాలంలో కూడా వేసవి పొడిగింపు (ఎక్స్‌టెండెడ్ సమ్మర్) పరిస్థితిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు.



సత్వర చర్యలు ప్రారంభించాల్సిందే..

భవిష్యత్తులో తలెత్తబోయే ప్రమాదకర పరిస్థితులను అధిగమించేందుకు, వీలైనంత మేర అలాంటి పరిస్థితులు తలెత్తకుండా తక్షణ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నివేదిక సూచించింది. నివేదిక ఇంకా ఏమందంటే..

- సత్వరమే సైన్స్ ఆధారిత విధానాన్ని రూపొందించి, అవసరమైన చర్యలు చేపట్టాలి
- వాతావరణంలో చోటు చేసుకోబోయే మార్పులకు సంబంధించి..జాతీయ స్థాయిలో రియల్ టైమ్ ముప్పు అంచనాల నిమిత్తం క్లైమేట్ రిస్క్ అబ్జర్వేటరీలు (సీఆర్ఓ) ఏర్పాటు చేయాలి.
- అతి భారీ వర్షపాతం, అత్యధిక ఉష్ణోగ్రతలు వంటివి తలెత్తినపుడు చేపట్టాల్సిన చర్యల కోసం 'రిస్క్ ఫైనాన్సింగ్ ఇన్‌స్ట్రుమెంట్లు'తయారు చేయాలి
- ఎదురయ్యే విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేలా జిల్లా స్థాయిల్లో విపత్తు నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలి
- అధిక ఉష్ణోగ్రతలు, భారీ వర్షపాతం నమోదైన సందర్భాల్లో.. వివిధ సంస్థలు, ఏజెన్సీలు అత్యధిక స్థాయిల్లో ఎదురయ్యే ప్రమాదాలను ఎదుర్కొనేందుకు వీలుగా ప్రాథమ్యాలను నిర్దేశించుకోవాలి.

2030 కల్లా ఉష్ణోగ్రతల్లో 1.5 డిగ్రీల పెరుగుదల

గ్లోబల్ వార్మింగ్‌లో భాగంగా 2030 కల్లా 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ మేర ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రభావం ఇండియాపై తీవ్రంగా ఉండబోతోంది. ముఖ్యంగా హైదరాబాద్ తదితర నగరాల్లో అనియంత్రిత పట్టణీకరణ పెరుగుదల, మొత్తంగా రోడ్లు, పరిసరాలు సిమెంట్, తారుమయం కావడంతో వర్షపు నీరు ఇంకే పరిస్థితి లేకుండా పోయింది. పట్టణీకరణతో కాంక్రీట్ నిర్మాణాలు వృద్ధి, తద్వారా ఉష్ణోగ్రతల్లో వృద్ధి, వివిధ రకాల కాలుష్యాల పెరుగుదల, కాంక్రీట్ నిర్మాణాల వృద్ధి, చెత్తా చెదారం పెరుగుదల వంటివి చోటు చేసుకుంటున్నాయి. ఇవి పరోక్షంగా వాతావరణ మార్పులకు దోహదం చేస్తున్నాయి. హైదరాబాద్ వంటి చోట్ల చెరువులు, కుంటలను ఆక్రమించి విచక్షణారహితంగా నిర్మాణాలు వచ్చేశాయి. ఈ పరిస్థితుల్లో భారీ వర్షాలు కురిసినపుడు నీరు ఎక్కడికి పోతుంది? ఇప్పటిదాకా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుస్థిర నగర అభివృద్ధికి సంబంధించిన విధానాలను అభివృద్ధి చేయకపోవడం శోచనీయం.



- ప్రొ.కె.పురుషోత్తమ్‌రెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త

ప్రత్యామ్నాయ ఇంధన వినియోగం పెంచాలి

కర్బన ఉద్గారాలు విపరీతంగా పెరిగిపోతుండడంతో పర్యావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉష్ణోగ్రతలు, వర్షపాతమూ పెరుగుతోంది. హైదరాబాద్ వంటి నగరాల్లో వ్యక్తిగత వాహనాల వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగి, వివిధరకాల ఇంధనాల వినియోగంతో కాలుష్యం, వేడి పెరుగుతోంది. చెత్తకాల్చడం, పారిశ్రామిక కాలుష్యాలు, అన్నీ కలగలిసి 'హీట్ ఐలాండ్ ఎఫెక్ట్'పెరుగుతోంది. ఈ కారణంగా నగరాల్లోనే అధిక వర్షాలు కురుస్తాయి. ఒక్కసారిగా హ్యూమిడిటీ పెరిగి కుంభవృష్టికి దారితీస్తుంది. ప్రస్తుతం పరిస్థితుల తీవ్రతను చూస్తుంటే ఉష్ణోగ్రతలు (అంబియెంట్ టెంపరేచర్) 60 డిగ్రీల దాకా వెళ్లే సూచనలు కన్పిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కాలుష్యం శుద్ధి కంటే తగ్గించే దిశలో చర్యలు తీసుకోవాలి. పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి వాటి వినియోగం తగ్గించి సోలార్, విద్యుత్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం పెంచాలి.



- డా.దొంతి నర్సింహారెడ్డి, పబ్లిక్ పాలసీ స్పెషలిస్ట్, వ్యవసాయ రంగ నిపుణులు



సాగర్ వద్ద సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు

శ్రీశైలం 10.. సాగర్ 26..

గేట్లు ఎత్తి నీటి విడుదల

దోమలపెంట/నాగార్జునసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో పది గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 3,80,380 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 881.4 అడుగుల వద్ద 195.6605 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాగా, సాగర్ 26 గేట్లు ఎత్తి స్పిల్‌వే మీదుగా 3,12,724 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,495 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలు, ఏఎమ్మార్పీ, వరదకాల్వలకు 19,219 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయ గరిష్టస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 584.90 అడుగులు (297.1465 టీఎంసీలు) నీరు ఉంది. కాగా.. ఆదివారం కావడంతో సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది.

మేడిగడ్డకు 4.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద తగ్గుముఖం పడుతోంది. ఆదివారం ఎగువ నుంచి గోదావరి, ప్రాణహిత నదుల వరదతో 4.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. 85 గేట్లు ఎత్తి అదేస్థాయిలో ఔట్‌ఫ్లోగా వదులుతున్నారు. కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద 7.720 మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహిస్తోంది.

లైఫ్ సైన్సెస్ కేంద్రంగా తెలంగాణ

'తెలంగాణ రైజింగ్-2047'కు ఆ రంగాలు చాలా కీలకం

- సుల్తాన్‌పూర్‌లో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్కు
- పరిశోధన, తయారీ రంగాలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాం
- ఆసియా పసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో సీఎం రేవంత్



బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డాక్టర్ నాగేశ్వరరెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'తెలంగాణ రైజింగ్–2047' లక్ష్యాలను సాధించడంలో ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్, మెడ్ టెక్, వైద్య పరికరాల తయారీ వంటి రంగాలు చాలా కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో నిర్వహించిన ఆసియా పసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్– 2025 కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. తెలంగాణను తయారీ రంగం ఆవిష్కరణలకు కేంద్రంగా మార్చుతున్నామని తెలిపారు. సుల్తాన్‌పూర్‌లో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్కును ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడ పరిశోధనలు, పరీక్షలు, తయారీ రంగాలకు ఉత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు 60కి పైగా హైదరాబాద్‌లో పనిచేస్తున్నాయని తెలిపారు. డయాగ్నస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీ, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్‌లో పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. స్థానిక స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, గ్లోబల్ కంపెనీలతో కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధ బయోడి జైన్‌కు మంచి ఉదాహరణ అని తెలిపారు. తెలంగాణ రైజింగ్–2047 తో 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని వెల్లడించారు. 'చాలా ఏళ్లుగా మన మేధస్సును ఇతర దేశాల కోసం ఉపయోగిస్తున్నాం. ఇప్పుడు మన ప్రజల కోసం పనిచేయాల్సిన సమ యం వచ్చింది. అందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారాలు అందిస్తుంది' అని హామీ ఇచ్చా రు. స్కిల్ యూనివర్సిటీ, కార్పొరేషన్లు, విద్యా సంస్థలను రిసెర్చ్ సెంటర్లతో అనుసంధానం చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలో అనిశ్చిత పరిస్థి తులు కనిపిస్తున్నాయని, ఈ సమయంలో ఆవిష్క రణలకు తెలంగాణ సరైన వేదిక అని తెలిపారు. కార్యక్రమంలో ఏఐజీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త కోర్టుతో సత్వర కేసుల పరిష్కారం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద



కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ సూరేపల్లి నంద. చిత్రంలో జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి

జిన్నారం (పటాన్‌చెరు): కొత్తగా కోర్టును ప్రారంభించడం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను తొందరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని హైకోర్టు న్యా యమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద పేర్కొన్నారు. జిన్నారంలో కోర్టు ఏర్పాటుతో ప్రజలకు దూరాభారం తగ్గిందని, న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ఆదివారం జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తాత్కాలిక భవనాన్ని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూరేపల్లి నంద మాట్లాడుతూ.. హైకోర్టు అధికారులతో చర్చించి శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నా రు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి భవానీచంద్ర, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్, తెలంగాణ మాజీ బార్ కౌన్సిల్ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎక్కడ ప్లస్.. ఎక్కడ మైనస్!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ప్రకటించనున్న జాబ్ క్యాలెండర్ సైతం ఈ నివేదికపైనే ఆధారపడనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

డిమాండ్ అండ్ సప్లై తరహాలో...

ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో ఉద్యోగుల పాత్రే అత్యంత కీలకం. ప్రభుత్వం అమలు చేసే ప్రతీ కార్యక్రమం సజావుగా జరగాలంటే డిమాండ్‌కు తగ్గట్లు ఉద్యోగుల పోస్టులు మంజూరు చేయాలి. ఒకవేళ ఉద్యోగ ఖాళీలుంటే వెంటనే భర్తీ చేయాలి. ప్రస్తుతం కొన్ని శాఖల్లో డిమాండ్‌కు సరిపడా ఉద్యోగులు లేరు. దీంతో సంక్షేమ కార్యక్రమాల అమలు ఇబ్బందికరంగా ఉంటోంది. ఉదాహరణకు బీసీ సంక్షేమ శాఖ పరిధిలో కొత్తగా 11 ఆర్థిక సహకార సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ఆయా కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినా ఉద్యోగుల పోస్టులు మంజూరు చేయలేదు. దీంతో ఆయా విభాగాల్లో కార్యక్రమాల అమలు గందరగోళంగా ఉంది. ఇలాంటి పరిస్థితిని అధిగమించేలా డిమాండ్‌కు సరిపడా కొలువులు నిర్దేశించేందుకు వ్యూహాత్మక కార్యాచరణను సర్కారు రూపొందిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం డిమాండ్‌కు సరిపడా పోస్టులు లేని శాఖలను గుర్తిస్తూనే ఎక్కువ పోస్టులున్న శాఖలను గుర్తించి వాటిని సమతౌల్యం చేసేలా కమిటీ సూచనలు చేసే అవకాశం ఉంది.

కమిటీ పరిశీలించనున్న అంశాలు...

- ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) ఆధారంగా ప్రతి విభాగంలో మంజూరైన శాశ్వత, తాత్కాలిక పోస్టులు, వాటిల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఖాళీల వివరాలు.
- ప్రభుత్వం అనుమతించిన డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులు, భర్తీ కోసం గుర్తించిన పోస్టులు, నియామకాలు పూర్తి చేసిన తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగుల సంఖ్య.
- శాశ్వత ప్రాదిపదికన ఉద్యోగాలు భర్తీ చేశాక తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న వారి తొలగింపు వివరాలు.
- ప్రభుత్వ శాఖల్లో డిమాండ్‌కు తగినట్లు అదనపు పోస్టుల ప్రతిపాదనలు, కొత్తగా ప్రతిపాదించిన పోస్టుల నియామకాల వల్ల పడే ఆర్థికభారం అంచనా.
- ఆర్థిక భారం తగ్గించుకోవడానికి గతంలో పోస్టులు మంజూరు చేసి పెండింగ్‌లో పెట్టిన పోస్టుల సమాచారం.
- ప్రభుత్వ శాఖల్లో అనుమతి లేకుండా తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు.



కొన్ని డాల్ఫిన్లు.. కొన్ని చేపలు.. ఓ అవకాశవాది పెలికాన్..

ఈ డాల్ఫిన్లు ఉన్నాయే.. ఇవి చేపలను రకరకాలుగా వేటాడతాయి. అందులో ఓ పద్ధతి.. తీరానికి తీసుకొచ్చి వేటాడటం.. ఈసారి అలాగే చేయాలని ప్లాన్ చేశాయి. కొన్ని గ్రూపుగా ఏర్పడి.. చేపల గుంపును తీరం వైపునకు నెట్టాయి. చేపలు ఒడ్డుకు వస్తే.. అక్కడి బురదలో చిక్కుకుంటాయి. దాంతో డాల్ఫిన్లు వెంటనే వాటిని నోట కరుచుకుని.. మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోతాయి. ఇక్కడ కూడా చివరి వరకూ అంతా ప్లాన్ ప్రకారమే సాగింది. సడన్‌గా భారీ ట్విస్టు.. మొత్తం విషయాన్ని దూరం నుంచి చూసేసిన ఓ పెలికాన్ అవకాశం కోసం వేచి చూసింది. చాన్స్ రాగానే.. ఇదిగో ఇలా అమాంతం అందిపుచ్చుకుంది.

- అమెరికాకు చెందిన జొ అనే ఫొటోగ్రాఫర్ తీసిన ఈ చిత్రం ఓషియన్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీలో ఫైనలిస్టుగా నిలిచింది.



ఇండియన్ బాక్సాఫీస్ బొనాంజా


జూలైలోనే రూ.1,430 కోట్ల వసూళ్లు

ఈ ఏడాది ఒక నెలలో ఇదే అధికం

2025లో రూ.12,000 కోట్లు దాటే చాన్స్

ఇండియన్ బాక్సాఫీస్ జూలైలో రూ.1,430 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇదే అత్యధికం. సైయారా, మహావతార్ నరసింహ చిత్రాలు ఈ జోరుకు కారణం. ఈ రెండు సినిమాలే జూలై వసూళ్లలో 45 శాతం పైగా వాటా సాధించాయి. పండగ సీజన్ జోష్‌తో 2025లో మొత్తం రూ.12,000 కోట్ల కలెక్షన్స్ దాటుతాయని పరిశ్రమ ధీమాగా ఉంది. ఈ ఏడాది జనవరి–జూలై మధ్య రూ.7,175 కోట్లు వసూలయ్యాయి. 2024 ఇదే కాలంతో పోలిస్తే ఇది 22 శాతం అధికం కావడం విశేషం. భారత్‌లోని సిల్వర్ స్క్రీన్స్ ఇప్పటి వరకు 2023లో అత్యధికంగా రూ.12,226 కోట్లు అందుకున్నాయి. 2025 ఈ రికార్డు బ్రేక్ చేస్తుందేమో చూడాలి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



2025 జనవరి-జూలైలో ఆదాయంలో వాటా శాతాల్లో

భాష	శాతం
హిందీ	40
తెలుగు	19
తమిళం	15
హాలీవుడ్	12
మలయాళం	8
ఇతర భాషలు	6


2025 జనవరి-జూలైలో టాప్-10 సినిమాలు, కలెక్షన్లు రూ.కోట్లలో

సినిమా	కలెక్షన్
ఛావా	693
సైయారా	392
మహావతార్ నరసింహ	259
సంక్రాంతికి వస్తున్నాం	222
సితారే జమీన్ పర్	201
హౌజ్‌ఫుల్-5	200
రైడ్-2	199
గుడ్ బ్యాడ్ అగ్లీ	182
గేమ్ ఛేంజర్	153
తుడరుమ్	144

గాజా.. గజ గజ

మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలతోపాటు వియత్నాం, అఫ్గానిస్తాన్ యుద్ధాల్లో కవరేజీకి వెళ్లి మృతిచెందిన జర్నలిస్టులకన్నా గాజాలో గత రెండేళ్లలోనే ఎక్కువ మంది జర్నలిస్టులు మృతిచెందారని పలు అంతర్జాతీయ జర్నలిస్టు సంఘాలు ఆందోళన వెలిబుచ్చుతున్నాయి. గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధానికి దాదాపు రెండేళ్లు పూర్తి కావొస్తున్న నేపథ్యంలో గాజాలో ఇప్పటివరకు 270 మంది జర్నలిస్టులు మృత్యువాతపడ్డారని గణాంకాలను విడుదల చేశాయి. మృతుల్లో ఎక్కువ మంది పాలస్తీనియన్లే ఉన్నారని పేర్కొన్నాయి. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేపట్టిన ఉగ్రదాడుల్లో వెయ్యి మందికిపైగా పౌరులు మృతిచెందారు. అలాగే సుమారు 200 మంది ఇజ్రాయెల్ పౌరులను ఉగ్రవాదులు బందీలుగా గాజాకు పట్టుకెళ్లారు. ఆ మర్నాటి నుంచే గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది.

- సాక్షి, సెంట్రల్ డెస్క్





సురవరం అంతిమయాత్ర సందర్భంగా ఎర్రదండు కవాతు





సురవరం భౌతికకాయంపై సీపీఐ జెండా కప్పుతున్న డి.రాజా, నారాయణ, కూనంనేని తదితరులు ● చివరిసారి అంజలి ఘటిస్తున్న కుటుంబ సభ్యులు

సురవరం పేరును శాశ్వతం చేస్తాం







సురవరం భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, వినోద్ కుమార్, కాలేరు వెంకటేశ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ● వైఎస్సార్‌సీపీ నేతలు అయోధ్యరామిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ● మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

తీరని లోటు అని విచారం వ్యక్తంచేశారు. నిరాడంబర జీవితం గడిపిన సుధాకర్‌రెడ్డి ఏనాడూ తన సిద్ధాంతాలను విడిచిపెట్టలేదని కొనియాడారు. బూర్గుల రామకృష్ణారావు, సూదిని జైపాల్‌రెడ్డి తరహాలోనే సురవరం సుధాకర్‌రెడ్డి కూడా మహబూబ్‌నగర్ జిల్లాకు వన్నె తెచ్చారని అన్నారు. విద్యార్థి దశ నుంచి చివరి శ్వాస వరకు విలువలకు కట్టుబడి జీవించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో సురవరం సుధాకర్‌రెడ్డి ఆలోచనలు ఉన్నాయని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, వినోద్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సురవరం భౌతికకాయానికి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించి చిరస్మరణీయ ముద్ర వేసుకున్న సురవరం మరణం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేటీఆర్ అన్నారు. దేశం గొప్ప నాయకుడిని కోల్పోయిందని బండారు దత్తాత్రేయ నివాళులర్పించారు.

అధికార లాంఛనాలతో..

సురవరం సుధాకర్‌రెడ్డికి సీపీఐ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్‌భవన్‌లో సురవరంకు ప్రభుత్వం అధికార లాంఛనాలతో గౌరవ వందనం సమర్పించింది. అనంతరం మధ్యాహ్నం 3.20 గంటలకు ఆయన అంతిమయాత్ర మఖ్దూమ్‌భవన్ నుంచి నారాయణగూడ చౌరస్తా, చిక్కడపల్లి, ముషీరాబాద్ మీదుగా సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ గాంధీ మెడికల్ కాలేజీకి చేరింది. అంతిమయాత్రలో ముందు భాగంలో పోలీసు కవాతు ఉండగా, అనంతరం సీపీఐ వలంటీర్లు ఎర్ర జెండాల కవాతు, ప్రజానాట్య మండలి కళాకారుల విప్లవ గీతాలాపనల మధ్య యాత్ర కొనసాగింది. అనంతరం సుధాకర్‌రెడ్డి పార్థివ దేహాన్ని ఆయన సతీమణి డాక్టర్ బి.వి. విజయలక్ష్మి, కుమారులు కపిల్, నిఖిల్ కలిసి గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, ప్రొఫెసర్ రమాదేవి, ప్రొఫెసర్ సుధాకర్‌కు అప్పగించారు. సురవరం భౌతికకాయానికి ఎంబామింగ్ (రసాయనాల పూత) చేసి భద్రపరుస్తామని.. వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం వినియోగిస్తామని చెప్పారు. సురవరం తన కళ్లను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు డి.రాజా, కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, చాడ వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, నెల్లికంటి సత్యం, పల్లా వెంకట్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ పెద్దిరాజు రవిచంద్ర, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గుడిసెకు నిప్పు

ఐనవోలు: దంపతుల మధ్య గొడవ ఇంటి దహనానికి దారితీసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కక్కిరాలపల్లి వడ్డెరగూడేనికి చెందిన బోదాసు సాంబరాజు–రాజేంద్ర దంపతులు బండ కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం భార్యను కొడుతున్న క్రమంలో చిన్న కుమారుడి తల, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే రాజేంద్ర తన కుమారుడిని ఆస్పత్రికి తీసుకెళ్లింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సాంబరాజు తాను ఉంటున్న గుడిసెకు గ్యాస్ ఆన్ చేసి నిప్పంటించాడు. ఈ ఘటనలో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సాంబరాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.



కాలిన గుడిసె

సురవరం అంతిమయాత్ర
చిత్రాలు, మరిన్ని రాష్ట్ర వార్తలు
సాక్షి ప్లస్ (ఈపేపర్)లో



సుఖమునప్పుడు ఎగిరి గంతులేయడం గానీ దుఃఖం ఎదురైనప్పుడు కృంగిపోవడం గానీ చేయకుండా రెండు స్థితులను సమానంగా చూసేవాడే ధర్మవంతుడు.

– ఎస్.ఎన్. గోయెంకా

సాక్షి

సోమవారం, 25 ఆగస్టు 2025

నేల విడిచిన సమరం

చిన్నపాటి ప్రాంతాన్ని ఏలిన రాజును సైతం భూమండలమేలినవాడిగా పేర్కొని ఆకాశానికెత్తడం మన ఇతిహాస, పురాణాల్లో కనిపిస్తుంది. మహాభారతంలో దుష్యంతుని గురించి నన్నయ రాస్తూ, అతడు మహాబలవంతుడనీ, దిక్కుల చివర ఏనుగులతో అలంకృతమైన భూమండలమంతా తన అధీనంలో ఉండగా; సూర్య కిరణాలు, గాలీ కూడా చొరలేని మహారణ్యాలను, దేశాలను అజేయ పరాక్రమంతో ఏలాడనీ అంటాడు. అన్ని రకాల బలాలూ, బలగాలూ కలిసొస్తే భూమి మొత్తాన్ని శాసించాలనే పాలకుల ఆకాంక్ష అలాంటి అభివర్ణనలలో తొంగిచూస్తుంది. యుద్ధాలనేవి భూమినింకా దాటని దశ అది. నేటి సాంకేతిక అభివృద్ధి పుణ్యమా అని యుద్ధాలు ఆకాశ మార్గం పట్టేశాయి. భూయుద్ధాలు గతస్మృతులై, యుద్ధం ఈ రోజున అక్షరాలా నేల విడిచిన సమరమైంది.

పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మనం జరిపిన 'ఆపరేషన్ సిందూర్' దానిని అత్యాశ్చర్యకరంగా కళ్ళకు కట్టింది. 'అర్థశాస్త్రం'తో సహా ప్రాచీన గ్రంథాలు యుద్ధతంత్రంలో చెప్పిన అన్ని ఉపాయాలను, మాయోపాయాలను, పూర్తిగా సైనిక సాయంతో కాకుండా శాస్త్ర సాంకేతిక సాయంతో అందులో ప్రయోగించినట్టు చెబుతున్నారు. అంతర్జాల కేంద్రితంగా, కృత్రిమ మేధ సృష్టించిన సమాచారంతో, డ్రోణులపైనా, గ్రౌండ్ పొజిషనింగ్ సిస్టమ్స్(జీపీఎస్)పైనా, ఉపగ్రహాలపైనా ఆధారపడి చేసిన ఎలక్ట్రానిక్ యుద్ధంగా అభివర్ణిస్తున్నారు. రష్యా సాయంతో మనం అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులను, రఫేల్ వంటి యుద్ధ విమానాలను బరిలోకి దింపి విజయవంతంగా వాడుకున్న తీరు, నేటి యుద్ధాలు భూమ్యాకాశాల మధ్య పోరుగా మారడాన్ని ప్రత్యక్షంగా చాటాయి.

సాంప్రదాయిక యుద్ధాలతో పోల్చితే, ఈ గగనతల యుద్ధాలు దేశాలకూ, జనాలకూ తెచ్చిపెట్టే కష్టాలూ అనేక రెట్లు ఎక్కువనీ; ఏ దేశానికాదేశం ఎప్పటికప్పుడు సాంకేతికంగా పై చేయిని సాధించడమే దీనికి పరిష్కారమన్న హెచ్చరికా వినిపిస్తోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో వెలుగు చూసిన వివరాలు ఇలాంటి యుద్ధాలతో ముడిపడిన ప్రమాదాలను భయభ్రాంతంగా చూపిస్తున్నాయి. ఉక్రెయిన్ జనానికి టెలివిజన్ సేవలందించే ఒక ఉపగ్రహాన్ని రష్యా నిపుణులు హ్యాక్ చేసి వాటిలో యుద్ధ శకటాలతోనూ, ఆయుధ సంపత్తితోనూ తమ సైనికులు జరిపే విన్యాసాల దృశ్యాలను ప్రసారం చేశారు. ఒక్క గుండు కూడా పేల్చకుండా, ఉపగ్రహాలను నిర్వీర్యం చేయడం ద్వారా, సమాచార అంధకారాన్ని సృష్టించి ఒక దేశ భద్రతనూ, దాని ఆర్థిక వ్యవస్థనూ దెబ్బతీసే ప్రమాదాన్ని రూపుగడుతున్నారు. సాంకేతికతను మెరుగుపరచుకుంటూ అన్ని విధాలా పోటీకి సన్నద్ధమైతే తప్ప ఈ సవాలును ఎదుర్కోవడం కష్టమనీ, సాంకేతిక సంపత్తి దేశాల మనుగడకు గీటురాయి అయిందనీ అంటున్నారు. అంతేకాదు, యుద్ధాలు గగన సీమను దాటి గ్రహాంతరాలకు చేరుకోవడమూ పొడగడుతోంది. చంద్ర మండలం మీది ఖనిజాలను, ముఖ్యంగా అణు విచ్ఛేదానికి తోడ్పడే హీలియం-3ను కొల్లగొట్టే పోటీకి అగ్రదేశాలు సిద్ధమవుతూ, అక్కడ అణు రియాక్టర్లను నెలకొల్పే యత్నంలో ఉన్నాయట!

మబ్బు చాటు మాయా యుద్ధాలను మన పూర్వులు ఊహించకపోలేదు. రాక్షసులు వాటిలో ప్రవీణులని మన ఇతిహాస, పురాణాలంటాయి. రామాయణంలో మారీచ సుబాహులు అలాంటివారే. రావణుని కొడుకు ఇంద్రజిత్తయితే, నింగి నుంచే కానీ, నేల మీద యుద్ధం చేయడు. మాయసీతను చూపించి నిజసీతగా భ్రమింపజేసి హత మార్చడం లాంటి మాయావి చేష్టలలో రావణుడు కూడా అతనికి చాలడు. సూర్యాస్తమయంలోగా సైంధవుని చంపుతానన్న అర్జునుని ప్రతిజ్ఞను నిజం చేయడానికి కృష్ణుడు సూర్యుడికి చక్రాన్ని అడ్డేసి సూర్యాస్తమయాన్ని సృష్టించడం నేటి కృత్రిమ సాంకేతిక విన్యాసాల్లాంటిదే. అప్పటివన్నీ ఊహలనుకుంటే, ఇప్పటి శాస్త్ర సాంకేతికత సృష్టించేవి నిండునిజాలు.

యుద్ధాలు నేలనూ, నింగినీ దాటి గ్రహాంతరాలకు చేరుకునే పరిస్థితిలో శాంతి గతేమిటి; ఇది పురోగమనమా, తిరోగమనమా అన్న ప్రశ్న వేసుకోక తప్పదు; యుద్ధమూ, శాంతి అనే జంటలో ఒకటి కాపురం కూల్చేసి గగనమార్గం పట్టిపోతే రెండవది నేల మీద కుమిలిపోతూ ఉండవలసిందేనా అన్న బాధకూ లోనవక తప్పదు. బాహ్యయుద్ధాల ఎండమావుల వేట నుంచి మనిషి వెనుదిరిగి అంతరంగ యుద్ధం వైపు ఎప్పుడు దృష్టి సారిస్తాడు?! లోకాలన్నీ జయించావు కానీ, అరిషడ్వర్గాలనే నీ లోపలి శత్రువులను ఎప్పుడు జయిస్తావని హిరణ్యకశిపుని ప్రహ్లాదుడు అడిగిన ప్రశ్న ఇప్పటికీ ఎంత ప్రాసంగికం!!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి: శు.విదియ ప.11.39 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: ఉత్తర రా.3.50 వరకు, తదుపరి హస్త, వర్జ్యం: ప.10.05 నుండి 11.47 వరకు, దుర్ముహూర్తం: ప.12.29 నుండి 1.19 వరకు, తదుపరి ప.3.00 నుండి 3.50 వరకు, అమృత ఘడియలు: రా.8.20 నుండి 10.02 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

మన మేధతో...



వేల సంవత్సరాలుగా మేధా హక్కుల చోరీని పట్టించుకోకపోవడంతో ఇండియా ఇతర నాగరికతల చేతిలో ఓడిపోయింది. ఇదే చోరీలతో చైనా బ్రహ్మాండంగా పైకి లేచింది. అక్రమంగా తమ ఆధిపత్యం నిలుపుకొనేందుకు పాశ్చాత్య దేశాలు మేధా హక్కుల శాసనాన్ని సృష్టించాయి. చరిత్ర పాఠం స్పష్టంగా ఉంది. మనం ఎందుకు ఇతర జనాల నియమాలను పాటిస్తున్నాం?

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

ఇష్టాలు



కష్టాలు జీవితాన్ని చుట్టుముట్టినప్పుడు ఇష్టాలు మనకబారిపోతాయి. పోనివ్వండి. కానీ, జీవితం ఎల్లప్పుడూ మనతో కఠినంగా ఉండదు. ఆదరించి, మనకు కావలసింది ఇస్తుంది కూడా! ఇది నా అనుభవం.

– వినేశ్ ఫోగట్, రెజ్లర్

లీడర్



మీ టీమ్‌కు మీరు ఎల్లప్పుడూ ఉల్లాసంగా ఉన్నట్లు కనిపించండి. అదే మీ సూపర్ పవర్. ప్రపంచం అలసిపోయిన నాయకుల్ని అనుసరించదు. గదిని వెలిగించే వారిని కోరుకుంటుంది. వారెంత నిద్రను కోల్పోయినా, తేటగా కనిపించాల్సిందే!

– సురేష్ మన్సరామణి, బిజినెస్ కోచ్


ఒత్తిడి



గాసిప్స్, అతిగా ఆలోచించటం, ప్రతిదానికీ ఆందోళన చెందటం మిమ్మల్ని ఒత్తిడికి గురి చేసి, మీకు కోపం తెప్పిస్తాయి. మీ పనిలో మీరు మునిగిపోండి. ఇలాంటివన్నీ వదిలిపోతాయి.

– శ్రీధర్ లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ ట్రైనర్


దిక్సూచి



మీ జీవితానికి మీరే బాధ్యులు. మీ జీవితాన్ని మెరుగుపరిచే బాధ్యతను మీరు ఎప్పుడైతే ఇతరులకు అప్పగిస్తారో, అప్పుడే మీరు మీ జీవితంపై నియంత్రణ కోల్పోయినట్లు! మన మెదళ్లు చాలా శక్తిమంతమైనవి. అవి చాలు మీకు దిక్సూచిగా పని చేయటానికి! వేరెవరో అక్కర్లేదు.

– అక్షత్ శ్రీవాత్సవ, ఫైనాన్షియల్ అడ్వైజర్

శాంతి ధ్వని



నిత్యం అనేక విషయాలు ధ్వనిస్తూ ఉండే ఈ ప్రపంచంలో నిశ్శబ్దం అంటే కేవలం శబ్దంలేకపోవటం మాత్రమే కాదు. అంత కంటే ఎక్కువ! శాంతి, స్పష్టత, మనసుకు నెమ్మది, సంతోషం... ఇవన్నీ కలిసినది.

– శాంతా గోఖలే, రచయిత్రి

నిలుపుకోవాల్సిన బంధం

విశ్లేషణ



బర్ఖా దత్

ఇండియాకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నోరుపారేసుకోవడం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. ఆయన అక్కసు వెనుక ప్రతిసారీ ఒక భూస్వామ్య పెత్తందారీ విధానం కనిపిస్తుంది. సుంకాలు, జరిమానాలను రక్షణ కవచంగా ధరించి ఆయన విమర్శలకు, బెదిరింపులకు దిగుతూంటారు. అమెరికా అధ్యక్షుడి వదరుబోతుదనంలో ఒక సామ్రాజ్యవాదిలో ఉండే దురహంకారం ప్రతిబింబిస్తూ ఉంటుంది.

రష్యా చమురును ఒక బూచిగా చూపిస్తున్నారంతే. అలనాటి ఈస్ట్ ఇండియా కంపెనీ ధోరణి ఇప్పుడు అమెరికా వ్యవహార శైలిలో కనిపిస్తోంది. వ్యవసాయం, పాడి, మత్స్య పరిశ్రమ పట్ల భారత దేశం అనుసరిస్తున్నట్లు చెబుతున్న సంరక్షణ విధానంపై నిజంగానే అమెరికా విభేదిస్తోందని మనకు ఎక్కడైనా మనసు పొరల్లో చిన్న సందేహం మిగిలి ఉంటే, ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఉపయోగించిన భాషతో అది కాస్తా పటాపంచలైపోతుంది.

'మహారాజా సుంకాలు' అనే పద బంధాన్ని గమనిస్తే, భారత దేశాన్ని ప్రాచ్యవాద, పురాతన జాతివాద కళ్ళద్దాలతోనే నవారో చూస్తున్నట్లు స్పష్టమవుతుంది. ఈసారి ఆయన 'పాములు ఆడించే వాళ్ళ' ఉపమానాన్ని ఉపయోగిస్తారేమో! ఏదో ఒక పక్షం వైపు రావలసిందిగా భారతదేశాన్ని నేరుగానే హెచ్చరించారాయన. కొత్తగా ఉపయోగించిన మాటలతో భారతీయుల మనసును నవారో మరింత గాయపరచారు. క్రెమ్లిన్‌కి 'లాండ్రోమాట్'గా ఆయన భారతదేశాన్ని అభివర్ణించారు. నిజానికి, అప్పటికి కొద్ది రోజుల క్రితమే అలాస్కాలో వ్లాదిమీర్ పుతిన్‌కి ట్రంప్ అక్షరాలా ఎర్ర తివాచీ పరచి స్వాగతం పలికిన సంగతిని ఆయన సమయానుకూలంగా మరచినట్లుంది.

అమెరికా ఆత్మవంచన

మనం రష్యా ముడి చమురు కొని, శుద్ధి చేసిన తర్వాత, ఆ చమురును యూరప్ దేశాలు కూడా కొనుగోలు చేశాయి. అలా రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడం ద్వారా మనం 'లాభాలు గడిస్తున్నా'మని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బిసెంట్ ఆరోపించారు. కానీ, ఉక్రెయిన్ యుద్ధం వల్ల నిజంగా లబ్ధి పొందుతున్నది వారే! ఐరోపా దేశాలు అమెరికా నుంచి ఆయుధాలు కొని ఉక్రెయిన్‌కు లాభాలకు అమ్ముతున్నాయి. అందుకే అవి విక్రయిస్తున్న అన్ని ఆయుధాలపైనా (అదనపు వ్యయాలు, లాభం కింద) ట్రంప్ ప్రభుత్వం 10% మొత్తాన్ని తీసుకుంటోందని బిసెంట్ మరో ఇంటర్వ్యూలో స్వయంగా అంగీకరించారు. ఇండియా మాత్రం రష్యా చమురు కొనడం తమ ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని చెబుతూంటే... అదే వ్యక్తులు, పుతిన్ యుద్ధాన్ని మనం బలోపేతం చేస్తున్నట్లుగా నిందిస్తున్నారు. ఇక్కడ అమెరికా ఆత్మ వంచన కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కపటత్వానికీ స్థిరమైన వాదన అవసరం.

ఎవరో ఒక అధ్యక్షుడి చపలచిత్త ధోరణిని పట్టించుకోనక్కర లేదని, భారత-అమెరికా స్నేహ సంబంధాలు సుదీర్ఘమైనవి, గాఢమైనవని వాదించేవారితో నేనూ ఏకీభవిస్తాను. కానీ, ట్రంప్‌కు అర్థమయ్యే భాషలోనే ఆయనకు వ్యతిరేకంగా స్వల్పకాలిక చర్యనైనా తీసుకోవాల్సిన అవసరాన్ని కూడా నేను అర్థం చేసుకోగలను. అలాగని వాషింగ్టన్ ఇవ్వనిది చైనా మనకేదో దోచిపెడుతుందని కూడా నేను అనుకోవడం లేదు.



◆ అమెరికా స్పందన ఒకటే పాఠం నేర్పుతోంది: ఒకే దేశంపై ఆశలన్నీ పెట్టుకోవద్దు. అది ప్రమాదకరం! అలాగని చైనాకు దగ్గర కాగలమా? ట్రంప్‌వి అవాకులో చవాకులో బహిరంగంగానే ఉంటాయి. కానీ, జిన్‌పింగ్‌వి తెరవెనుక చర్యలు.

చైనాను నమ్మవచ్చా?

ట్రంప్‌ది దూకుడు తత్త్వం. చైనా సైనికంగా మనకి ప్రత్యర్థి. ట్రంప్‌వి అవాకులో చవాకులో బహిరంగంగానే ఉంటాయి. జిన్‌పింగ్‌వి పారదర్శకం కాని తెరవెనుక చర్యలు. పాకిస్తాన్ పట్ల ట్రంప్ మెతక వైఖరిని అర్థం చేసుకోవచ్చు. దాని పొగడ్తలకు ఆయన ఉబ్బిపోయాడు, లేదా అది ఇవ్వజూపిన ప్రయోజనాలకు ప్రలోభపడ్డాడు అనుకుందాం. కానీ, ఇటీవలి 'ఆపరేషన్ సిందూర్'లో కూడా పాకిస్తాన్‌తో చైనా చెట్టపట్టాలేసుకుని తిరిగింది.

కనుక, ట్రంప్‌ను, ప్రస్తుత లోటుపాట్లను పక్కనపెట్టి అమెరికా – భారత్ స్నేహ సంబంధాన్ని కాపాడుకోవాలని కోరుకోవడంలో ఔచిత్యం ఉంది. ఇప్పటి అమెరికా స్పందన ఒకటే పాఠం నేర్పుతోంది. అది: ప్రపంచంలో ఓ మూలనున్న ప్రాంతంపై లేదా ఒకే దేశంపై ఆశలన్నీ పెట్టుకోవద్దు. అది ప్రమాదకరం.

మనవాళ్లు ఏం చేస్తున్నట్టు?

ట్రంప్‌ను భారత్ ఎందుకు దారికి తెచ్చుకోలేకపోయింది అనే దానిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఆపరేషన్ సిందూర్ ఆగిపోవడంలో ట్రంప్ స్వోత్కర్షను సమర్థించనందుకా? ఆయన 'ఇగో' దెబ్బతిందా? ట్రంప్ మాజీ అంగరక్షకుడు ఒకరిని పాకిస్తాన్ తన లాబీయిస్టులలో ఒకడిగా చేర్చుకుందని చెబుతున్నారు. మనం అలా కాకుండా, లాంఛన పూర్వకంగా, సంయమనంతో దౌత్యం నెరపడమా? కానీ, నాకొకటే సందేహం. అమెరికాలో ఉంటున్న భారత సంతతికి చెందిన గొప్ప వ్యక్తులు ఏమైపోయినట్లు?

యాభై లక్షల మంది ఇండియన్-అమెరికన్ సమూహాన్ని ఒక చక్కని వలస వర్గానికి నమూనాగా తరచూ అభినందిస్తూ ఉంటారు. ఆ వర్గం నాయకులు పెద్ద టెక్, ఫైనాన్షియల్ సంస్థలను నడుపుతున్నారు. విద్యా, విధాన నిర్ణాయక సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నారు. ఇండియా పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరు చూసి వారికి ఒళ్ళు మండటం లేదా? స్వీయ నిర్ణయాలు తీసుకోవడం భారతదేశానికున్న సార్వభౌమాధికారమనే సంగతిని ట్రంప్ ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోతే, ఆయన శ్వేత సౌధం నుంచి నిష్క్రమించే నాటికి కాపాడుకోవాల్సినవి పెద్దగా ఏమీ మిగలవు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

దేశాన్ని కోల్పోయినవాడు!

కామెంట్



కరణ్ థాపర్


ఆతిశ్ తాసీర్ 'భారతదేశపు విదేశీ పౌరసత్వాన్ని' భారత ప్రభుత్వం 2019 నవంబర్ 7న ఎత్తివేసింది. హోమ్ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ట్వీట్ ద్వారా ఆయనకు ఈ సంగతి మొదట తెలిసింది. అధికారిక లేఖ ఆ తర్వాత జారీ అయింది. తండ్రికి చెందిన పాకిస్తానీ మూలాలను ఆయన కప్పిపెట్టారనే సాకుతో ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుంది. కానీ, సంపూర్ణ సత్యం అదేనా?

'ఎ రిటర్న్ టు సెల్ఫ్: ఎక్స్‌కర్షన్స్ ఇన్ ఎక్సైల్' పేరుతో ఆయన రాసిన పుస్తకం తాజాగా విడుదలైంది. అందులోని ముందుమాటలో, ''అది వింతైన ఆరోపణ'' అని ఆయన అభివర్ణించారు. ''నేను ఇంతకుముందు కూడా 'స్ట్రేంజర్ టు హిస్టరీ' (2009) పుస్తకం రాశాను. నా జీవితంలో చాలా భాగం నేను నా తండ్రికి దూరంగానే ఉన్నప్పటికీ, అందులో మా నాన్న గురించిన వ్యాసాలు చాలానే చేర్చాను'' అని కూడా పేర్కొన్నారు. సల్మాన్ తాసీర్ (పాకిస్తాన్ రాజకీయ నాయకుడు) ద్వారా తవ్లీన్ సింగ్(కాలమిస్ట్)కు పుట్టిన కుమారుడు ఆతిశ్ అన్న సంగతి రహస్యం ఏమీ కాదు. ఈ సంగతి ప్రభుత్వానికి తెలియదనుకోవడానికి ఏమాత్రం వీలు లేదు.

ఇక్కడ గుర్తు చేసుకోవాల్సిన విషయం మరొకటి ఉంది. ఆతిశ్ తరపున తవ్లీన్ 1999లో భారతీయ సంతతికి చెందిన వ్యక్తి కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు (ఇదే ఆ తర్వాత 2005లో 'ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా'గా మారింది), ఆయన తల్లితండ్రులలో ఒకరు పాకిస్తానీ అనే కారణం అడ్డురాలేదు. కానీ 2016లో, అది ప్రతిబంధకంగా మారింది.

నిజానికి, ఆతిశ్ తండ్రి సల్మాన్ పాకిస్తానీ, బ్రిటిష్ పౌరుడు రెండూ అవుతారు. సల్మాన్ తల్లి బ్రిటిష్ పౌరురాలు. జన్మతః ఆతిశ్ బ్రిటిష్ పౌరుడ నడానికి బహుశా ఇదే కారణమేమో. కానీ, ఆతిశ్ 'ఓవర్సీస్ సిటిజన్‌షిప్'ను వేరే కారణంతో ఎత్తి వేశారనడంలో సందేహమే లేదు. మోదీని విమర్శించడమే ప్రస్తుత స్థితికి కారణం. ''మోదీ ప్రభుత్వ దృష్టిలో నేను 'పాకిస్తానీ'గా మారాను. అన్నింటి కన్నా ముఖ్యంగా 'ముస్లిం' అయ్యాను. భారతదేశంలో చాలా వరకు తండ్రి మతమే పిల్లలకు వర్తిస్తుంది. 'భారతదేశపు ప్రధాన విభజనకర్త' శీర్షికతో నేను 'టైమ్ మ్యాగజైన్'కు ముఖచిత్ర కథనం రాయడం, మోదీకి కోపం తెప్పించింది... మా అమ్మ భారతీయురాలైనా లెక్కలోకి రాలేదు. నేను బయట వ్యక్తిగా, పరాయి మనిషిగా, పాకిస్తానీగా ముద్రపడ్డాను'' అని ఆయన రాసుకున్నారు.





◆ పౌరసత్వాన్ని కోల్పోవడంలోని బాధేమిటో ఆతిశ్ తాసీర్ ముందుమాటలో వివరించారు. "ఒక దేశం దూరంపెట్టడం కంటే అవమానం మరొకటి ఉండదు. ఒక తండ్రి తన బిడ్డను తన బిడ్డ కాదంటే ఎలా ఉంటుందో అలా!"

పౌరసత్వాన్ని కోల్పోయిన తర్వాత, ప్రభుత్వం ఆయనకు వీసా ఇచ్చేందుకూ కూడా తిరస్కరించింది. దాంతో అమ్మమ్మ చనిపోయినపుడు ఆమె అంత్యక్రియలకు కూడా తాసీర్ హాజరు కాలేకపోయారు.

పౌరసత్వాన్ని కోల్పోవడంలోని బాధేమిటో ఆతిశ్ ముందుమాటలో వివరించారు. ''ఒక దేశం దూరంపెట్టడం కంటే అవమానం వేరే ఉండదు. ఒక తండ్రి తన బిడ్డను తన బిడ్డ కాదంటే ఎలా ఉంటుందో... ఇంటి నుంచి తరిమేస్తే ఎలా ఉంటుందో అలా! దేశం లేకపోతే గాలికెగిరే విస్తరాకు అయిపోతాం.''

సత్యం ఏమంటే, అమెరికాలోని విశ్వవిద్యాలయం నుంచి భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత, ఒక ఉన్నత వర్గ మైనారిటీకి చెందిన వాడిననే స్పృహ ఆతిశ్‌లో ఉంది. అయినా హిందీ, ఉర్దూ, సంస్కృత భాషలు నేర్చుకునేందుకు పాటుపడ్డారు. మమేకమయ్యేందుకు దేశంలో విస్తృతంగా పర్యటించారు. భారతదేశంలో భాగమయ్యేందుకు, ఇక్కడి వాడినని అనిపించుకునేందుకు హృదయపూర్వకంగా చేసిన ప్రయత్నం అది. ''భారతీయ జీవితంలో మెరుగ్గా ఇమిడిపోయేందుకు... నాలోని కొన్ని దృక్పథాలను దూరం చేసుకున్నాను'' అని ఆయన రాసుకున్నారు.

అందుకనే, మొహం మీద తలుపులు మూతపడినప్పుడు ఆయన ఇలా రాసుకోవడం ఆశ్చర్యం కలిగించదు: ''నాకెందుకో విచిత్రంగా స్వేచ్ఛ లభించినట్లు అయింది. బంధ విముక్తుడిని అయ్యాననిపించింది. ఇండియాలో ఇమిడేందుకు ప్రయత్నించాల్సిన కష్టం, నా స్వీయ పాశ్చాత్యీకరణకు మన్నించమన్నట్లు వ్యవహరించవలసి రావడం నుంచి హఠాత్తుగా బయటపడేసినట్లయింది.''


నేడు ఆయన భారతదేశం గురించి భూతకాలంలో ప్రస్తావిస్తున్నారు. ''నాది ఒకప్పుడు భారతదేశం.'' అలా రాయడం భరించలేని వేదన కలిగిస్తోందని ఆయన చెప్పుకొన్నారు. కానీ, దాన్ని ఆయనపై రుద్దారు. ఆతిశ్ 44 ఏళ్ళ వయసువారే కాబట్టి, నిర్మించుకునేందుకు భవిష్యత్తు ఉంది. కానీ ప్రభుత్వం ఇండియాను ఆయనకు గతాన్ని చేసేసింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ద్రావిడ భాషల వారధి

ఇన్ బాక్స్

నాలుగు ద్రావిడ భాషల పదాలను సేకరించి ఒక భారీ నిఘంటువును రూపొందించిన కేరళ వాసి జత్యేల శ్రీధరన్ తలస్సేరిలో తన నివాసంలో ఈ నెల 13న కన్ను మూశారు. ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు చేపట్టవలసిన నాలుగు భాషల పదాల ఈ తులనాత్మక అధ్యయనాన్ని ఆయన ఒంటరిగా సాధించారు. 'చతుర్ ద్రావిడ భాష పద పరిచయం' పేరిట ఈ నిఘంటువు మలయాళంలో ముద్రింపబడింది.



జత్యేల శ్రీధరన్

1934లో పేద కుటుంబంలో పుట్టిన శ్రీధరన్ నాల్గవ తరగతిలోనే చదువు వదిలేసి ఓ బీడీ కంపెనీలో పనికి కుదిరారు. బీడీ ప్యాకింగ్‌పై నాలుగు ద్రావిడ భాషల పదాలు ఉండేవి. ఒక మలయాళం పదాన్ని మిగతా మూడు భాషల్లో ఏమంటారో తెలుసుకోవాలన్న ఆసక్తి అక్కడే పుట్టి పెరిగింది. ఆ పని చేస్తూనే ఎనిమిదవ తరగతి పరీక్ష రాసి ఉత్తీర్ణుడై పీడబ్ల్యూడీ శాఖలో ఉద్యోగంలో చేరారు. తాను సేకరించిన మలయాళం పదాలకు తమిళ పదాలు తొందరగానే లభించేవి కానీ కన్నడ, తెలుగు పదాలు చెప్పేవారు దొరికేవారు కాదు. అందుకోసం తానే శ్రమించి తమిళ, కన్నడ, తెలుగు భాషలు నేర్చుకున్నారు. పుస్తకాల్లో దొరకని పదాల కోసం మూడు రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇలా ఆయన అన్ని భాషల్లో కలిపి పన్నెండు లక్షల పదాలను సేకరించారు. 1972లో తొలి ప్రయత్నంగా 'మలయాళం- తమిళ నిఘంటువు'ను తెచ్చారు. ఉద్యోగానికి వెళుతూ సేకరించిన నాలుగు భాషల పదాల కూర్పు కోసం 1984 నుండి పదేళ్ల పాటు శ్రమించారు. 1994 రిటైర్ అయ్యాక పూర్తి సమయాన్ని దీనికే కేటాయించారు.

ఈ నిఘంటువు నవంబర్ 2020లో పుస్తకంగా వచ్చింది. అప్పటికి ఆయనకు 82 ఏండ్లు. ముదిమి వయసులో లక్షలాది పదాల, వేయి పేజీల సమాచారాన్ని పట్టుకొని ప్రచురణ సంస్థల చుట్టూ తిరిగారు. పత్రికల ద్వారా ఈయన కృషిని తెలుసుకున్న కేరళ సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ దీని ముద్రణ బాధ్యతలు తీసుకుంది.

ఈ నాలుగు భాషల పదాల నిఘంటువులో ముందుగా మలయాళ పదం దాని అర్థం, తర్వాత సమాన అర్థం గల తమిళ, కన్నడ, తెలుగు పదాలు, వివరణలు నాలుగు కాలమ్స్‌గా ఒకే వరుసగా ఉంటాయి.


జత్యేల శ్రీధరన్ నిఘంటువు విశేషాలతో దర్శకుడు నందన్ 2021లో 'డ్రీమింగ్ ఆఫ్ వర్డ్స్' అనే డాక్యుమెంటరీని రూపొందించారు. భాషలను రక్షించడం అందరి బాధ్యతనే సందేశాన్ని అందించిన శ్రీధరన్ జీవితం సదా స్మరణీయం.

– బద్రి నర్సన్ | విశ్రాంత బ్యాంకు అధికారి

డేటా పాయింట్

యూఎస్‌కు మన స్మార్ట్ ఫోన్లే ఎక్కువ!

2025–26లో ఏప్రిల్ – జూలై మధ్యకాలంలో మన దేశం నుంచి అమెరికాకు రికార్డు స్థాయిలో 10 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్ ఫోన్ల ఎగుమతులు జరిగాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 52 శాతం ఎక్కువ. 2025 ఏప్రిల్ 1 – జూన్ 30 మధ్య కాలంలో (క్యూ2) ఎగుమతుల్లో మనం చైనాను అధిగమించాం.



ఆధారం: మార్కెట్ అనలిస్ట్ సంస్థ కెనలిస్

ముక్తికి మార్గం

జ్యోతిర్మయం

అప్పుడప్పుడే మొలకెత్తుతున్న ఒక చిన్న విత్తనం, భూమి పై పొరలను పెళ్ళగించుకుంటూ పైకి పొడుచుకొచ్చే దృశ్యంలో 'చిదిమేస్తే చితికిపోయేంత మెత్తని హరిత పదార్థానికి అంత మహత్తరమైన శక్తి ఎలా వచ్చింది?' ఆలోచిస్తే, ప్రతి విత్తనంలో ప్రకృతి నిక్షిప్తం చేసి ఉంచే శక్తి అంత బలమైనది కాబోలు! కంటితో చూడటానికి, చేతితో తాకడానికి వీలు కానటువంటి ఆ ప్రాణశక్తి, అత్యంత ప్రాథమిక రూపంలో బలం లేనిదిగా, బహు శక్తిహీనమైనదిగా కనబడటంలోనే ప్రకృతి రహస్యం దాగి ఉందనిపిస్తుంది. పదార్థంలో అలా కంటికి కనిపించక నిక్షిప్తమై ఉండే జీవశక్తిని ఏదైతే మేలుకొలిపి చైతన్యవంతం చేస్తుందో దానిని 'సంకల్పం' అని ఆధ్యాత్మికవేత్తలు పిలిచారు. 'ఎవరిది ఈ సంకల్పం?' అనే ప్రశ్నకు 'ప్రకృతిలోని ప్రతి వస్తువులోనూ నిండి ఉండే భగవంతుడిది!' అని సమాధానంగా చెప్పారు. **'బీజం బంకురం బయినట్లు, సంకల్పంబు ప్రపంచంబగు, నీ సంకల్పంబు తాన జనియించి, తాన వర్ధిల్లి, తాన యణంగుచుండు'** అనే మాటలలో మడికి సింగన 'వాసిష్ఠ రామాయణము' తృతీయాశ్వాసంలోని ఒక వచన భాగంలో ఈ సంగతినే చెప్పాడు. ఒక విత్తనం లోంచి మొక్క పుట్టినట్లుగా, పరమాత్ముడి సంకల్పం నుండి పుట్టిన ఈ ప్రపంచం తానే పుట్టి, తానుగా వర్ధిల్లి, తానే అదృశ్యమైపోతుంది అని ఆ మాటల భావం. భగవంతుడి సంకల్ప ఫలితం అలా ఉండగా, మానవుడికి సంకల్ప ఫలం బంధానికి దారి తీస్తుందని అదే వచన భాగంలో ఇలా చెప్పాడు మడికి సింగన.

'దీన సుఖంబు లేదు. దుఃఖం బాపాదించుచుండు, నట్లు గావున సంకల్ప భావన లుడిగి శుభంబు నొందుము.'

బంధంలో మనిషికి సుఖం దక్కదు. పైపెచ్చు దుఃఖాన్ని మిగుల్చుతుంది. అందువలన ఆ దుఃఖం నుండి తప్పుకోవాలంటే మనస్సులో అంకురించే 'సంకల్ప భావనలకు' స్వస్తి పలకడం తప్పనిసరి. అలా సుఖవంతులు కావడమే శ్రేయస్కరం – అని పై మాటల తాత్పర్యం. భగవంతుడి, భగవంతుడి సృష్టియైన మానవుడి సంకల్ప ఫలాలలో గల ఈ భేదాన్ని గుర్తించి వర్తించడం ముక్తిని కలిగిస్తుంది.

– భట్టు వెంకటరావు

యూరియా వెతలు



పక్కదారి..

రాయపర్తి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) డైరెక్టర్ ఇంట్లో యూరియా బస్తాలు లభ్యమైన ఘటన వరంగల్ జిల్లా రాయపర్తిలో ఆదివారం జరిగింది. అధికారుల కథనం ప్రకారం.. రాయపర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో తిర్మలాయపల్లి గ్రామానికి 404 యూరియా బస్తాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆదివారం కూపన్లు ఇచ్చి రైతులకు పంపిణీ చేశారు. ఈ క్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ దొంతరబోయిన యాదగిరి ఇంట్లో యూరియా బస్తాలు ఉన్నట్టు రైతులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి గుమ్మడి వీరభద్రం ఏఈఓలతో కలిసి సోదాలు చేయగా, యాదగిరి ఇంట్లో 10 బస్తాలు, మరోచోట 16 యూరియా బస్తాలు ఉన్నట్టు గుర్తించారు. వాటిని సీజ్ చేసి గ్రామపంచాయతీకి తరలించారు.



పర్వతగిరిలో యూరియా కోసం క్యూలో పట్టాదార్ పాస్‌పుస్తకాలు పెట్టి కూర్చున్న రైతులు

పాస్ బుక్కే.. దారి..

చేగుంట/పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో తెల్లవారు జామునే రైతులు క్యూలో పట్టాదార్ పాస్‌పుస్తకాలు పెట్టి కూర్చున్నారు. యూరియా అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు.

- మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులు బారులు తీరారు. 500 బస్తాల యూరియా రాగా, క్యూలో ఉన్న కొందరికి యూరియా దొరకకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు.



చేసేది లేక.. ఈ దారి..

ఇల్లెందురూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం పోచారంతండాలో మాజీ సర్పంచ్ వాంకుడోత్ శ్రీను నాలుగెకరాల్లో, బొల్లం మహేందర్ రెండెకరాల్లో మొక్క జొన్న సాగు చేశారు. అయితే విత్తు దశలో యూరియా అందలేదు. ఆ తర్వాత వర్షాలు కురవడంతో మొక్కలతోపాటు కలుపు కూడా ఏపుగా పెరిగింది. ప్రస్తుతం మొక్క ఎదుగుదల లోపించడం, కంకి వేయాల్సిన దశకు చేరుకున్నా కనీసం మొగ కూడా వేయలేదు. దీంతో ఆందోళనకు గురైన ఇద్దరు రైతులు ఆదివారం మొక్కజొన్న చేలను ట్రాక్టర్‌తో దున్నారు. విత్తనం వేసినప్పటి నుంచి ఒక్క బస్తా యూరియా కూడా దొరకలేదని వాంకుడోత్ శ్రీను వాపోయాడు. ఈ విషయమై ఏడీఏ లాల్ చంద్‌ను వివరణ కోరగా శ్రీను కుమారుడు సూర్యం ఆధార్ నంబర్‌తో జూన్ 14, 24, 26 తేదీల్లో 24 బస్తాల యూరియాను గ్రోమోర్ ఎరువుల దుకాణం నుంచి కొనుగోలు చేశాడని తెలిపారు. అధికారులు చెప్పిందే వాస్తవమైతే సదరు వ్యక్తికి తెలియకుండా అతడి ఆధార్ కార్డు ద్వారా యూరియా విక్రయాలు ఎలా జరిగాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వాస్తవాలు దాచి ప్రభుత్వంపై ఆరోపణలా?

- దిగుమతులు, దేశీయ ఉత్పత్తి లేకనే యూరియా కొరత
- అందుకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణం కాదా?
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మంత్రి తుమ్మల కౌంటర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కొరత వెనుక ఉన్న వాస్తవాలను దాచి రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదని, కేంద్ర మంత్రి హోదాలో ఉండి కిషన్‌రెడ్డి చేసిన రాజకీయ వ్యాఖ్యలు ఆయన స్థాయిని తగ్గించేలా ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా దేశంలోని డిమాండ్‌కు తగినట్టు యూరియా దిగుమతి కావటం లేదని ఓ పక్క చెబుతూనే.. యూరియా పక్కదారి పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. యూరియా కొరతకు దిగుమతులు తగ్గటంతోపాటు దేశీయ ఉత్పత్తి తగినంత లేకపోవటమే కారణం కాదా? ఇది కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కాదా? అని నిలదీశారు. తెలంగాణ ప్రజలు ఓట్లేసి గెలిపించినందునే కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి అయ్యారని, ఆ ప్రజల కోసం యూరియా సరఫరా అయ్యేందుకు చొరవ చూపాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర మంత్రి హోదాలో బాధ్యతగా కేంద్రం ప్రకటించిన 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా తక్షణమే సరఫరా అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ముక్కలు చేసి మూసీలో పడేసి..

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్య సమాజ్‌లో కులాంతర వివాహం చేసుకున్నారు. ఆపై రాజీపడిన కుటుంబీకులు గ్రామంలో మరోసారి వివాహ తంతు నిర్వహించారు. పెళ్లయ్యాక బోడుప్పల్‌కు వచ్చి శ్రీనివాస్ నగర్‌లో కాపురం పెట్టారు. మహేందర్‌రెడ్డి బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా డిగ్రీ చదివిన అతని భార్య పంజగుట్టలోని ఓ కాల్ సెంటర్‌లో పనిచేసేది. అయితే నెలపాటు సజావుగా సాగిన వారి కాపురంలో కుటుంబ కలహాలు మొదలయ్యాయి. భార్యపై అనుమానం పెంచుకున్న మహేందర్‌రెడ్డి పదేపదే సూటిపోటి మాటలతో వేధించడంతో స్వాతి ఉద్యోగం మానేసింది. అయినప్పటికీ వేధింపులు ఆపకపోవడంతో గతేడాది ఏప్రిల్ 22న భర్తపై వికారాబాద్ మహిళా ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇరువురికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే గ్రామ పెద్దలు సైతం భార్యాభర్తల మధ్య రాజీ కుదిర్చారు. దీంతో గతేడాది జూన్ నుంచి మళ్లీ ఇరువురూ కలిసి గత నెల వరకు వికారాబాద్‌లోనే ఉన్నారు. దాదాపు 20 రోజుల క్రితం మళ్లీ నగరానికి వచ్చిన ఈ జంట.. శ్రీనివాస్ నగర్‌లోని అదే ఇంట్లో అద్దెకు దిగింది. ప్రస్తుతం ఐదు నెలల గర్భిణీ అయిన స్వాతి వైద్య పరీక్షల నిమిత్తం ఈ నెల 27న వికారాబాద్ వెళ్లి ఆపై పుట్టింటికి వెళ్లి ఉంటానని భర్తకు చెప్పింది. దీనికి మహేందర్ అంగీకరించకపోవడంతో ఇరువురి మధ్యా వాగ్వాదం జరిగింది. అప్పటికే ఆమెపై కక్ష పెంచుకున్న మహేందర్‌రెడ్డి ఈ పరిణామంతో భార్యను చంపాలని నిర్ణయించుకున్నాడు. తన పథకాన్ని అమలు చేయడం కోసం బోడుప్పల్‌లోని ఓ హార్డ్‌వేర్ షాపు నుంచి హాక్సా బ్లేడ్ కొని ఇంట్లో దాచాడు.

గొంతు నులిమి చంపి, ముక్కలు చేసి...

శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహేందర్‌రెడ్డి.. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో తిరిగి వచ్చి భార్యతో మరోసారి గొడవపడి ఆపై గొంతునులిమి చంపేశాడు. మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి హాక్సా బ్లేడ్‌తో కాళ్లు, చేతులు, తలను మొండెం నుంచి వేరు చేశాడు. మొండాన్ని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి గదిలోనే దాచి మిగిలిన శరీర భాగాలను మరో కవర్‌తోపాటు బ్యాక్‌ప్యాక్‌లో పెట్టుకున్నాడు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరి ప్రతాప్‌సింగారం ప్రాంతంలోని మూసీ వంతెన పైనుంచి వాటిని మూడు విడతలుగా నదిలో పడేసి ఇంటికి తిరిగి వచ్చాడు. రాత్రి సుమారు 8 గంటల సమయంలో స్వాతి తల్లికి స్వాతి ఫోన్ నుంచి తాము బాగానే ఉన్నామని.. ఇప్పుడే భోజనం చేశామంటూ మెసేజ్ పెట్టాడు. ఆపై తన సోదరికి ఫోన్ చేసి భార్య కనిపించట్లేదని.. ఉప్పల్ ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేస్తానని చెప్పాడు.



ముక్కలు చేసిన అవయవాలను బ్యాగ్‌లో తీసుకొని వెళుతున్న నిందితుడు

అనుమానించిన మేడిపల్లి పోలీసులు...

అదే సమయానికి అతడి సోదరి సమీప బంధువుకు సమాచారం ఇచ్చింది. అప్పటికే కుటుంబ కలహాలు, రాజీలు ఉండటంతో ఆందోళన చెందిన ఆయన.. మహేందర్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నాడు. అయితే అతన్ని లోపలకు రానివ్వని మహేందర్‌రెడ్డి.. ఉప్పల్ ఠాణాలో ఫిర్యాదు చేద్దామంటూ తీసుకెళ్లాడు. కానీ మహేందర్‌రెడ్డి ఉంటున్న ప్రాంతం తమ పోలీసు స్టేషన్ పరిధిలోకి రాకపోవడంతో ఉప్పల్ ఏఎస్ఐ.. వారిని మేడిపల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విడిచిపెట్టాడు. అనంతరం మహేందర్‌రెడ్డి నుంచి ఫిర్యాదు స్వీకరించే క్రమంలో మేడిపల్లి పోలీసులు భార్యాభర్తల పూర్వాపరాలు అడిగారు. అతను చెప్పిన వివరాలపై అనుమానం వచ్చి ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో శ్రీనివాస్ నగర్‌లోని ఇంటికి తీసుకువచ్చారు. తాళం తీయించి లోపలకు వెళ్లగా గదిలోని కవర్‌లో ఉన్న మొండెం కనిపించడంతో కంగుతిన్నారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే హత్యానంతరం శరీర భాగాలను మూసీలో పడేసినట్లు నిందితుడు చెప్పడంతో అతన్ని మూసీ వద్దకు తీసుకెళ్లి అవశేషాల కోసం గాలించారు. ఇటీవలి భారీ వర్షాలతో మూసీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులకు అక్కడ ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. మహేందర్ రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు మొండాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. దీన్నుంచి డీఎన్ఏ సేకరించి స్వాతి తల్లితో పోల్చి చూడాలని నిర్ణయించారు.

తిండి కూడా పెట్టేవాడు కాదన్న తల్లి

గర్భవతి అయిన భార్య వివరాలు చెబితే నమోదు చేసుకుంటామని స్థానిక ఆశావర్కర్లు గతంలో పలుమార్లు అడిగినా మహేందర్‌రెడ్డి స్పందించలేదని తెలిసింది. కడుపుతో ఉన్న తన బిడ్డకు అల్లుడు అన్నం కూడా పెట్టేవాడు కాదని... తిండి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నానని కుమార్తె పలుమార్లు చెప్పుకొని బాధపడిందని స్వాతి తల్లి స్వరూప విలపిస్తూ చెప్పింది. పెళ్లయిన 2 నెలలకే స్వాతి గర్భం దాల్చగా మహేందర్‌రెడ్డి అబార్షన్ చేయించినట్లు మృతురాలి కుటుంబీకులు పేర్కొన్నారు. దీనిపై నిలదీసేందుకు మీ తల్లిదండ్రులు మా ఇంటికి వెళ్తే అంతుజూస్తానంటూ మహేందర్‌రెడ్డి పలుమార్లు స్వాతిని హెచ్చరించాడని సమాచారం. కాగా గ్రామంలో నివసించే మహేందర్‌రెడ్డి తల్లిదండ్రులు కుమారుడు చేసిన దురాగతం నేపథ్యంలో ఇంటికి తాళం వేసి పారిపోయారు.



స్వాతి అవశేషాల కోసం మూసీలో వెతుకుతున్న పోలీసులు

ఆదివాసీ బాలికపై అఘాయిత్యం?

- బస్సుల్లేక ఆటో ట్రాలీ ఎక్కిన బాధితురాలు
- బలవంతంగా మత్తుమందు కలిపిన డ్రింక్ తాగించడంతో స్పృహతప్పిన వైనం
- కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో వైద్యం.. కేసు నమోదు

పాల్వంచ రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి ఆలయ సమీపంలో శనివారం రాత్రి ఓ ఆదివాసీ బాలిక ఒంటిపై గాయాలు, చిరిగిన దుస్తులతో కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన గురించి ఐసీడీఎస్ సీడీపీవో ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలానికి చెందిన ఓ బాలిక ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కుంటలో ఉన్న బంధువుల ఇంటికి వారం క్రితం వెళ్లింది. తిరిగి శనివారం తన సోదరులు ఉంటున్న చింతూరు మండలం గొల్లగుప్పకు వెళ్లేందుకు కుంట బస్టాండ్‌కు చేరుకుంది. ఆ సమయంలో బస్సులు లేకపోవడంతో అటుగా వెళ్తున్న ఓ ట్రాలీ ఆటో ఎక్కింది. అందులోని ఇద్దరు యువకులు మధ్యలో ట్రాలీ నిలిపి మద్యం సేవించారని.. తనకు కూడా మత్తుమందు కలిపిన డ్రింక్‌ను బలవంతంగా తాగించడంతో స్పృహ కోల్పోయానని బాలిక తెలిపింది. తనకు మెలకువ వచ్చేసరికి పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఉన్నానని చెప్పింది. ఆలయ వాచ్‌మన్ లింగంపల్లి శ్రీను అందించిన సమాచారంతో బాలికను వెంటనే కొత్తగూడెంలోని బాలిక సంరక్షణ అధికారుల పర్యవేక్షణలో ఉంచారు. ఆమె సోదరులకు సమాచారం అందించామని సీడీపీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. బాలికకు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించి పాల్వంచ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. బాలిక శరీరంపై గాయాలు ఉండగా.. దుస్తులు కూడా చిరిగిపోయాయని చెప్పారు. బాలికపై అత్యాచారం జరిగిందా లేదా అనేది వైద్య నివేదిక వస్తే తెలిసే అవకాశం ఉందని.. సీడీపీవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పాల్వంచ సీఐ సతీశ్ పేర్కొన్నారు.

దివి నుంచి నిర్విఘ్నంగా భువికి

▶ మొదటి పేజీ తరువాయి

మాడ్యూల్‌ను ఆదివారం చినూక్ హెలికాప్టర్ ద్వారా జారవిడిచారు. అది భూ ఉపరితలానికి మూడు కిలోమీటర్ల సమీపానికి చేరుకోగానే అందులోని పారాచూట్ తెరుచుకుంది. దీంతో మాడ్యూల్ వేగం నిర్దేశిత స్థాయికి నియంత్రించబడి బంగాళాఖాతంలో సురక్షితంగా దిగింది. దానిని కోస్ట్‌గార్డ్ సిబ్బంది మెషీన్ బోట్ల ద్వారా ఒడ్డుకు చేర్చింది. ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ (ఐఏడీటీ-01)గా పిలుస్తున్న ఈ ప్రయోగం ఇస్రోకు మొదటిది. గగన్‌యాన్‌లో భాగంగా ఈ ఏడాది డిసెంబర్ నాటికి జీ-1 పేరుతో ప్రయోగాత్మక పరీక్షకు ఇస్రో సిద్ధమవుతోంది. 2035 నాటికి వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపి తిరిగి భూమికి సురక్షితంగా తీసుకురావాలని నిర్ణయించింది. అంతరిక్షంలో భారతీయ స్పేస్ స్టేషన్ (బీఎస్ఎస్) నిర్మాణానికి ఇప్పటికే స్పేడెక్స్ ఉపగ్రహాలను ప్రయోగించి డాకింగ్, అన్ డాకింగ్ ప్రక్రియలను పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఈలోపు గగన్‌యాన్‌కి సంబంధించి పలు పరీక్షలు చేపట్టనున్నారు. అందులో భాగంగానే శ్రీహరికోటలోని షార్ నుంచి తాజాగా క్రూ మాడ్యూల్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ నిర్వహించారు. ఈ ప్రయోగం క్రూ మాడ్యూల్‌లోని వివిధ పరికరాలు, పారాచూట్ సమర్థత, పనితీరుతోపాటు వ్యోమగాములను సురక్షితంగా తీసుకురావడానికి కావాల్సిన పరిస్థితుల అధ్యయనానికి దోహదపడుతుందని ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది.



క్రూ మాడ్యూల్‌ను ఆకాశంలోకి తీసుకెళ్తున్న సైనిక హెలికాప్టర్



క్రూ మాడ్యూల్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పొడిచి చంపి.. పెట్రోల్ పోసి తగలబెట్టి

భార్య ప్రవర్తనపై అనుమానంతో భర్త దురాగతం

మహబూబ్‌నగర్ క్రైం: ప్రేమించి పెళ్లాడిన భార్య ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందనే కారణంతో భర్త కిరాతకుడిగా మారాడు. సోమశిల చూసొద్దామని ఆమెను నమ్మించి అడవిలోకి తీసుకువెళ్లి చున్నీతో గొంతు నులిమి ఆపై కత్తితో పొడిచి హతమార్చాడు. అనంతరం మృతదేహంపై పెట్రోల్ పోసి తగలపెట్టాడు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం సాతాపూర్-మారేడు మానుదిన్నె అటవీ ప్రాంతంలో నాలుగు రోజుల కిందట జరిగిన ఈ ఘటన నిందితుడి లొంగుబాటుతో వెలుగులోకి వచ్చింది.

రాంగ్ నంబర్‌తో కలిసి.. ప్రేమ పెళ్లి చేసుకొని

మహబూబ్‌నగర్ టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన శ్రీశైలం, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోటూర్‌కు చెందిన శ్రావణి (27)కి రాంగ్ నంబర్ ద్వారా ఫోన్‌లో పరిచయం ఏర్పడింది. తరచూ ఫోన్‌లో మాట్లాడుకొనే క్రమంలో ప్రేమలో పడి 2014లో పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక బాబు, పాప ఉన్నారు. అయితే తొలి నుంచీ శ్రావణి ప్రవర్తనపై శ్రీశైలం అనుమానం పెంచుకున్నాడు. పెళ్లయిన కొంతకాలానికి భర్త, పిల్లలను వదిలేసి శ్రావణి తన అక్క భర్తతో వెళ్లిపోయింది. ఏడాది క్రితమే మళ్లీ భర్త వద్దకు రాగా ఆమెను భార్యగా శ్రీశైలం అంగీకరించాడు. దీంతో శ్రావణి ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అంబేడ్కర్‌నగర్‌లో ఇద్దరు పిల్లలతో నివసిస్తుండగా.. శ్రీశైలం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో హాస్టల్‌లో ఉంటూ దినసరి కూలీగా జీవనం కొనసాగిస్తున్నాడు.



శ్రావణి

భార్య పద్ధతి మార్చుకోకపోవడంతో..

శ్రావణి తరచూ ఫోన్లు మాట్లాడటం, చాటింగ్ చేయడం గమనించిన శ్రీశైలం ఆమెతో గొడవపడ్డాడు. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు చెప్పినా వినకపోవడంతో పథకం ప్రకారం ఆమెను హత్య చేసేందుకు ఈ నెల 21న హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు చేరుకున్నాడు. ఆమెకు ముందురోజు రాత్రి ఫోన్ చేసి ఉదయం సోమశిలకు వెళ్దామని చెప్పాడు. ఆమె పిల్లలిద్దరినీ బడికి పంపగా స్నేహితుడి ద్విచక్ర వాహనం తీసుకొచ్చిన శ్రీశైలం.. తన భార్యతో కలిసి సోమశిలకు పయనమయ్యాడు. పెద్ద కొత్తపల్లి మండలం సాతాపూర్‌కు చేరుకున్నాక సీతాఫలం పండ్లు ఉంటాయని చెప్పి భార్యను సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లాడు. అక్కడే చున్నీని ఆమె మెడకు చుట్టి గొంతు నులిమాడు. ఆ తర్వాత వెంట తెచ్చుకున్న కత్తితో పలుమార్లు పొడిచాడు. భార్య మృతి చెందిందని నిర్ధారించుకున్నాక వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి తగలపెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. తన కూతురు కనిపించట్లేదని శ్రావణి తండ్రి చంద్రయ్య మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. అంతలోనే శ్రీశైలం లింగాల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోవడంతో హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. అక్కడి పోలీసులు ఈ సమాచారాన్ని పెద్ద కొత్తపల్లి పోలీసులకు అందించగా వారు వెళ్లి నిందితుడిని విచారిస్తున్నారు.


అత్యల్ప శ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ

గ'ఘన' రక్షణ వ్యవస్థ సూపర్ సక్సెస్

గగనతల రక్షణ స్వావలంబనలో ముందడుగు ● దిగ్విజయంగా మూడు క్షిపణుల ప్రయోగం


క్విక్ రియాక్షన్ సర్ఫేస్-టు-ఎయిర్ మిసైల్

న్యూఢిల్లీ: రష్యాకు చెందిన ఎస్–400 తదితరాలకు ప్రత్యామ్నాయంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ (ఐఏడీడబ్ల్యూఎస్)ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. రక్షణ రంగ సంస్థ డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ఒడిశాలో చాందీపూర్‌లో శనివారం మధ్యాహ్నం ఈ పరీక్షలు జరిగాయి. తద్వారా గగనతల రక్షణ రంగంలో స్వావలంబన దిశగా మరో ముందడుగు వేసింది. పొరుగు దేశాలతో ఉద్రిక్తతల వేళ కీలక ఆయుధాల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అగత్యం లేకుండా గగనతల రక్షణ వ్యవస్థలను సొంతగానే తయారు చేసుకోగలమన్న ధీమాను ఈ పరీక్ష మరింతగా పెంచిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హర్షం వెలిబుచ్చారు. దీన్ని విజయవంతంగా చేసిన డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను అభినందించారు.

అత్యంత కచ్చితత్వం...

గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ పరీక్షలో భాగంగా ఒక డ్రోన్, రెండు అత్యంత వేగంగా దూసుకెళ్లే మానవరహిత గగనతల వాహనాలను గాల్లోనే తుత్తునియలు చేసేలా క్యూఆర్‌ఎస్‌ఏఎం, విశోరడ్స్, డీఈడబ్ల్యూలను ఒకేసారి భిన్న ప్రాంతాల నుంచి ప్రయోగించారు. ఇవన్నీ తమ పథంలో అత్యంత ఖచ్చితత్వంతో పయనించి తమ లక్ష్యాలను ఛేదించాయి. మూడు ఆయుధాలు తమ నిర్దేశిత పరామితులను సాధించాయి. మిస్సైల్ వ్యవస్థ, డ్రోన్ జాడ కనిపెట్టే వ్యవస్థ, విధ్వంసక వ్యవస్థ, కమాండ్, కంట్రోల్ వ్యవస్థలు, కమ్యూనికేషన్, రాడార్ల వ్యవస్థలన్నీ సమష్టిగా పూర్తి సమన్వయంతో పనిచేసే ఈ మిషన్‌ను విజయవంతం చేశాయి' అని రక్షణశాఖ తెలిపింది. ఈ పరీక్షను డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, త్రివిధ దళాల ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షించారు. మరో పదేళ్లలో భారత గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చే, అనుక్షణం కాపాలాకాసే అధునాతన ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థను తీసుకొస్తామని ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట మీద ప్రధాని మోదీ ప్రసంగించడం తెల్సిందే. సుదర్శన చక్ర పేరిట తేబోతున్న వ్యవస్థలో ఈ తాజా మూడు ఆయుధాలు ఉండబోతున్నాయని తెలుస్తోంది. ప్రతిపాదిత బహుళ అంచెల రక్షణ వ్యవస్థలో గగనతలంతోపాటు నిఘా, సైబర్ సెక్యూరిటీ అంశాలకు ప్రాధాన్యతనివ్వనున్నారు.

మూడంచెల్లో శత్రుపీచం అణచే తిరుగులేని వ్యవస్థలు

ఐఏడీడబ్ల్యూఎస్ బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ అత్యంత వేగంగా స్పందించే సర్ఫేస్ టు ఎయిర్ (క్యూఆర్ ఎస్ఏఎం) మిసైల్స్, అత్యల్ప శ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ (విశోరడ్స్) క్షిపణులు, అత్యంత శక్తిమంతమైన లేజర్ ఆధారిత డైరెక్టెడ్-ఎనర్జీ ఆయుధ (డీఈడబ్ల్యూ) వ్యవస్థలు దీనితో భాగం.

- ఈ మూడు వ్యవస్థలను శనివారం విజయవంతంగా పరీక్షించారు.
- ఇలా అన్ని రకాల ఆయుధాలను ఒకేసారి సమన్వయంతో ప్రయోగించే ఈ ఆపరేషన్‌ను కేంద్రీకృత కమాండ్, కంట్రోల్ సెంటర్(సీసీసీ) ద్వారా పర్యవేక్షించారు.
- ఆపరేషన్ సిందూర్ ముగిసిన మూడున్నర నెలల తర్వాత భారత్ ఇలా గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థను పరీక్షించడం ఇదే తొలిసారి.
- సీసీసీని డీఆర్‌డీఓ అభివృద్ధిచేసింది. రీసెర్చ్ సెంటర్ ఇమారత్, సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ అభివృద్ధి చేసిన విశోరడ్స్, డీఈడబ్ల్యూలకు కూడా అది నోడల్ లేబొరేటరీగా వ్యవహరించింది.



'ఆత్మనిర్భర్'లో నూతన అధ్యాయం

గగన్‌యాన్ మిషన్

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఐఏఎఫ్ ఆధ్వర్యంలో నలుగురు గగనయాత్రికులకు సన్మానం

న్యూఢిల్లీ: ఆత్మనిర్భర్ భారత్ ప్రయాణంలో 'గగన్‌యాన్ మిషన్' నూతన అధ్యాయానికి ప్రతీక అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. గగన్‌యాన్ యాత్రకు ఎంపికైన వ్యోమగాములు శుభాంశు శుక్లా, ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్‌లను ఆదివారం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అంతరిక్షం రేపటి మన ఆర్థికం, భద్రత, ఇంధనం అని రాజ్‌నాథ్ అన్నారు. గగనయాన్ వంటి కీలక మిషన్ల కోసం పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో త్రివిధ దళాధిపతులు పాల్గొన్నారు.

వైమానిక దళానిదే ఘనత: శుక్లా

భారత తొలి వ్యోమగామి రాకేశ్ శర్మ గురించి బాల్యంలో విని అంతరిక్ష ప్రయోగాల పట్ల ఆసక్తి పెరిగిందని శుక్లా చెప్పారు. తాను ఈ స్థాయికి చేరుకున్నానంటే ఆ ఘనత వైమానిక దళానిదేనన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిరావడం ఎప్పటికీ మర్చిపోలేని గొప్ప అనుభూతి అని వివరించారు.

బీజేపీ, ఈసీ మిలాఖత్

బిహార్‌లో బాహాటంగా ఓట్ల దోపిడీ
- బీజేపీ కుట్రలను అడ్డుకుని తీరతాం
- 'ఓటర్ అధికార యాత్ర'లో రాహుల్

అరారియా: మోదీ సర్కారు, కేంద్రం ఎన్నికల సంఘం కుమ్మక్కయ్యాయని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ముసుగులో బిహార్‌లో ఓట్ల దోపిడీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. బిహార్‌లో ఓట్ల చోరీని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా అరారియా జిల్లాలో ఆదివారం బహిరంగ సభలో, అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ''నా యాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఓటు చోర్, గద్దీ ఛోడ్ (ఓట్ల దొంగా, దిగిపో) అంటూ ఆరేళ్ల బాలుడు సైతం నినదిస్తున్నాడు'' అన్నారు. ''బిహార్‌లో ఎస్ఐఆర్ ముసుగులో ఏకంగా 65 లక్షల మంది ఓటర్లను ముసాయిదా జాబితా నుంచి తొలగించారు. దీనిపై బీజేపీ నోరువిప్పడం లేదు. బీజేపీ, ఈసీ కుమ్మక్కుకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? ఈసీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నానంటూ నాపై అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారు. ఎస్ఐఆర్‌ను బిహార్ ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు'' అని చెప్పారు.

'ఇండియా'దే గెలుపు

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు విపక్ష 'ఇండియా' కూటమిదేనని రాహుల్ ధీమా వెలిబుచ్చారు. ''కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా పని చేస్తున్నాయి. పరస్పరం గౌరవించుకుంటున్నాయి. మేం కలిసి పోటీ చేస్తాం. గెలుస్తాం. దీనిపై మా మేనిఫెస్టో కమిటీ కార్యాచరణ ప్రారంభించింది. రైతు సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాం'' అని వెల్లడించారు.



బుల్లెట్ ర్యాలీలో... రాహుల్‌కు ముద్దు

అరారియాలో బుల్లెట్ ర్యాలీ సందర్భంగా ఓ యువకుడు హఠాత్తుగా దూసుకొచ్చి రాహుల్ ఎడమ భుజంపై ముద్దు పెట్టాడు! జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న రాహుల్‌కు ఓ ఆగంతకుడు అంత సమీపానికి రావడం అందరినీ షాక్‌కు గురిచేసింది. భద్రతాధికారులు అతన్ని దూరంగా నెట్టడమే గాక చేయి కూడా చేసుకున్నారు. అనంతరం ఇంకెవరూ రాహుల్‌ను సమీపించకుండా వలయంగా మారి భద్రత కల్పించారు. అంతకుముందు కూడా ఓ బాలుడు రాహుల్ ర్యాలీగా వెళ్తున్న ఓపెన్ టాప్ కారుపైకి ఎక్కాడు.

చిరాగ్, పెళ్లి చేసుకో!

- తేజస్వి సరదా సలహా
- తనకూ వర్తిస్తుందన్న రాహుల్

'ఓటర్ అధికార్ యాత్ర' సభ అనంతరం రాహుల్, ఆర్జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్ పాల్గొన్న మీడియా భేటీ సరదా సన్నివేశాలకు, నవ్వులకు వేదికైంది. కాంగ్రెస్, ఆర్జేడీ మధ్య చిచ్చు పెట్టేందుకు ఎల్జేపీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్ ప్రయత్నిస్తున్నారా అన్న ప్రశ్నకు తేజస్వి బదులిస్తూ, ఆయన ఎత్తులను చిత్తు చేస్తానని ధీమా వెలిబుచ్చారు. అయితే, ''చిరాగ్ వయసులో నాకంటే పెద్ద. పెద్దన్నయ్య వంటివాడు. అందుకే తనకు నాదో సలహా. త్వరగా పెళ్లి చేసుకుంటే మంచిది'' అంటూ నవ్వులు పూయించారు. ''నీ ఉచిత సలహాలు నాక్కూడా తగులుతున్నాయి, చూసుకో'' అంటూ రాహుల్ చెణుకులు విసరడంతో అంతా మరోసారి గొల్లుమన్నారు. తేజస్వి అంతటితో ఆగకుండా, 'పెళ్లి చేసుకొమ్మని మా నాన్న(లాలు) కూడా మీకిప్పటికే చాలాసార్లు చెప్పా'రన్నారు. అది నిజమేనని రాహుల్ అంగీకరించారు. ''రెండేళ్లుగా లాలూజీని ఎప్పుడు కలిసినా నా పెళ్లి మాటే ఎత్తుతున్నారు. ఆయన సమక్షంలో ఇంకా నా పెళ్లి చర్చలు జరుగుతున్నాయి'' అంటూ మరోసారి అందరినీ నవ్వించారు. ''రాహుల్ పెళ్లి గురించి ఆయన తల్లి సోనియాగాంధీతో మాట్లాడా. రాహుల్‌ను పెళ్లికొడుకుగా చూడాలని మేమంతా ఆరాటపడుతున్నాం. ఆయన బారాత్‌లో మేం డ్యాన్స్ చేయాల్సిందే'' అని లాలు గతంలో అనడం తెల్సిందే.


వేదికపై తేజస్వి, రాహుల్ నవ్వులు

బీజేపీ కొత్త సారథి... ఎంపిక త్వరలో?

ఆరెస్సెస్ జోధ్‌పూర్ భేటీలో నిర్ణయం!

న్యూఢిల్లీ: బీజేపీ నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియను రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వేగవంతం చేసింది. నూతన అధ్యక్షుడి పేరును అతి త్వరలో ఖరారు చేయనున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 5 నుంచి 7 దాకా రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో జరిగే ఆర్ఎస్ఎస్ అగ్ర నాయకత్వ సమావేశం ఇందుకు వేదిక కానుంది. బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై ఈ భేటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే, ముఖ్య సంఘ్ నేతలు, అనుబంధ విభాగాల నేతలతో పాటు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ముఖ్యనేతలు కూడా చర్చల్లో పాల్గొంటారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలపైనా భేటీలో చర్చిస్తారు. మరోవైపు పలు కీలక రంగాల ప్రముఖులతో భాగవత్ ఈ నెల 26 నుంచి 28 దాకా ఢిల్లీలో భేటీ కానున్నారు.

రష్యా అణు ప్లాంట్‌పై దాడి

మాస్కో: రష్యాలోని అతిపెద్ద అణు విద్యుత్ ప్లాంట్లలో ఒకటైన కర్స్క్ అణు విద్యుత్కేంద్రంపై శనివారం రాత్రి డ్రోన్ దాడి జరిగింది. ఇది ఉక్రెయిన్ పనేనని రష్యా ఆరోపించింది. దేశవ్యాప్తంగా పలు ఇంధన, విద్యుత్కేంద్రాలే లక్ష్యంగా శుక్రవారం రాత్రి దాడులకు దిగిందని మండిపడింది. ''కర్స్క్ అణు కేంద్రంపై దాడిలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది. మంటలను వెంటనే ఆర్పేశాం. ఒక రియాక్టర్‌లో ఉత్పత్తిని తగ్గించాల్సి వచ్చింది. అయితే అణు ధార్మికత ముప్పేమీ లేదు'' అని పేర్కొంది. ''ఉస్త్-లుగాలోని ఇంధన ఎగుమతుల టెర్మినల్‌పై దాడితో మంటలు చెలరేగాయి. అక్కడ 10 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేశాం. దేశవ్యాప్తంగా 95 డ్రోన్లు, మిసైళ్లను ధ్వంసం చేశాం. రష్యా ప్రయోగించిన 48 డ్రోన్లను అడ్డుకున్నాం. డొనెట్స్క్‌లో రెండు గ్రామాలను స్వాధీనం చేసుకున్నాం. పశ్చిమ ఉక్రెయిన్‌లో భీకర పోరు కొనసాగుతోంది'' అని పేర్కొంది.

ఓడిపోబోం: జెలెన్‌స్కీ

''ఉక్రెయిన్ బాధిత దేశం కాదు, పోరాటయోధ. రష్యాతో పోరులో ఇంకా గెలవకున్నా, ఓడిపోయే ప్రసక్తి మాత్రం లేదు'' అని అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. రాజధాని కీవ్‌లో ఆదివారం స్వాతంత్ర్య దినోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఉక్రెయిన్ స్వాతంత్ర్య పరిరక్షణకు రాజీలేని పోరు కొనసాగిస్తామన్నారు. కెనడా ప్రధాని కార్నీ ఆదివారం కీవ్‌లో జెలెన్‌స్కీతో మంతనాలు జరిపారు.


వేడుకల్లో కార్నీ, జెలెన్‌స్కీ దంపతులు

త్వరలో భారత్‌కు జెలెన్‌స్కీ!

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ త్వరలో భారత్‌లో పర్యటించే అవకాశాలున్నాయి. శనివారం ఆయనతో ఫోన్ సంభాషణ సందర్భంగా ప్రధాని మోదీ ఈ మేరకు ఆహ్వానించారు. పర్యటన తేదీ త్వరలోనే ఖరారయ్యే అవకాశముందని ఉక్రెయిన్ పేర్కొంది. ద్వైపాక్షిక సంబంధాల్లో ఈ పర్యటన కీలక మైలురాయిగా మారనుందని అభిప్రాయపడింది.

యాసిడ్ పోసి లైటర్‌తో అంటించి కన్నకొడుకు కళ్లముందే భార్యను తగలబెట్టాడు

- గ్రేటర్ నోయిడా సమీపంలో దారుణం
- పోలీసుల నుంచి పారిపోయే యత్నం
- కాల్పుల్లో గాయపడి దొరికిన వైనం
- తల్లితో సహా కటకటాల్లోకి

నోయిడా: భర్త రూపంలోని కట్నపిశాచి పైశాచికత్వానికి మరో మహిళ బలైంది. యూపీలో గ్రేటర్ నోయిడా పరిధిలోని సిర్సా గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఈ దారుణం శనివారం పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే లక్షల కట్నం చాలదని, మరింత తేవాలని చిత్రహింసలు పెట్టి, చితకబాది, చివరకు యాసిడ్ పోసి, ఆపై సజీవదహనం చేసినట్టు వెల్లడైంది! దాంతో ఆ నరరూప రాక్షసుడు కటకటాలపాలయ్యాడు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం తీసుకెళ్తుండగా పారిపోయేందుకు యత్నించి, పోలీసుల తూటా దెబ్బకు గాయపడి మళ్లీ ఊచలు లెక్కిస్తున్నాడు. అతనితో పాటు, కోడలిని రాచిరంపాన పెట్టిన అత్తను కూడా అరెస్టు చేశారు.

ధన దాహంతో...

సిర్సా వాసి సత్యవీర్ రెండో కొడుకు విపిన్‌కు 26 ఏళ్ల నిక్కీతో 2016లో పెళ్లయింది. లక్షల నగదుతో పాటు స్కార్పియో కారు, విలువైన వస్తువులు కట్న కానుకలుగా ఇచ్చారు. ఇటీవల సత్యవీర్ బెంజ్ కారు కొనుకున్నాడు. తనకూ అలాంటి మరో కారైనా, మరో రూ.36 లక్షల అదనపు కట్నమైనా తేవాలని నిక్కీని విపిన్ హింసించసాగాడు. అందుకు తల్లి దయావతి వంతపాడేది. పెద్ద కొడుకు భార్య అయిన నిక్కీ అక్కడ కంచన్‌కు కూడా వేధింపులు మొదలయ్యాయి. గురువారం రాత్రి నిక్కీని ఇష్టానికి బాది, యాసిడ్ పోసి మరీ నిప్పంటించారు. అగ్నికి ఆహుతవుతూ మెట్ల నుంచి నిక్కీ పడిపోతున్న వీడియోలు వైరల్‌గా మారాయి. భర్త, అత్త కలిసి ఆమెను జుట్టుపట్టి కొడుతున్న వీడియో కూడా వెలుగులోకి వచ్చింది. వాటిని కంచన్ రికార్డు చేసి పోలీసులకు అందించింది. తీవ్రగాయాల పాలైన నిక్కీని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలొదిలింది. ''నా చెల్లెలిని కొట్టొద్దని వారించినందుకు నన్నూ చితకబాదారు. తన తల, మెడపై విపరీతంగా కొట్టి యాసిడ్ పోశారు'' అంటూ కంచన్ వాంగ్మూలమిచ్చింది. ఆమె ఫిర్యాదు మేరకు విపిన్, దయావతిని అరెస్టు చేశారు.


నిక్కీని కొడుతున్న విపిన్


మంటల్లో కాలిపోతున్న నిక్కీ


మృతురాలి ఫైల్ ఫొటో

ఎస్సై గన్ లాక్కుని...

సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం నిక్కీని ఆదివారం మధ్యాహ్నం అతన్ని ఘటనాస్థలికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఎస్సై నుంచి పిస్టల్ లాక్కొని పారిపోయాడు. వెంటాడుతున్న పోలీసులపైకి కాల్పులకు తెగబడ్డాడు. దాంతో అతని కాళ్లపై షూట్ చేశారు. కుప్పకూలాక అదుపులోకి తీసుకున్నారు.

అమ్మను నాన్నే చంపాడు!
ఆరేళ్ల కుమారుని వాంగ్మూలం

పాపం పసివాడు! ఆరేళ్ల లేత ప్రాయం. కన్నతల్లిని తన తండ్రే నాయనమ్మతో కలిసి మరీ కర్కశంగా సజీవ దహనం చేస్తుంటే కళ్లారా చూడాల్సి వస్తుందని కల్లో కూడా అనుకుని ఉండడు! ''అమ్మను నాన్న, నానమ్మ చెంపపై బాగా కొట్టారు. మండిపోయేది అమ్మపై పోశారు. తర్వాత నాన్న లైటర్‌తో నిప్పు పెట్టాడు'' అంటూ జరిగిన దారుణాన్ని పోలీసులకు చెప్పుకుంటూ వెక్కిళ్లు పెడుతున్న ఆ బాలున్ని చూసి కంటతడి పెట్టని వారు లేరు!

హెల్త్‌కేర్ కోర్సుల ఆన్‌లైన్ బోధనపై యూజీసీ నిషేధం

న్యూఢిల్లీ: సైకాలజీ, న్యూట్రిషన్ తదితర హెల్త్‌కేర్ సంబంధిత రంగాల కోర్సులను ఇకపై ఆన్‌లైన్, దూరవిద్యా విధానంలో అందించరాదని ఉన్నత విద్యా సంస్థలను యూజీసీ కోరింది. దీనిపై నిషేధం 2025 నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. నిషేధిత కోర్సుల్లో సైకాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, బయోటెక్నాలజీ, క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డయటెటిక్స్ ఉన్నాయని వెల్లడించింది. వచ్చే విద్యా సెషన్ నుంచి ఆయా కోర్సుల్లో విద్యార్థులను చేర్చుకోవద్దని యూజీసీ కార్యదర్శి జోషి కోరారు. ప్రాక్టికల్స్ కీలకమైన హెల్త్‌కేర్ కోర్సులను ఆన్‌లైన్/దూరవిద్య ద్వారా అందించడం వల్ల నాణ్యత దెబ్బతింటున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

సీఐఎస్ఎఫ్‌లో మహిళా కమాండో బృందాలు

న్యూఢిల్లీ: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్)పూర్తిగా మహిళా కమాండోలతో కూడిన బృందాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ప్రత్యేకంగా తర్ఫీదు పొందే ఈ బృందాల సేవలను ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో వినియోగించుకుంటామని సీఐఎస్ఎఫ్ అధికారులు ఆదివారం వెల్లడించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల్లో విధుల్లో ఉన్న 100 మంది మహిళా బలగాలను శిక్షణ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి మధ్యప్రదేశ్‌లో ఉన్న బర్వాహా ట్రెయినింగ్ సెంటర్‌లో కమాండ్ నైపుణ్యాలపై 8 వారాల శిక్షణ త్వరలోనే మొదలవుతుందన్నారు. దేశంలోని 68 పౌర విమానాశ్రయాలతోపాటు ఢిల్లీ మెట్రో, ఇతర కీలకమైన ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు 1.70 లక్షల మంది సీఐఎస్ఎఫ్ బలగాలు భద్రత కల్పిస్తున్నాయి. ఇందులో 12,491 మంది మహిళలున్నారు.2026లో సీఐఎస్ఎఫ్‌లోకి మరో 2,400 మందిని చేర్చుకుంటారు. ఈ విభాగంలో మహిళల ప్రాతినిధ్యాన్ని విడతల వారీగా కనీసం 10 శాతానికి పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

అర్థవంతమైన చర్చలు లేకుంటే... సభలు జీవచ్ఛవాలే!

- స్పీకర్ల సదస్సులో అమిత్ షా
- సభాపతి స్థానం ఔన్నత్యం పెంచాలని పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరగాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆకాంక్షించారు. ''సభల్లో అలజడి సృష్టించడం ప్రతిపక్షాలకు పరిపాటిగా మారింది. ఇది మంచి పరిణామం కాదు. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం పార్లమెంటు, అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకోవడం సరికాదు'' అన్నారు. సభాపతులు తమ పనితీరుతో ఆ పదవి ఔన్నత్యం పెంచాలని పిలుపునిచ్చారు. ''ప్రజా సమస్యలపై చర్చకు నిష్పాక్షిక వేదికగా సభలను తీర్చిదిద్దాల్సిన, వాటిలో పక్షపాతానికి తావులేకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిదే. లేదంటే సభలు జీవచ్ఛవాలతో సమానమే'' అన్నారు. అఖిల భారత స్పీకర్ల సదస్సును ఆదివారం ఢిల్లీ అసెంబ్లీలో ఆయన ప్రారంభించారు. స్పీకర్లు, శాసన మండళ్ల చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను ఉద్దేశించి ప్రసంగించారు. సభల్లో అర్థవంతమైన సంవాదాలు జరగకపోతే దేశానికి తీరని నష్టమన్నారు. ''చర్చలకు ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగించడం సహించరానిది. విపక్షాలు సంయమనం పాటించాలి. కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించాలి'' అని సూచించారు.


విఠల్ భాయి పటేల్ స్మారక స్టాంపును విడుదల చేస్తున్న ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, రిజిజు, అమిత్ షా

ద్రౌపదికి జరిగిన అవమానం

నిండుసభలో ద్రౌపదికి జరిగిన అవమానం ఎన్నో విపరిణామాలకు దారితీసిందని అమిత్ షా గుర్తుచేశారు. ''సభా గౌరవం దిగజారితే దేశంలో కూడా అలాంటి దుష్పరిణామాలు తప్పవు. స్పీకర్ సారథ్యంలో జరిగే చర్చలతో దేశానికి ఎనలేని మేలు జరుగుతుంది. చట్టసభల భవనాలు జీవం పోసుకుంటాయి. స్పీకర్ అంటే సంరక్షకుడు, సేవకుడు. సమస్యల పరిష్కారానికి మేధోమథనమే ఉత్తమ మార్గం. ''ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయి సోదరుడు, స్వాతంత్ర్య యోధుడు విఠల్‌భాయి పటేల్ వందేళ్ల క్రితం సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. మన దేశంలో శాసనసభ చరిత్ర అప్పుడే మొదలైంది. అలాంటి విఠల్‌భాయి చరిత్ర ఇన్నాళ్లూ మరుగున పడింది'' అని ఆవేదన వెలిబుచ్చారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తదితరులు సదస్సులో మాట్లాడారు.

రాజ్యాంగ రక్షణకు పాటుపడతా

ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

సాక్షి, చెన్నై: తనను ఆదరించి గెలిపిస్తే ఉపరాష్ట్రపతి హోదాలో రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు అవిశ్రాంతంగా కృషిచేస్తానని విపక్షాల 'ఇండియా' కూటమి ఉపరాష్ట్రపతి ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చారు. తమిళనాడులోని ఎంపీల మద్దతును కూడగట్టుకునేందుకు చెన్నైలో ఆదివారం సాయంత్రం సుదర్శన్ రెడ్డి పర్యటించారు. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్‌తో సమావేశమయ్యారు. చెన్నై టీనగర్‌లోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో డీఎంకే కూటమిలోని కాంగ్రెస్, సీపీఎం, వీసీకే తదితర పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ''నేనిప్పుడు నా గురించి చెప్పుకోదల్చుకోలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నేనిచ్చిన తీర్పులనూ ప్రస్తావించదల్చుకోలేదు. నా తీర్పుల కంటే ఇప్పుడు మీరు నా విషయంలో ఇచ్చే తీర్పు(ఓటు వేయడం) అత్యంత కీలకం. నాకు అవకాశం ఇస్తే రాజ్యాంగాన్ని పరిరక్షిస్తా'' అని సుదర్శన్ రెడ్డి చెప్పారు.

ఉక్రెయిన్‌కు 3,350 క్షిపణులు పంపనున్న అమెరికా

వాషింగ్టన్: ఉక్రెయిన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు అగ్రరాజ్యం సిద్ధమైంది. 850 మిలియన్ డాలర్ల విలువైన 3,350కి పైగా ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ (ఈఆర్ఏఎం) క్షిపణులను ఉక్రెయిన్‌కు అందించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఈ ఆయుధ ప్యాకేజీకి యురోపియన్‌దేశాలు నిధులు సమకూరుస్తున్నాయి. ఆరు వారాల్లో ఈ క్షిపణులు కీవ్‌కు చేరుకుంటాయి. ఇవి ఎప్పుడో ఉక్రెయిన్‌కు చేరాల్సి ఉండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చల నేపథ్యంలో కొంత ఆలస్యం అయ్యాయి. వీటిలో 240 నుంచి 450 కి.మీ. పరిధి కలిగిన ఈ ఈ ఆర్ఏఎమ్ క్షిపణులు ఉన్నాయి.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 25 । ఆగస్టు । 2025



వంతెనలున్నాయి..
గణేష్ ఉత్సవాల సందడి జోరందుకుంది. నగరంలోని ఫ్లైఓవర్ల ఎత్తును, విగ్రహాల ఎత్తుతో బేరీజు వేసుకుని అందుకు తగ్గ మార్గాన్ని ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. -8లో



స్మార్ట్ లోకంలో..
నగర అధునాతన సాంకేతిక జీవనశైలిలో వేగం పెరిగిన కొద్దీ యువత 'స్క్రీన్ టైమ్-సెంట్రిక్' దిన చర్యగా, బానిసత్వంగా మారుతోందని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0/22.0
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పొడి వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

ధనాధన్.. మారథాన్..

పరుగుతో పోయేదేమీలేదు అనారోగ్యం తప్ప. అనే తీరుగా ఔత్సాహిక రన్నర్లు ఉత్సాహంగా.. ఉల్లాసంగా పాల్గొన్నారు. ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు ఆదివారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఎన్‌ఎండీసీ హైదరాబాద్ మారథాన్–2025ను నిర్వహించారు. పరుగుకు ఔత్సాహికులు వేలాదిగా తరలివచ్చారు.





ఒక వైవిధ్యభరితమైన వేడుక. శతాబ్దాల సాంస్కృతిక ఉత్సవం. కులమతాలకు అతీతంగా ఒక్కటైన ఉత్సాహం. విభిన్న జీవన సంస్కృతుల ఆవిష్కరణ భాగ్యనగరం. ప్రతి మనిషి సమూహమయ్యే వేడుక. మహోన్నతమైన భాగ్యనగర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే వినాయక వేడుకలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. తొమ్మిది రోజుల పాటు విభిన్న ఆకృతులలో భక్తకోటిని మంత్రముగ్ధులను చేసే వినాయక చవితి ఉత్సవాలు ఈ నెల 27 నుంచి సంబరంగా జరుపుకొనేందుకు నగరం సిద్ధమవుతోంది. – సాక్షి, సిటీబ్యూరో

అహో మహా గణపతి!

శతాబ్దాల చారిత్రక సౌరభం.. గణనాథుడి మహోత్సవం

- నగరంలో తిలక్ స్ఫూర్తితో మొదలైన వేడుకలు
- చవితి ఉత్సవాలకు ఆర్యసమాజ్ అంకురార్పణ
- సామరస్యమే లక్ష్యంగా సామూహిక నిమజ్జనం
- 27 నుంచి గణేష్ నవరాత్రులకు సిటీ సిద్ధం

శతాబ్దాలుగా లంబోదరుడు భక్తజనుల పూజలను అందుకుంటూనే ఉన్నాడు. శాతవాహనులు, రాష్ట్రకూటులు, చాళుక్యుల కాలం నుంచే ప్రజలు విఘ్నేశ్వరుడి పండగ చేసుకున్నట్లు చరిత్ర చెబుతోంది. ప్రజల్లో దేశభక్తిని, జాతీయతను పెంచేందుకు ఛత్రపతి శివాజీ వినాయక వేడుకలను ఘనంగా జరిపేవాడని చెబుతారు. కానీ.. అప్పటికి ఇంకా ఈ వేడుక సామూహికం కాదు. 1818 నుంచి 1892 వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు కేవలం ఇళ్లకే పరిమితమయ్యాయి. ఎవరి ఇంట్లో వాళ్లు గణనాథుడికి పూజలు చేసి, భక్తితో కొలిచేవారు. 1893 తర్వాతే సామూహిక ఉత్సవమైంది. ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు, స్వాతంత్ర్యోద్యమాన్ని బలోపేతం చేసేందుకు లోకమాన్య బాల గంగాధర తిలక్ లాల్‌బాగ్‌లో తొలిసారి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఇలా మహారాష్ట్రలో ప్రారంభమైన ఈ వేడుకలు అనతి కాలంలోనే హైదరాబాద్‌లోనూ మొదలయ్యాయి.

వేడుకలు ఇలా మొదలు..

నిజాం నిరంకుశత్వానికి ఎదురు నిలిచిన ఆర్య సమాజ్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించింది. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో బహదూర్‌యార్‌జంగ్, ఖాసీం రజ్వీ నేతృత్వంలో జరిగిన అకృత్యాలను తిప్పికొట్టేందుకు ఆర్య సమాజ్ వాడవాడలా వినాయక మండపాలను నెలకొల్పి విగ్రహాలను ఏర్పాటు చేసింది. పండిత్ నరేంద్రజీ నేతృత్వంలో వేలాది మంది కార్యకర్తలు నగరంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు.

- భజనలు, దేశభక్తి గీతాలతో, వివిధ రకాల ఆటల పోటీలతో తొమ్మిది రోజులు గడిచేవి. కానీ అప్పటికి ఇంకా చిన్నచిన్న మట్టి ప్రతిమలే పెట్టేవాళ్లు. 1950 అనంతరం ఈ వేడుకలు అన్నిచోట్లా ఘనంగా జరిగాయి. బాలాపూర్, లాల్‌దర్వాజా, మీరాలం ట్యాంక్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో అందమైన బొజ్జగణపయ్యలు కొలువుదీరారు. నిజాం కాలంలో లక్ష్మయ్య, ఎంకమయ్య, మరికొందరు భక్తులు కలిసి హుస్సేనీ ఆలం బారాగల్లీలో చిన్న వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మీరాలంమండి వినాయకుడికి 150 సంవత్సరాల చరిత్ర ఉన్నట్లు స్థానికులు చెబుతారు. ఇక 1953లో అప్పటి స్వాంతంత్ర్య సమరయోధుడు శంకర్ ఖైరతాబాద్‌లో ఒక్క అడుగు ఎత్తు వినాయకుడితో వేడుకలను ప్రారంభించారు.

సామూహిక నిమజ్జనం ఇలా..

ఆ రోజుల్లో హైదరాబాద్‌లో వందల సంఖ్యలోనే మండపాలు వెలిసేవి. సఫిల్‌గూడ, సరూర్‌నగర్, మీరాలంట్యాంకు, రాజన్న బావి తదితర చెరువుల్లో నిమజ్జనం చేసేవాళ్లు. 1979 నాటి నిమజ్జనోత్సవానికి కంచి శంకరాచార్యులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. చార్మినార్ స్వాగత వేదికపై నుంచి ప్రసంగించారు. విగ్రహాలను ట్యాంక్‌బండ్‌లోనే నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. వందేమాతరం రామచంద్రయ్య నేతృత్వంలో ఆలె నరేంద్ర, బద్దం బాల్‌రెడ్డి, దత్తాత్రేయ, భరత్‌సింగ్, డాక్టర్ భగవంత్‌రావు తదితరులు 1980లో భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వినాయక విగ్రహాలు హుస్సేన్ సాగర్ బాట పట్టాయి.



నేడు నేత్రోనిలనం

ఖైరతాబాద్: ఈసారి ఖైరతాబాద్ మహాగణపతి 69 అడుగుల ఎత్తులో 28 అడుగుల వెడల్పుతో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి భక్తులకు దర్శనమిచ్చేందుకు సిద్ధమయ్యాడు. మహా గణపతిని పూర్తిగా మట్టితోనే తీర్చిదిద్దినట్లు శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు. దేశంలోనే మట్టితో ఇంత ఎత్తులో విగ్రహాన్ని తయారు చేసి ఊరేగించి.. నిమజ్జనం చేయడం ఖైరతాబాద్ వినాయకుడి ఘనత అని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, సెప్టెంబరు 6న నిమజ్జనం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం మహా గణపతి ప్రతిమకు కంటిపాపను (నేత్రోనిలనం) అమర్చడం ద్వారా ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లవుతుందని శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు.



డర్టీ మర్డర్స్!

మంటగలుస్తున్న మానవ సంబంధాలు

- చంపేసి.. కాల్చేసి.. ఆపై ముక్కలుగా నరికి..
- నగరంలో తరచుగా అమానుష హత్యలు
- ఆధారాలు మాయం చేయడానికి ఎత్తుగడలు
- తాజాగా మేడిపల్లిలో కలకలం రేపిన హత్యోదంతం

రాజధానిలో తరచుగా డర్టీ మర్డర్స్ వెలుగుచూస్తున్నాయి. మానవత్వం మరిచిన కొందరు తమవారి విషయంలోనూ విచక్షణ కోల్పోతున్నారు. క్షణికావేశం, కక్షలు, కార్పణ్యాలు, పక్కా పథకం ప్రకారం.. ఇలా కారణమేదైనా హత్య చేసిన తర్వాత మృతదేహాలను మాయం చేస్తున్నారు. ఇందులో భాగంగానే హత్య చేసిన తర్వాత మృతదేహాలను కాల్చేయడం, ముక్కలు చేసేయడం, కుక్కర్‌లో ఉడికించడం ... ఇలా ఎంతటి దారుణానికైనా ఒడిగడుతున్నారు. ఇలాంటి ఘోరాల్లో అత్యధికం సాక్ష్యాధారాలు మాయం చేయడానికేనని, యాంటీ సోషల్ పర్సనాలిటీ డిజార్డర్ కూడా కారణమని సైకాలజిస్టులు చెబుతున్నారు. నగరంలో జరిగిన కొన్ని దారుణ ఘటనలు ఇలా ఉన్నాయి..
– సాక్షి, సిటీబ్యూరో

ముక్కలు చేసి.. మూసీలో పడేసి..

మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో నివసించే మహేందర్‌రెడ్డి గర్భవతి అయిన తన భార్య స్వాతి అలియాస్ జ్యోతిని దారుణంగా చంపేశాడు. ఆపై మృతదేహాన్ని ముక్కలు చేసి, మొండెం మినహా మిగిలిన భాగాలు మూసీ నదిలో పడేశాడు. ఆదివారం ఉదయం ఈ ఉదంతం వెలుగులోకి రాగా... నిందితుడిని విచారిస్తున్న పోలీసులు మృతదేహం అవశేషాల కోసం మూసీ తీరం మొత్తం గాలిస్తున్నారు.

సిమెంట్ దిమ్మెలో నవీష్ శవం..

'జనహర్ష' అధినేత రమణమూర్తితో ఆర్థిక విభేదాల నేపథ్యంలో అతడి పార్ట్‌నర్ నవీష్‌మూర్తి 2005లో దారుణ హత్యకు గురయ్యాడు. రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్ విజయ్‌సింగ్ మరికొందరు కలిసి నవీష్‌మూర్తిని ఉప్పల్ ప్రాంతంలోకి తీసుకువెళ్లారు. అక్కడ నిర్మాణంలో ఉన్న తమ పరిచయస్తుడి ఇంట్లో హత్య చేశారు. శవాన్ని వంటింట్లో పడేసి, కాంక్రీట్‌ను దిమ్మగా పోసేశారు. ఆ ఇంటి వెనుక నివసించే ఓ మహిళ ఇచ్చిన సమాచారంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

గోనె సంచుల్లో మూటకట్టి..

2003లో వెలుగులోకి వచ్చిన ప్రభాకర్ హత్య తీవ్ర కలకలం సృష్టించింది. యూసుఫ్‌గూడలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వహించే ప్రభాకర్ ఫైనాన్స్ వ్యాపారి కూడా. పుట్టిన రోజు కార్డులు ప్రింటింగ్ చేయించుకోవడానికి వచ్చిన శైలజతో అతడికి పరిచయమైంది. ప్రభాకర్ నుంచి శైలజ రూ.లక్షల్లో అప్పు తీసుకుంది. తిరిగి చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో ప్రభాకర్‌ను ఇంటికి పిలిచి, కూల్‌డ్రింక్‌లో నెయిల్ పాలిష్ రిమూవర్ కలిపి మత్తులోకి దింపింది. ఆపై చంపేసి చేసి శవాన్ని ఐదు భాగాలుగా కోసి, గోనె సంచుల్లో కట్టి వంటింటి నుంచి టెర్రస్ వరకు ఐదు చోట్ల దాచింది.



పాలేరులో పడేశారు..

కర్నూలు జిల్లాకు చెందిన రామ్‌భూపాల్ రెడ్డికి నగరానికి చెందిన ఫిల్మ్ ఫైనాన్సియర్ మంజులారెడ్డితో పరిచయమైంది. వీరిద్దరూ 2001లో వివాహం చేసుకున్నా కొన్నాళ్లకు మనస్పర్థలు వచ్చి వేర్వేరుగా ఉన్నారు. ఓ దశలో మంజులారెడ్డిని హతమార్చాలని నిర్ణయించుకున్న రామ్‌భూపాల్‌రెడ్డి తన మిత్రులైన మల్లికార్జునరెడ్డి, మధుసూధన్‌రెడ్డిలతో కలిసి 2006 జూన్ 27న చంపేశాడు. మృతదేహాన్ని గోనె సంచిలో మూటగట్టి ఖమ్మం సమీపంలోని పాలేరు జలాశయంలో పడేశారు.

ముక్కలుగా దొరికిన రాకేష్

నారాయణగూడ పోలీసుస్టేషన్ పరిధిలో వాచ్‌మన్‌గా పని చేసిన ఓ వ్యక్తి కుమారుడు రాకేష్ 2010 డిసెంబర్‌లో ముక్కలు ముక్కలుగా దొరికాడు. తొలుత రామ్‌కోఠి చౌరస్తాలోని సిద్ధార్థ ఏజెన్సీస్ వద్ద కాళ్లు, తల లేని మొండెం, రెండు రోజులకు నారాయణగూడలో కాళ్లు లభించాయి. ఇతడి కుడి కాలికి ఉన్న ఆరు వేళ్లను బట్టి తల్లిదండ్రుల తమ బిడ్డగా గుర్తించారు. రాకేష్ తల మాత్రం దొరకలేదు. ఈ ఘాతుకానికి ఒడిగట్టింది ఎవరనేదీ తేలలేదు.

రిఫ్రిజిరేటర్‌లో విగతజీవిగా..

కరీంనగర్ జిల్లా సిరిసిల్లకు చెందిన వస్త్ర వ్యాపారి శ్రీనివాస్ 2011లో హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన దుండగులు ఆయన మృతదేహాన్ని తమ ఫ్లాట్‌లో ఉన్న ఫ్రిజ్‌లో పెట్టి పరారయ్యారు. సిరిసిల్లకే చెందిన ప్రొఫెషనల్ నేరగాడు శ్రీధర్ సూత్రధారిగా ఈ హత్య జరిగింది.

ఆధారాలు మాయం చేయడానికే..

ఇలాంటి ఉదంతాల్లో మృతదేహాలను ముక్కలు చేయడం, కాల్చేయడం, ఉడికించడం.. తదితరాలన్నీ ఎక్కువగా కీలక ఆధారమైన డెడ్‌బాడీని మాయం చేయడానికే చేస్తుంటారు. మృతదేహాన్ని యథాతథంగా తీసుకువెళ్లి ఎక్కడైనా పడేసి వచ్చే అవకాశం లేకపోతేనే ఈ వైపు మొగ్గుతుంటారు. ప్రస్తుత ఇంటర్నెట్ ప్రపంచంలో యూట్యూబ్ ఆధారంగానూ ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయి. కుటుంబీకులు.. అందునా భర్తలు ఇలాంటి దారుణాలు చేయడానికి అనుమానమే ప్రధాన కారణమవుతోంది. సమాజంలో పెరిగిపోయిన యాంటీ సోషల్ పర్సనాలిటీ డిజార్డర్ కారణంగానూ విచక్షణ కోల్పోతున్నారు. ఈ నేరం చేసే వరకు ఆ నిందితులు సాధారణ జీవితమే గడుపుతుండటం గమనార్హం. ఇలాంటి కేసుల్లో నేరం నిరూపణ కూడా కష్టసాధ్యం అవుతుంది. – ఆర్. ప్రభాకర్, మాజీ డీసీపీ

డ్రమ్ములో డెడ్‌బాడీ..

వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో 2012 జూన్ 28న ఓ డెడ్‌బాడీ బయటపడింది. నిలబెట్టి ఉన్న ప్లాస్టిక్ డ్రమ్‌లో ప్లాస్టిక్ గన్నీ బ్యాగ్‌లతో పార్సిల్ చేసి టేప్ వేసిన స్థితిలో లభించింది. వికలాంగుడైన హతుడిది నల్లగొండ, మహబూబ్‌నగర్ అయి ఉండవచ్చని పోలీసులు భావించారు.

ఉడికించి.. పొడిగా చేసి..

రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోని మీర్‌పేట పరిధి జిల్లెలగూడలో ఈ ఏడాది జనవరిలో వెంకట మాధవిని ఆమె భర్త గురుమూర్తి చంపేశాడు. మృతదేహాన్ని ముక్కలు చేసి క్యాస్టిక్ సోడా వేసి ఉడకబెట్టి, ఎముకల్ని పొడిగా చేశాడు. ఆపై డ్రైనేజీలో కలిపేశాడు.

వెరైటీ వెండింగ్ జోన్!

నగరంలో ఎక్కడా లేని విధంగా..
- టోలిచౌకి ఫ్లై ఓవర్ కింద షాపులు
- త్వరలో బహిరంగ వేలం ద్వారా అద్దెకు

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటి వరకు ఫ్లై ఓవర్లకు అందమైన పెయింటింగ్స్, ఫ్లై ఓవర్ల కింద స్తంభాలకు వేలాడే తీగలు(హ్యాంగింగ్ క్రీపర్స్), ఫ్లై ఓవర్ కింది ఖాళీ ప్రదేశంలో పచ్చదనం, అందమైన పూలమొక్కలు, వాటర్ ఫౌంటైన్స్, అందమైన శిల్పాలు, ఆకట్టుకునే ఆకృతులు, స్పోర్ట్స్ కోర్టులు వంటివి ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ.. మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు నగరంలో ఎక్కడా లేని విధంగా టోలిచౌకి ఫ్లై ఓవర్ కింద వెండింగ్ జోన్ ఏర్పాటు చేసింది. ఫ్లై ఓవర్ కింద 18 దుకాణాలు/స్టాల్స్‌తో దీన్ని ఏర్పాటు చేసింది. వీటిని ఆయా వ్యాపారాలకు ప్రైవేట్ వ్యక్తులకు అద్దెలకిచ్చేందుకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలపడంతో జీహెచ్‌ఎంసీ చట్టం, నిబంధనలకనుగుణంగా టెండర్ –కమ్– బహిరంగ వేలం నిర్వహించేందుకు సంబంధిత ఎస్టేట్స్ విభాగం అధికారులు సిద్ధమవుతున్నారు. త్వరలోనే నోటిఫికేషన్ ద్వారా ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. త్వరలో పిలవనున్న టెండర్లలో అర్హత పొందేవారికి మూడేళ్ల పాటు స్టాళ్లను లీజుకివ్వనున్నారు.



టోలిచౌకి బ్రిడ్జి కింద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొత్త షాపులు

మరమ్మతులు మాత్రం గాలికి..
ఫ్లైఓవర్లకు సొబగులు, కొత్తందాలు అద్దుతున్న జీహెచ్‌ఎంసీ యంత్రాంగం అభిరుచిని ఎవరూ కాదనలేరు కానీ.. రంగులు హంగుల కంటే ముందు ఫ్లై ఓవర్ల పటిష్టత, దెబ్బతిన్న మార్గాల్లో మరమ్మతులు, ప్రజలు సాఫీగా ప్రయాణించేలా లేన్ మార్కింగ్‌లు, స్పీడ్ లిమిట్స్ హెచ్చరికలు తదితరమైనవి ఏర్పాటు చేశాక ఇలాంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలుండవా?
వెండింగ్‌జోన్ ఆలోచన బాగానే ఉన్నా, వాటిని దక్కించుకునే వ్యాపారులకు ఉపాధి లభించడంతో పాటు ప్రజలకు సదుపాయం కానున్నప్పటికీ, దుకాణాలకు వచ్చే పోయే రద్దీతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే సరైన పార్కింగ్ సదుపాయాలు లేక పలు ప్రాంతాల్లోని వ్యాపార ప్రాంతాలు గజిబిజిగా మారి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుండటం తెలిసిందే. జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన వెండింగ్ జోన్‌లోని స్టాళ్లు కాక అనధికారికంగానూ కొత్త స్టాళ్లు ఏర్పాటు చేసే అవకాశం కూడా ఉందని, తద్వారా మరిన్ని సమస్యలకు ఆస్కారం ఉందని అర్బన్ ప్లానింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈ దిశగా బల్దియా యంత్రాంగం ఎందుకు ఆలోచించలేదో? లేక గజిబిజి గందరగోళం, ట్రాఫిక్ రద్దీ నివారణకు దానికి వేరే ప్రణాళిక ఏమైనా ఉందో కాలమే సమాధానం చెబుతుంది.





కమ్యూనిస్టు యోధుడికి కడసారి వీడ్కోలు

శుక్రవారం కన్నుమూసిన కమ్యూనిస్టు దిగ్గజం, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డికి కడసారి వీడ్కోలు పలికారు. మఖ్దూం భవన్‌లో ఉంచిన ఆయన భౌతిక కాయానికి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, సీపీఐ నేతలు, రాజకీయేతర రంగాల ప్రముఖులు నివాళులర్పించారు. సురవరం సేవలు అజరామరం అని కొనియాడారు.

జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యానికి యువకుడి బలి

చందానగర్ రైల్వే అండర్ పాస్ కింద వరద నీటిలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

చందానగర్: జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి ఓ యువకుడు బలయ్యాడు. చందానగర్ రైల్వే అండర్ పాస్ నిండా వర్షం నీరు చేరి గుంతలా మారగా..నీటిని తొలగించడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. దీంతో ఆ నీటిలో పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పాపిరెడ్డి కాలనీ వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు భారీగా చేరింది. దీంతో శనివారం రాత్రి ఓ గుర్తు తెలియని యువకుడు (30) ఆ వరద నీటిలో పడి మృతి చెందాడు. స్థానికులు ఈ విషయాన్ని చందానగర్ పోలీసులకు తెలిపారు. ఈ మేరకు పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



వరద నీటిలో పడి మృతి చెందిన యువకుడు

ప్లైవుడ్ గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం



ప్లైవుడ్ గోడౌన్‌లో చెలరేగుతున్న మంటలు



రోబోటిక్ యంత్రంతో మంటలార్పుతున్న సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాటేదాన్ ప్రాంతంలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన సలీమ్ గత ఏడు సంవత్సరాలుగా ఇక్కడ ప్లైవుడ్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఇందులో మల్టీ పర్పస్‌గా వెల్డింగ్, ప్లైవుడ్, సోఫాల తయారీతో పాటు మేకలు, కోళ్లను పెంచుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే రాజేంద్రనగర్ అగ్నిమాపక అధికారి చంద్రనాయక్ నేతృత్వంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అలాగే చాంద్రాయణగుట్ట నుంచి అగ్నిమాపక కేంద్రంతో పాటు గౌలిగూడ నుంచి రోబోటిక్ యంత్రాన్ని రంగంలోకి దించి మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తుంది. కొన్ని మూగజీవాలు మంటల్లో చిక్కుకుపోయి చనిపోయాయి. కోళ్లు, రెండు మేకలు మృతి చెందాయి. ప్రమాదానికి గల కారణంగా ఇంకా తెలియరాలేదని అగ్నిమాపక అధికారి చంద్రనాయక్ వెల్లడించారు. షార్ట్ సర్క్యూట్ కారణమై ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా కాటేదాన్‌లో ఫైర్ వాహనాలు వెళ్లే దారి సరిగా లేకపోవడంతో గౌలిగూడ నుంచి రోబోటిక్ యంత్రాన్ని తీసుకువచ్చి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి మంటలు ఆర్పారు.

వంతెనలున్నాయి.. గుర్తుంచుకోండి!

సరిచూసుకోకుంటే విగ్రహాలు ఇరుక్కునే అవకాశం

ఫలితంగా మనోభావాలు దెబ్బతినడం, ట్రాఫిక్ జామ్స్ // సిటీలో జోరందుకున్న గణేష్ సందడి, త్వరలో నిమజ్జనాలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గణేష్ సందడి జోరందుకుంది. ఇప్పటికే అనేక మండపాలకు వినాయక విగ్రహాలు చేయగా...సోమ, మంగళవారాల్లో ఈ హడావుడి మరింత ఎక్కువ అవుతుంది. గతానికి భిన్నంగా ఈసారి ఆగమన్ పేరుతో విగ్రహం ఖరీదు చేయడం, మండపం వరకు తీసుకువెళ్లడం, ఏర్పాటు చేయడాన్నీ అట్టహాసంగా చేస్తున్నారు. వినాయకచవితి ముగిసిన మూడో రోజుల నుంచి నిమజ్జనాలు ప్రారంభం అవుతాయి. ఇలా వాహనాలపై విగ్రహాలకు తీసుకువెళ్లే సందర్భంలో అవి ఫ్లైఓవర్లు, మెట్రో స్టేషన్లకు తగిలి ధ్వంసం కావడం, ఇరుక్కుపోవడం జరిగే ఆస్కారం ఉంది. ఫలితంగా భక్తుల మనోభావాలు దెబ్బతినడంతో పాటు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులకు కారణం అవుతుంది. ఆదివారం పంజగుట్ట ఫ్లైఓవర్ కింద ఇరుక్కుపోయిన విగ్రహం తీవ్ర ట్రాఫిక్ జామ్స్‌కు కారణమైంది. ఈ నేపథ్యంలోనే కొన్ని కీలక జాగ్రత్తలు తీసుకోవాలని, నగరంలోని ఫ్లైఓవర్ల ఎత్తును, విగ్రహాల ఎత్తుతో పోల్చుకుని అందుకు తగ్గ మార్గాన్ని ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

- గణేష్ విగ్రహంతో కూడిన వాహనం వెళ్లే మార్గంలోని వంతెనల కన్నా గరిష్ఠంగా ఐదు అడుగులు తక్కువగా విగ్రహం ఎత్తు ఉండాలి. వంతెన కింది ఉన్న రోడ్డు నుంచి ఈ ఎత్తును పరిగణనలోకి తీసుకుంటారు.
- 'గణేష్'ని తీసుకువెళ్లే వాహనం (లారీ, వ్యాన్ తదితరాలు) ఎత్తు గరిష్ఠంగా ఐదు అడుగులు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే విగ్రహం ఎత్తు వంతెన కంటే కనిష్ఠంగా 5 తక్కువగా ఉండాల్సిన అవసరం ఉంది.
- పోలీసు విభాగం గణేష్ విగ్రహాల ఎత్తుపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు. అయితే ప్రస్తుతం నగరంలో చాలా చోట్ల మెట్రో రైల్ మార్గం ఉంది. కొన్ని చోట్ల మెట్రో రైల్ స్టేషన్లు ఉన్నాయి. వీటన్నింటినీ నిర్వాహకులు దృష్టిలో పెట్టుకోవాలని పోలీసులు కోరుతున్నారు.
- ప్రధానంగా ఎంజే మార్కెట్ మీదుగా భారీ విగ్రహాలు వెళ్లడం కష్టసాధ్యం. వీటిని మండప నిర్వాహకులు దృష్టిలో పెట్టుకుని, ముందుగానే అనువైన దారిని ఎంచుకోవాల్సి ఉంటుంది. విగ్రహం ఎత్తుతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలి.
- విగ్రహాల తరలింపునకు సంబంధించి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా పోలీసు కంట్రోల్ రూమ్ (100, 112) లేదా స్థానిక పోలీసుల్ని సంప్రదించాలి.

పంజగుట్ట కూడలిలో బ్రిడ్జిని తాకిన విగ్రహం



పంజగుట్ట కూడలి వద్ద ఆగిన వాహనం

పంజగుట్ట: వినాయకుని విగ్రహం తరలిస్తున్న వాహనం పంజగుట్ట కూడలి వద్ద బ్రిడ్జికి తాకడంతో వాహనం రోడ్డుపైనే ఆగిపోయి కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆదివారం ఉదయం ఓ పెద్ద డీసీఎంలో భారీ వినాయకున్ని తీసుకుని పంజగుట్ట నుండి అమీర్‌పేట వైపునకు వెళ్తుండగా..పంజగుట్ట కూడలి వద్ద పైన ఫ్లైఓవర్ బ్రిడ్జి అడ్డంకిగా మారింది. దీంతో వాహనాన్ని అక్కడే ఆపేశారు. రోడ్డు మధ్యలో వాహనం ఆగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని బంజారాహిల్స్ వైపునకు మళ్లించడంతో అక్కడ వాహనం సాఫీగా వెళ్లిపోయింది.

నగరంలోని ప్రధాన ఫ్లైఓవర్ల వివరాలు ఇలా..

ఫ్లైఓవర్	ఎత్తు (అడుగుల్లో)
తెలుగుతల్లి	23
అంబేద్కర్ విగ్రహం	17
నారాయణగూడ	18.5
బషీర్‌బాగ్	18.5
తార్నాక	19.5
నల్గొండ చౌరస్తా	18
వైఎంసీఏ	18.10
ప్యాట్నీ	17.4
పీఎన్‌టీ	16
సీటీఓ	18
చాంద్రాయణగుట్ట	18
గ్రీన్‌ల్యాండ్స్	19
పంజగుట్ట	20
మోనప్ప ఐలాండ్	18.5
మాసబ్‌ట్యాంక్	17.5

చర్లపల్లి జైలు నుంచి పరారై.. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కి..

కుషాయిగూడ: చర్లపల్లి సెంట్రల్ జైలు నుంచి ఓ రిమాండ్ ఖైదీ ఆదివారం సాయంత్రం తప్పించుకున్నాడు. ఈ మేరకు చర్లపల్లి జైలు అధికారులు ఖైదీ పరారీపై చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. బిహార్‌కు చెందిన సామ్ కమర్ ఉప్పల్ క్రైం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో ఈ నెల 16న పోలీసులు కమర్‌ను చర్లపల్లి జైలుకు రిమాండ్‌కు తరలించారు. కాగా చర్లపల్లి జైలులో పెయింటింగ్ పనులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో వారికి సహాయంగా ఉంటున్నట్లు నటించాడు. ప్రహరీకి రంగులు వేసే సమయంలో అదును చూసి జైలు సిబ్బంది కళ్లుగప్పి గోడ దూకి పారిపోయినట్లు సమాచారం. జైలు నుంచి సాయంత్రం 4:30 గంటలకు తప్పించుకున్న ఖైదీని ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రాత్రి 7.30కి అదుపులోకి తీసుకున్నారు.

ఏఐ సహకారంతో రెచ్చగొట్టే చిత్రాలు

నిందితుడిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగించి, తమ ఫోన్‌లో రూపొందించిన అత్యంత అభ్యంతరకరమైన చిత్రాలను సోషల్ మీడియాలో వైరల్ చేసిన నిందితుడిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇతగాడు తమ వర్గాన్నే కించపరుస్తూ వీటిని సృష్టించాడని, ఫేస్‌బుక్‌తో పాటు ఇన్‌స్టాగామ్‌లోనూ షేర్ చేశాడని అధికారులు తెలిపారు. తాను మరో వర్గానికి చెందిన వ్యక్తిగా పేర్కొంటూ ఈ పోస్టులు చేసిన ఇతగాడు వైషమ్యాలు సృష్టించడానికి ప్రయత్నించినట్లు వివరించారు.

నేను కోరుకున్న జీవితం ఇది కాదు..

సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య



దేబషిష్ (ఫైల్)

బంజారాహిల్స్: 'అమ్మా..నాకు ఈ జీవితం నచ్చడం లేదు..నేను కోరుకున్న లైఫ్ ఇది కాదు.. నా జీవితాన్ని ఇంకోరకంగా ఊహించుకున్నా..ఇప్పుడు జరుగుతున్నది వేరేగా ఉంది..నాకు నచ్చని ఈ బతుకు ముగించాలనుకుంటున్నాను' అంటూ ఓ యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన దేబషిష్ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో నిర్మాణంలో ఉన్న మంత్రి కన్‌స్ట్రక్షన్స్‌లో క్వాలిటీ కంట్రోలర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అదే ఆవరణలో గత కొంతకాలంగా ఒక గదిలో ఉంటున్నాడు. అయితే వారం రోజుల నుంచి అదోలా ఉంటూ..తనకు ఈ జీవితం నచ్చడం లేదంటూ సహచర సిబ్బందితో వాపోయేవాడు. అనుకున్న విధంగా బతుకు కొనసాగడం లేదని అశాంతితో గడుపుతూ చివరకు తల్లికి సూసైడ్ నోట్ రాసి తాను ఉంటున్న గదిలోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ మాజీ ప్రొఫెసర్ వెంకట రాజయ్య మృతి



ప్రొ.వెంకట రాజయ్య(ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఇంగ్లిష్ విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.వెంకటరాజయ్య (65) గుండె సంబంధిత వ్యాధితో అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఓయూకు అనుకొని ఉన్న డీడీ కాలనీలో నివాసం ఉంటున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రొ.వెంకటరాజయ్య మృతి పట్ల ఓయూ మాజీ వీసీ ప్రొ.రవీందర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఓయూకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. వరంగల్ జిల్లా తరిగొప్పుల గ్రామానికి చెందిన ప్రొ.వెంకటరాజయ్య ఇంటర్ నుంచి హైదరాబాద్‌లోనే విద్యభ్యాసం చేశారు. సిటి కాలేజీ విద్యార్థి సంఘాల ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా గెలిచిన ఆయన అనేక బీసీ ఉద్యమాలలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్సీగా పోటీ చేసిన ఆయన విద్యార్థి దశ నుంచి రాజకీయాలు, ప్రజా సమస్యలపై పోరాడినట్లు మాజీ వీసీ వివరించారు.

దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు



ర్యాలీలో పాల్గొన్న మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

మేడ్చల్ రూరల్: దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని..ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. మేడ్చల్‌లో డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆమె టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, ఓట్ చోర్‌పై ప్రచార రథాలను ప్రారంభించారు. అంతకు ముందు మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి మీడియాతో మాట్లాడుతూ ఓట్ చోర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు హరివర్ధన్‌రెడ్డి ప్రచార రథాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలతోపాటు సంక్షేమ పథకాలు కూడా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పనితీరుపై పాదయాత్ర చేస్తున్నట్టు తెలిపారు.

ఓట్ల దొంగతనంతోనే బీజేపీ అధికారంలోకి : టీపీసీసీ చీఫ్

బీజేపీ ఓట్ల దొంగతనానికి పాల్పడటం వల్లే దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందని, మోదీ మరోమారు ప్రధాని అయ్యారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఏ విధంగా ఓట్ల దొంగతనానికి పాల్పడిందో వివరించేందుకు, మోదీ ఫాసిస్టు విధానానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పాదయాత్ర చేపట్టారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయ నిపుణులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలిలో చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కారులో కొకైన్ తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల అరెస్ట్



అరెస్టైన ముగ్గురు నిందితులు



సిగరెట్ పెట్టెలో దాచిన కొకైన్

హిమాయత్‌నగర్: కారులో కొకైన్ తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద 33.3 గ్రాముల కొకైన్‌ను ఎక్సైజ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీమ్ సీజ్ చేసింది. నారాయణగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.అంజిరెడ్డి వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాంకోఠి వర్ధమాన్ బ్యాంక్ వద్ద చేపట్టిన తనిఖీల్లో ఓ ఇన్నోవా కారులో ముగ్గురు వ్యక్తులు కొకైన్‌ను తరలిస్తుండగా పట్టుకున్నారు. నాంపల్లికి చెందిన బాహిద్దీన్ ఖాన్, బంజారాహిల్స్‌కు చెందిన అలీఅస్గర్ గులాబీ, జుబైర్ అలీ (యుఎస్ఏ సిటిజన్)ను అదుపులోకి తీసుకొని, వారి వద్ద 33.3 గ్రాముల కొకైన్‌ను గుర్తించారు. వారిని విచారించగా బాహిద్దీన్ ఖాన్, అస్గర్ గులాబీలు కొకైన్‌ను తరుచూ పార్టీలలో వాడుతున్నట్లు తేలింది. హైదరాబాద్ నగరంలో కొకైన్ లభ్యం కాకపోవడంతో బెంగళూరులో ఏడాది క్రితం ఓ పార్టీలో పరిచయం అయిన మహమ్మద్ అజారుద్దీన్ వద్ద కొకైన్‌ను గ్రాము రూ.9 వేలకు కొనుగోలు చేస్తున్నారు. యుఎస్ఏ సిటిజన్ అయిన జుబైర్ అలీ నెలన్నర క్రితం నగరానికి వచ్చాడు. వారు కొకైన్ కొనుగోలు చేసేందుకు అతని ఇన్నోవా కారును వాడుతున్నారు. కొకైన్ సరఫరా చేస్తున్న మహమ్మద్ అజారుద్దీన్ పరారీలో ఉన్నాడు.

ఎస్సీ,ఎస్టీల హక్కుల సాధనకు ముందుంటా: మంత్రి వివేక్

సనత్‌నగర్: ఎస్సీ, ఎస్టీలు ఇంకా వెనుకబడే ఉన్నారని, వారి హక్కుల సాధన కోసం తాను ఎప్పటికీ ముందుంటానని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దూరదృష్టి వల్లే మనందరికీ రక్షణ కవచంలా రాజ్యాంగం లభించిందని గుర్తు చేశారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్, ఆల్ డిఫెన్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సేవ్ కాన్‌స్టిట్యూషన్-సేవ్ ఇండియా' పేరిట ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ పేదప్రజల కోసం పోరాడుతున్న ఏకైక జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. మన రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మనందరి కర్తవ్యమన్నారు.

ప్రశ్నించే నేతలు అర్బన్ నక్సలైట్లా?



జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: సమ సమాజ స్థాపన కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడుతున్న నక్సలైట్ల అంశంపై ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్లు అంటూ ముద్రవేసి వేధించడం అప్రజాస్వామికమని సామాజిక వేత్త ప్రొ.హరగోపాల్ అన్నారు. ఆదివారం తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ ఆడిటోరియంలో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొ.జయశంకర్ 14వ స్మారక ఉపన్యాసం జరిగింది. ప్రొ.జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ప్రొ.హరగోపాల్ మాట్లాడారు. నల్సార్ వర్సిటీ వీసీ ప్రొ.శ్రీకృష్ణదేవరావు, సామాజిక ఉద్యమ కార్యకర్త అంజలి భరద్వాజ్, వేదిక రాష్ట్ర కార్యదర్శి డా.తిప్పర్తి యాదయ్య, అధ్యక్షులు అంబటి నాగయ్య, డా.ఉపేందర్ రావు, డా.దుబ్బ రంజిత్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన

ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం బాలల న్యాయ సేవల విభాగం జిల్లా సభ్యుడు సీహెచ్ రవి సందర్శించారు. శుక్రవారం పాఠశాల భవనంపై నుంచి ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై ఆయన తోటి విద్యార్థులతో ఆయన మాట్లాడి.. ఘటన గురించి ఆరా తీశారు. తల్లిదండ్రులపై బెంగతోనే బాలిక అఘాయిత్యానికి పాల్పడిందని తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మీర్‌పేట: దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు మీర్‌పేట బీజేపీ-2 అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ తెలిపారు. ఆదివారం జిల్లెలగూడ కమల నెహ్రూ నగర్‌లో సాహితీ సిస్టమ్స్ సహకారంతో గ్రామీణ కౌశల్య యోజన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపు 35 మంది తమ పేర్లను నమోదు చేయించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి సిద్దాల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గౌరిశంకర్, జిల్లెల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసు.. కొత్తమలుపు!

- రెండో భర్తతో కలిసి మొదటి భర్తను హత్య చేసిన మహిళ
- నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

మొయినాబాద్: అజీజ్‌నగర్ డెయిరీ ఫామ్‌లో జరిగిన హత్య కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. ఫామ్‌లో పనిచేయడానికి వచ్చిన మహిళ తన మొదటి భర్తతో కలిసి రెండో భర్తను హత్య చేసినట్లు తెలుస్తోంది. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఉన్న సామ రాజిరెడ్డి డెయిరీ ఫామ్‌లో పని చేసే రాజేశ్‌కుమార్(24) శనివారం హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులకు నిందితులను పట్టుకోవడం సవాలుగా మారింది. నిందితులు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని పారిపోవడంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు అన్ని విషయాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాయి.

నెల రోజుల క్రితమే..

అజీజ్‌నగర్‌లోని రాజిరెడ్డి డెయిరీ ఫామ్‌లో పనిచేసేందుకు బిహార్‌కు చెందిన ఏజెంట్ పవన్ ద్వారా నెల రోజుల క్రితం రాజేశ్‌కుమార్, పూనం దేవి దంపతులు వచ్చారు. అయితే తన మొదటి భర్త మహేశ్‌సాని అలియాస్ గుడ్డును వదిలేసిన పూనందేవి.. రాజేశ్‌కుమార్‌ను రెండో పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. రాజేశ్‌కుమార్, పూనందేవి అజీజ్‌నగర్‌లోని డెయిరీ ఫామ్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల రాజేశ్‌కుమార్ మద్యం తాగి తనను వేధిస్తున్నాడని పూనందేవి తన మొదటి భర్త మహేశ్‌సానికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఈనెల 21న మహేశ్‌సాని అజీజ్‌నగర్ వచ్చాడు. అతను తమ బంధువని భర్తకు పరిచయం చేసింది. అదే రోజు రాత్రి ఇద్దరూ కలిసి రాజేశ్‌కుమార్‌ను హత్య చేసి, పారిపోయారు.

నిందితుల కోసం గాలింపు..

హత్య కేసు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు మొదలుపెట్టారు. ఏజెంట్ పవన్‌తో ఫోన్‌లో మాట్లాడి పరారైన నిందితుల ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ వద్ద హత్యకు గురైన రాజేశ్‌కుమార్ వివరాలు మాత్రమే ఉన్నట్లు తెలిసింది. నిందితులు మహేశ్‌సాని, పూనందేవిల వివరాలు తనకు తెలియదని పోలీసులకు చెప్పినట్లు సమాచారం. దీంతో వీరు బిహార్ వెళ్లారా..? మరెక్కడైనా ఉన్నారా..? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు దొరికితేనే కేసు విషయాలు బయటకొస్తాయని పోలీసులు చెబుతున్నారు.

సేవా సంస్థలను ప్రోత్సహించాలి



కేంద్రమంత్రి రాందాస్ అథవాలేతో ఆదినారాయణ

లిబర్టీ: నిరుపేదల స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న సంస్థలను ప్రోత్సహించాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ కోరారు. ఈమేరకు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ అథువాలేకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. సామాజిక సాహిత్య, సాంస్కృతిక విద్య, వైద్య విషయమై పేదలకు చేయూతనివ్వడంతో పాటు జాతీయస్థాయి పర్వదినాలు సాహిత్య సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు సాహిత్య సభలు సెమినార్లు నిర్వహించాలని మంత్రి సూచించారని ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎర్రగడ్డలో పర్యటిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో కార్పొరేటర్ సీఎస్ రెడ్డి, స్థానిక నేతలతో కలిసి ఆదివారం పర్యటించారు. ఆయన వెంట నేతలు రవిగౌడ్, రమేశ్ నాయక్, ఆకాశ్ పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీడాపోటీలు



శ్రీనగర్‌కాలనీ: గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని రాజీవ్‌నగర్‌కాలనీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. కమిటీ ప్రెసిడెంట్ మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, గౌరవ అధ్యక్షులు బీఎన్ మూర్తి, మోహన్‌రావు, బాపయ్యచౌదరి, సుబ్బరావయ్య పాల్గొన్నారు.

మహాగణపతి ఉత్సవాలకు రండి



సెంట్రల్ జోన్ డీసీపీకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సభ్యులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఖైరతాబాద్ అడ్‌హాక్ కమిటీ సభ్యులు సెంట్రల్ జోన్ డీసీపీ శ్రీవల్లికి ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో అడ్‌హాక్ కమిటీ సభ్యులు రాంరెడ్డి, లక్ష్మణ్ యాదవ్, పృథ్వీరాజ్, మహేందర్‌బాబు, మహేశ్‌యాదవ్, వంశీకృష్ణ, రాజేందర్ యాదవ్, నవీన్ యాదవ్, జిగ్నేష్ జ్యోషి తదితరులు పాల్గొన్నారు.

ఇక కలిసే ముందుకు..

మళ్లీ ఒక్కటైన సీఎస్ రెడ్డి, భవానీ శంకర్



చైర్మన్ రామ్‌రెడ్డితో సీఎస్ రెడ్డి, భవానీశంకర్

రహమత్‌నగర్ : కొంతకాలంగా ఎవరికీ వారే అన్నట్లు వ్యవహరించిన రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎస్ రెడ్డి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్ పార్టీ అధిష్టానం సూచనతో మళ్లీ కలిశారు. రహమత్‌నగర్ డివిజన్‌లో కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డితో ఆదివారం నిర్వహించిన బస్తీ పర్యటలో వీరద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని శ్రేణులకు సూచించారు.

ఏకగ్రీవ ఎన్నిక

హిమాయత్‌నగర్ : పొలిటిషియన్ జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం దేశోద్ధారక భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పొలిటిషియన్ జేఏసీ జాతీయ కన్వీనర్‌గా గిద్ద శ్రీనివాస్ నాయుడును, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్ ఇంద్రపల్లిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జేఏసీ బలోపేతానికి, భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు చర్చించారు.

ఆగమనం అదరహో..!

మిరిమిట్లు గొలిపే లైటింగ్, డీజే హోరు మధ్య గణనాథులకు ఘన స్వాగతం ● నెలకొంటున్న ఆధ్యాత్మిక వాతావరణం



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14 నందినగర్‌లో లంబోధరుడు

బంజారాహిల్స్: మహా నగరంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ఎంత ఆర్భాటంగా నిర్వహిస్తారో.. గణనాథుడి విగ్రహాలను మండపాలకు చేర్చే ఘట్టాన్ని కూడా అంతే స్థాయిలో 'ఆగమనం' పేరుతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ధూల్‌పేట, నాగోలు ప్రాంతాల నుంచి గణేశ్ విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు డప్పుల మోత, యువతీ యువకుల కేరింతలు, నృత్యాలు, డీజే హోరు, మిరిమిట్లు గొలిపే లైటింగ్ మధ్య విగ్రహాలను మండపాలకు తీసుకువస్తున్నారు. ఇంతకుముందు ఆయా బస్తీలు, కాలనీల్లో నిర్వాహకులు గణనాథులను కేవలం నిమజ్జనానికి తరలించినప్పుడు మాత్రమే ఆర్భాటం చేసేవారు. అయితే ఇటీవల విగ్రహాలను మండపాలకు తరలించే 'ఆగమనం' వేడుకలు కూడా ఓ ట్రెండ్‌గా మారింది. ఆదివారం సెలవు కావడంతో వినాయక చవితి పండుగకు మరో 2 రోజులే గడువు ఉండడంతో నిర్వాహకులు ఆదివారమే పెద్ద సంఖ్యలో మండపాలకు విగ్రహాలను తీసుకురాగా బస్తీవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రెండు మూడేళ్లుగా ఆగమనం పేరుతో విగ్రహాలకు ఘనంగా స్వాగతం పలుకుతున్న వాసులు ఈయేడు మాత్రం దాదాపు అందరూ ఇదే ట్రెండింగ్‌లో సాగుతున్నారు. దీంతో ఐక్యమత్యం, ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



కేబీఆర్ పార్కు ఎదుట విగ్రహాలు పంపిణీ చేస్తున్న హెచ్ఎండీఏ అధికారులు

బంజారాహిల్స్: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించాలని కోరుతూ హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఏటా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ఎదుట ఏర్పాటు చేసిన కేంద్రంలో వాకర్లకు, సందర్శకులకు, స్థానికులకు ఆదివారం మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. మొత్తం 16 లొకేషన్లలో పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

నందినగర్‌లో 23 అడుగుల గణనాథుడు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14 నందినగర్ గ్రౌండ్‌లో 'బంజారాహిల్స్ కా మహారాజ్' యూత్ అసోసియేషన్ వారు ఈసారి 23 అడుగులు ఎత్తు అయిన వినాయకుడిని నందినగర్ గ్రౌండ్‌లో ప్రతిష్ఠించనున్నారు. అలాగే రోడ్డు నంబర్-14లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో బంజారా వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ కన్వీనర్, బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ బి.భారతీ నాయక్ 16 అడుగులు ఎత్తుగల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

'చట్టపరంగా బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్ : స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పార్టీపరంగా కాకుండా చట్టపరంగా ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో బీహార్, జార్ఖండ్, తమిళనాడు ప్రభుత్వాలు అనుసరించిన విధానం ఇక్కడి ప్రభుత్వం ఎందుకు అవలంభించడం లేదన్నారు. రిజర్వేషన్లు అమలుకు అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని తెలిపారు. గవర్నర్‌తో ఆర్డినెన్స్ ఆమోదింపజేసి జీఓ జారీ చేయాలన్నారు. లేకుంటే అసెంబ్లీలో బీసీ బిల్లు మళ్లీ పాస్ చేసి గవర్నర్‌కు పంపితే తప్పనిసరి పరిస్థితుల్లో ఆమోదం లభిస్తుందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు చట్ట ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద సోమవారం తలపెట్టిన సత్యాగ్రహ దీక్షకు అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. బీసీ నేతలు గుజ్జ సత్యం, జిల్లపల్లి అంజి, నిఖిల్, మోదీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాల వెలుగు సంఘం నేతలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో 143వ వారం మాల వెలుగు సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాదులు కాదారి రమేశ్, రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వారి పిల్లలకు మంచి చదువు అందించాలని, అంబేడ్కర్ గురించి తెలియజేయాలన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం కేవలం చదువు వల్ల మాత్రమే వస్తుందని, జ్ఞానం ఎవరి సంపద కాదన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, తులసీ రాజలింగం, బత్తుల మధుసూదన్, మీడియా కోఆర్డినేటర్ ఆలూరి సాయికిరణ్, సంఘం సభ్యులు నాగరాజు, దండు మన్యం, దండు రమేశ్, బాలస్వామి, శేఖర్, మాసయ్య, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సురవరం' సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న వైసీపీ నేతలు

హిమాయత్‌నగర్ : సీపీఐ అగ్రనేత, పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని ఆదివారం మగ్దూం భవన్‌లో ఉంచారు. వైసీపీ పార్లమెంటరీ నాయకుడు వై.వీ.సుబ్బారెడ్డి, ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి తదితరులు సురవరం పార్థీవ దేహానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

సురవరం సుధాకర్ మృతి తీరని లోటు

లిబర్టీ: సురవరం సుధాకర్ మృతి తీరని లోటని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు సార్లు పార్లమెంటు సభ్యుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా నిబద్ధతతో విలువలతో కూడిన నాయకుడిగా పని చేశారని కొనియాడారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం.. కుటుంబ సభ్యులకు సానుభూతిని ఆయన తెలియజేశారు.

ద్విచక్ర వాహనం అపహరణ

వెంగళరావునగర్ : షాపు ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటగిరికి చెందిన అబ్దుల్ అష్ఫక్ 3 వారాల క్రితం ఆన్‌లైన్ వ్యాపారం ప్రారంభించాడు. శనివారం తన ద్విచక్ర వాహనంపై కార్యాలయానికి వచ్చాడు. మధ్యాహ్నం స్నేహితుడి ద్విచక్ర వాహనంపై టీ తాగేందుకు వెళ్లి వచ్చాడు. మధ్యాహ్నం లంచ్ చేసేందుకు ఇంటికి వెళ్లేందుకు సిద్ధం కాగా తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. బాధితుడు ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ ఫోన్ చోరీ

వెంగళరావునగర్ : మొబైల్ ఫోన్ అపహరణకు గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన శేషుమాంబ ఈనెల 13న సాయంత్రం ఇంటి సమీపంలోని మార్కెట్‌కు వెళ్లింది. కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసిన అనంతరం ఫోన్ పే ద్వారా నగదు చెల్లించి ఇంటికి వచ్చింది. తర్వాత చెక్ చేసుకోగా ఫోన్ కనిపించలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి యజమానిపై కేసు

బంజారాహిల్స్: ప్రైవేట్ వ్యక్తితో మ్యాన్‌హోల్ పనులు చేయించిన ఇంటి యజమానిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డునంబర్-12లోని శ్రీరాంనగర్‌కు చెందిన ఎంఏ పహాబ్ గ్లాస్ ఫిట్టింగ్ పనులు చేస్తుంటాడు. అతని ఇంటికి 12 ఏళ్లుగా సీవరేజీ కనెక్షన్ ఉంది. కొన్ని నెలలుగా తరచూ ఇంటి ముందు మ్యాన్‌హోల్ పొంగుతోంది. దీంతో పలుమార్లు జలమండలి టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తున్నాడు. ఈనెల 11న మరోసారి ఫిర్యాదు చేశాడు. దీంతో 16న జలమండలి సీవరేజీ క్లీనింగ్ యంత్రంతో వచ్చిన నాగరాజు అనే ఉద్యోగి సమస్యను పరిశీలించారు. మ్యాన్‌హోల్ వద్ద సుమారు 10 ఫీట్ల మేర ఉన్న లైన్‌లో పైపులు పగిలిపోయాయని మరమ్మతు చేయడం తమ పనికాదని, మీరే కూలీలతో పనులు చేయించుకోవాలని చెప్పి వెళ్లిపోయాడు. దీంతో 21న లేబర్ అడ్డాకు వెళ్లి ఇద్దరు కూలీలను తీసుకువచ్చి మ్యాన్‌హోల్‌లో బ్లాకేజీని తొలగింపజేశారు. అయితే గుర్తుతెలియని వ్యక్తి మ్యాన్‌హోల్‌లో దిగిన వ్యక్తి ఫొటోను తీసి మరుసటి రోజు ఓ పత్రికలో ప్రచురించడంతో నిబంధనలకు విరుద్ధంగా మ్యాన్‌హోల్‌లో వ్యక్తి దిగడం ప్రమాదకరమని, దీనికి కారణమైన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యాధి నిరోధక టీకాలతో ఎంతో మేలు



సాక్షి, సిటీబ్యూరో: అనారోగ్యానికి చికిత్స కంటే ముందస్తుగా వ్యాధి నిరోధక టీకా తీసుకోవడం మేలని జైడస్ లైఫ్ సైన్సెస్ ఎండీ డా.షార్విల్ పటేల్ పేర్కొన్నారు. ప్రివెన్సకేర్ అవసరాలపై స్థానిక హోటల్‌లో వైద్యా బృందంతో ఆదివారం చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో ఫ్లూ వేగంగా వ్యాప్తి చెందుతుందని ఇది శ్వాసకోశ, కిడ్నీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల వారిపై తీవ్ర ప్రభావం చూపిస్తాయన్నారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ.. 50 ఏళ్ల పైబడిన వ్యక్తులు, 12 ఏళ్లలోపు పిల్లలు, గర్భిణులు, శ్వాసకోస, కిడ్నీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు ఇన్‌ఫ్లుఎంజా వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. ఏటా ఒక డోస్ తీసుకుంటే చాలా రోగాల నుంచి ఉపశమనం పొందొచ్చన్నారు. గర్భిణులు 24 వారం సమయంలోనే ఈ వ్యాక్సిన్ తీసుకుంటే గర్భిణిగా ఆరు నెలలు, పిల్లలు పుట్టిన తరువాత మరో ఆరు నెలల పాటు అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఒక డోస్ ఏడాది పాటు పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్వాసకోశ, కిడ్నీ, గైనికాలజీ, తదితర విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మారుతీనగర్‌కాలనీలో పర్యటిస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

వెంగళరావునగర్ : రానున్న జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎవరూ పోటీ చేసిన శ్రేణులంతా గెలుపు లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. కల్యాణ్‌నగర్ చౌరస్తా వద్ద ఉన్న ప్రైవేట్ హాల్‌లో వెంగళరావు నగర్ కాలనీలోని 14 బూత్‌లకు చెందిన సభ్యులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థి విషయంలో అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మనోజ్ యాదవ్, సీనియర్ నేతలు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, చిలకల వెంకటేశ్వరరావు, రాంచందర్ పాల్గొన్నారు.

మారుతీనగర్‌కాలనీలో మాజీ ఎంపీ పర్యటన

యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆదివారం పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘం నేతలను కలుసుకుని ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి మినహా ఈ పదేళ్లలో చెప్పుకోదగ్గ మార్పులు ఈ ప్రాంతంలో లేవన్నారు. మళ్లీ అలాంటి ఫలాలు ప్రజలు అందుకోవాలంటే ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాదయాత్ర



సూర్యుడికి పూజలు చేస్తున్న ఉపేందర్‌రెడ్డి

వెంగళరావునగర్ : నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 25 నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్టు గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని లేబర్ అడ్డా వద్ద కాంగ్రెస్ నేతలు, స్థానిక కార్యకర్తలతో కలిసి సూర్య పూజా కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఇందులో భాగంగా సూర్యుడికి కొబ్బరికాయలు కొట్టి కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగాలని వేడుకున్నారు. సీనియర్ నేత లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ఫుట్‌పాత్‌పైకి ..

ఐదుగురు యువకులపై కేసు



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద ఫుట్‌పాత్‌పైకి ఎక్కిన కారు

బంజారాహిల్స్: కారు అదుపుతప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. లక్డీకాపుల్, రెడ్‌హిల్స్, మాసబ్‌ట్యాంక్‌లో నివసించే అకిఫ్ అలీ, రేహాన్, రియాన్, ఆరిఫ్, షానవాజ్ ఐదుగురు స్నేహితులు సంగారెడ్డిలో ఉండే మరో స్నేహితుడు మహ్మద్ మీర్జా బర్త్ డే వేడుకలకు కోసం శనివారం రాత్రి వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు బయలుదేరారు. అకిఫ్ అలీ డ్రైవింగ్ చేస్తున్నారు. ఫిలింనగర్ నుంచి తెలంగాణ భవన్ మీదుగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వైపు వెళ్తుండగా కారు అదుపుతప్పి ఫుట్‌పాత్ పైకి ఎక్కి కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వే ఫెన్సింగ్‌ను ఢీకొట్టింది. ఇందులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన అకిఫ్ అలీతో పాటు రేహాన్, రియాన్, ఆరిఫ్, షానవాజ్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరందరికీ డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌తో పాటు మూత్ర, రక్త పరీక్షలు నిర్వహించారు. అయితే వీరు మద్యం సేవించలేదని, ఎలాంటి డ్రగ్స్ కూడా తీసుకోలేదని పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. అతి వేగంగా.. నిర్లక్ష్యంగా కారు నడిపి ప్రమాదానికి కారణం అవడమే కాకుండా ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన ఘటనలో వీరందరిపై బీఎన్ఎస్ సెక్షన్ 281, 290, (3)పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాగంటి గోపీనాథ్ మృతి తీరని లోటు



మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

రహమత్‌నగర్ : ప్రజల మనిషిగా మన్ననలు పొందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఎస్పీఆర్ హిల్స్ క్వారీ మైదానంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన మాగంటి గోపీనాథ్ సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలుపించుకుని మాగంటి గోపీనాథ్ ఆశయాన్ని సాధించుకోవాలని కోరారు. అనంతరం గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్ సతీమణి సునీత, మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, ఎన్నికల పరిశీలకులు తక్కలపెల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేడు విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ నాయకుడు సోహైల్, కార్పొరేటర్ రాజ్‌పటేల్, మాజీ కార్పొరేటర్ ఎంఏ షఫీ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండాపురం నాగరాజు, కాసాల అరుణ్, వినోద్‌కుమార్ గౌడ్, లియాకత్ అలీ, నర్సింహరెడ్డి, షేక్ చోటు, గఫూర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న 'ప్రతిభా దర్శన్'



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మూడో తరగతి విద్యార్థులు ఆదివారం నిర్వహించిన 'ప్రతిభా దర్శన్' ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు కట్టిపడేశాయి. ఈ సందర్భంగా అధ్యక్షుడు మురళీముకుంద్, డైరెక్టర్ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ కాంచనవల్లి, ప్రధానోపాధ్యాయురాలు విధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ వేడుకలకు సమన్వయం అవసరం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. గోల్నాకలోని ఓ ఫంక్షన్ హాల్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ అచ్చిని రమేష్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గణేశ్ వేడుకలను అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. గణేష్ వేడుకలు నగరంలో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతాయని, వాటిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. బీజేపీ నేతలు డాక్టర్ ఎన్.గౌతంరావు, జి.ఆనంద్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు బీ.వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు బీ.పద్మావెంకట్‌రెడ్డి, అమృత, బీఆర్ఎస్ నాయకులు, ఏసీపీ హరీష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఉత్సవ సమితి ప్రతినిధులు అలే భాస్కర్, బుచ్చిరెడ్డి, బీజేపీ నేతలు, గణేష్ వేడుకల నిర్వాహకులు పాల్గొన్నారు.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ హర్షవర్ధన్‌రెడ్డి

కవాడిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో పాత పెన్షన్ విధానంలోకి వెళ్లే ఆప్షన్ ఉన్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం జీవో నంబర్ 28 ద్వారా సీపీఎస్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చి ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్యాయం చేసిందని ఆయన మండిపడ్డారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో దీక్షను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి బి.రత్నాకర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రావు, గౌరవ అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, రాజారెడ్డి, యుగేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కృష్ణప్రియ పాల్గొన్నారు.

జైలులో జీవితంలో స్వేచ్ఛ ఉండదు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత జడ్జి రాజేంద్ర 'జింబో', కవి నిఖిలేశ్వర్ తదితరులు

హిమాయత్‌నగర్: మనిషికి అన్నీ ఉన్నా స్వేచ్ఛ కోసం జీవిస్తాడని, కానీ జైలు జీవితంలో స్వేచ్ఛ ఉండదని విశ్రాంత జడ్జి, ప్రముఖ రచయిత డా.మంగారి రాజేంద్ర 'జింబో' అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కె.రాజన్న హిందీ మూలం ఫాంసీని డాక్టర్ కారం శంకర్ తెలుగు అనువాదం 'ఉరికంభం నీడలో' ఒక బహుజనుడి ఆత్మకథ పుస్తకావిష్కరణ సభ ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉరికంభం నీడలో బహుజనుడి ఆత్మకథ పుస్తకం నిలుస్తుందని పేర్కొన్నారు. స్వేచ్ఛ హరించడం వేదనకు గురిచేస్తోందని, అది రాజన్న జీవితంలో కనిపిస్తుందని అన్నారు. సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, అడిషనల్ జిల్లా కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, సీనియర్ సాహిత్యకారులు డాక్టర్ అహిల్యా మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

రైలు.. జైలు.. బెయిలు

వందలాది రైళ్లు.. లక్షలాది మంది ప్రయాణికులు.. ఈ క్రమంలో నేరాల సంఖ్యా అదేవిధంగా పెరిగిపోతోంది. ఈ వ్యవహారం రైల్వే పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారిపోయింది. కళ్లు మూసి తెరిచేలోగా మాయమవుతున్న బ్యాగులు.. చైన్ స్నాచింగ్ గ్యాంగ్‌లు.. సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లే ముఠాలు.. అవసరమైతే దాడులకు వెరవని కరుడుగట్టిన నేరగాళ్లు.. ఈ నేపథ్యంలో నేర నియంత్రణ ఎలా..? నేరగాళ్లను కట్టడి చేయడం ఎలా..? అనేది ప్రభుత్వ రైల్వే పోలీసులకు (జీఆర్‌పీ) పెద్ద టాస్క్‌గా మారింది. ఇందుకు సీనియర్ అధికారుల సూచనల ఆధారంగా వ్యూహం రచించారు. అసలు నేరాలకు కారణం ఎవరు అనే దానిపై దృష్టి సారించారు. టెక్నాలజీ సాయంతో బృందాలు రంగంలోకి దిగాయి. పని మొదలెట్టాయి. ఆ వ్యూహం పేరే.. 'జైలు–బెయిలు'.

రైళ్లలో నేరాల నియంత్రణకు జీఆర్‌పీ వినూత్న పంథా

- జైలుకు వెళ్లి బెయిలుపై వచ్చిన వారి ట్రాకింగ్
- రైల్వే పోలీసుల ప్రత్యేక ప్రణాళిక



సికింద్రాబాద్: రైళ్లలో పాత నేరస్తులే ఎక్కువగా నేరాలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. అరెస్టయ్యి బెయిలుపై విడుదలైన వారిపైనే దృష్టి పెట్టాలని నిర్ణయించారు. ప్రత్యేక బృందాలు రిమాండ్ ఖైదీలు, బెయిల్ పొంది జనంలో తిరుగుతున్న వారి వివరాలను సేకరించే పనిలో పడింది. ఆ వివరాలతో పాటు వారి కదలికలపై నజర్‌కు టెక్నాలజీ సాయం తీసుకుంటోంది.

కళ్లుమూసి తెరిచేలోగా మాయం..

ఇటీవలి కాలంలో సికింద్రాబాద్ జిల్లా పరిధిలో రైళ్లలో నేరాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కారణాలేమైనప్పటికీ అన్ని నేరాలు పోలీస్ స్టేషన్ వరకు రావడం లేదు కూడా.. కదులుతున్న రైళ్లలో సెల్‌ఫోన్లను లాక్కెళ్లడం.. లగేజీలు దొంగిలించడం.. ఏసీ బోగీల్లో విలువైన వస్తువుల తస్కరణ.. కోచ్‌లలో దొంగల స్వైర విహారం వంటివి నమోదవుతున్నాయి. ముఖ్యంగా సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్, చర్లపల్లి రైల్వే స్టేషన్లలో అధిక శాతం కేసులు నమోదవుతున్నాయి. నేరాలు జరిగే సమయం చూస్తే అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అధికశాతం జరుగుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

బాబోయ్ ఇంతమంది నేరస్తులా..!

సికింద్రాబాద్ జిల్లా పరిధిలో ఐదేళ్ల నేరాలు పరిశీలిస్తే 149 మంది చైన్‌స్నాచర్లు.. 694 మంది నేరగాళ్లు దొంగతనం.. దోపిడీ కేసుల్లో అరెస్టయ్యారు. వీరిలో కొందరు జైళ్లలో ఉండగా మరి కొందరు బెయిల్‌పై బయటకొచ్చారు. అసలు చిక్కు ఇక్కడే మొదలైంది. వీరి నేరాల పథక రచనకు జైళ్లు వేదికలుగా మారుతున్నాయని పోలీసులు భావిస్తున్నారు. అందుకే జైలులో ఎందరున్నారు. బెయిల్ మీద బయటకొచ్చిందెవరు అనే విషయంపై జీఆర్పీ పూర్తి స్థాయిలో దృష్టి సారించింది.

ట్రాకింగ్ చాలా కష్టమే.. అయినా..

ఓ రకంగా చూస్తే సికింద్రాబాద్ జిల్లా పరిధిలోని నేరస్తులందరినీ ట్రాక్ చేయడం చాలా కష్టమైన పనే. చాలా మంది సిబ్బంది కూడా అవసరం. అదనపు పనిగంటలు కూడా కావాలి. ఓ వైపు రోజు వారీ విధి నిర్వహణ.. రైళ్లలో భద్రత.. రైలు ప్రమాదాల మృతుల గుర్తింపు.. ఇతర విధులకే సరిపడా సిబ్బంది లేరు. సికింద్రాబాద్ జిల్లాలో తీసుకుంటే 12 రైల్వే పోలీస్ స్టేషన్లు.. 17 అవుట్‌పోస్టులు ఉన్నాయి. వీటిలో నేరాలు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్న సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి రైల్వేస్టేషన్ల పరిధిలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు 667 మంది అవసరం ఉండగా ప్రస్తుతం 364 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. రైలు ప్రమాద ఘటనల్లో మృతుల దర్యాప్తు కోసయే సమయం వృథా అవుతున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

గత ఐదేళ్లలో జరిగిన నేరాలు

సంవత్సరం	నేరాలు
2021	1637
2022	2384
2023	2658
2024	2835
2025 (జూలై వరకు)	1595
దొంగతనాలు: 3784	దోపిడీలు: 40

టెక్నాలజీ సాయంతో...

సమస్యలన్నింటినీ పక్కన పెట్టి.. నేర నియంత్రణ కోసం సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందనాదీప్తి నేతృత్వంలో సీనియర్ అధికారుల సూచనలతో పోలీసులు పక్కా వ్యూహంతో ముందుకు కదిలేందుకు నిర్ణయించుకున్నారు. టెక్నాలజీ సాయంతోనేరగాళ్ల మొబైల్ నెంబర్లు, ఆధార్, చిరునామాలు ఇలాంటి ప్రాథమిక అంశాల ఆధారంగా వారి కదలికలపై దృష్టి సారించేలా ప్రయత్నిస్తున్నారు. వారు ఏ ప్రాంతాల్లో సంచరిస్తున్నారు. వారు తిరుగుతున్న వ్యక్తులు ఎవరు? రాష్ట్రం దాటి వెళ్తున్నారా.. రైలు ప్రయాణాల్లో ఉంటున్నారా..? సత్ప్రవర్తన ఉందా ఇలాంటి అంశాల ఆధారంగా వారిని ట్రాక్ చేస్తున్నారు.


నగరంలో నేడు

- రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ మూవీ, టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఉదయం 10.30గంటలకు రవీంద్ర భారతిలో పుష్కర మహోత్సవం జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు దస్తకారి హాట్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసాబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

విజ్ఞానం, ఆర్థిక సంపద పంచుకోవడంలోనే ఆనందం

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



డాక్టర్ సాయిబాబాగౌడ్ ఆత్మకథ పుస్తకం 'విజన్ బియాండ్ విజన్'ను ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

సనత్‌నగర్: ప్రతిఒక్కరూ తమలోని విజ్ఞానంతో పాటు ఆర్థిక సంపదను పంచుకోవడంలోనే నిజమైన ఆనందం, తృప్తి లభిస్తాయని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సాయిబాబాగౌడ్ 'విజన్ బియాండ్ విజన్' పేరిట రాసిన ఆత్మకథ పుస్తకాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. బేగంపేట మయూరిమార్గ్‌లోని దేవనార్ అంధుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకయ్యనాయుడు మాట్లాడుతూ సేవాభావాన్ని ఇతరులతో పంచుకోవాలని, మన పూర్వీకులు జాతికి అందించిన సంపద అదేనన్నారు. సేవను పంచడంలో దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సాయిబాబాగౌడ్, జ్యోతిగౌడ్‌లే నిదర్శనమన్నారు. కేవలం నలుగురితో ప్రారంభమైన దేవనార్ పాఠశాలను ప్రస్తుతం 640 మంది విద్యార్థులకు చేర్చడం ఓ అద్భుతమని అభివర్ణించారు. ఒకప్పుడు భారత దేశం శక్తివంతమైన దేశమని, ఆర్థికంగా ప్రపంచంలోనే అగ్రగామిగా ఉండేదన్నారు. బ్రిటీష్‌వారు, మొఘలులు దండయాత్ర చేసి ధ్వంసం చేశారన్నారు. కానీ భారతదేశం ఎప్పుడూ ఏ దేశంపై దాడి చేయలేదని, ఆపరేషన్ సిందూర్ కూడా దాడి కాదని, కేవలం ప్రతిచర్య మాత్రమేనన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను విధిగా పాటించాలని, మాతృభాష, మాతృభూమి, కన్నతల్లిని గౌరవించాలని అన్నారు. మరుగున పడిన అసలైన చరిత్రను తెలుసుకుని, దాన్ని భావితరాలకు వారికి అందించాలని సూచించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేవనార్ వ్యవస్థాపకులైన సాయిబాబాగౌడ్, జ్యోతిగౌడ్‌లు అంధ విద్యార్థులకు వెలుగునివ్వడం కోసం అలుపెరగని కృషి చేస్తున్నారని అభినందించారు.

కాటేపల్లిలో టైర్ల కంపెనీ మూసే వరకు పోరాటం

హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: ప్రపంచంలో అత్యంత వేగంగా కాలుష్యం పెరుగుతున్న దేశం భారతదేశమని, ఇప్పటికే ఢిల్లీ నాశనమైందని, కాలుష్యం వచ్చే పరిశ్రమలకు పాలకులు అనుమతులు ఇస్తూ హైదరాబాద్‌ను ఏం చేద్దామనుకుంటున్నారో అర్థం కావడం లేదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. యాదాద్రి–భువనగిరి జిల్లాలోని కాటేపల్లిలోని టైర్ల కంపెనీల కాలుష్యంపై అఖిల పక్ష సమావేశం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఒకప్పుడు సమాజం కోసం దేశంకోసం పాటుపడేవారు, త్యాగాలు చేసే వారు నాయకులుగా ఉండేవారని, కానీ ఇప్పుడు సంపాదనే ధ్యేయంగా రాజకీయాల్లోకి వస్తూ, రాజకీయాన్ని వ్యాపారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులకు ఏదైనా తెలియనప్పుడు సమాజంలో నిస్వార్థంగా ఆలోచించే మేధావులు ఎంతో మంది ఉన్నారని, వారి సలహాల ప్రకారం చేయాలి కానీ వారి సలహాలు తీసుకోవడం ఇష్టం ఉండదన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు కాలుష్యం వచ్చే పరిశ్రమలు మాకు వద్దంటుంటే ఆ సంస్థలను భారత్‌కు ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాటేపల్లి గ్రామం ఐక్యం కావాలని, వారికి తాము అండగా ఉంటామని ప్రజా ఉద్యమం చేస్తేనే ప్రభుత్వం దిగి వస్తుందన్నారు. ప్రొఫెసర్ బాబూరావు మాట్లాడుతూ.. కాటేపల్లి పారిశ్రామిక ప్రాంతం కాదని, కానీ అక్కడ టైర్ల కంపెనీకి అనుమతులు ఇచ్చారంటేనే మన కాలుష్య నియంత్రణ మండలి ఎలా పనిచేస్తుందో అర్థం అవుతుందన్నారు. సదరు కంపెనీ ముందు బోర్డు కూడా లేదని, ఇటీవల సియాచీన్ కంపెనీలో 50 మంది చనిపోయారని, ఏదైనా ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమ మాట్లాడుతూ.. కాటేపల్లిలో వ్యవసాయ భూముల మధ్య ఊరికి దగ్గరగా రెండు టైర్ల రీసైక్లింగ్ కంపెనీలకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. దాని యజమాని మార్వాడీ, కానీ మన వారిని కొంతమందిని పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాడని అన్నారు. సమావేశంలో విఠల్, రఘు, సుభాష్, జలంధర్, శ్రీనివాస్, వెంకట్, అరుణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రుమటాయిడ్ ఆర్థరైటీస్ వ్యాధిగ్రస్తులకు ఆందోళన వద్దు

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



రుమటాలజీ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మాదాపూర్: రుమటైడ్ ఆర్థరైటీస్ వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి నిర్ధారణతో పాటు వైద్యంలో అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని నోవాటెల్‌లో సౌత్‌జోన్ ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్(సిర్రికాన్) 2025లో భాగంగా డాక్టర్ విజయ ప్రసన్న ఆదివారం నిర్వహించిన పేషెంట్ సపోర్టు కార్యక్రమాన్ని ఆయన పలువురు డాక్టర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, గతంలో క్యాన్సర్ వస్తే చనిపోయేవారని, అంతటి ప్రాణాంతక వ్యాధులకు కూడా ఇప్పుడు అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. తల్లి కోమటిరెడ్డి సుశీల ఫౌండేషన్ పేరుతో రోగులకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. రుమటాలజీ సీనియర్ డాక్టర్ లీజా రాజశేఖర్ మాట్లాడుతూ రుమటాలజీ వ్యాధుల గురించి చాలా మందికి అవగాహన లేదన్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలని కోరారు. బీమా కంపెనీలు సైతం ఇబ్బందులు పెడుతున్నాయని, వారితో కూడా ప్రభుత్వం చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజ్‌కిరణ్, డాక్టర్ రాజేంద్ర వరప్రసాద్, డాక్టర్ వినోద్ రవీంద్రన్, డాక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు ఉచితంగా విద్యుత్

సాక్షి, సిటీబ్యూరో: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఏర్పాటు చేసే మండపాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మండపాల నిర్వాహకులు కనెక్షన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించింది. గ్రేటర్‌లో ఏటా 50 వేలకుపైగా మండపాలను ఏర్పాటు చేస్తుంటారు. గతంలో వీటికి కమర్షియల్ కేటగిరి కింద తాత్కాలిక కనెక్షన్లు జారీ చేసేవారు. ఎంపిక చేసుకున్న లోడు ప్రకారం ఒక్కో మండపం నుంచి ఇందుకు రూ.1,500 వరకు వసూలు చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ నెల 27 నుంచి వచ్చేనెల 6 వరకు నిర్వహించే గణేష్ ఉత్సవాల్లో భాగంగా వినాయక మండపాలకు ఉచితంగా కరెంట్ సరఫరా చేయాలని నిర్ణయించింది. వచ్చేనెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీనవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసే మండపాలకు కూడా ఉచిత విద్యుత్ సరఫరా పథకం వర్తిస్తుందని పేర్కొంది.

మంజీరా బ్యారేజీ గేట్లకు ముప్పులేదు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా బ్యారేజ్ గేట్లకు ఎలాంటి ముప్పు కలగలేదని జలమండలి ప్రకటించింది. జలమండలి అధికారులు బ్యారేజ్‌ను ఆదివారం సందర్శించి గేట్లను పరిశీలించారు. గేట్లన్నీ సక్రమంగా పనిచేస్తూ కార్యనిర్వహణ స్థితిలో ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం మంజీరా నుంచి 2 క్రెస్ట్ గేట్లు, ఒక స్కవర్ వెంట్ ద్వారా 15,130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. సింగూర్ నుంచి ప్రవాహం 9,226 క్యూసెక్కులు ఉందన్నారు. గేట్లలో ఎటువంటి అంతరాయం లేకుండా సగటున 46,000 క్యూసెక్కులతో ఇప్పటి వరకు సుమారు 28.09 టీఎంసీని విడుదల చేసినట్లు ప్రకటించారు.

మారథాన్.. ఫుల్ జోష్



గచ్చిబౌలి: ఫిట్‌నెస్‌పై మరింత అవగాహన పెంచేందుకు నిర్వహించిన మారథాన్ ఉత్సాహం నింపింది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్–2025 ఆదివారం ఉదయం 5 గంటల నుంచి 11.30 గంటల వరకు కొనసాగింది. నగరవాసులే కాకుండా పలు రాష్ట్రాలు, దేశాల నుంచి సైతం పెద్దసంఖ్యలో హాజరయ్యారు. నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వద్ద ప్రారంభమైన ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్ గచ్చిబౌలి స్టేడియం వద్ద ముగిశాయి. దీంతో ఐటీ కారిడార్ వరకు రహదారులన్నీ సందడిగా మారాయి. దాదాపు 28 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం గచ్చిబౌలి స్టేడియంలో విజేతలకు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారథాన్ ఎందరికో ప్రేరణగా నిలుస్తోందన్నారు. ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జనాభా బలమైన దేశానికి పునాది అన్నారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ బిజినెస్ హెడ్ శ్రీపాద్ షిండే మాట్లాడుతూ ఆరోగ్యం, సంపదను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్, ఎన్ఎండీసీ డైరెక్టర్ వినయ్‌కుమార్, ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ రేస్ డైరెక్టర్ రాజేష్ వెచ్చ, ఏఎస్ఐసీఎస్ డైరెక్టర్ సౌరభ్ శర్మ, వివిధ కంపెనీల ఐటీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఫుల్ మారథాన్ పురుషుల విభాగంలో కెన్యాకు చెందిన చెరుయట్, ఇథోపియాకు చెంది ఉర్గా, కెన్యాకు చెందిన చెలుకో మొదటి, రెండు, మూడో స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో కెన్యాకు చెందిన కిబెట్, ఇథోపియాకు చెందిన కుమ్సా, ఇథోపియాకు చెందిన మెహరి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. ఎలైట్ మారథాన్ ఓవరాల్ ఇండియా మెన్ విభాగంలో అనీష్, తీర్థ, కాళిదాస్‌లు మొదటి మూడు స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో భగీరథి, అశ్విని, జ్యోతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు.







గ్రీనరీ వాచ్.. వీకెండ్ కిరాక్..

విద్యార్థుల మధ్య స్నేహభావం మరింత పెంపొందించేందుకు హెచ్‌సీయూ క్యాంపస్ ఎక్స్‌ప్లోరర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ముచ్చట్లు ఆడుకుంటూ నడుస్తూ క్యాంపస్‌లోని సౌత్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద అంతా కలిసి అక్కడి నుంచి బయలుదేరారు. క్యాంపస్‌లోని పచ్చని చెట్ల మధ్యలోంచి నడుస్తూ రాతి సంపదను తిలకిస్తూ నడక కొనసాగించారు. అంతా కలిసి హైరాక్స్ వద్దకు చేరుకొని అక్కడ కొంతసేపు సేదతీరారు. పెద్దపెద్ద బండరాళ్ల పైనుంచి క్యాంపస్ అందాలను తిలకించారు. అనంతరం వారంతా సమీపంలోని టెంపుల్ రాక్స్‌కు చేరుకున్నారు. అక్కడ చాలాసేపు సందడిగా గడిపారు. కార్యక్రమాన్ని హెచ్‌సీయూ క్యాంపస్ ఎక్స్‌ప్లోరర్స్ కో ఆర్డినేటర్లు వంశీ, నిధిజా, సౌరబ్ శుక్లా పర్యవేక్షించారు. - రాయదుర్గం

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 25, ఆగస్టు, 2025




స్మార్ట్ లోకంలో..



నగర అధునాతన సాంకేతిక జీవనశైలిలో వేగం పెరిగిన కొద్దీ యువత 'స్క్రీన్ టైమ్-సెంట్రిక్' దినచర్యగా, బానిసత్వంగా మారుతోందని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇందులో భాగంగా తాజా సర్వేలు చెబుతున్న ఆందోళనకర విషయం ఏంటంటే.. నగరంతో పాటు రాష్ట్రంలోని 14 నుంచి 16 ఏళ్ల పిల్లల్లో 92 శాతం మందికి స్మార్ట్‌ఫోన్ వినియోగ పరిచయం ఉండటం. ఇందులో చదువుకోసం వాడుతున్నవారు 61 శాతం కాగా సోషల్ మీడియా బ్రౌజింగ్‌కి వెళ్తున్నవి 82.5 శాతం కావడం విశేషం. ఇది విద్యార్థుల చదువుపైనే కాకుండా దుష్ప్రభావాలపై ఆందోళనల్ని పెంచుతోందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా టీనేజ్ పిల్లల్లో మొబైల్‌తో పాటు వివిధ సాంకేతిక మాధ్యమాల స్క్రీన్ టైం విపరీతంగా పెరిగిందని సూచిస్తున్నాయి.

- సాక్షి, సిటీబ్యూరో

- 14 నుంచి 16 ఏళ్ల పిల్లల్లో 92 శాతం మందికి స్మార్ట్‌ఫోన్ వినియోగంలో పరిచయం
- సమయాన్ని, సామర్థ్యాన్నీ మింగేస్తున్న.. రాత్రి స్క్రోల్, రీల్స్, గేమింగ్
- విద్యార్థులకు నిద్ర ఏడు గంటలలోపే.. అధ్యయన ఫలితాలు

నగరంలో యువత స్క్రీన్ టైం పెరిగిపోయింది : తాజా సర్వేలు



ఎక్కువ సమయం స్క్రీన్‌కు అతుక్కుపోవడం ఒక్క చదువుకు మాత్రమే కాదు నిద్రపట్టలేని లక్షణాన్ని కూడా గందరగోళప రుస్తోంది. దేశవ్యాప్తంగా విద్యార్థుల మానసిక ఆనందంపై 'స్టూడెంట్ వెల్‌బీయింగ్ పల్స్' నివేదిక చెబుతున్న తాజా వివరాల ప్రకారం.. రాత్రి వేళల సోషల్ మీడియా వాడకం నిద్రను తగ్గించి, జీవన సంతృప్తిని-ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. 12వ తరగతి విద్యార్థుల్లో దాదాపు 75 శాతం మందికి స్కూల్ డేస్‌లో 7 గంటల కన్నా తక్కువ నిద్రే వస్తోందట. ఇది ఆందోళనను పెంచుతూ మానసిక ఆరోగ్య సంక్షోభానికి దారి తీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్క్రీన్ టైమ్‌లో ల్యాప్‌టైమ్, మొబైల్, ట్యాబ్స్ తదితర మాధ్యమాల్లో 'పది నిమిషాలే' అని మొదలయ్యే రీల్స్-బింజ్, నిద్రపోయే బెడ్ టైంకు ముందు ఆ స్క్రీన్‌లకు కళ్లు పెనవేసుకుని ఉండటం వల్ల నిద్రను చెడగొట్టి, మరుసటి రోజు ఫోకస్, శక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని కొత్త అధ్యయనం హెచ్చరిస్తోంది. 30 నిమిషాలకంటే ఎక్కువ స్క్రీన్ చూశాక నిద్ర నాణ్యత తక్కువగా ఉందని ఈ డేటా చెబుతోంది. అలాగే 41 వేల మందిపై నిర్వహించిన ఒక సర్వేలో 'సోషల్ స్క్రోల్' వల్ల నిద్ర ఆలస్యమవుతుందనే విషయం కూడా బయటపడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా యువతలో హెల్తీ ఆన్‌లైన్ అలవాట్ల అవసరాన్ని స్పష్టంగా తెలిపే నివేదికను విడుదల చేసింది.

నెక్స్ట్ మ్యాచ్ నెక్స్ట్ ర్యాంక్..

ఈ స్క్రీన్ టైం బానిసత్వానికి గేమింగ్ మరో పెద్ద టైమ్‌సింక్. మల్టీప్లేయర్/ఈ-స్పోర్ట్స్ మోడ్‌లో 'నెక్స్ట్ మ్యాచ్ నెక్స్ట్ ర్యాంక్' లూప్ యువతను ముంచేస్తుంది. భారతీయ పరిశోధనల ప్రకారం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో గేమింగ్ అలవాట్లు.. ఫంక్షనాలిటీ, సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని సూచిస్తున్నాయి. అదే సమయంలో కాలేజీ విద్యార్థులపై చేసిన అధ్యయనాల్లో 'నలుగురిలో ఒక్కడికి' స్మార్ట్‌ఫోన్ అడిక్షన్ లక్షణాలు కనిపించాయని నివేదికలు వెల్లడించాయి. స్క్రీన్‌పై గడిపే సమయం పెరిగేకొద్దీ మార్కులపై వస్తున్న ఫలితాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. తక్కువ కాలంలోనే యువతలో వచ్చిన ఈ మార్పులతో పాటు డోపమైన్ హిట్స్ కోసం వేపింగ్/సబ్‌స్టెన్స్ ట్రయల్స్ వైపు అడుగులు కూడా ఆందోళనకరంగా మారాయి. తెలంగాణ యాంటీ-నార్కోటిక్స్ బ్యూరో ప్రణాళికలే ఈ విషయాలను చెబుతున్నాయి. హైదరాబాదు పరిసరాల్లో కుర్రాళ్లలో వీటి సరఫరా సులభంగా లభించడం వంటి కారణాలు అటు వైపు నెడుతున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.

పరిష్కారం ఏంటి?



ఇలాంటి తరుణంలో పరిష్కార మార్గాలపై నిపుణులు, సామాజికవేత్తలు [illegible] ... కాకుండా 'డెడ్ [illegible]




బొజ్జలు కాదు.. కండలు పెంచగలం..!

- బాడీ షేపింగ్‌కి జెనెటిక్స్‌తో సంబంధం లేదు
- 'డెక్కన్ అప్రైజింగ్-2025 అవార్డు గ్రహీతలకు అభినందన
- సాధనతో ఏదైనా సాధ్యం : సినీనటుడు అల్లు శిరీష్

'మనం బొజ్జలనే కాదు.. అందమైన ఆకృతితో కూడిన కండలను పెంచగలం.. అయితే దీనికి సరైన సమయంలో సరైన మార్గనిర్దేశం అవసరం. అప్పుడే సాధన ఫలితాలనిస్తుంది.. కండలు పెంచేందుకు జెనిటిక్స్‌తో ఎలాంటి సంబంధం లేదు. బాడీ బిల్డింగ్‌పై ఉన్న అపోహలు, తెరలు తొలగిపోవాలి. అప్పుడే అంతర్జాతీయ స్థాయిలో మనం సత్తా చూపించగలం' అని సినీనటుడు అల్లు శిరీష్ అన అభిప్రాయాన్ని వెల్లడించారు.

– శంషాబాద్



శంషాబాద్ క్లాసిక్ కన్వెన్షన్‌లో 'డెక్కన్ అప్రైజింగ్-2025 పేరిట ఐసీఎన్ (ఐ కాంపీట్ నేచురల్) సంస్థ నిర్వహించిన సహజసిద్ధ శరీర దృఢత్వ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను, నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం ఫిట్‌నెస్‌పై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

గుర్తింపు అవసరం..

ప్రపంచస్థాయిలో బాడీ బిల్డింగ్‌కి మంచి గుర్తింపు ఉంది. ఇందులో రాణించిన అథ్లెట్లు కోట్ల రూపాయలు సంపాదిస్తారు. మన దేశంలో మాత్రం బాడీ బిల్డర్లు కోచ్‌లుగా మాత్రమే మిగిలిపోతున్నారు. క్రికెట్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడలకు మన దేశంలో ఇచ్చిన ప్రాధాన్యత బాడీబిల్డింగ్‌కు కూడా దక్కేలా చర్యలు తీసుకోవాలి.

అనేక అపోహలు..

శరీర దారుఢ్యానికి మందులు, స్టిరాయిడ్లు వాడతారనే అపోహల కారణంగా చాలా మంది దీనికి దూరంగా ఉంటున్నారు. అవేవీ అవసరం లేకుండా కూడా సరైన సమయంలో సరైన కోచ్ ద్వారా శిక్షణ తీసుకుని సాధన చేస్తే అంతర్జాతీయ అథ్లెట్లను తయారు చేసుకోవచ్చు.. ఐసీఎన్ లాంటి సంస్థలు ఆ దిశగానే కృషి చేస్తున్నాయి.. అందుకే ఎంతో ఇష్టంతో గత రెండేళ్లుగా ఇక్కడికి వచ్చి అథ్లెట్లను ప్రోత్సహిస్తున్నాను. రెండు రాష్ట్రాలకు చెందిన నాలుగు వందల మంది యువత ఈ పోటీల్లో పాల్గొన్న తీరు చూస్తుంటే మన వద్ద కూడా ఫిట్‌నెస్‌పై అవగాహన పెరుగుతున్నట్లు కనిపిస్తోంది.

నాకు తగ్గ కథ వస్తే..

కండలు పెంచేందుకు జన్యుపరమైన సంబంధాలేవీ లేవు. ఫిట్‌నెస్‌కు రాంగ్ రూట్, షార్ట్‌కట్స్ ఎంత మాత్రం సరైంది కాదు. శరీర తత్వం బట్టి బొజ్జలు వస్తాయనే ప్రచారం సరికాదు. సహజంగానే ఫిట్‌నెస్ అంటే నాకు ఎంతో ఇష్టం. నా ఎత్తు, బరువు, ఆకృతికి అనువైన మంచి స్పోర్ట్స్ కథ వస్తే అలాంటి సినిమా చేయడానికి ఉత్సాహంగా ఉన్నాను. ఇప్పటి వరకూ వచ్చిన క్రికెట్, రన్నింగ్, ఫుట్‌బాల్ వంటి కథలు కాకుండా కొత్తగా ఉంటే బాగుంటుంది.

క్లే మినియేచర్ వర్క్‌షాప్..

మట్టితో కళాత్మక సృష్టి..

సాక్షి, సిటీబ్యూరో: మారుతున్న కాలానికి అనుగుణంగా విభిన్న, వినూత్న వర్క్‌షాప్‌లకు వేదికగా హైదరాబాద్ నిలుస్తోంది. ఇందులో భాగంగానే నగరంలో 'క్లే మినియేచర్ వర్క్‌షాప్' నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా సున్నితమైన బంకమట్టితో సూక్ష్మచిత్రాలను రూపొందించే కళలో శిక్షణ అందించనున్నారు. నగరంలోని శేరిలింగంపల్లి థర్డ్ వేవ్ కాఫీ వేదికగా ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకూ ఈ వర్క్ షాప్ కొనసాగనుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఆర్ట్ వర్క్‌లో చిన్న బొమ్మలు, అలంకరణ వస్తువులు, ఇంటీరియర్ బొమ్మలు ఎలా సృష్టించాలో శిక్షణ అందిస్తారు. వినూత్న కళలపై అభిరుచి ఉన్న ఔత్సాహికులకు ఇదొక ప్రాథమిక శిక్షణా వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.




సమ్మోహనం.. కథక్ నృత్యం

రవీంద్రభారతిలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు




గన్‌ఫౌండ్రి : సంప్రదాయ కళలు, ఆధ్యాత్మికత, నృత్య రూపకాలు కలగలిపి ఒకే వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను సమ్మోహనపరిచాయి. ప్రముఖ సాంస్కృతిక సంస్థ నాథ్ నీడ్ డాన్స్ స్టూడియో దశాబ్ద ఉత్సవ వేడుకలు రవీంద్రభారతిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కథలు, ఇతిహాసాలతో పాటు ప్రదర్శించిన 'భక్త శల బేగ కథ' నృత్యరూపకం అహూతులను ఆసాంతం మంత్రముగ్ధుల్ని చేశాయి. సంస్థ వ్యవస్థాపకురాలు అర్చన మిశ్రా శిష్య బృందం అయిన 75 మంది కళాకారులు చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ కథక్ నృత్య గురువు సంజయ్ కుమార్ జోషి మాట్లాడుతూ.. నేటి యువతరానికి శాస్త్రీయ సంగీత కళల ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు.



కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నాట్య గురువు డాక్టర్ పి.రమాదేవి, కథక్ నాట్య కళాకారిణి డాక్టర్ నీలిమ దేశ్ పాండే, ఎన్‌టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో పక్షి ప్రేమికులు

మంచిరేవుల ట్రెక్ పార్క్‌లో బర్డ్ వాక్



కిలకిలారావాలు..

కెమెరాల్లో ప్రకృతి రమణీయ దృశ్యాలు

మణికొండ : ప్రకృతి ఒడిలో పక్షి ప్రేమికులు సేదతీరుతున్నారు. కాలుష్య రహిత ప్రాంతంలో ప్రశాంతమైన వాతావరణంలో రాష్ట్ర అటవీ శాఖ నిర్వహించిన బర్డ్ వాక్‌లో పలువురు నగరవాసులు భాగస్వాములయ్యారు. హైదరాబాద్ నగర శివారు, ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని మంచిరేవులలో ఉన్న ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో అటవీ అభివృద్ధి సంస్థ బర్డ్ వాక్ (పక్షుల వీక్షణ) ఆదివారం నిర్వహించింది. నగరంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన పక్షి ప్రేమికులు వాటిని చూసి తన్మయత్వం పొందారు. ప్రకృతి రమణీయమైన దృశ్యాలను కెమెరాల్లో బంధించారు. పాకెట్ గైడ్ పుస్తకాలలో ఆయా పక్షి జాతుల వివరాలను పొందుపరుచుకున్నారు. పక్షుల రకాలు, వాటి అరుపులు, వాటి జీవన విధానం గుర్తించి తెలుసుకున్నారు.




31న వికారాబాద్‌లో..

ఈనెల 31న ఆదివారం వికారాబాద్ సమీపంలోని అనంతగిరి హిల్స్‌లో బర్డ్ వాక్ (ది బ్రీజ్) నిర్వహిస్తున్నామని అటవీశాఖ సహాయ డైరెక్టర్ (ఎకో టూరిజం) వి.తనూజ తెలిపారు. ఆసక్తిగలవారు ఫోన్ : 94935 49399, 73823 07476 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. మంచిరేవుల బర్డ్ వాక్‌లో ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, నేచురలిస్టులు అపరంజని, కిరణ్, బాబు పాల్గొన్నారు.

కనిపించిన పక్షులు ఇవే..

బర్డ్ వాక్‌లో షిక్రా, నెమళ్లు, చిన్న పసరక, లకుముకి పిట్ట, కొంగలు, గిజిగాడు, కోకిల, మైనా, బార్న్ స్వాలో, జనువాయితో పాటు పలు రకాల పక్షులు వీక్షకులను కనువిందు చేశాయి. అటవీ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఎకో టూరిజం) రంజిత్ నాయక్ ఆయా పక్షులు ప్రకృతి వ్యవస్థలో పోషించే ముఖ్య పాత్రలను, వాటి ద్వారా జరిగే విత్తన వ్యాప్తి, పర్యావరణ సంతులనం వంటి అంశాలను వివరించారు. ప్రజల్లో పక్షుల సంరక్షణపై అవగాహన పెంచడంతో పాటు పర్యావరణ విద్యను ఇలాంటి కార్యక్రమాల ద్వారా అందిస్తున్నామన్నారు. వాటిని పరిరక్షించుకోకపోతే రానున్న రోజుల్లో వాటిని మ్యూజియంలో చూడాల్సి వస్తుందన్నారు.

పేరెంట్స్.. ముందు మీరు పాటించండి

పిల్లల్ని ఎంత ముద్దు చేసినా, వారికి బుద్ధుల్ని నేర్పించే వయసొకటైతే వచ్చేస్తుంది. అప్పుడిక క్రమశిక్షణ అలవాటు చేయాల్సిందే. అయితే ఆ శిక్షణ.. శిక్షలా ఉండకూడదు. ముద్దార నేర్పించినట్లుగా ఉండాలి. పిల్లలు మెత్తటి మట్టి ముద్దల్లాంటి వారు. వారిని చక్కగా మలచటం పెద్దల చేతుల్లోనే ఉంటుంది. 'మొక్కై వంగనిది మానై వంగునా?' అనే సామెత ఎలాగూ ఉన్నదే! వాళ్లు మొక్కలుగా ఉన్నప్పుడే.. వాళ్లు మంచి అలవాట్లు, బాధ్యతలు నేర్చుకోవాలంటే.. అవి చేసి చూపించాల్సింది, పాటించాల్సింది మొదట తల్లిదండ్రులే.

స్కూల్లో టీచర్లు చదువు నేర్పటానికి ఒక సిలబస్ ఉన్నట్లే, ఇంట్లో తల్లిదండ్రులు మంచి అలవాట్లు నేర్పటానికి కూడా 6 సబ్జెక్టుల సిలబస్ ఒకటి ఉంది : ఆహారం, ఆటలు, నిద్రవేళలు, సమయపాలన, నియంత్రణ, సంభాషణ. ఈ ఆరు సబ్జెక్టుల్లో పరీక్షలు రాయవలసింది పిల్లలు కాదు. తల్లిదండ్రులు! ఆ ఆరు సబ్జెక్టులు, ఆరు సిలబస్‌లు ఏమిటో చూద్దామా..

- సాక్షి, స్పెషల్ డెస్క్



సబ్జెక్ట్ 1 ఆహారం

పిల్లలు అడిగినా అడగకున్నా ఏదో ఒకటి తినిపిస్తూ, తినేందుకు ఇస్తూ పేరెంట్స్ తమ ప్రేమను వెలిబుచ్చుతుంటారు. స్కూలుకు వెళ్లడానికి మారాం చేస్తే ఏదో ఒకటి షాపులో కొని ఇస్తుంటారు. చిన్నపిల్లలు వాళ్లకేం తెలుసు.. జంక్‌ఫుడ్ ఎంత ప్రమాదకరమో! వారంలో ఎక్కువ రోజులు హోటళ్ల నుంచో లేదా ఆన్‌లైన్ ద్వారానో ఆహారం తెప్పించుకుని ఇంట్లో తినడం చేస్తే.. పిల్లలకు ఇక ఏం చెప్తాం?



ఎలా నేర్పించాలి?

చాక్లెట్లు, జంక్‌ఫుడ్, బయటి ఆహారం వంటివి ఎంత ప్రమాదకరమో వీడియోల ద్వారా వారికి అర్థమయ్యేలా చూపించాలి. కాస్త పెద్ద పిల్లలైతే పత్రికల్లో కథనాలు చూపించాలి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వంటి వెబ్‌సైట్లలో సమాచారం చూపించాలి. తాజా పండ్లు, కూరగాయల వల్ల ప్రయోజనాలు తెలియజెప్పాలి. మీరు చెప్పే వాటిలో.. మీమీ ఆరోగ్య పరిస్థితులను బట్టి.. వీలైనంతవరకు పిల్లలతో కలిసి తినాలి.

సబ్జెక్ట్ 2 ఆటలు

పిల్లలకు కూడా వయసుకు తగిన శారీరక శ్రమ అవసరం. అవి లేకనే పిల్లల్లో స్థూలకాయం, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.



ఇలా నేర్పించండి: పిల్లలతో కలిసి మీరూ ఇంటి పనులు చేయండి. కలిసి తోట పని చేయండి. వాకింగ్ చేయండి. వాటి ప్రయోజనాలు వాళ్లకు వీడియోలు లేదా పత్రికల్లో కథనాల ద్వారా తెలియజేయండి.

సబ్జెక్ట్ 3 నిద్ర వేళలు

వేళకు నిద్రపోవటం, నిద్ర లేవటం మంచి అలవాటు. కానీ, చాలామంది పిల్లలు ఉదయాన్నే లేవరు. దాంతో వాళ్లను లేపి, రెడీచేసి, టిఫిన్ తినిపించేసరికి తల్లులకు తలప్రాణం తోకకి వస్తుంది.



మీరే ముందు లేవండి

సూర్యోదయానికంటే ముందే లేవడం మొదట తల్లిదండ్రులే ప్రారంభించాలి. ఇందుకోసం ముందు చేయాల్సిన రెండు విషయాలు.. రాత్రి వీలైనంత త్వరగా నిద్రపోవడం, బద్ధకాన్ని వదిలించుకోవడం. ఉదయాన్నే లేవడం వల్ల కలిగే ప్రయోజనాలు పిల్లలకు చెప్పండి. విజయవంతమైన వ్యక్తులంతా.. సూర్యోదయానికంటే ముందే నిద్రలేచినవాళ్లేనని వాళ్ల జీవిత చరిత్రలు వివరించండి. పిల్లలను.. వాకింగ్ చేద్దామనో, అలా మేడమీదకు ఎండలోకి వెళ్లి వద్దామనో నిద్రలేపండి. మొదట్లో లేవరు. కానీ, లేపడం మానొద్దు. నెమ్మదిగా అలవాటు అవుతుంది. మీరు వాకింగ్‌కో లేదా మేడమీదకో వాళ్లను తీసుకెళ్లినప్పుడు వాళ్లకు నచ్చిన విషయాలు జరిగితే వాళ్లే రోజూ మిమ్మల్ని లేపుతారు.

సబ్జెక్ట్ 4 సమయపాలన

అందరికీ ఉండేవి ఆ 24 గంటలే. అందులోనే మన నిత్య కృత్యాలకు, ఇతర పనులకు ఎంత సమయం కేటాయిస్తాం అన్నదానిపై మన అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

మీరు ఫాలో అవ్వండి



మీరు ఒక టైమ్ టేబుల్ వేసుకుని దాన్ని మీ ఇంట్లో ఒక గోడమీదనో మరోచోటో అంటించండి. దాన్ని చూసుకుని మరీ ఫాలో అవ్వండి. ప్రతిసారీ టిక్కులు పెట్టండి. మీరు చూస్తున్న, చేస్తున్న విషయం పిల్లలకు తెలియాలి. నెమ్మదిగా వాళ్ల బెడ్‌రూమ్‌లో కలర్‌ఫుల్‌గా వాళ్లతోనే ఒక టైమ్ టేబుల్ తయారుచేయించండి. లేదా వాళ్లే తయారుచేసుకున్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. వాళ్లు కూడా మీలాగే చేసేందుకు ప్రయత్నిస్తారు. మొదట్లో.. వాళ్లు విజయవంతంగా దాన్ని ఫాలో అయిన ప్రతిరోజూ ఒక ప్రశంస లేదా బహుమతి ఏదో ఒకటి ఇవ్వండి. తరువాత వాళ్లకు మీరేమీ ఇవ్వాల్సిన అవసరం లేకుండానే అన్నీ చేసేస్తారు.

సబ్జెక్ట్ 5 నియంత్రణ

సోషల్ మీడియా వచ్చాక పెద్దలకు, పిల్లలకు కూడా స్మార్ట్ ఫోనే లోకం అయిపోయింది. టీవీలు చూస్తూ తినడం చేస్తున్నారు. చాలామంది పెద్దలు పిల్లలు చదువుకుంటుంటేనో, వాళ్లు చూస్తుండగానో లేదా వాళ్లతోనో.. గంటల తరబడి రీళ్లు, వీడియోలూ, టీవీలో సినిమాలూ / వెబ్‌సిరీస్‌లూ చూస్తుంటారు.



మీకు మీరే నియంత్రించుకోండి

సోషల్ మీడియా, టీవీ ఉచ్చులోంచి ముందు మీరు బయటపడండి. పిల్లల ముందు, వాళ్లు చదువుకుంటున్నప్పుడు ఫోన్‌లో వీడియోలు చూడటం తగ్గించండి. అలాగే భోజన సమయంలో టీవీ ఆఫ్ చేయడం మీరు అలవాటు చేసుకోండి. ముఖ్యంగా రాత్రుళ్లు టీవీలూ ఫోన్లూ తగ్గించండి. ఉదయాన్నే త్వరగా లేవగలుగుతారు.

సబ్జెక్ట్ 6 సంభాషణ



ఈ రోజుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలాంటి వారినైనా ఎక్కడైనా బతికేలా చేయగలవు. ఇందుకు ప్రధానమైనవి.. సంభాషణా చాతుర్యం, మాటల్లో స్పష్టత, అవసరమైన చోట మృదుత్వం, ధైర్యంగా భావ వ్యక్తీకరణ. ఇవి పిల్లలు.. బడిలో టీచర్లు, ఇంట్లో మిమ్మల్నే చూసి నేర్చుకుంటారని మర్చిపోవద్దు.

పిల్లలతో మాట్లాడండి.. వినండి

తల్లిదండ్రులు తరచూ పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి. ఉద్యోగాల్లో ఎంత తీరిక లేకుండా ఉన్నా, పిల్లల కోసం తీరిక చేసుకోవాలి. వారి స్కూలు విషయాలను అడిగి తెలుసుకుంటుండాలి. వాళ్లు చెప్పేది శ్రద్ధగా వినాలి. ఆ నమ్మకం వారికి కలగకపోతే వారు మనసు విప్పి మీతో మాట్లాడటం మానేస్తారు. సెలవు రోజుల్లో వారిని మీతోపాటు మార్కెట్‌కో, షాపుకో తీసుకెళ్లండి.. బయట ఎలా మాట్లాడాలో వాళ్లే నేర్చుకుంటారు.

మంచి అలవాట్లలో తల్లిదండ్రులే మార్గదర్శకులు
పెద్దలు చేస్తుంటే పిల్లలూ చూసి నేర్చుకుంటారు
కసుర్లు, విసుర్ల వల్ల ప్రయోజనం శూన్యం



ఓపిక పట్టండి

పిల్లలకు మంచి అలవాట్లు నేర్పటానికి పెద్దలకు ఓర్పు అవసరం.

- పిల్లలు అలవాటు పడేంత వరకు వారికి గుర్తు చేస్తూనే ఉండాలి.
- మంచి అలవాట్లు నేర్చుకునే విషయంలో పిల్లల ప్రయత్నాలను గుర్తించి, ప్రశంసించాలి.
- పిల్లలకు మీరు కొన్ని అలవాట్లను ఏర్పరచలేకపోతుంటే వారి ఉపాధ్యాయులు, పిల్లల వైద్యులు లేదా ఇతర నిపుణుల సలహా తీసుకోవడానికి వెనుకాడకండి.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక



ఢిల్లీ అసెంబ్లీ హాలులో జరిగిన ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కేంద్రహోంమంత్రి అమిత్‌షాను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అమిత్ షాను శాలువాతో సత్కరించారు.

కాంగ్రెస్ 'ఓబీసీ' అడ్వయిజరీ కమిటీ నియామకం

- జాతీయ కన్వీనర్‌గా ప్రొఫెసర్ సుధాన్షు కుమార్
- కమిటీలో సభ్యుడిగా ప్రొఫెసర్ కంచ ఐలయ్య

సాక్షి, న్యూఢిల్లీ: ఓబీసీ ఐడియాలజీ అడ్వయిజరీ కమిటీని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. దీనికి ప్రొఫెసర్ సుధాన్షు కుమార్‌ను జాతీయ కన్వీనర్‌గా నియమించింది. ఈ మేరకు ఆ కమిటీ చైర్మన్ అనిల్ జై హింద్ ఉత్తర్వులు జారీ చేశారు. 23 మంది సభ్యులతో ప్రకటించిన అడ్వయిజరీ కమిటీలో తెలంగాణకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్యకు సభ్యుడిగా చోటు కల్పించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో తెలంగాణ సర్కారు చేసిన కులగణన సర్వేపై ఇటీవల ఢిల్లీలో జరిగిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో సీఎం, మంత్రులతో కలసి కంచ ఐలయ్య పాల్గొన్నారు. కులగణన కోసం ఆయన కొన్నేళ్లుగా ఉద్యమిస్తున్నారు. అలాగే రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రచారానికి మద్దతు ఇస్తున్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలానికి వ్యతిరేకంగా ఆయన పోరాడుతున్నారు. కంచ ఐలయ్య బీసీ సిద్ధాంతాన్ని గుర్తించిన కాంగ్రెస్ అధినాయకత్వం ఓబీసీ ఐడియాలజీ అడ్వయిజరీ కమిటీలో ఆయనకు అవకాశం కల్పించింది.

ఫిరాయింపులపై కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల గురించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఎద్దేవా చేశారు. 60 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తమ పార్టీలో చేర్చుకున్న కేటీఆర్‌కు పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అయినా కేటీఆర్ మాట్లాడుతుంటే వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్టుందని అన్నారు. పార్టీలకు పార్టీలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ఏమీ మాట్లాడకుండా, పార్టీ మారిన వారి చేత రాజీనామాలు చేయించకుండా, ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ దమ్ము గురించి తెలంగాణ ప్రజలకు తెలుసునని, నిజంగా కేటీఆర్ దమ్మేంటో స్థానిక సంస్థల ఎన్నికల్లో చూపించాలని సవాల్ చేశారు. భవిష్యత్తులో కేటీఆర్‌కు, ఆయన తండ్రి కేసీఆర్‌కు రాజకీయ సన్యాసం ఖాయమని అయిలయ్య ఎద్దేవా చేశారు.

బై ఎలక్షన్లతో కాంగ్రెస్‌కు బైబై

- పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మళ్లీ గెలవాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి ఉప ఎన్నికలకు వెళ్లే దమ్ముందా?
- 20 నెలల్లోనే ప్రభుత్వం రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేసింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు



బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మియాపూర్: రాష్ట్రంలో త్వరలోనే అసెంబ్లీ ఉప ఎన్నికలు రానున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వానికి అవే బైబై ఎన్నికలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు దమ్ముంటే తమ పదవులకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో పోటీచేసి గెలవాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉప ఎన్నికలకు వెళ్లే దమ్ముందా? అని సవాల్ విసిరారు. మియాపూర్ నరేన్ గార్డెన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపురం రాజు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.2.80 లక్షల కోట్ల అప్పుచేసి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు గడవకముందే రూ.2.20 లక్షల కోట్ల అప్పుచేసి ఒక్క మంచిపని కూడా చేయలేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌ను మహా నగరంగా తీర్చిదిద్దామని చెప్పారు. కరోనా సమయంలో ఏడాదిపాటు ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఆదాయం రాకపోయినా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆగకుండా కొనసాగించామని తెలిపారు. ఇప్పుడు 20 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పుతో 42 ఫ్లై ఓవర్లు, నాలుగు అత్యాధునిక ఆస్పత్రులు, 36 మురుగునీటి శుద్ధి కేంద్రాలు నిర్మించిందని వెల్లడించారు. రేవంత్ ప్రభుత్వం ఒక్క కొత్త వంతెన గానీ మోరీని గానీ నిర్మించిందా? అని ప్రశ్నించారు.

హైడ్రా అరాచకంతో హైదరాబాద్ అతలాకుతలం

కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన హైడ్రావల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుప్పకూలిందని కేటీఆర్ విమర్శించారు. హైడ్రా అరాచకాలతో నగరమంతా అతలాకుతలమైందని ఆరోపించారు. దుర్గంచెరువులో కాంగ్రెస్ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చే దమ్ము హైడ్రాకు ఉందా? అని సవాల్ చేశారు. పేదల ఇళ్లు కూలగొడుతున్న హైడ్రా.. పెద్దల జోలికి మాత్రం వెళ్లడం లేదని మండిపడ్డారు. 20 నెలల్లో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు తాము ఏ పార్టీలో ఉన్నామో కూడా చెప్పుకోలేకపోతున్నారని, ఒకవేళ బీఆర్ఎస్ పార్టీలో ఉంటే ఈ కార్యక్రమానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రోజాదేవి రంగారావు, సింధూ ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌లో తెలంగాణ ఉంటేనే.. ఉచిత ప్రయాణమట!

▶ మొదటి పేజీ తరువాయి

ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు ఉండదని, కచ్చితంగా టికెట్ కొనాల్సిందేనంటూ కొందరు కండక్టర్లు అత్యుత్సాహంతో చేసిన ప్రచారం ఫలితమిది.

- మహేశ్వరం సమీపంలోని ఓ కాలనీకి చెందిన మహిళ తుక్కుగూడ నుంచి చాంద్రాయణగుట్ట వెళ్లేందుకు మహేశ్వరం డిపో బస్సు ఎక్కారు. ఆధార్‌కార్డులో తెలంగాణ బదులు ఏపీ అని ఉండటంతో జీరో టికెట్ ఇచ్చేందుకు కండక్టర్ నిరాకరించారు. చేసేది లేక రూ.25 టికెట్ కొని ప్రయాణించాల్సి వచ్చింది. 'దీనిపై మహేశ్వరం డిపో అధికారులకు ఫిర్యాదు చేస్తే, చిరునామాలో తెలంగాణ బదులు ఏపీ అని ఉంటే ఉచిత ప్రయాణానికి అనుమతించబోమని తేల్చి చెప్పారు'అని ఆమె కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.
- నాలుగు రోజుల క్రితం బూర్గంపహాడ్ ఇంటి చిరునామా ఉన్న ఆధార్‌కార్డుతో ఓ మహిళ నగరంలోని మెహిదీపట్నంలో బస్సెక్కగా, కండక్టర్ ఉచిత ప్రయాణానికి అనుమతించలేదు. ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న ఆధార్‌కార్డు కావటంతో దానిపై తెలంగాణ బదులు ఆంధ్రప్రదేశ్ అని ఉండటమే కారణం. దీంతో ఆ మహిళ ఆ బస్సు దిగి మరో బస్సు ఎక్కాల్సి వచ్చింది.
- ఇలా నిత్యం కొన్ని ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్లు జీరో టికెట్లను నిరాకరిస్తుండటంతో ఇప్పుడు అలజడి రేగింది. కొన్ని బస్సుల్లో కండక్టర్లు నోటీసులు అతికించి మరి ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలని, లేని పక్షంలో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఉండదని రాసి ఉన్న సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు.


అలాంటి ఆదేశాలు లేకున్నా...

ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న ఆధార్ కార్డులను చాలామంది ఇప్పటికీ అలాగే వాడుతున్నారు. ఇళ్లు మారినవారు, ఫోన్ నంబర్లు మారినవారు ఆధార్ కార్డుల్లో ఆ మేరకు మార్పుల వివరాలను సవరించుకుంటుండగా, ఎలాంటి మార్పులు జరగనివారు పాత ఆధార్‌కార్డులనే వాడుతున్నారు. ఏపీ పేరున్న ఆధార్ కార్డులు అన్నిచోట్లా చెల్లుబాటు అవుతుండగా, ఒక్క ఆర్టీసీ బస్సుల్లోనే అభ్యంతరాలు వ్యక్తం అవుతుండటం విశేషం. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే, తాము డిపో మేనేజర్లకు అలాంటి ఆదేశాలు ఏమీ ఇవ్వలేదని, ఉమ్మడి రాష్ట్రంలో పొందిన ఆధార్ కార్డుల్లో తెలంగాణ బదులు ఆంధ్రప్రదేశ్ అని ఉన్నా, వాటిని అనుమతించాల్సి ఉంటుందని పేర్కొనటం విశేషం. ఉచిత ప్రయాణ పథకం అమలులోకి వచ్చిన కొత్తలో మాత్రం రెండుమూడు పర్యాయాలు, ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలన్న ప్రకటన వెలువడిందని, ఇప్పుడు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. కానీ, ఒకరిని చూసి మరొకరుగా ఆధార్ కార్డుల్లో ఆంధ్రప్రదేశ్ అని ఉంటే అనుమతించడం లేదు. కొందరు టికెట్ చెకింగ్ సిబ్బంది కూడా తెలంగాణ అని లేకపోతే తప్పుపడుతున్న సందర్భాలూ ఉన్నాయి.

చిన్ననాటి ఫొటో ఉంటే మార్చుకోవాల్సిందే..

ఆధార్ కార్డులు అమలులోకి వచ్చిన 15 ఏళ్ల క్రితం అప్పటి చిన్నారుల కార్డులు ఇప్పటికీ కొందరు వాడుతున్నారు. ఇలాంటి కార్డుల్లో ఫొటోలను అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంది. కానీ ఆంధ్రప్రదేశ్ అని ఉంటే అనుమతించకపోవడం ఇప్పుడు పెద్ద వివాదంగా మారుతోంది.

అయ్యన్న బూతు పురాణం



రావికమతం: అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరోసారి బూతు పురాణం విప్పారు. ప్రొటోకాల్ తెలియదా అంటూ పోలీసులను ఉద్దేశించి.. పత్రికలో రాయలేని భాషలో బూతులు లంకించుకున్నారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం దొండపూడిలో ఈ నెల 21న గ్రామ దేవత శ్రీదుర్గాలమ్మ పండుగ భారీ ఎత్తున జరిగింది. నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 25 మందికి పైగా కూటమి ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నుంచి మాజీ మంత్రులు ఆర్కే రోజా, గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితర నేతలు హాజరయ్యారు. వేలాదిమంది భక్తుల రాకతో గ్రామంలో విపరీతమైన రద్దీ నెలకొనడంతో సీఐ, ఎస్ఐ సహా పోలీసులంతా బందోబస్తులో నిమగ్నమయ్యారు. అదే సమయంలో అమ్మవారి దర్శనానికి అనుయాయులతో వచ్చిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు పోలీసు అధికారులెవరూ తన వద్దకు రాలేదని ఆగ్రహించారు. 'ఇంతమంది వీఐపీలు వస్తే సీఐ, ఎస్ఐ ఏం చేస్తున్నారు? అంటూ బండబూతులతో రెచ్చిపోయారు. అయ్యన్న తిట్లు విన్న అనుచర వర్గం కేకలు వేయగా.. పోలీసులు అధికారులు చిన్నబుచ్చుకున్నారు. తామంతా ఉదయం నుంచీ విధి నిర్వహణలోనే ఉన్నా ఈ తిట్లేంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా చూసిన అక్కడి భక్తులు విస్తుపోయారు. కొందరైతే అయ్యన్నపాత్రుడి బూతు పురాణం వినలేక చెవులు మూసుకోవాల్సి వచ్చింది.

బండి సంజయ్ బీసీ కాదు.. దేశ్‌ముఖ్

జనహిత పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సంచలన వ్యాఖ్యలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ బీసీ కాదు.. ఆయన దేశ్‌ముఖ్' అంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జనహిత పాదయాత్ర గంగాధర మండలం ఉప్పరమల్యాల నుంచి గంగాధర మధురానగర్ చౌరస్తా వరకు పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ..బండి సంజయ్ ఎప్పుడూ దొంగ ఓట్లతోనే గెలిచారు. బీజేపీ నేతలు పొద్దున లేస్తే దేవుడి పేరుతో కులం, మతం పేరుతో ఓట్లు అడిగే బిచ్చగాళ్లు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీల విజయంపైనా అనుమానాలున్నాయి. బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోంది. కూతురు విదేశాలకు వెళ్లగా, కేటీఆర్ సరేసరి, తండ్రి ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యాడు. ఇదే అదనుగా మరో వ్యక్తి (హరీశ్‌రావు) అవకాశం కోసం కాచుకు కూర్చున్నాడు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తప్ప మరే పార్టీకి భవిష్యత్ లేదు' అని చెప్పారు.



జనహిత పాదయాత్రలో పాల్గొన్న మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్, వివేక్, పొన్నం ప్రభాకర్

ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు రాహుల్ పాదయాత్ర : మీనాక్షి

దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిహార్‌లో పాదయాత్ర చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. 'రాహుల్‌గాంధీ తలచుకుంటే హెలికాప్టర్‌లో తిరగగలరు. అయినా ఆయన సామాన్యుడిలా ప్రజాస్వామ్య పరిరక్షణకు పాదయాత్ర చేస్తున్నారు. రాహుల్‌గాంధీ స్వయంగా ప్రజల కష్టాలు తెలుసుకుంటున్న సిసలైన నాయకుడు. ప్రస్తుతం 19 నెలల పాలనలో రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కారు కూడా ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. నేను మధ్యప్రదేశ్ నుంచి వచ్చాను. నాకు ఇక్కడి భాష రాదు. కానీ మీ కళ్లల్లో నాపై అభిమానం స్పష్టంగా కనిపిస్తోంది. ఇందుకు ఏ భాషా అవసరం లేదు. దేశంలో ప్రజలపై మమకారం, ప్రేమతో కూడిన రాజనీతిని అమలు చేయడమే కాంగ్రెస్ విధానం..' అంటూ ప్రసంగం ముగించారు. అంతకుముందు మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నంతో కలిసి కురిక్యాలలో ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులైన భాగ్య, గంగయ్య దంపతుల ఇంటిని పరిశీలించారు. వారింట్లో టీ తాగి, జిలేబి తిన్నారు.

200 టీఎంసీల లభ్యతకు ఆధారమేది?

- బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదికలో స్పష్టత కొరవడింది
- ఈప్రాజెక్టుపై ఆక్షేపణలతో సీడబ్ల్యూసీకి లేఖ రాసిన కృష్ణాబోర్డు
- ఇప్పటికే ప్రాజెక్టును వ్యతిరేకించిన గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీ, పోలవరం అథారిటీ

సాక్షి, హైదరాబాద్: గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్)పై కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టు నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 90–120 రోజుల్లో మొత్తం 200 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణానదిలో వేసి.. అక్కడి నుంచి పెన్నా బేసిన్‌కు మళ్లించడానికి ఏపీ ప్రభుత్వం సమర్పించిన పీఎఫ్ఆర్‌ను సమగ్రంగా పరిశీలించి ఈ మేరకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లోని ప్రాజెక్ట్ అప్రైసల్ డైరెక్టర్‌కు తన అభిప్రాయాలను కృష్ణాబోర్డు తెలియజేసింది. బనకచర్ల ప్రాజెక్టుకు 200 టీఎంసీల నీటి లభ్యత ఉందని పీఎఫ్ఆర్ నివేదికలో చూపిన లెక్కలతో.. కృష్ణా, గోదావరి ట్రిబ్యునల్స్ తీర్పుల ప్రకారం ఇప్పటికే వాడుకుంటున్న జలాలపై ఎలాంటి ప్రభావం ఉండరాదని స్పష్టం చేసింది. 90–120 రోజులపాటు ఆ మేరకు నీటి లభ్యతకు ఆధారాలు, పోలవరం నుంచి ఆ మేరకు నీటిని మళ్లిస్తే ఉండనున్న ప్రభావాలపై నివేదికలో ఎలాంటి స్పష్టత లేదని పేర్కొంది.

నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ లోతుగా పరిశీలించాలి

నీటి లభ్యత, అంతర్రాష్ట్ర సంబంధిత అంశాలను కేంద్ర జల సంఘంలోని ప్రత్యేక విభాగాలు లోతైన పరిశీలన చేయాల్సిన అవసరముందని కృష్ణాబోర్డు తేల్చి చెప్పింది. ప్రాజెక్టుల పరిశీలనకు సంబంధించి అనుసరించాల్సిన జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రొటోకాల్ ప్రకారం తమకు ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించాల్సి ఉండగా, పీఎఫ్ఆర్‌ను పంపించారని అసంతృప్తి వ్యక్తం చేసింది. అయినా, తాము విస్తృతంగా పరిశీలించి తమ అభిప్రాయాలను తెలుపుతున్నామని పేర్కొంది. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీడబ్ల్యూసీ, గోదావరి బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయగా, ఆ జాబితాలో తాజాగా కృష్ణాబోర్డు సైతం చేరడం గమనార్హం. ఏపీ సమర్పించిన ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదికను గత జూన్‌లో సీడబ్ల్యూసీ.. ఈ విభాగాలకు పంపించి అభిప్రాయాన్ని కోరింది.

ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మోజెస్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. రాష్ట్ర అధ్యక్షుడిగా కె.బాబు మోజెస్, ప్రధాన కార్యదర్శిగా మాధవీలత, ఉపాధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాస్, కోశాధికారిగా కె.బ్రహ్మాచారి నియమితులయ్యారు. ఆదివారం కార్యవర్గం ఎన్నిక అనంతరం జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై తీర్మానం చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌లో ఇతర శాఖల అధికారులకు డిప్యూటేషన్లు ఇవ్వొద్దని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటివరకు ఇచ్చిన డిప్యూటేషన్ల వల్ల కార్పొరేషన్‌లోని సీనియర్ అధికారులకు కీలక పోస్టులు దక్కకుండా పోయాయని అన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగులకు న్యాయం జరిగేలా సంఘం పోరాడుతుందని మోజెస్ తెలిపారు.

మీ అభిప్రాయం ఏంటి?



సమావేశంలో ఏజీ సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, భట్టి, ఉత్తమ్

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీధర్‌బాబులు హాజరయ్యారు. కరీంనగర్ పర్యటనలో ఉన్న మరో మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో కమిటీతో తన అభిప్రాయాన్ని పంచుకోగా, ఇంకో మంత్రి సీతక్క గైర్హాజరయ్యారు. సమావేశంలో భాగంగా కులగణన నుంచి బీసీ బిల్లును రాష్ట్రపతికి పంపేంతవరకు జరిగిన కార్యాచరణ, న్యాయపరంగా ఈ బిల్లు ఆమోదానికి తీసుకోవాల్సిన చర్యలు, రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసి ఎన్నికలకు వెళితే.. ఎదురయ్యే అడ్డంకులు తదితర అంశాలపై ఏజీ సుదర్శన్‌రెడ్డితో కమిటీ చర్చించింది.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు ఉత్తమ్, పొన్నం కూడా
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీలతో భేటీ!
- రేపు బిహార్‌లో రాహుల్ పాదయాత్రకు హాజరు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే కార్యక్రమానికి హాజరైన అనంతరం అక్కడి నుంచి నేరుగా ఆయన శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకొని ఢిల్లీ వెళ్తారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై పీసీసీ నియమించిన మంత్రుల కమిటీ కూడా నేడు ఢిల్లీ వెళ్తోంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కమిటీ సభ్యులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సోమవారం ఢిల్లీ వెళ్లి న్యాయ కోవిదులు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ తదితరులతో సమావేశమై బీసీ రిజర్వేషన్లపై అభిప్రాయాలు తీసుకోనున్నారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా పాల్గొంటారని తెలుస్తోంది. కాగా బిహార్‌లో రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రకు హాజరయ్యేందుకు మంగళవారం ఢిల్లీ నుంచి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు వెళతారు.



ఆలకించడమూ ఓ కళే!

మానవ సంబంధాలలో, సమర్థవంతమైన సంభాషణకు పునాది శ్రద్ధగా వినడం. ఇది కేవలం మాటలను వినడం కాదు, మాట్లాడేవారి భావాలను, ఉద్దేశాలను, చెప్పదలచుకున్న అసలు విషయాన్ని అర్థం చేసుకునే అద్భుతమైన కళ. శ్రద్ధగా వినడం ద్వారానే అపార్థాలు తొలగిపోతాయి, బంధాలు బలపడతాయి. నిజమైన అవగాహన ఏర్పడుతుంది.

శ్రోతుం తు యతతే నర్తకో గీయతే యద్వా
వక్తుం యతతే బాలస్తం న శృణ్వంతి పండితాః

నాట్యం చేసేవారు పాటను శ్రద్ధగా వినడానికి ప్రయత్నిస్తారు. పండితులు మాట్లాడేటప్పుడు పిల్లలు వినడానికి ప్రయత్నించరు. ఈ శ్లోకం వినడంలోని ప్రాముఖ్యతను, విజ్ఞులు ఇతరుల మాటలను ఎంత శ్రద్ధగా వింటారో సూచిస్తుంది.

శ్రద్ధగా వినడం అనేది ఒక గొప్ప నైపుణ్యం, దీనిని సాధన ద్వారా పెంపొందించుకోవచ్చు. సనాతన ధర్మంలో జ్ఞాన సముపార్జనకు 'శ్రవణం' (వినడం) మొదటి మెట్టుగా చెప్పబడింది. గురువుల నుండి, పెద్దల నుండి జ్ఞానాన్ని పొందడానికి శ్రద్ధగా వినడం అత్యవసరం.

శ్రద్ధగా వినడం వ్యక్తిగత జీవితంలోనే కాకుండా, వృత్తిపరమైన రంగంలో కూడా అత్యంత కీలకమైనది. ఒక వ్యాపారవేత్త ఖాతాదారుల అవసరాలను శ్రద్ధగా వింటేనే సరైన సేవలను అందించగలడు. ఒక నాయకుడు తన బృంద సభ్యుల సమస్యలను విని, పరిష్కారాలు చూపడం ద్వారా విశ్వసనీయతను పొందుతాడు. కుటుంబంలో, స్నేహితుల మధ్య తలెత్తే అనేక చిన్నపాటి సమస్యలకు, అపార్థాలకు ప్రధాన కారణం ఒకరి మాటలను మరొకరు శ్రద్ధగా వినకపోవడమే. నిశ్శబ్దంగా ఉండి, ఎదుటి వ్యక్తిని మాట్లాడటానికి ప్రోత్సహించడం, వారి మాటలను మధ్యలో అడ్డుకోకుండా వినడం, కళ్ళలో కళ్ళు పెట్టి చూడటం – ఇవన్నీ శ్రద్ధగా వినే లక్షణాలు. ఇవి కేవలం సంభాషణను సులభతరం చేయడమే కాదు, వ్యక్తిగత ఎదుగుదలకు, సామరస్య పూర్వక సంబంధాలకు పునాదులు వేస్తాయి.

ఆకర్ణనతో భవంతి లోకే జ్ఞానినః సాధువాదినః
అశ్రద్ధయా చ మూర్ఖత్వం భవేత్ సర్వదా ఖలు

శ్రద్ధగా వినడం వల్లనే లోకంలో జ్ఞానులు, మంచి మాటలు పలికేవారు అవుతారు. అశ్రద్ధగా వినడం వల్ల ఎల్లప్పుడూ మూర్ఖత్వం కలుగుతుంది. ఈ సూక్తి శ్రద్ధగా వినడం వల్ల కలిగే ప్రయోజనాలను, అశ్రద్ధ వల్ల కలిగే నష్టాలను వివరిస్తుంది.

వినయం శోభయతే విద్వాంసం శ్రవణం జ్ఞాన దాయకమ్
అవధానం హి సర్వత్ర సఫలతాం ప్రయచ్ఛతి

వినయం విద్వాంసుడికి శోభను ఇస్తుంది, వినడం జ్ఞానాన్ని ఇస్తుంది. ఏ విషయంలోనైనా శ్రద్ధే విజయానికి దారితీస్తుంది. ఈ శ్లోకం వినయం, వినడం, శ్రద్ధ అనే లక్షణాలు విజయానికి ఎలా దోహదపడతాయో స్పష్టం చేస్తుంది.

శ్రద్ధగా వినడం అనేది కేవలం ఒక కమ్యూనికేషన్ టెక్నిక్ మాత్రమే కాదు, అది ఎదుటి వ్యక్తిని గౌరవించే, వారి పట్ల సానుభూతిని చూపించే ఒక గొప్ప మానవ లక్షణం. ఇది సంబంధాలకు బలాన్నిస్తుంది, వ్యక్తిగత ఎదుగుదలకు దోహదపడుతుంది, సంఘర్షణలను తగ్గిస్తుంది. ప్రతి సంభాషణను ఒక అభ్యాస అవకాశంగా భావించి, శ్రద్ధగా వినే కళను అలవరచుకోవడం ద్వారా మనం జీవితంలో మరింత విజయవంతంగా, సంతోషంగా జీవించగలం.



మహాభారతంలో ధృతరాష్ట్రుడు సంజయుడి ద్వారా యుద్ధ వివరాలను విన్నప్పటికీ, తన పుత్ర ప్రేమ కారణంగా ఆయన మాటలను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాడు. అదే విదురుడు, శ్రీకృష్ణుడి మాటలను శ్రద్ధగా విని, ధర్మ సూక్ష్మాలను గ్రహించాడు. ఈ ఉదాహరణలు కేవలం వినడం సరిపోదని, అర్థం చేసుకునే తత్వంతో వినాలని చాటి చెబుతాయి.

– కె. భాస్కర్ గుప్తా

అమృత బిందువులు

- గతించిన కాలం గొప్పదని ఇతిహాసాలు చెబుతాయి. రాబోయే రోజులు మంచివని విజ్ఞానశాస్త్రం చెబుతుంది. మనస్సు, బుద్ధి మంచిగా ఉంటే... ప్రతిరోజూ మంచిదేనని మన ధర్మం చెబుతుంది.
- కావలసినవి ఎంచుకోవడంలో సందిగ్ధత ఉన్నా పర్వాలేదు కానీ ఏది వద్దో తేల్చుకోవడంలో స్పష్టత ఉండాలి.
- మనిషికి బాధ తెలియనంత వరకు భగవంతుడు అర్థం కాడు బాధ తెలిశాక భగవంతుడు తప్ప వేరే ఎవరూ అర్థం కాదు.
- సమస్తం తెలిసిన భగవంతునికి మన సమస్యలు ఏమిటో తెలియవా? మనం చేసుకున్న పాపకర్మలు అనుభించాకే కదా... ఆ తర్వాత రావలసిన ఆనందం, సంతోషం మనల్ని వెత్కుంటూ పల్లకిలో తప్పక వస్తాయి.
- మనం మన కలలను, మన లక్ష్యాలను విశ్వసించినప్పుడు వాటికి కావలసిన వనరులు వాటంతట అవే సమకూరతాయి.

ఆత్మదర్శిని

అనంతం... అనశ్వరం... సంపూర్ణం



మనస్సు అనేది ఏంటి? ఆత్మనుంచే దారి మళ్ళి వచ్చిన ఒక కొమ్మలాంటిది. ఆత్మ అనే సముద్రం నుంచి వచ్చిన ఒక కెరటమే ఆలోచన. ఆలోచనే నేను అనుకుంటున్నావు. ఆలోచన అనేది మళ్ళీ తిరిగి ఆత్మలో లీనమైపోయినప్పుడు నీవు అనంతుడివి. ఆత్మ స్వయం ప్రకాశం, అనంతం. ఆత్మగా అన్నీ నీవే.

నేను మనస్సు అనుకున్నపుడే ఇది నాది, ఇది నీది అనే భావన, ఆక్రమించుకోవడం, ఆక్రందన, ఆక్రోశం అనేవన్నీ మొదలౌతున్నాయి. అంటే ఎప్పుడైతే 'శరీరమే నేను' అని నమ్మటం మొదలైందో నటుడు అనేవాడు మొదలయ్యాడు. వ్యక్తి అనేవాడు మొదలయ్యాడు. నటన అనేది మొదలైంది. భ్రమించడం అనేది మొదలైంది. నువ్వు ఒక 'వ్యక్తి'గా ఉన్నపుడు అంటే మనసుతో ఉన్నపుడు ఏదీ బాగుండదు. అదే ఆత్మగా ఉన్నావనుకో నీవు అనంతం... నశ్వరం... సంపూర్ణం.



ఆత్మచైతన్యం అంటారే, ఆ స్థితిలో ఆత్మ నీలోనే నిద్రాణంగా ఉంది. ఎక్కడికీ పోలేదు. కానీ ఎప్పుడైతే నీ నిజతత్వాన్ని మర్చిపోయి నీవు ఒక వ్యక్తిగా, ఒక శరీరంగా, ఒక మనస్సుగా, ఒక ఆలోచనగా నమ్ముతూ పోతున్నావో, అప్పుడు నీవు ఆత్మ అనే సముద్రానికి చాలా దూరమై ఆలోచన అనే ఒక కెరటంలా కొట్టుమిట్టాడుతూ ఒడ్డుకు వస్తూ వెళ్తూ అలజడిలో ఉంటావు. సముద్ర గర్భంలో ఎప్పుడూ ప్రశాంతంగా ఉండి తీరుతుంది. అసలు ఎప్పుడైతే నీవు ఆత్మ ఔతావో అపుడు నీవే దైవం. అసలు దైవమంటే ఒక వ్యక్తి కాదు. వ్యక్తి అనేది మనసు తయారు చేసుకున్న ఒక నమ్మకం, ఒక భావన. దైవం చూడటానికి వీలయ్యేది కాదు. కానీ మనస్సు ఎప్పుడూ చూడాలనుకుంటుంది. ఒకవేళ దైవాన్ని చూసినా ఒప్పుకోదు. దేవుడు ఇలా ఎందుకు ఉంటాడు అంటుంది. దైవం ప్రతి వస్తువులోనూ, ప్రతి విషయంలోనూ ఉంటుంది. ప్రతీ చోటా ఉంటుంది. ప్రతి వ్యక్తి వెనుక ఉన్న ఉనికే దేవుడు. ఆ ఉనికి ఎవరు? అదే ఆత్మ. నీలోని చైతన్యమే ఆత్మ. ఆత్మ ఎప్పుడూ సాక్షిగా ఉంటుంది. నీ బాల్యం, నీ ఎదుగుదల, నీలో వచ్చే మార్పులు ఇవన్నీ ఎవరికి తెలుస్తున్నాయి? నీ చిన్నప్పటి జీవితం, ప్రస్తుత జీవితం ఎవరికి తెలుస్తోంది. మార్పును చూసేది మారని నీ ఆత్మే కదా!

– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

తాత్త్వికకథ

మిడిసిపాటు

ఒక ఊర్లో ఓ బలవంతుడైన యువకుడు ఉండేవాడు. తన శరీరాన్ని చూసి జనం భయపడుతుండటంతో అతడిలో గర్వం మొదలయ్యింది. దాంతో చిన్నాపెద్దా, ఆడామగా తేడా చూడకుండా ఊర్లోవాళ్ళని ఏడిపించడం ప్రారంభించాడు.

తనకు అందరూ భయపడాల్సిందేనని, తను చేయలేని పని ఏదీ లేదని ఇష్టానుసారం వ్యవహరించేవాడు. ఒకరోజు వ్యవసాయం పని మీద పక్క ఊరికి వెళ్ళాడు. అతడు వస్తున్నది చూసి అందరూ వెళ్ళి ఇండ్లల్లో దాక్కొన్నారు.

అదే ఊరి దగ్గర బిడ్డను గట్టుపైన పడుకోబెట్టి వరిపొలంలోని కలుపు మొక్కలను ఏరి పారేస్తోంది ఓ మహిళ. ఆ బలవంతుడి రాకను ఆమె గమనించలేదు. తన పనిలో తాను లీనమై ఉంది. లేత ఎండ గట్టు మీద ఉన్న బిడ్డపై పడటంతో ఆ బిడ్డ ఏడుపు లంకించుకున్నాడు. బిడ్డ ఏడుపు పట్టించుకోకుండా ఆ బలవంతుడు ''నేనంటే నీకు భయం లేదా?'' అని అడిగాడు ఆమెను.

ఆ అహంభావి గురించి విని ఉన్న ఆమె అతడి పొగరు తగ్గించడానికి అదే అదనుగా భావించింది.''నేను భయపడటం పక్కన పెట్టు. మొదట నా బిడ్డ ఏడుపు ఆపించు చాలు'' అంది. 'అదెంత పని' అని అతడు ఆ బిడ్డ ముందర కెళ్ళి నిలబడ్డాడు. బిడ్డను భయపెడుతూ రకరకాల విన్యాసాలు చేశాడు. అయితే ఆ బిడ్డ ఏమాత్రం ఏడుపు ఆపలేదు.



ఆశ్చర్యపోతూ అతడు ''ఈ బిడ్డ నన్ను చూసి ఎందుకు భయపడటం లేదు? ఏడుపు ఎందుకు ఆపడం లేదు'' అని అడిగాడు.

ఆమె కొంచెం ధైర్యం తెచ్చుకుని ''నువ్వు ఎవరో, నీ ప్రతాపం ఏమిటో ఈ బిడ్డకు తెలియదు. అందుకే ఈ బిడ్డ నీ బెదిరింపులను పట్టించుకోలేదు. మన గురించి ప్రపంచానికంతా తెలుసనుకుంటే ఎలా? నాలుగు ఊర్లు దాటి పెద్ద నగరాలకు వెళ్తే నువ్వెవరో జనానికి తెలియదు. కొందరు గుర్తించినా, అక్కడ నిన్ను ఢీ కొట్టేవాళ్ళు చాలామంది ఎదురవుతారు. మనం మంచి పనులు చేసి, మంచి పేరు తెచ్చుకుంటే ఇక్కడే కాదు, ఎక్కడైనా చెల్లుబాటవుతాము. ఇప్పటికైనా నీ కండలు చూసుకుని మురిసిపోవద్దు. వయసు ఎల్లకాలం ఉండదని గుర్తుపెట్టుకో.'' అని హితవు పలికింది.

'ఈ విశాల విశ్వంలో మనం సముద్రంలోని ఇసుక రేణువంత. మనకు ఎన్ని ఉన్నా... మిడిసిపాటు వద్దు, మంచితనం ముద్దు' అని గుర్తించి ముందుకు నడిచాడు ఆ బలవంతుడు. ఆమె తన బిడ్డను ఎత్తుకుని ముద్దులాడటంతో ఆ బిడ్డ ఏడుపు ఆపింది.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

అరుదైన గౌరవం



● బాలకృష్ణ

నటుడు బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (యూకే, గోల్డ్ ఎడిషన్)లో ఆయన పేరు నమోదైంది. భారతీయ సినిమా రంగంలో నటుడిగా యాభై సంవత్సరాలు పూర్తి చేసుకుని, ఇంకా నటుడిగా బాలకృష్ణ కొనసాగుతున్నారు. ఇందుకుగాను ఆయన్ను ఈ అవార్డు వరించింది. ఈ నెల 30న హైదరాబాద్‌లో 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సీఈవో సంతోష్ శుక్లా చేతుల మీదుగా బాలకృష్ణకు సత్కారం జరగనుంది. ఇక సినిమాల విషయానికి వస్తే... ప్రస్తుతం 'అఖండ 2' చిత్రం చేస్తున్నారు బాలకృష్ణ. బోయపాటి శీను దర్శకత్వంలోని ఈ సినిమా ఈ ఏడాదే థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.

క్లైమాక్స్‌ని ఎవ్వరూ ఊహించలేరు

– సినిమాటోగ్రాఫర్ కుశేందర్ రమేశ్ రెడ్డి



''తెలుగులోనూ కంటెంట్ బేస్డ్ సినిమాలొస్తాయని 'త్రిబాణధారి బార్బరిక్' నిరూపిస్తుందన్న నమ్మకం మాకు ఉంది. ఈ తరహా చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి. ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచేలా ఈ చిత్రం ఉంటుంది. ఈ చిత్రంలోని ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంది. క్లైమాక్స్‌ని ఎవ్వరూ ఊహించలేరు. అద్భుతమైన క్లైమాక్స్ కుదిరింది'' అని సినిమాటోగ్రాఫర్ కుశేందర్ రమేశ్ రెడ్డి అన్నారు. సత్యరాజ్, ఉదయభాను, వశిష్ఠ ఎన్. సింహా, సత్యం రాజేశ్ క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో మారుతి సమర్పణలో విజయపాల్ రెడ్డి అడిదెల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సినిమాకు 'పొలిమేర, రజాకార్' చిత్రాల ఫేమ్ కుశేందర్ రమేశ్ రెడ్డి కెమెరామేన్‌గా వర్క్ చేశారు. 'త్రిబాణధారి బార్బరిక్' గురించి ఆయన మాట్లాడుతూ– ''ఈ చిత్రానికి ప్రధాన బలం కథ. 'పొలిమేర, రజాకార్' సినిమాల కథలు విన్నప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో ఈ చిత్రకథ విన్నప్పుడూ అలాంటి ఫీలింగే కలిగింది. ఈ సినిమాను ఎక్కువగా రాత్రి పూట, రెయిన్ ఎఫెక్ట్స్‌లోనే షూటింగ్ చేశాం. అయితే వేసవి కాలంలో రెయిన్ సీజన్ ఎఫెక్ట్‌ని చూపించడం అంత సులభం కాదు. ఇదే మాకు పెద్ద సవాల్‌గా అనిపించింది. ఎండాకాలంలో వానాకాలాన్ని సృష్టించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. 'బాహుబలి' దగ్గర్నుంచి సత్యరాజ్ గారితో పరిచయం ఉంది. నైట్ షూట్స్, రెయిన్ ఎఫెక్ట్ సీన్లంటూ మేం ఆయన్ను చాలా ఇబ్బంది పెట్టాం (నవ్వుతూ). ఇక అల్లరి నరేశ్‌గారి '12ఏ రైల్వే కాలనీ' సినిమా చేశాను. ఇటీవలే 'కామాఖ్య' చిత్రీకరణ ప్రారంభమైంది. 'పొలిమేర 3' షూటింగ్ త్వరలోనే ప్రారంభం అవుతుంది. దర్శకుడు అనిల్‌గారితో వరుస సినిమాలు ఉంటాయి'' అని తెలిపారు.

ఏం జరుగుతోంది...

రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో నటించిన లవ్‌స్టోరీ మూవీ 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ చిత్రంలో దీక్షిత్ శెట్టి మరో కీలక పాత్రలో నటించారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. కాగా ఈ సినిమాలోని 'ఏం జరుగుతోంది...' పాట లిరికల్ వీడియోను ఈ నెల 26న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ వెల్లడించి, ఈ సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రాకేందు మౌళి సాహిత్యం అందించిన ఈ పాటను చిన్మయి పాడారు. ''ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌గా 'ఏం జరుగుతోంది...' పాట ప్రేక్షకులను అలరిస్తుంది. అతి త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్.



● దీక్షిత్ శెట్టి, రష్మికా మందన్నా

మకుటం లేని మాఫియా డాన్



● విశాల్

విశాల్ హీరోగా నటిస్తున్న 35వ చిత్రం 'విశాల్ 35' (వర్కింగ్ టైటిల్) టీజర్ విడుదలైంది. సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ పై రవి అరసు దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఆర్బీ చౌదరి నిర్మిస్తున్నారు. అంజలి, దుషారా విజయన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి 'మకుటం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సముద్రం నేపథ్యంలో నడిచే ఓ మాఫియా కథ ఇది అని టీజర్ స్పష్టం చేస్తోంది. ''ఈ చిత్రంలో విశాల్‌ను ప్రేక్షకులు సరికొత్తగా చూడబోతున్నారు. ఇక తాజాగా విడుదల చేసిన టైటిల్ టీజర్‌కి జీవీ ప్రకాశ్‌కుమార్ అందించిన ఆర్ఆర్ అద్భుతంగా ఉంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇతర వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

ఇది నా ఊరు సార్

'నీలాగే ఇతరులను ప్రేమించు... అందరూ నీ కుటుంబమే అనుకో... అదే అన్ని రిలీజియన్స్... అందరు దేవుళ్ళు చెప్పేది...' అన్న డైలాగ్‌తో ప్రారంభం అవుతుంది 'మదరాసి' సినిమా తెలుగు ట్రైలర్. శివ కార్తికేయన్ హీరోగా ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'మదరాసి'. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించగా, విద్యుత్ జమ్వాల్, బిజూ మీనన్, షబీర్ కల్లరక్కల్, విక్రాంత్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. శ్రీ లక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ సెప్టెంబరు 5న రిలీజ్ కానుంది. కాగా ఆదివారం 'మదరాసి' సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల ట్రైలర్స్‌ని విడుదల చేశారు. 'తమిళనాడుకి సిక్స్ కార్గో ట్రక్స్ ఫుల్‌గా లోకల్ మేడ్ ఇల్లీగల్ గన్స్ వస్తున్నాయి... స్టేట్ బోర్డర్‌లోనే ఆపాలి', 'యస్... సార్!', 'నీవల్ల అయితే టచ్ చేయరా..!', 'తుపాకీ ఎవడి చేతిలో ఉన్నా... విలన్ నేనే రా..!', 'ఇది నా ఊరు సార్... నేను వదలను!' అన్న డైలాగ్స్ తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: అనిరుధ్ రవిచందర్.



● శివ కార్తికేయన్

దుబాయ్‌లో గామా అవార్డ్స్

'గామా' (గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్స్) ఐదో ఎడిషన్ ఈ నెల 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో జరగనుంది. ఈ అవార్డ్స్ కార్యక్రమానికి టైటిల్ స్పాన్సర్‌గా వైభవ్ జ్యువెలర్స్ సంస్థ వ్యవహరిస్తోంది. కాగా ఆదివారం హైదరాబాద్‌లో గామా అవార్డ్స్ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 'గామా' సీఈవో సౌరబ్ కేసరి మాట్లాడుతూ–''కమర్షియల్ ఈవెంట్ కాదు ఇది. మా నాన్న (త్రిమూర్తులు)గారికి కళాకారులపై ఉన్న అభిమానంతో 'గామా' అవార్డ్స్‌ను నిర్వహిస్తున్నాం. ఇతర దేశాల్లోనూ గామా అవార్డ్స్ ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ప్రముఖ దర్శకులు ఏ. కోదండరామిరెడ్డి, బి గోపాల్, హీరోయిన్స్ ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి, దక్షా నాగర్కర్, నటుడు వైవా హర్ష, వైభవ్ జ్యువెలర్స్ ఎండి రాఘవ్ మాట్లాడారు.



● మానస, ఫరియా, సౌరబ్, దక్ష

ఇలా చూసుకుంటానే...

అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్ ముఖ్య తారలుగా మున్నా ధూలిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఈ చిత్రంలోని 'ఇలా చూసుకుంటానే' అంటూ సాగే మెలోడీ పాటను రానా దగ్గుబాటి విడుదల చేసి, బాగుందని ప్రశంసించారు. అనూప్ రూబెన్స్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా సిద్ శ్రీరామ్ పాడారు. ''ఈ పాటను జమ్మూ కశ్మీర్, మలేషియాలో చిత్రీకరించాం. త్వరలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.



● రోషిణి, మొయిన్

ఓటీటీ

ఇది చూడొచ్చు

ఇది భావావేశాల అల

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో అరేబియా కడలి సిరీస్ ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.

ఈ ప్రపంచంలో కష్టాల్లేని మనుషులు ఉండరు. లేనివాడైనా, ఉన్నవాడికైనా కష్టమనేది ఎప్పుడూ వెన్నంటే ఉంటుంది. ఆ కష్టాన్ని ధైర్యంగా ఎదుర్కొని జీవించగలిగినవాడే హీరో. అలాంటి హీరోలను వెండితెర మీద మనం ఇప్పటికే ఎన్నో సార్లు చూసుంటాం, చూస్తున్నాం... అలాగే చూడబోతున్నాం. నిజానికి ఆ వెండితెర మీద హీరో పడే కష్టం మన జీవితాల నుండి తీసుకున్నదే. వెండితెర మీద హీరో పాత్రధారి తన కష్టాన్ని ఎదుర్కోవడం రెండు గంటలకు పైగా మన నిజమైన కష్టాన్ని మరిచి ఆనందంగా చూడడమే విడ్డూరం. అలాంటి కొందరి కష్టాన్ని మనకు కళ్ళకు కట్టినట్టుగా చూపే ప్రయత్నం చేశారు 'అరేబియా కడలి' అనే సిరీస్ ద్వారా. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి అందించిన రచనకు దర్శకుడు వీవీ సూర్యకుమార్ తీర్చిదిద్దిన కళా కష్టమే ఈ 'అరేబియా కడలి'. నేటి మేటి విలక్షణ కథానాయకుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో అలరించగా మరో పాత్రకు వర్ధమాన నటి ఆనంది ప్రాణం పోశారు. అంతలా ఆ కష్టం కథేంటో ఓసారి చూద్దాం. ముఖ్యంగా ఇది తీర ప్రాంతాలకు సంబంధించిన జాలర్ల కథ. సముద్రంలోకి తమ ప్రాణాలు పణంగా పెట్టి రోజుల తరబడి చేపల వేటకు వెళ్ళే జాలరుల కష్టాల ప్రతిరూపమే ఈ కథ. సముద్ర తీర ప్రాంతాలలో దగ్గరగా ఉన్న రెండు జాలర్ల గ్రామాలకు ఓ కారణంతో అస్సలు పడదు. కానీ మరో కారణంతో ఆ రెండూళ్ళ నుండి ఒకే పడవలో జాలర్లు వేటకు వెళ్ళవలసి వస్తుంది. అలా వెళ్ళిన ఆ ఓడ తుఫాను కారణంగా పాకిస్తాన్ తీర ప్రాంతానికి చేరుతుంది. అక్కడ ఈ జాలర్లందరినీ పాకిస్తాన్ దేశం బంధించి నానా హింసలు పెడుతుంది. మరి... వారి ఊళ్ళలోనే కలవని వీళ్ళు పరాయి దేశంలో బందీలై తిరిగి భారత దేశానికి వస్తారా? లేదా అన్నది సిరీస్‌లోనే చూడాలి. మొత్తం 8 ఎపిసోడ్లతో కథాంశం పక్కకి పోకుండా ఎంతో చక్కగా తీశారు దర్శకుడు. సముద్రంలో అల ఎంత ఉవ్వెత్తున ఎగిసిపడుతుందో అంతకు మించి మనలోని కష్టం మన భావావేశాలను ప్రతిబింబిస్తుంది అని నొక్కి చెప్పే సన్నివేశాలు ఈ సిరీస్‌లో మెండుగా ఉన్నాయి. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సిరీస్ మంచి కాలక్షేపం.



– హరికృష్ణ ఇంటూరు



చికిత 'పసిడి' గురి

ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి తనిపర్తి చికిత స్వర్ణ పతకంతో మెరిసింది. కెనడాలోని విన్నిపెగ్‌లో ఆదివారం ఈ మెగా ఈవెంట్ ముగిసింది. అండర్-21 మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో చికిత విశ్వవిజేతగా అవతరించింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత ఫైనల్లో 142-136 పాయింట్ల తేడాతో దక్షిణ కొరియాకు చెందిన యెరిన్ పార్క్‌పై విజయం సాధించింది. అంతకుముందు సెమీఫైనల్లో చికిత 142-133తో మెరిలాస్ డియాజ్ (స్పెయిన్)పై, క్వార్టర్ ఫైనల్లో 146-143తో పర్ణీత్ కౌర్ (భారత్)పై గెలుపొందింది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో చికిత 687 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంలో నిలిచి మెయిన్ 'డ్రా'లో నేరుగా రెండో రౌండ్‌కు 'బై' పొందింది. రెండో రౌండ్‌లో చికిత 143-140తో మా యువెన్ (చైనీస్ తైపీ)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 142-138తో జిమెనా ఎస్ట్రాడా (మెక్సికో)పై గెలిచింది. అండర్-21 మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో చికిత, పర్ణీత్ కౌర్, తేజల్‌లతో కూడిన భారత జట్టు క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ 229-232తో టర్కీ చేతిలో ఓడిపోయింది.



భారత షూటర్ల జోరు

ఐశ్వర్య ప్రతాప్ సింగ్‌కు రెండు పతకాలు

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. ఆదివారం సీనియర్ పురుషుల విభాగంలో భారత్‌కు ఒక స్వర్ణం, ఒక రజతం దక్కింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ వ్యక్తిగత విభాగంలో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ స్వర్ణ పతకం నెగ్గగా... టీమ్ విభాగంలో ఐశ్వర్య ప్రతాప్, చెయిన్ సింగ్, అఖిల్ షెరాన్‌లతో కూడిన భారత జట్టుకు రజతం లభించింది. ఫైనల్లో ఐశ్వర్య ప్రతాప్ 462.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెన్‌యు జావో (చైనా; 462) రజతం, నయోవా ఒకాడా (జపాన్; 448.8) కాంస్యం గెలిచారు. చెయిన్ సింగ్ (435.7) నాలుగో స్థానంలో, అఖిల్ (424.9 పాయింట్లు) ఐదో స్థానంలో నిలిచారు. టీమ్ విభాగంలో ఐశ్వర్య ప్రతాప్ (584 పాయింట్లు), చెయిన్ సింగ్ (582 పాయింట్లు), అఖిల్ (581 పాయింట్లు) బృందం మొత్తం 1747 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ వ్యక్తిగత భారత్‌కు చెందిన అడ్రియన్ కర్మాకర్ (463.8 పాయింట్లు) స్వర్ణ పతకాన్ని సాధించాడు. టీమ్ విభాగంలో అడ్రియన్, నితిన్, రోహిత్‌లతో కూడిన భారత బృందం 1733 పాయింట్లతో పసిడి పతకాన్ని నెగ్గింది. ఓవరాల్‌గా భారత్ 26 స్వర్ణాలు, 9 రజతాలు, 11 కాంస్యాలతో కలిపి 46 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

- యూఎస్ ఓపెన్ తొలి రౌండ్ ఫలితాలు
- దక్షిణాఫ్రికాపై 276 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘనవిజయం
- పారిస్‌లో నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీ

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పుజారా గుడ్‌బై

క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత టెస్టు స్పెషలిస్ట్

- అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్లు వెల్లడి





న్యూఢిల్లీ: టీమిండియా టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజారా... అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆటలోని మూడు ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. 2010లో భారత జట్టు తరఫున అరంగేట్రం చేసిన పుజారా... దశాబ్దానికి పైగా సాగిన తన కెరీర్‌లో జట్టుకు ఎన్నో మరపురాని విజయాలు అందించాడు. టెక్నిక్‌కు పెట్టింది పేరైన 37 ఏళ్ల పుజారా కెరీర్‌లో 103 టెస్టులాడి 43.60 సగటుతో 7195 పరుగులు చేశాడు. అందులో 19 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. టెస్టుల్లో గంటల తరబడి క్రీజులో పాతుకుపోయి... ప్రత్యర్థి బౌలర్లను విసిగించడంలో దిట్ట అయిన పుజారా... పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాత్రం ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. కెరీర్‌లో 5 వన్డేలు ఆడిన పుజారా 51 పరుగులు చేశాడు. 2018-19లో ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా తొలిసారి టెస్టు సిరీస్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన పుజారా... 2020-21 దాన్ని నిలబెట్టుకోవడంలోనూ తన విలువ చాటుకున్నాడు. 2023లో చివరిసారిగా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ఆడిన పుజారా... ఆ తర్వాత తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో పేరు ప్రఖ్యాతలు సంపాదించినా... దేశవాళీ మ్యాచ్‌లకు ఎప్పుడూ దూరంకాని పుజారా జట్టులో తిరిగి చోటు దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించినా... సెలెక్టర్లు మరో అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇక తప్పుకోవడమే ఉత్తమమని ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు.

అదే అతిపెద్ద గౌరవం...

అత్యున్నత స్థాయిలో భారత జెర్సీ ధరించడం... జాతీయ గీతం ఆలపించడం... బరిలోకి దిగిన ప్రతిసారీ వంద శాతం ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించడం... ఇవన్నీ మాటల్లో చెప్పలేని అనుభవాలు. అయితే ప్రతి దానికి ముగింపు అంటూ ఉంటుంది. అన్ని ఫార్మాట్ల నుంచి వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నా. ఇన్నాళ్ల కెరీర్‌లో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా బీసీసీఐ, సౌరాష్ట్ర క్రికెట్ సంఘానికి కృతజ్ఞతలు. కెరీర్‌లో ఎదిగేందుకు వారు ఎంతో తోడ్పాటు అందించారు. నా మెంటార్‌లు, కోచ్‌లు, ఆధ్యాత్మిక గురువు, ఇలా అందరి సహకారంతోనే ఈ స్థాయికి వచ్చా. సహచర క్రికెటర్లు, సహాయ సిబ్బంది తోడ్పాటు మరవలేనిది. రాజ్‌కోట్ నుంచి వచ్చిన ఓ కుర్రాడు భారత జట్టులో భాగం కావాలనే కలను నెరవేర్చుకున్నాడు. ఎన్నో అవకాశాలు దక్కాయి. వాటి ద్వారా ఎంతో అనుభవం సాధించా. దేశానికి ప్రాతినిధ్యం వహించడం గౌరవంగా భావిస్తున్నా. ఇక నుంచి కుటుంబానికి మరింత సమయం కేటాయిస్తా.

– వీడ్కోలు సందేశంలో పుజారా

ప్రశంసల వెల్లువ...

స్టార్ బ్యాటర్లు కోహ్లి, రోహిత్‌తో పాటు స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ ఏడాదే టెస్టు క్రికెట్ నుంచి తప్పుకోగా... ఇప్పుడు పుజారా కూడా ఆ జాబితాలో చేరిపోయాడు. పుజారా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఓవరాల్‌గా 21,301 పరుగులు చేశాడు. రాహుల్ ద్రవిడ్ టెస్టు క్రికెట్ నుంచి తప్పుకున్న అనంతరం 'నయా వాల్'గా గుర్తింపు పొందిన అతడు... మూడో స్థానంలో బరిలోకి దిగి ఎన్నో మరపురాని ఇన్నింగ్స్‌లు ఆడాడు. కెరీర్‌కు వీడ్కోలు పలికిన పుజారాకు అభినందనలు వెల్లువెత్తాయి. 'నువ్వు మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వెళ్లడం చూసినప్పుడల్లా ఎంతో ధైర్యంగా ఉండేది. ప్రశాంతంగా ఆడే తీరు టెస్టు క్రికెట్‌పై నీ ప్రేమను చూపించేది. చక్కటి టెక్నిక్, అంతకుమించిన ఓర్పు, ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ జట్టుకు వెన్నెముకగా నిలచేవాడివి. 2018లో ఆస్ట్రేలియాలో టీమిండియా టెస్టు సిరీస్ నెగ్గడంలో నీ పాత్ర ఎంతో ఉంది. జీవితంలో కొత్త చాప్టర్ మరింత ఆస్వాదించాలని ఆకాంక్షిస్తున్నా' అని సచిన్ ట్వీట్ చేశాడు. టీమిండియా కోచ్ గంభీర్, మాజీ ఆటగాళ్లు యువరాజ్, సెహ్వాగ్, లక్ష్మణ్, కుంబ్లే, రవిశాస్త్రితో పాటు బీసీసీఐ, సౌరాష్ట్ర క్రికెట్ సంఘం రహానే, గిల్, పుజారాకు అభినందనలు తెలిపారు.

పుజారా కెరీర్ గణాంకాలు

	టెస్టు	వన్డే
ఆడిన మ్యాచ్‌లు	103	5
ఆడిన ఇన్నింగ్స్	176	5
చేసిన పరుగులు	7195	51
అత్యధిక స్కోరు	206 నాటౌట్	27
నాటౌట్	11	0
సగటు	43.60	10.20
సెంచరీలు	19	0
అర్ధసెంచరీలు	35	0
ఫోర్లు	863	4
సిక్స్‌లు	16	0
క్యాచ్‌లు	66	0

స్టయిలే వేరు!

గంటల తరబడి క్రీజులో పాతుకుపోగల నైపుణ్యం... సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడగల ఆత్మస్థయిర్యం! ఒత్తిడిని చిత్తు చేయగల దృఢ సంకల్పం... ప్రత్యర్థుల సహనాన్ని పరీక్షించగల మనోధైర్యం! ఒక్క మాటలో చెప్పాలంటే... నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం!!

క్రీజులో అడుగుపెట్టింది తడువు ఓ మహాయజ్ఞానికి పూనుకున్నట్లు... పిచ్, పరిస్థితులు, ప్రత్యర్థులు ఇలా వేటితో సంబంధం లేకుండా తన కర్తవ్యాన్ని వందకు రెండొందల శాతం నిర్వర్తించిన టీమిండియా టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజారా కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆస్ట్రేలియా గడ్డపై కంగారూ పేసర్ల బాడీలైన్ బౌలింగ్‌తో ఇబ్బంది పెట్టినా... ఇంగ్లండ్ పిచ్‌లపై అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ వంటి వాళ్ల స్వింగ్‌తో ఊరించినా... వికెట్ విలువ గుర్తెరిగి ప్రత్యర్థులకు టీమిండియాకు మధ్య అడ్డుగోడలా నిలిచిన పుజారా జట్టుకు ఎన్నో మరపురాని విజయాలు అందించాడు. విరాట్ కోహ్లి లాంటి కవర్ డ్రైవ్‌లు, రోహిత్ శర్మ లాంటి పుల్ షాట్‌లు, రిషబ్ పంత్ వంటి ఫాలింగ్ హుక్ షాట్‌లు ఆడగల సామర్థ్యం లేకున్నా... కేవలం తన సహనంతోనే సుదీర్ఘ కాలం జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఘనత పుజారాది. ఫోర్లు, సిక్స్‌ల రూపంలో కొలవలేని గొప్పతనం అతడిది. సెంచరీలు, డబుల్ సెంచరీలు వివరించలేని ఆటతీరు అతడిది. టి20లు రాజ్యమేలుతున్న తరుణంలోనూ సంప్రదాయ క్రికెట్‌కే పెద్దపీట వేస్తూ... సుదీర్ఘ ఫార్మాట్‌కు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చిన అతడి ఘనతలను స్ట్రయిక్‌రేట్‌తో సరితూచడం సాధ్యం కానిది. 2018-19లో ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా తొలిసారి టెస్టు సిరీస్ గెలవడం వెనక దాగిఉన్న పుజారా అకుంఠిత దీక్షను లెక్కించేందుకు కొలమానాలు లేవనడం అతిశయోక్తి కాదు. 1258 బంతులు ఎదుర్కొన్న అతడు 521 పరుగులతో సిరీస్ అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. ఇక 2021 బ్రిస్బేన్ టెస్టులో ఆస్ట్రేలియాపై అతడు కనబర్చిన పోరాటపటిమ ముందు ఎన్ని త్రిశతకాలైన దిగదుడుపే. తొలి ఇన్నింగ్స్‌లో 94 బంతులాడిన పుజారా... రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా 211 బంతులు ఎదుర్కొని 56 పరుగులు సాధించిన వైనాన్ని ఏ క్రీడాభిమాని మరవగలడు. అతడి వికెట్ పడగొట్టడం సాధ్యంకాని ఆసీస్ పేసర్లు బాడీలైన్ బౌలింగ్‌తో విజృంభించినా... వెన్నుచూపకుండా వికెట్ల ముందు వీరుడిలా నిలిచిన తీరును ఏ గణాంకాలతో లెక్కించగలం! ఒకటా రెండా... జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఎన్నో సార్లు విలువైన ఇన్నింగ్స్‌లతో గట్టెక్కించిన పుజారా ఆటకు అల్విదా చెప్పాడు. అతడి స్థానాన్ని భర్తీ చేసేదెవరో చూడాలి మరి!

–సాక్షి క్రీడా విభాగం

భవిత

స్వర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ చరిత్ర » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో జనరలిస్ట్ ఆఫీసర్లు

ప్రభుత్వ బ్యాంక్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త. ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంక్, పుణె ప్రధాన కార్యాలయంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర .. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో జనరలిస్ట్ ఆఫీసర్ (స్కేల్-II)2025 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో... ఎన్ని ఖాళీలున్నాయి? ఎవరు అర్హులు, ఎంపిక విధానం, పరీక్ష విధానం, జీతభత్యాలు తదితర వివరాలు..

» మొత్తం 500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులు
» ఆన్‌లైన్ పరీక్ష , ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక



- పోస్టు పేరు: జనరలిస్ట్ ఆఫీసర్(స్కేల్-II).
- మొత్తం పోస్టుల సంఖ్య: 500.(ఎస్సీ-75, ఎస్టీ-37, ఓబీసీ-135, ఈడబ్ల్యూఎస్-50, యూఆర్-203, పీడబ్ల్యూబీడీ-20).

అర్హత

కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ/ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ(ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 55% మార్కులు) లేదా చార్టర్డ్ అకౌంటెంట్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అవసరం. సీఎంఏ/సీఎఫ్ఏ/ఐసీడబ్ల్యూఏ, జేఏఐఐబీ/సీఏఐఐబీ ఉత్తీర్ణత ఉన్న వారు కూడా దరఖాస్తుకు అర్హులు.

వయసు

అభ్యర్థులు 31.07.2025 నాటికి 22 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు 10 నుంచి 15 ఏళ్ల వయోసడలింపు ఉంటుంది.

వేతనం

ఎంపికైన వారికి అన్ని అలవెన్సులు కలిపి నెలకు రూ.64.820 నుంచి రూ. 93,960 వేతన రూపంలో అందుతుంది.

ఎంపిక ప్రక్రియ

రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.

150 మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష

మొత్తం 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (20 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (20 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ(20 మార్కులు), ప్రొఫెషనల్ నాలెడ్జ్(90 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు నెగిటివ్ మార్కు ఉంటుంది. ఒకవేళ ప్రశ్నకి సమాధానం రాయకపోయినా, ప్రశ్న విడిచిపెట్టినా ఆ ప్రశ్నలకు నెగిటివ్ మార్కింగ్ ఉండదు. పరీక్ష వ్యవధి 2 గంటలు.

ఇంటర్వ్యూ

రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూ మొత్తం 100 మార్కులకు ఉంటుంది. రాతపరీక్ష, ఇంటర్వ్యూ తర్వాత యూఆర్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు కనీసం 40 శాతం అర్హత మార్కులు సాధించాలి.

ఆన్‌లైన్ పరీక్షలో రాణించేలా

తొలుత సిలబస్‌ను సమగ్రంగా పరిశీలించాలి. అనంతరం పాత ప్రశ్న పత్రాలను విశ్లేషించాలి. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు. ఏ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో గమనించాలి.

రీజనింగ్ ఎబిలిటీ

రీజనింగ్ ఎబిలిటీలో స్కోర్ కోసం కోడింగ్- డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్, పజిల్స్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ఇనిక్వాలిటీస్, డేటా సఫిషియన్సీ తదితర అంశాలపై పట్టు సాధించాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగంలో మంచి మార్కుల కోసం అర్థమెటిక్, నంబర్ సిరీస్, సింప్లిఫికేషన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి. 8, 9, 10వ తరగతి గణితం పాఠ్యపుస్తకాల ద్వారా ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత సాధ్యమైనన్ని గత ప్రశ్నలు, మోడల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లోనే ఎక్కువ స్కోర్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, గ్రామర్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. వొక్యాబులరీ, సెంటెన్స్ కరెక్షన్, క్లోజ్‌టెస్ట్, సెంటెన్స్ రీ-అరేంజ్‌మెంట్, జంబుల్డ్ సెంటెన్సెస్, మిస్‌స్పెల్ట్ వర్డ్స్ తదితరాలపై ప్రశ్నలు వస్తాయి

దరఖాస్తు ఫీజు

జనరల్ అభ్యర్థులు రూ.1000 + జీఎస్టీ రూ.180 కలిపి మొత్తం రూ.1180 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు రూ. 100 + జీఎస్టీ రూ.18 కలిపి మొత్తం రూ.118 చెల్లిస్తే సరిపోతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 13.08.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.08.2025.
- రాతపరీక్ష, ఇంటర్వ్యూ తేదీలు త్వరలో ప్రకటిస్తారు.
- వెబ్‌సైట్: https://bankofmaharashtra.in

విద్య, ఉద్యోగ సమాచారం



టీఎంసీ, ముంబైలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు

ముంబైలోని టాటా మెమోరియల్ హాస్పిటల్(టీఎంసీ) ఒప్పంద ప్రాతిపదికన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డీఎంఎల్‌టీ/ఎంఎల్‌టీ/పీజీడీఎంఎల్‌టీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. » వయసు: 30 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.25,510 నుంచి 32,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» ఇంటర్వ్యూ తేది: 01.09.2025.
» ఇంటర్వ్యూ వేదిక: హెచ్‌ఆర్‌డీ డిపార్ట్‌మెంట్, ఔట్ సోర్సింగ్ సెల్, నాలుగో అంతస్తు, సర్వీస్ బ్లాక్ బిల్డింగ్, టాటా మెమోరియల్ హాస్పిటల్, డా.ఈ. బోర్గెస్ రోడ్, పరేల్, ముంబై-400012.
» వెబ్‌సైట్: https://tmc.gov.in

ఎన్టీపీసీలో 20 ఫిజిషియన్ పోస్టులు

ఎన్టీపీసీ లిమిటెడ్‌లో ఫిజిషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 20.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/డీఎన్‌బీ జనరల్ మెడిసిన్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 37 ఏళ్లు ఉండాలి.
» వేతనం:నెలకు రూ.70,000 నుంచి 2,00,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 26.08.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.09.2025
» వెబ్‌సైట్: https://careers.ntpc.co.in

ఎన్టీపీసీలో 15 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు

ఎన్టీపీసీ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (హ్యూమన్ రిసోర్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 15.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా లేదా ఎంబీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 9.9.2025 నాటికి 29 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.40,000 నుంచి 1,40,000
» ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 26.08.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.09.2025
» వెబ్‌సైట్: https://careers.ntpc.co.in

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ బోర్డులో 615 పోస్టులు

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు(డీఎస్ఎస్ఎస్‌బీ) వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 615.
» పోస్టుల వివరాలు: స్టాటిస్టికల్ క్లర్క్-11, అసిస్టెంట్ పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్-78, మేసన్-58, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్-02, జూనియర్ డ్రాఫ్ట్స్‌మెన్(ఎలక్ట్రిక్)-06, టెక్నికల్ సూపర్‌వైజర్(రేడియాలజీ)-09, బైలిఫ్-14, నాయబ్ తహశీల్దార్-01, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్-09, సీనియర్ ఇన్వెస్టిగేటర్-07, ప్రోగ్రామర్-02, సర్వేయర్-19, కన్జర్వేషన్ అసిస్టెంట్-01, అసిస్టెంట్ సూపరింటెండెంట్-95, స్టెనోగ్రాఫర్-01, అసిస్టెంట్ లైబ్రేరియన్-01, జూనియర్ కంప్యూటర్ ఆపరేటర్-01, చీఫ్ అకౌంటెంట్-01, అసిస్టెంట్ ఎడిటర్-01, కేర్‌టేకర్-114, ఫారెస్ట్ గార్డ్-52.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: స్టాటిస్టికల్ క్లర్క్, అసిస్టెంట్ పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఫారెస్ట్ గార్డ్‌కు 18 నుంచి 27 ఏళ్లు, మేసన్‌కు 20 నుంచి 32 ఏళ్లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌కు 30 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు మేసన్, స్టాటిస్టికల్ క్లర్క్‌కు రూ.19,900 నుంచి రూ.63,200, అసిస్టెంట్ పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్‌కు రూ.25,500 నుంచి రూ.81,100, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400, ఫారెస్ట్ గార్డ్‌కు రూ.21,700 నుంచి రూ.69,100.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, పీఈటీ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 18.08.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.09.2025
» వెబ్‌సైట్: https://dsssb.delhi.gov.in

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు నాన్-కంబాటెంట్ పోస్టులు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయు నాన్-కంబాటెంట్ నియామకానికి(ఇన్‌టేక్ 01/2026) నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక వాయుసేన కేంద్రాల్లో హాస్పిటాలిటీ -హౌస్‌కీపింగ్ విభాగాల్లో ఖాళీల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
» అర్హత: అభ్యర్థులు మెట్రిక్యులేషన్/పదో తరగతి లేదా తత్సమాన విద్యార్హతలు ఉండాలి. అవివాహిత పురుషులు మాత్రమే అర్హులు. నోటిఫికేషన్‌లో తెలిపిన ప్రకారం ఎత్తు, బరువు, ఛాతీ శారీరక ప్రమాణాలు ఉండాలి.
» వయసు: 21 ఏళ్లు మించకూడదు.
» వేతనం: మొదటి ఏడాది నెలకు రూ.30,000+ ఇతర అలవెన్సులు.
» ఎంపిక విధానం: దరఖాస్తుల పరిశీలన, రాతపరీక్ష, స్కిల్/ప్రాక్టికల్ టెస్ట్, శారీరక సామర్థ్య పరీక్ష, వైద్య పరీక్షలు ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరితేది: 01.09.2025.
» వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	694	81,307
నిఫ్టీ ▽	214	24,870

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,496	△	396
డోజోన్స్	45,632	△	846
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,321	△	12
డాక్స్	24363	△	70
షాంఘై	3,826	△	55
నికాయ్	42,633	△	23

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్


ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.95	87.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.80	118.75
€	యూరో	ఎస్‌బీఐ	100.10	102.85
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.13	59.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.51	57.55
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.99	69.38
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.46	23.98
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.96	24.97
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.32	13.14

రుణం భారమా... 'రాజీ' ఉందిగా!

చెల్లించలేకపోతే రాజీ చేసుకోవడమే ఏకైక మార్గం

- లోన్ సెటిల్‌మెంట్‌తో బయటపడొచ్చు
- బాకీలో 50 శాతం వరకు తప్పదు
- రుణ చరిత్రపై దీర్ఘకాలం పాటు మచ్చ
- తర్వాత రుణం లభించడం కష్టం



ఎన్నో అవసరాలకు నేడు అరువు ఆధారంగా మారుతోంది. రుణంపై ఖరీదైన కొనుగోళ్లకు సైతం వెనుకాడడం లేదు. ఈఎంఐతో చిన్నగా తీర్చేయొచ్చులే అన్న ధీమా కనిపిస్తోంది. కానీ, ఉన్నట్టుండి ఉద్యోగం కోల్పోతే..? లేదంటే ప్రమాదం/వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల కారణంగా ఆర్థిక పరిస్థితులు తలకిందులై.. రుణం తీర్చడం కష్టంగా మారితే? ఈ రిస్క్‌ను రుణం తీసుకునే ముందు ఎవరూ ఆలోచించడం లేదు. ఒకవేళ రుణం చెల్లించలేని క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్లినప్పుడు ఉన్న ఏకైక మార్గం.. రాజీ (సెటిల్‌మెంట్) చేసుకోవడమే. ఇది ఎలా పనిచేస్తుంది..? రుణ చరిత్రపై దీని ప్రభావం ఎలా ఉంటుంది? తదితర విషయాలతో కూడిన కథనమిది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

రుణ వాయిదాలను సకాలంలో చెల్లించకపోవడం వల్ల అసలుకు వడ్డీ తోడవుతుంది. దీనిపై పెనాల్టీ తదితర చార్జీలు కూడా పడతాయి. సకాలంలో రుణాన్ని చెల్లించాల్సిన బాధ్యత రుణగ్రహీతలపై, దీన్ని చట్టబద్ధంగా వసూలు చేసుకునే హక్కు రుణదాతలకు ఉంటుంది. అసాధారణ పరిస్థితులు ఎదురై రుణాన్ని సకాలంలో చెల్లించలేని పరిస్థితుల్లో వన్‌టైమ్ లోన్ సెటిల్‌మెంట్ (రుణ పరిష్కారం) కోసం అభ్యర్థించొచ్చు. రుణం ఇచ్చిన బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ ఇందుకు అనుమతిస్తే.. చెల్లించాల్సిన మొత్తం చాలా వరకు తగ్గిపోతుంది. కానీ, దీని కారణంగా తర్వాతి కాలంలో రుణం పొందడం కష్టంగా మారొచ్చు. "వ్యక్తిగత రుణం, వాహన రుణం, గృహ రుణం, విద్యా రుణం, వ్యాపార రుణం, క్రెడిట్ కార్డు రుణం తదితర రుణాల్లో సెటిల్‌మెంట్‌కు వెళ్లొచ్చు. రుణాన్ని పరిష్కరించుకునే ముందు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన అంశాలు కొన్ని ఉన్నాయి. ఇది క్రెడిట్ స్కోరుపై, ఆర్థిక భవిష్యత్‌పై గణనీయమైన ప్రభావం చూపిస్తుంది" అని ఎంపాకెట్ (ఇన్‌స్టంట్ లోన్ ప్లాట్‌ఫామ్) వ్యవస్థాపకుడు, సీఈవో గౌరవ్ జలాన్ వివరించారు.

రుణ పరిష్కారం అన్నది అంతిమ ఆప్షన్‌గానే ఉండాలన్నది నిపుణుల సూచన. నెలవారీ చెల్లింపులు చేయలేక రుణ ఎగవేత పరిస్థితుల్లోకి వెళ్లినప్పుడే లోన్ సెటిల్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని 'బేసిక్ హోమ్ లోన్' సంస్థ సీఈవో అతుల్ మోంగా సూచించారు. దీనివల్ల చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సిన అవసరం తప్పుతుందన్నారు. ప్రధానంగా.. "అన్ సెక్యూర్డ్ రుణాలైన వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు, వ్యాపార రుణాల విషయంలో రుణ పరిష్కారాన్ని పరిశీలించొచ్చు. అదే సమయంలో సెక్యూర్డ్ కిందకు వచ్చే గృహ రుణాలు, ఆటో రుణాలు లేదా ప్రాపర్టీపై రుణాలు, బంగారంపై రుణాల పరిష్కారానికి దూరంగా ఉండాలి. ఎందుకంటే తనఖాలో ఉన్న వాటిని రుణదాతలు స్వాధీనం చేసుకుంటారు" అని మైమనీ మంత్ర డాట్ కామ్ వ్యవస్థాపకుడు, ఎండీ రాజ్ ఖోస్లా పేర్కొన్నారు.

తగ్గే భారం ఎంత?



రుణం తీర్చే అవకాశం లేనప్పుడు పరిష్కారం మాత్రం ఎందుకు? అని సందేహించొచ్చు. చట్టపరమైన చర్యలకు దూరంగా ఎంతో కొంత చెల్లించి భయపడే మార్గం దీంతో లభిస్తుంది. దీనివల్ల మానసిక నిశ్చింత లభిస్తుంది. సెటిల్‌మెంట్‌తో తగ్గే భారం ఎంత? అన్న దానికి ఇతమిద్ధమైన సూత్రం ఏమీ లేదు. రుణం ఇచ్చిన సంస్థతో బేరసారాలు.. నియమ, నిబంధనలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రుణగ్రహీత చెల్లింపుల సామర్థ్యాలపైనే ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా అధిక వడ్డీ భారం ఉండే క్రెడిట్ కార్డు, వ్యక్తిగత రుణాల విషయంలో సెటిల్‌మెంట్‌తో చెప్పుకోతగ్గ భారం తగ్గుతుంది. రుణగ్రహీత తన ఇబ్బందికర పరిస్థితుల గురించి రుణదాతకు సమర్థవంతంగా వివరించగలిగితే.. పాక్షిక చెల్లింపులకు బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ అంగీకరించొచ్చు. అవకాశం ఉంటే పూర్తి మొత్తంతో పరిష్కరించుకోవడం మెరుగైన ఆప్షన్ అవుతుందని నిపుణుల సూచన. మొత్తం బకాయి ఎంత? దానిపై వడ్డీ భారం ఎంత? చర్చల సామర్థ్యంపైనే తుదకు ఎంత మొత్తం చెల్లించాలన్నది ఆధారపడి ఉంటుందని అతుల్ మోంగా తెలిపారు. అసలు రుణం కంటే కొంచెం ఎక్కువగాను.. అసలు, వడ్డీ అన్ని చార్జీలు మొత్తం కంటే తక్కువ చెల్లించే పరిష్కారానికి వీలుంటుంది.

"ఏక మొత్తంలో చెల్లిస్తారు గనుక మొత్తం బకాయిలో తక్కువకే రుణ దాతలు అంగీకరిస్తారు. ఒకవేళ పాక్షిక చెల్లింపులకు సైతం కటకట ఎదుర్కొంటుంటే.. మొత్తం బకాయిలో 25 శాతం లేదా 30 శాతం చెల్లించే ప్రతిపాదన చేయొచ్చు. మీరు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి రుణ దాతకు వివరించాలి. దీంతో చెల్లించాల్సిన మొత్తం 30–50 శాతానికి పరిమితం అవుతుంది" అని విద్యా రుణాల పంపిణీ సంస్థ 'ప్రొపెల్డ్' వైస్ ప్రెసిడెంట్ రవికిషోర్ గోయల్ తెలిపారు. చెల్లించాల్సిన మొత్తం భారీగా ఉండి, చెల్లించే సామర్థ్యం చాలా తక్కువగా ఉంటే మరింత తక్కువ మొత్తానికి లోన్ సెటిల్ చేసుకునేందుకు అభ్యర్థించొచ్చని ఖోస్లా సూచించారు. బకాయిలో 10 నుంచి 50 శాతం మధ్య చెల్లింపులు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. సాధారణంగా రుణదాతలు బకాయిలో 50 శాతానికి పైన చెల్లించే పరిష్కారానికి అంగీకరిస్తుంటారని.. అయినప్పటికీ, సాధ్యమైనంత తక్కువకు పరిష్కారం కుదుర్చుకునేందుకు ప్రయత్నం చేయొచ్చని సూచించారు. సమీప కాలంలో ఆర్థిక పరిస్థితులు కుదుటపడే అవకాశం లేని పరిస్థితుల్లోనే లోన్ సెటిల్‌మెంట్‌ను పరిశీలించాలన్నారు. కొన్ని సందర్భాల్లో ఒకే విడత కాకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు ఒకటికి మించిన వాయిదాల్లో చెల్లించే పరిష్కారం సైతం కుదుర్చుకునేందుకు అవకాశం ఉంటుంది.

క్రెడిట్ స్కోరుపై ప్రభావం



రుణాన్ని సెటిల్ చేసుకున్న తర్వాత ఆ సమాచారాన్ని బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ క్రెడిట్ బ్యూరోలకు అందిస్తాయి. 'సెటిల్డ్' లేదా 'సెటిల్డ్ ఫర్ లెస్ దెన్ ద ఫుల్ అమౌంట్' (అసలు కంటే తక్కువ మొత్తంతో పరిష్కారం) అంటూ బ్యాంక్‌లు తెలియజేస్తాయి. రుణ గ్రహీత క్రెడిట్ రిపోర్ట్‌లోకి ఇదే సమాచారం చేరుతుంది. సెటిల్డ్ అకౌంట్‌కు సంబంధించిన సమాచారం ఏడేళ్ల వరకు క్రెడిట్ రిపోర్ట్‌లో కొనసాగుతుంది. సెటిల్డ్ అని ఉంటే రుణం తిరిగి చెల్లించే సామర్థ్యం లేమిని సూచిస్తుంది. కనుక క్రెడిట్ స్కోరుపై గణనీయమైన ప్రభావమే పడుతుంది. దీంతో భవిష్యత్తులో అవసరానికి రుణం లభించదు. ఒకవేళ రుణం లభించినా ఇతరులతో పోల్చితే చెల్లించాల్సిన వడ్డీ రేటు చాలా ఎక్కువగా ఉంటుంది. రుణ బకాయిని పూర్తిగా చెల్లించినట్టయితే క్రెడిట్ రిపోర్ట్‌లో అది క్లోజ్డ్ (ముగిసినట్టు) అని ఉంటుంది.

మరో రుణం పుడుతుందా?

రుణాన్ని పరిష్కరించుకున్నాక చేయాల్సిన మొదటి పని, తిరిగి తమ క్రెడిట్ స్కోర్‌ను పునర్‌నిర్మించుకోవడం. తిరిగి మరో రుణం తీసుకునేందుకు కనీసం రెండేళ్లయినా విరామం ఇవ్వాలన్నది నిపుణుల సూచన. అప్పటి వరకు ఏ రుణం కోసం విచారణ చేయొద్దు. రుణ విచారణలు సైతం క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం చూపిస్తాయి. రుణ పరిష్కారం చేసుకున్న వారు సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు తీసుకోవడం మంచి ఆలోచన. అంటే ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై జారీ చేసే క్రెడిట్ కార్డు. ఈ కార్డుపై 30–50 రోజుల కాలానికి వడ్డీ లేని రుణ సదుపాయం లభిస్తుంది. ఈ కార్డు మొత్తం లిమిట్‌లో 50 శాతం మించకుండా క్రమశిక్షణతో వినియోగిస్తూ, సకాలంలో చెల్లింపులు చేస్తూ వెళ్లాలి. దీనివల్ల రెండేళ్ల కాలంలో క్రెడిట్ స్కోరు బలపడుతుంది. తద్వారా గతంలో చేసుకున్న రుణ పరిష్కారం తాలూకు ప్రభావాన్ని అధిగమించొచ్చు.

మధ్యవర్తుల సాయం..

రుణ గ్రహీతల తరఫున రుణ పరిష్కారం కోసం బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలతో చర్చలు నిర్వహించేందుకు డెట్ కౌన్సిలర్ లేదా డెట్ సెటిల్‌మెంట్ ఏజెన్సీ సేవలు సైతం అందుబాటులో ఉన్నాయి. రుణ పరిష్కారం గురించి ఎలాంటి అవగాహన లేని వారు, ఎలా మాట్లాడాలో తెలియని వారు ఈ తరహా సేవలను పొందొచ్చు. "నిపుణుల సాయం తీసుకోవడం వల్ల స్పష్టమైన ప్రయోజనాలు లభిస్తాయి. సంప్రదింపుల్లో డెట్ సెటిల్‌మెంట్ కంపెనీలు ఎంతో అనుభవం కలిగి ఉంటాయి. రుణ గ్రహీత తరఫున మెరుగైన ప్రయోజనాలతో కూడిన పరిష్కారాన్ని చూడగలవు" అని గౌరవ్ జలాన్ తెలిపారు. అంగీకార పత్రాలు సంబంధిత డాక్యుమెంట్ల పని కూడా సులభతరం అవుతుందన్నారు. ఇలాంటి సేవలు అందించే కంపెనీల చార్జీలు ఎక్కువగా ఉంటాయి. కనుక అందుబాటు ధరలపై అందించే సంస్థలను చూసుకోవడం ముఖ్యం. కొన్ని సంస్థలు ఫ్లాట్ ఫీజు వసూలు చేస్తుంటే, కొన్ని బకాయిలో 15–25% వరకు తీసుకుంటాయని మోంగా తెలిపారు. ఇలాంటి సంస్థల సేవలను పొందే ముందు వాటి విశ్వసనీయతను ధ్రువీకరించుకోవాలి.



చివరి ఎంపికే..



క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపిస్తుంది కనుక లోన్ సెటిల్‌మెంట్ అన్నది చివరి ఎంపికగానే ఉండాలి. దీనికంటే ముందు రుణ బకాయి మొత్తాన్ని చెల్లించే మార్గాలను పరిశీలించాలి. రుణదాతతో చర్చించుకుని, కొంత కాలం పాటు మారటోరియం (విరామం/6–12 నెలలు) కోరొచ్చు. ఈ లోపు ఆర్థిక పరిస్థితులను గాడిన పెట్టుకుని రుణ బకాయిని వడ్డీ సహా చెల్లించే వెసులుబాటును పరిశీలించాలి. లేదంటే దీర్ఘకాలానికి రుణాన్ని పునర్వ్యవస్థీకరించి, తక్కువ నెలసరి వాయిదాలతో చెల్లించే పరిష్కారం కుదుర్చుకోవచ్చు. ఏవైనా ఆస్తులు ఉంటే విక్రయించి చెల్లించడం మెరుగైన మార్గం అవుతుంది. అవసరమైతే కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల సాయంతో గట్టెక్కే మార్గం చూడొచ్చు. ఏ విధంగా చూసినా అవకాశం లేనప్పుడు రుణ పరిష్కారానికి వెళ్లొచ్చు.

ఇవి గుర్తుంచుకోండి...

కొన్ని వేల రూపాయిల బకాయి కోసం లోన్ సెటిల్‌మెంట్ కోరడం అస్సలు సూచనీయం కాదు. ఎంత కష్టమైనా సరే చెల్లించడమే మెరుగైన ఆప్షన్ అవుతుంది. రుణ బకాయి వ్యక్తి వార్షిక ఆదాయంలో 20–30 శాతం ఉన్నప్పుడు లోన్ సెటిల్‌మెంట్ ఆప్షన్ ఎంపిక చేసుకుని క్రెడిట్ స్కోరులో రాజీ పడవద్దని ఖోస్లా సూచించారు.

- లోన్ సెటిల్‌మెంట్‌లో భాగంగా అంగీకారం మేర చెల్లింపులు చేసిన తర్వాత మిగిలిన మొత్తాన్ని రుణ దాత మాఫీ చేస్తారు. దాంతో చట్టపరంగా ఇకమీదట చెల్లించాల్సిన బాధ్యత ఉండదు.
- రుణ పరిష్కారం కంటే దివాలా పిటిషన్ దాఖలు చేయడమే తేలిక కదా అని అనుకోవద్దు. దివాలాతో రుణాలకు శాశ్వతంగా దారులు మూసుకుపోయినట్టు అవుతుంది. దీనికంటే సెటిల్‌మెంట్ నయం.
- కొన్ని బ్యాంక్‌లు లేదా ఎన్‌బీఎఫ్‌సీలు తక్కువ మొత్తం చెల్లింపులకు అంగీకరించకపోవచ్చు.
- రుణం చెల్లించకుండా లేదా పరిష్కారం కుదుర్చుకోకుండా కాలయాపన చేస్తే బ్యాంక్‌లు/ఎన్‌బీఎఫ్‌సీలు చట్టపరమైన చర్యలు మొదలు పెడతాయి. రుణగ్రహీతలపై కోర్టులో సివిల్ కేసు దాఖలు చేస్తాయి. కొన్ని సందర్భాల్లో క్రిమినల్ కేసు దాఖలు చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. దీనివల్ల లేనిపోని చార్జీల భారం నెత్తిన పడుతుంది.
- సకాలంలో వసూలు కాని రుణ ఖాతాలను బ్యాంక్‌లు/ఎన్‌బీఎఫ్‌సీలు థర్డ్ పార్టీ సంస్థలకు అప్పగించొచ్చు. దీనివల్ల వారి నుంచి కఠిన వసూళ్ల చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-8-2025	
విశాఖ	535–00
చిత్తూరు	558–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495–00
వరంగల్	497–00
రిటైల్ ధర	5.55

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

క్యూ1 జీడీపీపై మార్కెట్ కన్ను | అనిల్ అంబానీపై బీవోఐ 'ఫ్రాడ్' ముద్ర

న్యూ ఫండ్ ఆఫర్

ఏంజెల్ వన్.. రెండు గోల్డ్ ఫండ్స్



ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా గోల్డ్ ఈటీఎఫ్, గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్‌లను (ఎఫ్‌వోఎఫ్) ప్రవేశ పెట్టింది. గోల్డ్ ఈటీఎఫ్ సెప్టెంబర్ 2తో, ఎఫ్‌వోఎఫ్ సెప్టెంబర్ 3తో ముగుస్తుంది. దేశీయంగా పసిడి ధరలను ట్రాక్ చేసే ఈ ఫండ్స్.. పుత్తడిలో సులభతరంగా ఇన్వెస్ట్ చేసే సాధనాలుగా ఉపయోగపడతాయి. ఈటీఎఫ్‌లో రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. డీమ్యాట్ లేకుండానే పసిడిలో ఇన్వెస్ట్ చేసేందుకు ఫండ్ ఆఫ్ ఫండ్ ఉపయోగపడుతుంది. ఇందులో రోజుకు రూ. 250 నుంచి సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేయొచ్చు. మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ ప్రకారం దేశీయంగా పసిడి ఆధారిత ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ మార్కెట్, 2024 జూలైలో రూ. 34,455 కోట్లుగా ఉండగా 2025 జూలై నాటికి రూ. 67,634 కోట్లకు పెరిగింది.

యాక్సిస్ నిఫ్టీ 500 క్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్..



దేశీయంగా అత్యంత నాణ్యమైన యాభై కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసేందుకు వీలుగా నిఫ్టీ500 క్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్‌ను యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ప్రవేశపెట్టింది. ఇందులో సెప్టెంబర్ 4 వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. నిఫ్టీ 500 నుంచి ఎంపిక చేసిన యాభై స్టాక్స్ ఈ సూచీలో ఉంటాయి. ఈక్విటీపై అత్యధిక రాబడులు, తక్కువ రుణభారం, స్థిరమైన ఆదాయ వృద్ధిలాంటి అంశాలను స్టాక్స్ ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటారు. ఇందులో కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. 2025 జూలైతో ముగిసిన 15 ఏళ్ల వ్యవధిలో నిఫ్టీ 50 వార్షికంగా 12.1 శాతం వృద్ధి చెందగా, నిఫ్టీ 500 క్వాలిటీ 50 ఇండెక్స్ 15. 6 శాతం వృద్ధి రేటు సాధించినట్లు సంస్థ తెలిపింది.

షేర్ల షో

ష్లాస్ బెంగళూరు | మోర్గాన్ స్టాన్లీ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 420 **టార్గెట్:** రూ. 549

ఎందుకంటే: దేశీయంగా 'లీలా' బ్రాండుతో విలాసవంత హోటళ్లను నిర్వహిస్తున్న ఆతిథ్య రంగ కంపెనీ ష్లాస్ బెంగళూరు. పూర్తిస్థాయిలో లగ్జరీ హోటళ్లను నిర్వహిస్తున్న కొద్దిపాటి కంపెనీలలో ఒకటిగా నిలుస్తోంది. దీంతో అసెట్ హెవీ బిజినెస్‌లో కార్యకలాపాలు విస్తరించిన కంపెనీ నిర్వహణ ఆదాయంలో 93% వరకూ 5 సొంత హోటళ్లనుంచే సమకూర్చుకుంటోంది. కంపెనీకిగల ప్రఖ్యాత హోటళ్ల చారిత్రక ఆర్కిటెక్చర్‌సహా అత్యంత ఆధునిక హంగులతో సేవలు అందిస్తున్నాయి. గదుల అద్దెలు(రేట్లు) మెరుగుపడటంతోపాటు.. అధిక ఆక్యుపెన్సీ కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరాని(2026–27)లో వార్షికంగా నిర్వహణ లాభం(ఇబిటా) 12% వృద్ధి సాధించనున్నట్లు అంచనా. వడ్డీ వ్యయాలు దిగిరావడం ద్వారా నికర లాభం 9 రెట్లు జంప్‌చేసే వీలుంది. ప్రస్తుతం కంపెనీ బ్యాలన్స్‌షీట్ దాదాపు రుణరహితస్థాయికి బలపడింది. ఫలితంగా రానున్న కాలంలో పెట్టుబడి వ్యయాలకు ఫ్రీ క్యాష్ ఫ్లో(ఎఫ్‌సీఎఫ్) దన్నుగా నిలవనుంది. 2027–28కల్లా 475 గదుల సామర్థ్యంతో 5 హోటళ్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో ఒక హోటల్‌ను భాగస్వామ్యం(జేవీ)తో నిర్మిస్తోంది. గతేడాది (2024–25) కంపెనీ ఆర్‌వోసీఈ కనిష్ఠ స్థాయి (7.3%)లో నమోదైంది. అయితే ఆస్తుల విలువను తిరిగి మదింపు చేయడం (రూ.1,300 కోట్లు)తో సర్దుబాటు.. ప్రమోటర్ల పునఃపెట్టుబడుల (రూ.1,200 కోట్లు)తో లభించిన నగదు బ్యాలన్స్ ఆర్‌వోసీఈని 10%కి పెంచుతోంది. 2027 ఈవీ, ఇబిటాతో చూస్తే షేరు 19 రెట్లు అధికంగా కదులుతోంది.

కల్యాణ్ జ్యువెలర్స్ | జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 511 **టార్గెట్:** రూ. 700

ఎందుకంటే: దక్షిణాదిగా కంపెనీగా కార్యకలాపాలు ప్రారంభించిన కల్యాణ్ జ్యువెలర్స్ తదుపరి దశలో దేశవ్యాప్తంగా బిజినెస్‌ను విస్తరించింది. తద్వారా దేశవ్యాప్తంగా బ్రాండ్‌ను పటిష్టపరచుకుంది. స్థానిక పరిస్థితులు, డిమాండుకు అనుగుణంగా ప్రొడక్టులను అందించడం, బిజినెస్‌ను మలచుకోవడం ద్వారా ప్రాంతాలవారీగా కార్యకలాపాలను స్థిరపరచుకుంది. దీంతో దక్షిణాదిమినహా ఇతర ప్రాంతాలలో కంపెనీ పన్నుకుముందు లాభ (పీబీటీ) మార్జిన్లు 2018లో నమోదైన 2.2 శాతం నుంచి 2025కల్లా 4.4 శాతానికి బలపడ్డాయి. విస్తరణలో అనుసరించిన కొత్తతరహా ఫ్రాంచైజీ విధానం స్టోర్ల విస్తరణకు దోహదం చేసింది. దీనిలో భాగంగా నిల్వలు(ఇన్వెంటరీ)సహా స్టోర్లపై పెట్టుబడులను ఫ్రాంచైజీ భాగస్వామి చేపట్టడంతో కంపెనీ పెట్టుబడుల విషయంలో అత్యుత్తమ సామర్థ్యాన్ని కనబరిచేందుకు వీలు చిక్కింది. అయితే ఫ్రాంచైజీ భాగస్వామితో మార్జిన్లను పంచుకోవలసిరావడంతో నిర్వహణ లాభ (ఇబిటా) మార్జిన్లు బలహీనపడ్డాయి. అయినప్పటికీ పన్నుకుముందు లాభం (పీబీటీ) మార్జిన్లు 2027–28కల్లా 5 శాతానికి పుంజుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో 2025–28 కాలంలో వార్షిక ప్రాతిపదికన ఆదాయం 25%, ఇబిటా 23 శాతం, నికర లాభం 31 శాతం చొప్పున పుంజుకోవచ్చని అంచనా వేస్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా(2026–27) పీఈ 45 రెట్లు ప్రాతిపదికన టార్గెట్ ధరను నిర్ణయించాం. అయితే టాటా గ్రూప్ దిగ్గజం టైటాన్ 57 రెట్లు పీఈతో పోలిస్తే తక్కువ విలువ (45 రెట్లు)లోనే టార్గెట్‌కు తెరతీశాం. కల్యాణ్‌తో పోలిస్తే టైటాన్ అత్యధిక మార్జిన్లు, అత్యుత్తమ రిటర్న్ రేషియోలు సాధిస్తుండటం పరిగణనలోకి తీసుకున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

జాయింట్ ఖాతాకు నామినీ అవసరమా..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నా వద్ద రూ.30 లక్షలు ఉన్నాయి. వీటిని మెరుగైన రాబడులు ఇచ్చే సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలన్నది యోచన. ఇందుకు ఎలాంటి సాధనాలను ఎంపిక చేసుకోవాలి?

– వైశాలి సురేంద్రన్

ప్రతీ ఇన్వెస్టర్ తన పెట్టుబడిపై అధిక రాబడి కోరుకోవడం సహజం. కానీ ఇన్వెస్టర్‌గా మీ లక్ష్యం గరిష్ఠ రాబడి ఒక్కటే కాకూడదు. రిస్క్‌ను కూడా తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి. ఈ దృష్ట్యా సరైన పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకోవాలి. కేవలం రాబడి కోణంలోనే పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకుంటే అది నష్టానికి దారితీయవచ్చు. అందుకుని ప్రతీ పెట్టుబడి సాధనంలోనూ ఉండే సానుకూల, ప్రతికూలతలను చూడాలి. ఈక్విటీ పథకాలు స్వల్పకాలంలో అధిక రాబడులు ఇవ్వగలవు. కానీ అది కచ్చితం అని చెప్పలేం. ప్రతికూల పరిస్థితుల్లో స్వల్పకాలంలో నష్టాలనూ ఇస్తాయి. అస్థిరతలు ఎక్కువ. మార్కెట్ ఏ సమయంలో అయినా దిద్దుబాటుకు గురికావచ్చు. మనకు పెట్టుబడులు అవసరమైన అత్యవసర పరిస్థితుల్లో మార్కెట్లు కరెక్షన్‌కు లోనైతే అప్పుడు నష్టానికి అమ్ముకోవాల్సి వస్తుంది. అందుకుని స్వల్పకాలానికి ఈ తరహా రిస్క్‌ను అధిగమించేందుకు డెట్ సాధనాల్లోనూ కొంత మేర ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఈక్విటీ పెట్టుబడులు ఐదేళ్లు, అంతకుమించిన కాలానికి ఉండాలి. ఇక మీ పెట్టుబడులను వివిధ రకాల మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుకోవడం ద్వారా వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ ఏదైనా ఫండ్ బలహీన పనితీరు చూపిస్తే, మరో ఫండ్ మంచి పనితీరుతో రాబడుల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకోవడం మరో మార్గం. ఇందుకు సిప్‌ను ఎంపిక చేసుకోవచ్చు. దీనివల్ల స్వల్పకాలంలో పెట్టుబడులపై మార్కెట్ కరెక్షన్ల ప్రభావాన్ని అధిగమించొచ్చు. ఈక్విటీ, డెట్ సాధనాల మధ్య పెట్టుబడుల వ్యూహమైన అస్సెట్ అలోకేషన్‌ను పాటించాలి. డెట్, ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడంతోనే పని ముగిసినట్టు కాదు. తప్పకుండా ఏడాదికోసారి వాటి పనితీరు ఎలా ఉందన్నది తప్పకుండా సమీక్షించుకోవాలి. మీ లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా డెట్, ఈక్విటీ కేటాయింపుల్లో మార్పులు చేసుకోవాలి.



ఎనీవన్ ఆర్ సర్వైవర్ అనే ఆప్షన్‌తో ఉన్న జాయింట్ బ్యాంక్ ఖాతాకు నామినీ నమోదు అవసరమా?

– జోషి భవేరా

బ్యాంక్ ఖాతా అయినా, పెట్టుబడి అయినా నామినీ నమోదు చేయడం ఎంతో అవసరం. ఎనీవన్ లేదా సర్వైవర్ బ్యాంక్ ఖాతాని ఇద్దరు కంటే ఎక్కువ మంది నిర్వహించొచ్చు. బ్యాంకింగ్ లావాదేవీలపై ఎవరో ఒకరు సంతకం చేస్తే సరిపోతుంది. ఎవరైనా ఒక ఖాతాదారు దురదృష్టవశాత్తూ మరణిస్తే, అప్పుడు ఆ ఖాతాలోని బ్యాలన్స్, వడ్డీని జీవించి ఉన్న ఖాతాదారుకు చెల్లిస్తారు. ఆ తర్వాత అదే ఖాతాను కొనసాగించుకోవచ్చు. ఒకవేళ ఏ ఖాతాదారుడూ జీవించి లేకపోతే, ఆ ఖాతాకు నామినీ నమోదు చేసి లేకపోతే.. అప్పుడు ఖాతాదారుడి వారసులు అన్ని రకాల పత్రాలు సమర్పించిన అనంతరం అందులోని బ్యాలన్స్‌ను క్లెయిమ్ చేసుకోగలరు. నామినీని నమోదు చేయడం వల్ల అనుకోని పరిస్థితుల్లో అవి సాఫీగా బదిలీ అయ్యేందుకు వీలుంటుంది. అందుకని ఎనీవన్ లేదా సర్వైవర్ ఖాతాకు సైతం నామినీ నమోదు చేసుకోవడం అనవసర సమస్యలను తప్పిస్తుంది.

ఫీజుల పెంపా? కుదింపా?

ఇంజనీరింగ్ ఫీజులపై నేటి నుంచి కసరత్తు

ఎఫ్ఆర్‌సీ ముందుకు ప్రైవేటు కాలేజీలు

కొత్త మార్గదర్శకాల ప్రకారం పరిశీలన

జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులపై దృష్టి

ఎఫ్ఆర్‌సీ ఆడిటర్లను మార్చే యోచన

మరోవైపు ప్రైవేటు కాలేజీల అంతర్మథనం

వచ్చేవారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చ!



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజుల పెంపు అంశాన్ని రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఎఫ్ఆర్‌సీ) సోమవారం నుంచి తిరిగి పరిశీలించనుంది. అన్ని డాక్యుమెంట్లతో హాజరవ్వాలని ఇప్పటికే 180 కాలేజీలకు నోటీసులు పంపింది. తొలి రోజు 20 కాలేజీలతో చర్చించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ ప్రక్రియ వచ్చే నెల 3వ తేదీ వరకు కొనసాగుతుంది. 2025–28 బ్లాక్ పీరియడ్‌కు ఇంజనీరింగ్ కాలేజీల్లో వివిధ కోర్సులకు ఫీజులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఆరు నెలల క్రితమే మొదలైంది. కాలేజీల డాక్యుమెంట్లు, ఆడిట్ రిపోర్టులను కమిటీ పరిశీలించింది. కాలేజీలతో చర్చించి ప్రతిపాదిత ఫీజులతో నివేదికను ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం అందుకు అంగీకరించకుండా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని వేసింది. ఈ కమిటీ సూచనల మేరకు కాలేజీల ఫీజుల వ్యవహారాన్ని మరోసారి ఎఫ్ఆర్‌సీ విచారిస్తోంది.

ప్రైవేటు కాలేజీలకు టెన్షన్

కాలేజీల్లో నాణ్యత ప్రమాణాలను కొత్తగా మార్గదర్శకాలుగా తీసుకుంటున్నారు. ఇందుకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు ఉన్న కాలేజీలను గుర్తించాల్సి ఉంటుంది. దీనిపై కాలేజీ యాజమాన్యాల్లో గుబులు మొదలైంది. కొన్ని కాలేజీలకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు ఉన్నా గతంలో ఎప్పుడూ ఫీజుల పెంపునకు వీటిని కొలమానంగా తీసుకోలేదు. ఈ ర్యాంకులు లేకున్నా, తక్కువ స్థాయిలో ఉన్నా నిర్ణీత ఫీజుకు కత్తెర కూడా వేసే అవకాశం ఉందని యాజమాన్యాలు భయపడుతున్నాయి. కొన్ని కాలేజీలు న్యాక్ ర్యాంకు కోసం కూడా ప్రయత్నించలేదు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు టాప్ కాలేజీలకు మాత్రమే వస్తున్నాయని యాజమాన్యాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో పెద్ద కాలేజీలకే న్యా యం జరుగుతుందని, చిన్న కాలేజీలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

ఆడిట్ లెక్కలపై సందేహాలు

గత మూడేళ్ల జమా ఖర్చులను కాలేజీలు ఎఫ్ఆర్‌సీకి ఇప్పటికే సమర్పించాయి. వీటిని ఆడిట్ విభాగాలు పరిశీలించాయి. అయితే, కాలేజీల్లో ఆడిట్ చేసినవారితో ఎఫ్ఆర్‌సీ ఆడిటర్లకు సంబంధాలున్నాయని, ఇప్పుడు వారిని మార్చే అవకా శం ఉందని చెబుతున్నారు. మౌలిక వసతులకు చే సిన ఖర్చు, ఫ్యాకల్టీకి చెల్లించిన వేతనాలు డిజిటల్ విధానంలో చూపించా లని ఎఫ్ఆర్‌సీ కోరే అవ కాశం ఉంది. అయితే దాదా పు 85 కాలేజీల వద్ద ఇలాంటి ఆధారాలు లేవని సమాచారం. దీంతో ఈ కాలేజీల ఫీజుల్లో కోత పడుతుందా? అనే సందేహాలు యాజమాన్యాల్లో కలుగుతున్నాయి. లేబొరేటరీలు, ప్లేస్‌మెంట్లను కూడా ఫీజుల పెంపునకు కొలమానంగా తీసుకోబోతున్నారని తెలిసింది. అయితే, కొన్నేళ్లుగా కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదు. ఆఫ్ క్యాంపస్ నియామకాలే జరుగుతున్నాయి. పెద్ద కాలేజీల్లో విద్యార్థు లు క్యాంపస్ ఉద్యోగాలకు ప్రయత్నించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని ఎంతవరకు పరిగణనలోనికి తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

భవిష్యత్ కార్యాచరణపై కాలేజీల కసరత్తు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్‌సీ ముందు హాజరైనా.. భవిష్యత్ కార్యాచరణపై ఉమ్మడిగా ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు భావిస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం మొదటి వారం రోజులు ఎఫ్ఆర్‌సీ ముందు హాజరయ్యే వాటిల్లో ఒక మోస్తరు కాలేజీలున్నాయి. వీటి పట్ల కమిటీ ఎలా వ్యవహరిస్తుంది? ఏయే అంశాలను పరిగణనలోనికి తీసుకుంటుంది? ఫీజులు పెంచుతారా? తగ్గిస్తారా? అనే అంశాలను పరిశీలించాలని నిర్ణయించాయి. దీని ఆధారంగా వచ్చేవారం సమావేశమై చర్చించాలని నిర్ణయించినట్టు ఓ కాలేజీ ప్రతినిధి తెలిపారు. అవసరమైతే న్యాయ పోరాటం చేయడమా? ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమా? ఏదీ కాకపోతే సమ్మెకు వెళ్లడమా? అనే అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

బాబు ముఠా బార్ల దందా

టీడీపీ సిండికేట్‌కు ఏకపక్షంగా అన్నింటినీ కట్టబెట్టే కుట్ర **ఇతరులు దరఖాస్తులు చేయకుండా అడ్డుకుంటున్న వైనం**

పోలీసుల బెదిరింపులు.. టీడీపీ రౌడీల వేధింపులు

840 బార్లకు దాదాపు 2 వేల రిజిస్ట్రేషన్లు.. కానీ ఏడు రోజుల్లో వచ్చింది కేవలం 32 దరఖాస్తులే

చివరి రెండు రోజుల్లో సిండికేట్ సభ్యులే దాఖలు చేసేలా స్కెచ్..

మరింత లాభాల మార్జిన్, రాయితీలు పొందేందుకు పన్నాగం

వారితో ఇండెంట్ పెట్టించి ప్రభుత్వమే మద్యం కొనుగోలు చేసేలా వ్యూహం.. ఇదే పెద్ద స్కామ్

2014-19 మధ్య దోపిడీకి మించి ఇప్పుడు కొల్లగొట్టేలా కుతంత్రం..

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

కమ్యూనిస్టు యోధునికి.. ప్రముఖుల తుది నివాళి















ఆలయ ముఖ మండపంలో శ్రీస్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

యాదగిరికొండ.. భక్తులతో కిటకిట

యాదగిరిగుట్ట/బీబీనగర్: యాదగిరిగుట్ట భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవురోజు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో కొండపైకి చేరుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, క్యూకాంప్లెక్స్, మాడ వీధుల్లో భక్తులు అధికంగా కనిపించారు. భక్తులు అధికంగా తమ సొంత వాహనాల్లో రావడంతో కొండపైన బస్టాండ్ ప్రాంతంలో, వీఐపీ పార్కింగ్‌లో కార్లు భారీగా నిండిపోయాయి. శ్రీలక్ష్మీ నరసింహస్వామి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమ యం పట్టింది. 45వేల మందికి పైగా భక్తులు మొక్కులు తీర్చు కున్నారు. కాగా వివిధ పూజలతో శ్రీనృసింహుడి ఆలయానికి నిత్యాదాయం రూ.55,16,706 వచ్చినట్టు ఆలయాధికారులు వెల్లడించారు.


గూడూరు టోల్‌ప్లాజా వద్ద వరంగల్ వైపు నిలిచిన వాహనాలు

టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పరిధిలో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి మార్గంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఇరువైపులా వాహనాల రద్దీ నెలకొంది. వీకెండ్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు సాగించడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు టోల్ బూత్‌ల గుండా బారులుదీరాయి. ఫాస్టాగ్ స్కానింగ్ త్వరగా కాకపోవడం.. బూత్‌లలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో వాహనాలు ఆలస్యంగా కదిలాయి.



డిష్‌తో కోతులకు ఇక డిష్యూం..

రోజు రోజుకూ పల్లెల్లో కోతుల బెడద ఎక్కువై పోతోంది. నిత్యం ఇళ్లపై సంచరిస్తూ పెంకులు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో వాటితో వేగలేని జనాలు కాపలా కాయాల్సి వస్తోంది. ఇండ్లపై ఏర్పాటు చేసుకున్న టీవీ డిష్ యాంటెన్నాలను సైతం కోతులు పీకి పడేస్తున్నాయి. దీనివల్ల మళ్లీ డిష్ యాంటెన్నాను ఏర్పాటు చేసుకోవడానికి వందలు, ఒక్కో సారి వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి గ్రామానికి చెందిన మల్లేశం ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నారు. పాత సైకిల్ టైర్‌కు పదునైన ఇనుప మేకులు గుచ్చి, డిష్ యాంటెన్నా చుట్టూ అమర్చాడు. ఇక అప్పటి నుంచి డిష్ యాంటెన్నా వైపు కోతులు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదని మల్లేశం చెపుతున్నారు.

– మిరుదొడ్డి (దుబ్బాక)



మావోయిస్టుల డంప్ లభ్యం

భారీగా ఆయుధాలు స్వాధీనం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా మేటగూడ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు ఆదివారం మావోయిస్టుల భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి. కోబ్రా 203 బెటాలియన్ బలగాలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా డంప్ కనిపించిందని, అందులో కంట్రీమేడ్ తుపాకులు, బీజీఎల్ రాకెట్ లాంచర్లతో పాటు భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసు ఉన్నతాధికా రులు తెలిపారు.

సిరిసిల్ల ‘సెస్’కు రూ.101.77 కోట్లు చెల్లించాలి

- రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలు మాఫీ చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కేటీఆర్ లేఖ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యుత్ పంపిణీ సేవలందించే సెస్ (సహకార విద్యుత్ సరఫరా సంఘం)కు ప్రభుత్వం వెంటనే రూ.101.77 కోట్ల బకాయిలు చెల్లించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరారు. ఈ మేరకు కేటీఆర్ ఆయనకు సుదీర్ఘ లేఖ రాశారు. సిరిసిల్లలోని పవర్‌లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు. పవర్‌లూమ్ కార్మికులు, ఆసాములపై పడుతున్న రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలను ప్రభుత్వం మాఫీ చేసి, వస్త్ర పరిశ్రమకు రావాల్సిన రూ.101.77 కోట్ల విద్యుత్ సబ్సిడీని విడుదల చేయాలని కోరారు.

నేతన్నలకు ఆత్మహత్యలే శరణ్యం

సిరిసిల్లలో సుమారు 25వేల పవర్‌లూమ్‌లు నడుస్తున్నాయని లేఖలో వివరించారు. బతకలేక ఆత్మహత్యలే శరణ్యం అనుకున్న సిరిసిల్ల నేతన్నల తలరాత మార్చేందుకు గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల పథకం తీసుకొచ్చామని గుర్తు చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లతో నేతన్నలకు చేతి నిండా పని దొరకడంతోపాటు స్థిరమైన ఆదాయం లభించిందని తెలిపారు. ప్రస్తుతం పవర్‌లూమ్ యూనిట్లు ఎదుర్కొంటున్న సమస్యలు కార్మికులను తిరిగి ఆత్మహత్యల వైపు నెడుతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.



కుటీర పరిశ్రమలపై భారం

సిరిసిల్లలో కుటీర పరిశ్రమలుగా వస్త్రోత్పత్తి రంగాన్ని పరిగణిస్తూ.. పవర్‌లూమ్స్‌కు 50 శాతం విద్యుత్ టారిఫ్ సబ్సిడీ పొందుతున్న యూనిట్లు, అవగాహన లోపంతో ఎస్ఎస్ఐ యూనిట్లుగా మారడంతో ‘సెస్’పరిధిలో పరిశ్రమల-3 కేటగిరీ కిందకు వచ్చాయని కేటీఆర్ వివరించారు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాలతో 127 ఎస్ఎస్ఐ యూనిట్లకు, 191 ఇతర యూనిట్లకు మొత్తం రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలు పడ్డాయని తెలిపారు. ఈ భారీ మొత్తాన్ని చెల్లించే స్థితిలో కార్మికులు లేరన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పవర్‌లూమ్స్‌కు ప్రభుత్వం నుంచి ‘సెస్’సంస్థకు రావాల్సిన రూ.101.77 కోట్ల సబ్సిడీ విడుదల కాకపోవడంతో విద్యుత్ పంపిణీ సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని కేటీఆర్ తెలిపారు. టీజీఎన్‌పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన విద్యుత్ కొనుగోలు ఖర్చులను కూడా ‘సెస్’సంస్థ చెల్లించలేకపోతుందని వివరించారు.

నేతన్నలను ఆదుకోవడం తక్షణ అవసరం

నేత కార్మికులను ఆదుకోవడానికి, వారి జీవనోపాధిని కాపాడటానికి ప్రభుత్వం స్పందించాలన్నారు. బకాయిలు మాఫీ చేసి, సబ్సిడీలను విడుదల చేసి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని, ఇది తక్షణ అవసరంగా భావించాలని భట్టి విక్రమార్కకు కేటీఆర్ తన లేఖలో కోరారు.

‘లక్ష’ణంగా పెళ్లి!

భారీగా ఖర్చు చేస్తున్న జనం

- వివాహాన్ని తీపిగుర్తుగా మార్చేందుకు ఎంతైనా వ్యయం
- పెళ్లికార్డు నుంచి రిసెప్షన్ వరకు అంతా డబ్బుమయం
- రూ.25 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య వెచ్చింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పెళ్లిని జీవితంలో తీపి గుర్తుగా మార్చేందుకు ప్రజలు ఎంతైనా ఖర్చు చేస్తున్నారు. పెళ్లి కార్డు నుంచి మొదలుపెడితే విందు వరకు భారీగా ఉండేలా చూసుకుంటున్నారు. తమ స్థాయిని బట్టి ఘనంగా కనిపించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఒకప్పుడు వారం రోజుల వేడుక జరిపినా అవ్వని ఖర్చు.. నేడు ఒక్క రోజు పెళ్లికి అంతకుమించి వెచ్చిస్తున్నారు. ఒకరిని చూసి ఒకరు ఆడంబరాలకు పోతూ కొందరు అప్పులపాలవుతుంటే.. మరికొందరు ఉన్నంతలో సర్దుకుంటున్నారు. ఒక్క పెళ్లి చేయడానికి జీవితాన్ని వెచ్చిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వివాహ వేడుకలో మార్పులు వచ్చాయి. అంతే స్థాయిలో ఖర్చులు పెరిగాయి. నేడు జరుగుతున్న కల్యాణాలకు ప్రజలు పెడుతున్న ఖర్చు.. వేడుకలపై ప్రత్యేక కథనమిది.

అంతా భారీగానే..

పెళ్లి ముహూర్తం ఖరారు కాగానే మొదట గుర్తుకొచ్చేది పెళ్లికార్డు. దీనికి తమ స్థాయిని బట్టి ఖర్చు చేస్తున్నారు. ఒక్కొక్క కార్డు తక్కువగా రూ.10 నుంచి మొదలుపెడితే.. రూ.వెయ్యి వరకు మార్కెట్‌లో లభిస్తున్నాయి. మధ్య తరగతి ప్రజలు సైతం పెళ్లికార్డు కొంచెం భారీగానే వెచ్చిస్తున్నారు. మరికొందరు డిజిటల్ ఇన్విటేషన్ కోసం ప్రత్యేకంగా షూటింగ్స్ చేస్తున్నారు. దీన్ని నిమిషం వ్యవధిలో ఉండే వీడియోగా ఎడిట్ చేసి బంధువులు, స్నేహితులకు సోషల్‌మీడియా వేదికగా ఆహ్వానిస్తున్నారు. ఇందుకు ఫొటోగ్రాఫర్‌కు ప్రత్యేకంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ఇటీవల ప్రీ వెడ్డింగ్ షూటింగ్స్ కోసం.. దూరప్రాంతాలకు వెళ్లి అందమైన ప్రాంతాల్లో వీడియో రికార్డింగ్ చేస్తున్నారు. ఇందుకోసం తక్కువకు తక్కువగా.. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చిస్తున్నారు. పెళ్లి వేడుక మొత్తం చిత్రీకరణకు ఫొటో, వీడియోగ్రాఫర్లకు సుమారు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించాలి.



ఐదు రోజుల వేడుక

ఎంగేజ్‌మెంట్ నుంచి మొదలుకొని మంగళస్నానాలు, సంగీత్, పెళ్లి, రిసెప్షన్ కార్యక్రమాలను ఐదు రోజుల్లో నిర్వహిస్తున్నారు. ఇందుకు ఫంక్షన్‌హాల్‌తోపాటు వంటలు, వడ్డించేవారు, ముస్తాబు చేసేవారు(బ్యూటీషియన్స్), బ్యాండ్‌బాజా, టెంట్‌హౌస్ నిర్వాహకులను ముందస్తుగా మాట్లాడుకొని వేడుకను విజయవంతంగా చేసేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు. వంటలకు అవసరమైన సామగ్రి, వంటలు తయారు చేసేవారు, వడ్డించే వారికి తక్కువకు తక్కువగా రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. వీరితోపాటు బ్యూటీషియన్స్‌ను ప్రత్యేకంగా తెప్పించుకుంటుండడంతో.. రోజుకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లిస్తున్నారు. ఇలా ఆడంబరాల కోసం అదనపు ఖర్చు చేయాల్సి వస్తోంది.

బట్టలు..నగలు

పెళ్లికూతురి పెళ్లి బట్టలకే రూ.50 వేలు పెట్టాల్సి వస్తుండగా, తల్లిదండ్రులు, బంధువుల కోసం మరో రూ.50 వేలు వెచ్చిస్తున్నారు. ఇదే ఖర్చు పెళ్లికొడుకు వాళ్లు కూడా పెడుతున్నారు. పెళ్లి ముహూర్తం పెట్టినప్పటి నుంచి ఈ ఖర్చులు మొదలవుతున్నాయి. బంగారు నగల కోసం లక్షల్లోనే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. మధ్యతరగతి కుటుంబాలు సైతం పెళ్లికూతురికి కనీసం 10 తులాల బంగారు ఆభరణాలు చేయిస్తున్నారు. అంటే రూ.10 లక్షల వరకు నగలపైనే ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇలా పెళ్లి ఖరారైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు మధ్యతరగతి కుటుంబాలు తక్కువలో తక్కువగా.. రూ.25 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న వారైతే.. రూ.కోటి వరకు ఖర్చు చేస్తున్నారు. పెళ్లి ఖర్చులు తిరిగి రావని తెలిసినా సమాజంలో తమకంటూ గుర్తింపు రావాలని ఎంత ఖర్చుకైనా వెనకాడడం లేదు. అయితే ఈ క్రమంలోనే స్థిరమైన ఆదాయం ఉన్న కుటుంబాలైతే ఆర్థికంగా ఇబ్బంది పడనప్పటికీ.. మధ్యతరగతి, దిగువ తరగతి వారు మాత్రం అప్పులపాలవుతున్నారు. ఆ అప్పులను తీర్చేందుకు జీవితకాలాన్ని వెచ్చిస్తున్నారు.

బంధువులే అన్నీ చేసేవారు..



మా కాలంలో ఫొటోలు, వీడియోలేవీ లేవు. పంతులు పెట్టిన ముహూర్తానికి పెళ్లి చేసేటోళ్లు. పెళ్లి కోసం ఒక్క రోజు ముందుగానే పెళ్లికొడుకును అమ్మాయి వాళ్ల ఊరికి తీసుకొచ్చేవాళ్లు. ఇప్పటి లాగా వంటవాళ్లు, టెంట్ వేసేటోళ్ల కోసం ఖర్చులు ఉండేవి కావు. బంధువులు వారం రోజుల ముందే ఇంటికొచ్చి అన్ని పనులు చేసేటోళ్లు. కట్నం కింద ఆవు, దూడ, సైకిల్, గడియారం, రేడియో ఇచ్చేటోళ్లు. అమ్మాయికి బంగారంతో పుస్తెలతాడు చేయించేటోళ్లు. మా కాలంలో చాలా తక్కువ ఖర్చుతో సాదాసీదాగా పెళ్లిళ్లు జరిగేవి.

– మందాటి రాంబాయి, అక్కపల్లి

భారీగా కనిపించేందుకు..



పెళ్లిని భారీగా జరిపేందుకు ఎంత డబ్బు అయినా ఖర్చు చేస్తున్నారు. ఎంగేజ్‌మెంట్ నుంచి మొదలుకొని రిసెప్షన్ వరకు ప్రతీ ఈవెంట్‌ను గ్రాండ్‌గా చేసుకుంటున్నారు. దీనికి తగ్గట్టే డెకరేషన్, డ్రెస్సింగ్, ఫొటోషూట్స్‌కు ఖర్చు చేస్తున్నారు. దీంతోనే ఈనాటి పెళ్లిళ్లలో ఖర్చు పెరిగిపోతుంది.

– ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్

సంస్కృతి మారుతోంది



ఒకప్పుడు బియ్యం, జొన్నలు కలిపిన అక్షింతలు వేసుకునేవారు. ఇప్పుడు ఫొటోగ్రఫీ కోసం రంగురంగులు కనిపించేలా థర్మకోల్, ప్లాస్టిక్ బాల్స్ కలిపిన అక్షింతలు వేస్తున్నారు. ఫొటోల కోసం కాలయాపన చేస్తూ ముహూర్తానికి పెళ్లి జరగనివ్వడం లేదు. గతంలో పసుపు ముట్టుడు కార్యక్రమం ఇంటి ఆడబిడ్డలతో చేయించేవారు. ప్రస్తుతం హల్దీ ఫంక్షన్ అంటూ ఘనంగా చేస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ పెళ్లి వేడుక జరుపుకోవాలి.

– బిట్కూరి వేణుగోపాలాచారి, పండితుడు



కల్లు తాగిన కోతి..

మిరుదొడ్డి(దుబ్బాక): పల్లెల్లో కల్లును ఇష్టపడని వారుండరు. కమ్మగా, మత్తుగా ఉండే స్వచ్ఛమైన కల్లు ఆరోగ్యాన్నిస్తుందని గ్రామీణ వాసుల నమ్మకం. ఈత చెట్ల నుంచి ధారాగా వచ్చే కల్లును తేనెటీగలు, ఇతర కీటకాలు సైతం ఆస్వాదిస్తుంటాయి. కాగా, మేమేం తక్కువ అనుకున్నాయేమో కోతులు.. గీత కార్మికులు కల్లు కుండలను చెట్ల నుంచి దింపిన తర్వాత చెట్ల నుంచి కారుతున్న కల్లు రుచిని ఆస్వాదిస్తున్నాయి. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో ఓ ఈత చెట్టు నుంచి బొట్టు బొట్టుగా రాలుతున్న కల్లును కోతులు ఇలా జుర్రుతున్న దృశ్యాన్ని ‘సాక్షి’కెమెరా క్లిక్‌మనిపించింది.

శ్రీవారి దర్శనానికి 5 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 83,858 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,034 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.93 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

నేడు వరాహస్వామి జయంతి

తిరుమల: ఆదివరాహక్షేత్రమైన తిరుమలలోని శ్రీ భూ వరాహస్వామివారి ఆలయంలో సోమవారం వరాహ జయంతి జరగనుంది. ఇందులో భాగంగా ఉదయం కలశ స్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేయనున్నారు. ఆ తరువాత పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లు, వివిధ రకాల పండ్లతో తయారు చేసిన పంచామృతంతో వేదోక్తంగా మూలవర్లకు ఏకాంతంగా అభిషేకం నిర్వహించనున్నారు.

కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

మద్దిలో హనుమద్ హోమం



జంగారెడ్డిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమద్ హోమం ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మా.. కోర్కెలు నెరవేర్చమ్మా



కై కలూరు: అమ్మా.. కొల్లేటి పెద్దింట్లమ్మా.. మొక్కులు తీర్చుకుంటున్నాం.. మా కోర్కెలు తీర్చమ్మా.. అంటూ భక్తులు అమ్మను ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద సమీప జిల్లాల నుంచి భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున విచ్చేశారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారికి వేడి నైవేద్యాలు, పొంగళ్లను సమర్పించారు.

ఐఐటీ విద్యార్థులకు ఇంటరాక్టివ్ సెషన్


ఏర్పేడు: తిరుపతి ఐఐటీలో మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాల విభాగం సంయుక్తంగా గుజరాత్‌లోని వడోదర ఎంపీ డాక్టర్ హేమాంగ్ జోషితో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీపై విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ప్రజాస్వామ్యం, పాలన, ప్రజా విధానం డైనమిక్స్‌పై చర్చలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, విధాన ఔత్సాహికులకు సూచనలు ఇచ్చారు. ఐఐటీ డైరెక్టర్–ఇన్–చార్జ్ ప్రొఫెసర్ శశిధర్ గుమ్మా పాల్గొని యువతకు సాధికారత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపిందని కొనియాడారు.

సకలజన సార్వత్రిక విద్య

దూరవిద్యలో దూసుకెళ్తున్న ఇగ్నో

- 2022–23లో ఈ వర్సిటీ విద్యార్థుల సంఖ్య 13 లక్షలకుపైనే
- 333 ప్రోగ్రామ్స్ ద్వారా డిప్లొమా, యూజీ, పీజీ డిగ్రీలు
- గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ రిజిస్ట్రేషన్లు
- మొత్తం చేరికల్లో దాదాపు సగం మంది మహిళలే
- చదువుకుంటున్న 11,089 మంది జైల్ ఇన్‌మేట్స్
- ఇగ్నో డిగ్రీలతో ఉద్యోగాల్లో ఎదుగుదల
- ప్లేస్‌మెంట్ డ్రైవ్స్, పూర్వవిద్యార్థుల సమ్మేళనాలతో కొత్త పుంతలు

సాక్షి, అమరావతి: వయోలింగ భేదాల్లేకుండా దేశంలో అవసరమైనవారి విద్య, విజ్ఞానదాహం తీరుస్తోంది ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో). ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర వృత్తుల్లో ఉన్నవారు, రెగ్యులర్‌గా కాలేజీలకు, యూనివర్సిటీలకు వెళ్లి చదువుకోలేని లక్షలాది మందికి దూరవిద్య, ఆన్‌లైన్ లెర్నింగ్ ద్వారా డిగ్రీలను ప్రదానం చేస్తోంది. ఏటికేడాది ఈ విశ్వవిద్యాలయంలో చేరికలు పెరుగుతున్నాయి. 21 స్కూల్ ఆఫ్ స్టడీస్ ద్వారా 67 రీజనల్ సెంటర్లు, 2,257 లెర్నింగ్ సపోర్టు కేంద్రాల ద్వారా దేశవ్యాప్తంగా దూర విద్య, ఆన్‌లైన్‌లో డిప్లొమా, యూజీ, పీజీ డిగ్రీలు ఇగ్నో అందిస్తోంది. 333 అకడమిక్ ప్రోగ్రామ్స్ అందిస్తున్న ఇగ్నో అనేకమంది ఉద్యోగాలు సాధించడంలోను, ఉద్యోగుల కెరీర్ వృద్ధిలోను కీలకపాత్ర పోషిస్తోంది. ప్రత్యేక కేటగిరీ కింద పరిగణించే దివ్యాంగులకు విద్యను చేరువ చేయడమే కాకుండా.. వివిధ కేసుల్లో జైలు జీవితం గడుపుతున్న 'జైల్ ఇన్‌మేట్స్' (ఖైదీలు)ను సైతం విద్యావంతులుగా తీర్చిదిద్దుతోంది. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి వర్సిటీ ఇటీవల విడుదల చేసిన నివేదికలో పలు ఆసక్తికర అంశాలున్నాయి. 2022–23లో 7,13,510 మంది వివిధ కోర్సులకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరితో కలిపి ఆ విద్యాసంవత్సరంలో ఇగ్నోలో 13 లక్షల మందికిపైగా విద్యార్థులున్నారు. 2022–23లో నమోదైనవారిలో పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచే ఎక్కువగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తం చేరికల్లో దాదాపు సగం మంది మహిళలే ఉన్నారు. దివ్యాంగులు 4,227 మంది, ఖైదీలు 11,089 మంది చేరారు.



2022-23లో ఇగ్నోలో నమోదైన విద్యార్థుల వివరాలు

వర్గం	ఉపవర్గం	విద్యార్థుల సంఖ్య
లింగం	పురుషులు	3,65,780
	మహిళలు	3,47,730
ప్రాంతం	పట్టణ	3,49,179
	గ్రామీణ	3,55,364
	కొండ ప్రాంతం	8,967
సామాజికత	జనరల్	3,67,176
	ఓబీసీ	1,95,368
	ఎస్సీ	90,316
	ఎస్టీ	45,542
	ఈడబ్ల్యూఎస్	15,108
ప్రత్యేకం	దివ్యాంగులు	4,227
	జైల్ ఇన్‌మేట్స్	11,089

కెరీర్ వృద్ధికి సోపానం

ఇగ్నో సగటు విద్యార్థులకు దూరవిద్యలో బోధన అందించడమే కాకుండా ఉద్యోగాలు చేస్తూ కెరీర్‌లో ఎదగాలనుకునేవారికి సైతం చేయూతనిస్తోంది. కొన్నేళ్లుగా ఉద్యోగాలు చేసుకుంటూ ఇగ్నోలో ఇతర డిగ్రీలు అభ్యసిస్తున్నవారి సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. 2015–16లో 98,071 మంది ఉద్యోగులు నమోదు చేసుకుంటే.. 2019–20లో 2.28 లక్షల మంది ఉద్యోగులు నమోదు చేసుకున్నారు. తరువాత సంవత్సరం ఈ సంఖ్య 1.30 లక్షలకు తగ్గినా.. 2022–23లో 1.44 లక్షలకు పెరిగింది. సంప్రదాయ విశ్వవిద్యాలయాల మాదిరిగానే ఇగ్నో సైతం తమ సంస్థలో డిగ్రీలు పొందినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పించడానికి చర్యలు చేపడుతోంది. 2022–23లో ఎనిమిది ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహించింది. 2021–22లో 21 శాతం ఉన్న ప్లేస్‌మెంట్స్ రేటు 2022–23లో 30 శాతానికి పెరిగింది. అంతర్జాతీయ ఈ–కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్, ఎస్‌బీఐ లైఫ్, గ్లోబివా, ఇన్సూరెన్స్ దేఖో డాట్‌కామ్ వంటి పలు సంస్థల్లో వీరు ఉద్యోగాలు పొందారు.

ఉద్యోగాలు చేసుకుంటూ ఇగ్నో కోర్సుల్లో చేరినవారి సంఖ్య

సంవత్సరం	సంఖ్య
2015-16	98,071
2016-17	1,10,600
2017-18	1,30,421
2018-19	1,06,070
2019-20	2,28,049
2020-21	1,30,129
2021-22	1,39,384
2022-23	1,44,561

కావాల్సినంత ప్రోత్సాహం

విశ్వవిద్యాలయం కెరీర్ అవగాహన సెషన్లు నిర్వహించడం ద్వారా పరిశ్రమ నిపుణుల కెరీర్ ప్లానింగ్, నైపుణ్య అవసరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తోంది. ఉద్యోగాన్వేషణలో ఉన్న విద్యార్థులకు చేయూత ఇస్తోంది. సీవీ తయారీ, జాబ్ పోర్టల్ వినియోగం, ఇంటర్వ్యూలకు తర్ఫీదు ఇస్తోంది. ఇగ్నో పోర్టల్‌లో 59 వేల కంటే ఎక్కువ మంది పూర్వవిద్యార్థులు నమోదు చేసుకున్నారు. దీని ఆధారంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనాలను నిర్వహించి వివిధ రంగాల్లో విజయం సాధించిన వారితో ప్రేరణ కార్యక్రమాలు అందిస్తోంది. 2022–23లో ఇటువంటి 13 సమ్మేళనాలను నిర్వహించింది. వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో ఉన్నవారు ఆయా రంగాల్లో మరింత ఎదిగేందుకు కూడా ఈ విశ్వవిద్యాలయం తోడ్పాటు ఇస్తోంది.

ఇగ్నో డిగ్రీ ఉపయోగపడిన తీరు

కెరీర్‌పై ప్రభావం	శాతం
ఉద్యోగ ప్రమోషన్	42
జీతం పెంపు	38
ప్రాధాన్యత పోస్టులకు మార్పు	33
మెరుగైన ఉద్యోగ భద్రత	46
వ్యవస్థాపక వెంచర్లు ప్రారంభం	8



- తిరుపతి కొర్లగుంటకు చెందిన ఓ దంపతులకు వివాహమైన 5 ఏళ్లకు మగబిడ్డ జన్మించాడు. పుట్టిన 10 నెలల తర్వాత ప్రతి రోజు ఏడుస్తుండేవాడు. తల్లిదండ్రులు నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించగా డయాబెటీస్ టైప్–2 అని తేలింది. తల్లి, తండ్రికీ మధుమేహం లేదు. కానీ చిన్నారికి ఎలా సంక్రమించిందో అర్థం కాలేదని తల్లిదండ్రులు ఏడవని రోజు లేదు. వైద్యుల సూచనతో నెలకు మూడు సార్లు ఇన్సులిన్ వేయిస్తున్నారు. లేకలేక పుట్టిన బిడ్డకు ఇలా జరిగిందేమిటని తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు.



బాల్యానికి తియ్యని కాటు

మధుమేహం మహమ్మారి విజృంభిస్తోంది. పెద్దలనే కాకుండా చిన్నారులపై తన ప్రతాపం చూపుతూ వేధిస్తోంది. పుట్టకతోనే పసికూనలపై దాడి చేస్తోంది. దీంతో జీవితాంతం సూదిపోటు తప్పడం లేదు. అల్లారుముద్దుగా పెంచుకున్న కన్నబిడ్డలను తల్లిదండ్రులే స్వయంగా ఆసుపత్రులకు తీసుకెళ్లి ఇన్సులిన్ ఇప్పిస్తుండడం కన్నవాళ్లకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఇలాంటి బాధితుల సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరుగుతుండడం అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది.

- పుట్టుకతోనే షుగర్ వ్యాధి బారిన పడుతున్న వైనం
- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న టైప్–1 రోగులు
- వంశపారంపర్యం, ఇన్ఫెక్షన్లు, వైరల్ వ్యాధులే కారణమంటున్న నిపుణులు
- ఇన్సులిన్ తీసుకోవడమే శరణ్యమంటున్న వైద్యులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేధిస్తున్న ఇన్సులిన్ కొరత



తిరుపతి తుడా : జిల్లాలో టైప్–2 డయాబెటీస్‌తో పోటీపడుతూ టైప్–1 డయాబెటీస్ వెంటాడుతోంది. పుట్టకతోనే సంక్రమిస్తూ వేల మంది చిన్నారుల జీవితాలతో ఆడుకుంటోంది. శరీరంలోని క్లోమ గ్రంధిలో ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. అయితే కొన్ని కారణాలతో ఈ గ్రంధిలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే బీటా కణాలను శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ నాశనం చేస్తుంది. దీని కారణంగా రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. దీన్ని టైప్–1గా మధుమేహంగా పిలుస్తారు. సాధారణంగా పిల్లలు, యువతలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. అయితే కొన్ని సార్లు బీటా కణాలను రోగ నిరోధక వ్యవస్థ నిర్వీర్యం చేయడం కాకుండా క్లోమ గ్రంధికి ఏదైనా వ్యాధి సోకినప్పుడు, గాయం అయినప్పుడు బీటా కణాలు నిర్వీర్యమవుతాయి. దీని బారిన పడిన వారికి క్రమం తప్పకుండా ఇన్సులిన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కొంత మందికి వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు. మరికొంత మందికి పలు రకాల ఇన్ఫెక్షన్లు, వైరల్ వ్యాధులు, ఇతర ప్రమాదకర అనారోగ్యాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడవచ్చు. ఆహారం, జీవనశైలి అలవాట్లు టైప్–1 డయాబెటీస్‌కు కారణాలు కావు.

ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్సులిన్ కొరత



ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్సతో పాటు టైప్–1 డయాబెటీస్‌కు ఇన్సులిన్ ఉచితంగా అందించాల్సి ఉంది. అయితే జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులలో అరకొరగా ఇన్సులిన్ అందిస్తున్నారు. మండల కేంద్రాలలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలోనూ ఇన్సులిన్ పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో వ్యయ ప్రయాసల కోర్చి బాధిత చిన్నారుల తల్లిదండ్రులు పట్టణ ప్రాంతాలలోని ప్రైవేటు హాస్పిటళ్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో చిన్నారికి వ్యాధి తీవ్రతను బట్టి నెలకు సుమారు రెండు నుంచి నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో నెలకు సుమారు రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు ఖర్చు అవుతోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నొప్పి తక్కువగా ఉండే ఇన్సులిన్ పెన్నుల ద్వారా ఇంజెక్షన్ వేస్తున్నారు. వీటి ఖరీదు సాధారణ ఇన్సులిన్ కంటే రెండు రెట్లు అధికంగా ఉంటుంది.

30 శాతం బాధితులే

జిల్లాలో కోవిడ్ తర్వాత టైప్–1 మధుమేహం విజృంభణ ఎక్కువైంది. జిల్లాలో 30 శాతం మధుమేహ బాధితులు ఉండటం గమనార్హం. ఇందులో టైప్–2 డయాబెటిక్ బాధితులు 90శాతం ఉండగా టైప్–1 బాధితులు 15శాతం ఉన్నట్లు సమాచారం. ఈ లెక్కన టైప్–1 డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు సుమారు 25 వేల మందికి పైగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

ఇన్సులిన్‌తో మాత్రమే చికిత్స



కోవిడ్ తర్వాత టైప్–1 డయాబెటీస్ రోగుల సంఖ్య పెరుగుతోంది. గతంలో ఈ వ్యాధి గ్రస్తులు కేవలం 3 నుంచి 5 శాతం మాత్రమే ఉండేది. ఇప్పుడు అది 10 నుంచి 15శాతానికి పెరిగింది. కోవిడ్ వైరస్ నేరుగా బీటా కణాలపై దాడి చేయడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. చిన్నారుల్లో వచ్చే టైప్–1 మధుమేహం ఇన్సులిన్‌తో మాత్రమే చికిత్స అందుబాటులో ఉంది. ఆయాసం, కడుపు నొప్పి, వాంతుల లక్షణాలతో చిన్న పిల్లలను తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకువస్తుంటారు. పరీక్షల నిర్వహించి డయాబెటీస్ నిర్ధారణ అయ్యాక చికిత్స ప్రారంభిస్తాం. వ్యాధి భారిన పడిన పిల్లలకు ఇన్సులిన్‌తో పాటు ఆహార నియమావళి తప్పనిసరిగా పాటించాలి. **–డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, తిరుపతి**

ఏపీఈఆర్‌సీలో ఏక్ నిరంజన్!

- ఒకే ఒక్క సభ్యుడితో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి
- చైర్మన్ పోస్టు భర్తీ చేయకుండానే లీగల్ మెంబర్ నియామక ప్రక్రియ
- ఆ పోస్టుకు రెండు సామాజిక వర్గాల నుంచి ఇద్దరు న్యాయవాదుల పేర్లు
- చైర్మన్ పోస్టుకు ఇప్పటికే ఓ సీనియర్ ఐఏఎస్ పేరు అనధికారికంగా ఖరారు
- లీగల్ సభ్యుడి పోస్టుకూ అదే సామాజికవర్గం వ్యక్తి పేరు ప్రతిపాదన
- తమ సామాజిక వర్గానికి ఇవ్వాలని పట్టుబడుతున్న బాబు సన్నిహితుడు
- ఎటూ తేలక రోజుల తరబడి సీఎం వద్దనే పెండింగ్‌లో ఫైల్

సాక్షి, అమరావతి: స్వయం ప్రతిపత్తితో నిర్ణయాలు తీసుకుని పారదర్శకంగా ప్రజలకు మేలు చేయాల్సిన వ్యవస్థల్లో సైతం కూటమి ప్రభుత్వం రాజకీయాలను చొప్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)లో జరుగుతున్న పరిణామాలే అందుకు తాజా నిదర్శనం. రాజకీయ, సామాజిక వర్గ సమీకరణలు తేలకపోవడంతో లీగల్ మెంబర్ భర్తీ ఫైల్ సీఎం వద్ద పెండింగ్‌లో పడింది!

ఏం జరుగుతోందంటే..

ఒక చైర్మన్, ఇద్దరు సభ్యులు ఉండే ఏపీఈఆర్‌సీకి 2024 అక్టోబర్ నుంచి పూర్తి స్థాయి చైర్మన్ లేరు. ఈ ఏడాది ఫిబ్రవరిలో లీగల్ సభ్యుడు పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఒకే ఒక్కరు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా, సభ్యుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. నెలల తరబడి సాగదీత తరువాత ప్రభుత్వం లీగల్ సభ్యుడి నియామక ప్రక్రియ చేపట్టింది. జూన్ 18న ఈ నోటిఫికేషన్ విడుదల కాగా జూలై 9వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొంది. తరువాత గడువు జూలై 16 వరకు పొడిగించారు. అదీ సరిపోదని జూలై 25 వరకూ మళ్లీ గడువిచ్చారు. న్యాయ వ్యవస్థలో ఉన్నవారు, ఇతర ఏ కార్యాలయాల్లోనూ ఉద్యోగి కాని వారు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. 50 ఏళ్ల లోపు వయసు ఉన్నవారు అనర్హులని, ఎంపికైన అభ్యర్థి ఐదేళ్ల పాటు ఏపీఈఆర్‌సీ సభ్యుడిగా కొనసాగుతారని నిబంధనల్లో పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ఐదుగురి పేర్లను ఎంపిక చేసిన ఇంధన శాఖ ఆ ఫైలును ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించింది. అంతే.. ఆ తరువాత అక్కడి నుంచి ఫైలు కదలలేదు.

స్వయంగా హైకోర్టు కలుగజేసుకోవడంతో..

రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులతోపాటు ప్రజల నుంచి వసూలు చేసే విద్యుత్ చార్జీలను నిర్ణయించే ప్రతిపాదనలపై విచారణ జరిపి ఆమోదించడం లేదా తిరస్కరించడం లాంటి కీలక బాధ్యతలను ఏపీఈఆర్‌సీ చైర్మన్ నిర్వర్తిస్తారు. అంత కీలకమైన పోస్టును కూటమి ప్రభుత్వం భర్తీ చేయకపోవడంపై ఇటీవల స్వయంగా హైకోర్టు కలుగజేసుకుంది. ఏపీఈఆర్‌సీ చైర్మన్‌ను ఎప్పటిలోగా నియమిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే రిటైర్డ్ న్యాయమూర్తి స్థాయి వ్యక్తులు ఏపీఈఆర్‌సీ చైర్మన్ స్థానంలో ఉంటే తమ ఆటలు సాగవని ప్రభుత్వ పెద్దలు గ్రహించారు. దీంతో త్వరలో పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారికి ఆ పదవిని కట్టబెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. అనధికారికంగా ఇప్పటికే ఆయన పేరును ఖరారు చేశారు. ఈ క్రమంలో తొలుత లీగల్ మెంబర్ పోస్టు భర్తీ చేయాలని నిర్ణయించారు.

ఓ సీనియర్ నేత జోక్యంతో...

చైర్మన్ పదవికి తాము ఎంచుకున్న సీనియర్ ఐఏఎస్ అధికారి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే లీగల్ సభ్యుడి పోస్టును కూడా ఇవ్వాలని భావించారు. అయితే అదే సమయంలో కేంద్రంలో రాజ్యాంగబద్ధ పదవిని నిర్వర్తించిన ఓ సీనియర్ నేత జోక్యం చేసుకుని తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినే లీగల్ సభ్యుడిగా నియమించాలని సూచించడంతో ఎటూ తేలడం లేదు. చైర్మన్, మెంబర్ పోస్టులను ఒకే సామాజిక వర్గం వారికి ఇస్తే విమర్శలు వస్తాయని ఆ సీనియర్ నేత చెబుతున్నట్లు తెలుస్తోంది. పోనీ లీగల్ మెంబర్ పోస్టును భర్తీ చేయకుండా వదిలేద్దామనుకుంటే అప్పుడు చైర్మన్ పదవిలో తప్పనిసరిగా రిటైర్డ్ న్యాయమూర్తిని నియమించాల్సి ఉంటుంది. దీంతో ఎటూ తేల్చలేక ఏపీఈఆర్‌సీ సభ్యుడి భర్తీ ఫైలు రోజుల తరబడి సీఎం వద్దనుంచి కదలడం లేదు.



ఏలూరు అమీనాపేట పోలీస్‌స్టేషన్ వద్ద కైండ్‌నెస్ వాల్ అల్మారా

సేవాతత్పరత.. సామాజిక బాధ్యత

'నా' అనే స్వార్థాన్ని విడిచి..

'మన' అనే దృక్పథాన్ని పెంచేలా ఏలూరు పోలీసులు సేవాతత్పరత చాటుతూ 'మోడల్ పోలీస్'గా నిలుస్తున్నారు. మానవత్వ స్ఫూర్తిని పెంపొందిస్తూ సామాజిక బాధ్యతపై అవగాహన పెంచేలా వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. సమాజంలో అభాగ్యులకు ఆపన్నహస్తం అందించేలా జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ కైండ్‌నెస్ వాల్, టేక్ ఏ బుక్.. లీవ్ ఏ బుక్ కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఏలూరులో 'మోడల్' పోలీస్
- కైండ్‌నెస్ వాల్, టేక్ ఏ బుక్ కార్యక్రమాలు
- పోలీసుల ఆధ్వర్యంలో పర్యవేక్షణ



బొమ్మలను తిలకిస్తున్న బాలిక

టేక్ ఏ బుక్ ర్యాక్



ఏలూరు టౌన్ : ఓ వైపు చట్టానికి లోబడి శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు మరోవైపు సామాజిక బాధ్యతగా ఏలూరు అమీనాపేట పోలీస్ పెట్రోల్‌స్టేషన్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన కైండ్‌నెస్ వాల్ మన్ననలు పొందుతోంది. ఇంట్లో మనం ఉపయోగించని వస్తువులు చాలా ఉంటాయి. సమాజంలో ఆ వస్తువులు అవసరమైన వారూ ఉంటారు. అయితే వాటిని వారికి ఎలా అందించాలో చాలా మందికి తెలియదు. సా యం చేయాలన్న ఆలోచన ఉన్నా మార్గం లేక వదిలేస్తారు. అలాంటి వారు ఎ లాంటి ఇబ్బంది లేకుండా ఆయా వస్తువులను పోలీసులు ఏర్పాటుచేసిన కైండ్‌నెస్ వాల్ అల్మారాలో పెట్టవచ్చు. వాటిని అవసరమైన వారు తీసుకుని వినియోగిస్తారు. ఈ విధానంలో డిగ్నిటీ.. కై ండ్‌నెస్.. కేరింగ్.. ఒక్కచోటే ఉంటాయి. ఈ ఆలోచనలతో పోలీసులు ఏర్పాటుచేసిన కైండ్‌నెస్ వాల్ మన్ననలు పొందుతోంది. పలువురు దుస్తులు, ఆటబొమ్మలు, షూష్, చెప్పులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఇలా పలురకాల వస్తువులను ఇక్కడ ఉంచుతున్నారు. వీటిని పిల్లలు, పెద్దలు, కార్మికులు వచ్చి ఆనందంగా తీసుకువెళుతున్నారు. కైండ్‌నెస్ బాస్కెట్స్ పేరుతో ఇదే విధానం పలు దేశాల్లో మన్ననలు పొందింది.

టేక్ ఏ బుక్‌కు మంచి ఆదరణ

ఏలూరు ఎస్పీ క్యాంపు కార్యాలయం బయట రోడ్డుపైనా, ట్రాఫిక్ పార్కులో టేక్ ఏ బుక్.. లీవ్ ఏ బుక్ అనే నూతన విధానాన్ని ప్రారంభించారు. జిల్లా జేసీ ధాత్రిరెడ్డి ఆలోచనతో వీటిని ఏర్పాటుచేశారు. పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభమైన సమయంలో మంచి స్పందన వస్తోంది. చాలామంది విద్యార్థులు పుస్తకాలు ఈ ర్యాక్‌లో పెడితే, అవసరమైన వారు తీసుకుంటున్నారు. ఇప్పటికే విద్యార్థులు అల్మారాలోని విలువైన పుస్తకాలు తీసుకుని చదివి, వారి వద్ద ఉన్న పుస్తకాలను అక్కడ పెడుతున్నారు. ఈ పుస్తకాల ర్యాక్‌కు విద్యార్థులు, లెక్చరర్స్, ఉపాధ్యాయుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

డిగ్నిటీ ఆఫ్ కైండ్‌నెస్ పెంపొందించేలా..



పిల్లలకు చిన్నతనం నుంచే సామాజిక పరిస్థితులపై అవగాహన, బాధ్యత పెంచాలి. ఇదంతా ఇంటి నుంచి ప్రారంభించాలి. దానం చేశామనే ఫీలింగ్ మనలో ఉండకుండా, తీసుకున్నామనే ఆలోచన మనసును బాధించకుండా డిగ్నిటీ ఆఫ్ కైండ్‌నెస్ ప్రతి ఒక్కరిలో పెంపొందించాలి. కరుణ, దయాగుణం పిల్లల్లో అలవర్చుతూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చూడాలి. దీంతో కక్షలు, ద్వేషాలు, కోపాలు, దాడులు, దౌర్జన్యాలు నిరోధించే అవకాశం ఏర్పడుతుంది.

– కొమ్మి ప్రతాప్ శివకిషోర్, ఏలూరు జిల్లా ఎస్పీ


అమృతసర్‌లోని గోల్డెన్ టెంపుల్

భారతదేశం గర్వించే అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్... దేశం కోసం ప్రాణాలర్పించిన జలియన్‌వాలా బాగ్.
సైనిక వందనంతో గౌరవించే వాఘా- అట్టారి సరిహద్దు... పంజాబ్ ప్రాణత్యాగాల నిలయం జంగ్ ఈ ఆజాదీ.
వ్యర్థాలను అర్థవంతం చేసిన చండీగఢ్ రాక్ గార్డెన్... భగవద్గీత బోధనక్షేత్రం హరియాణా కురుక్షేత్రం.
బహాయిూ ధ్యానమందిరం ఢిల్లీ లోటస్ టెంపుల్... భారతీయ లోహ ప్రావీణ్యత చిహ్నం ఐరన్ పిల్లర్.
కృష్ణుడు పుట్టిన మధుర... ఆడిపాడిన బృందావనం... భారతీయుల ప్రేమ పొందిన ప్రపంచవింత తాజ్‌మహల్.
ఉత్తర భారత వారసత్వాన్ని వారంలో ఒడిసి పట్టుకోవచ్చు.

ఉత్తర భారత్ హెరిటేజ్ టూర్

1వ రోజు :

హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం తర్వాత 3.50 గంటలకు 6ఈ 167 విమానం బయలుదేరి సాయంత్రం ఆరున్నరకు అమృత్‌సర్‌కు చేరుతుంది. ఎయిర్‌పోర్ట్‌లో నిర్వాహకులు పికప్ చేసుకుంటారు. హోటల్‌లో చెక్ ఇన్ అవడం, విశ్రాంతి, రాత్రి బస.

2వ రోజు :

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత అమృత్ సర్ గోల్డెన్ టెంపుల్, జలియన్‌వాలా బాగ్ సందర్శనం. మధ్యాహ్నం తర్వాత వాఘా బోర్డర్ విజిట్, రాత్రి బస అమృత్‌సర్‌లోనే.


జలియన్‌వాలాబాగ్ స్మారకం


వాఘా–అట్టారి సరిహద్దు

బంగారు మందిరం

గోల్డెన్ టెంపుల్ అనగానే గుర్తొచ్చే ప్రదేశం అమృత్ సర్. ఇటీవల తమిళనాడులో మరో గోల్డెన్ టెంపుల్ నిర్మాణం జరిగింది. కానీ ఇది 443 ఏళ్ల నాటి నిర్మాణం. దేశమెరిగిన బంగారపు మందిరం. దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన ఆలయం కూడా. సిక్కుల ప్రార్థనామందిరం రాజకీయ సంక్లిష్టతలకు నెలవైంది. ఉగ్రవాద కార్యకలాపాలను నిలువరించే ప్రయత్నంలో భాగంగా ప్రధాని ఇందిరాగాంధీ 1984లో ఆపరేషన్ బ్లూ స్టార్‌కు ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు ఆమె హత్యకు దారి తీశాయి. ఈ గురుద్వారాని రోజుకు లక్షా యాభై వేల మంది సందర్శిస్తారని అంచనా. గురుద్వారా కమిటీ నిర్వహించే లంగార్ (భోజనశాల)లో భోజనం చేయాలి. ఇక్కడో విషయం లంగార్‌లో అందరూ సమానమే. సహపంక్తి భోజనం చేయాలి. ఎంతమంచి వచ్చినా, కాదనకుండా వడ్డిస్తారు. ఎంత తిన్నా పెడతారు కానీ వడ్డించుకున్న పదార్థాన్ని వృథా చేస్తే ఒప్పుకోరు. పూర్తిగా తినేవరకు ఒకరు వచ్చి ఎదురుగా నిలుచుంటారు. భోజనాన్ని గౌరవించాలనేది వారి నియమం. భోజనంతోపాటు వారి నియమాన్ని కూడా గౌరవించడం పర్యాటకుల ధర్మం. బంగారు గోపురం ఉన్న ప్రధాన ఆలయం సరోవరం మధ్యలో ఉంటుంది. ఆలయం ప్రధాన ద్వారం నుంచి లోపలికి వంతెన మీద రావాలి. ఈ గురుద్వారా పేరు హర్ మందిర్ సాహిబ్. ఈ మందిర నిర్మాణాల సమూహం వరల్డ్ హెరిటేజ్ సైట్ గుర్తింపు కోసం యునెస్కో పరిశీలనలో ఉంది. ఈ మందిరంలో జాతిరత్నాలు పొదిగిన పై కప్పును కూడా పరిశీలనగా చూడాలి.

బుల్లెట్ గాయాల గోడ

బ్రిటిష్ అధికారి జనరల్ డయ్యర్ కాల్పులు జరిపినప్పుడు బుల్లెట్‌లు తగిలి చిల్లులు పడిన గోడ ఉంటుంది. ఆ గోడకు 36 బుల్లెట్ గాయాలు ఇప్పటికీ కనిపిస్తాయి. 1919, ఏప్రిల్ నెల 13వ తేదీ, బైశాఖీ పండుగరోజు జరిగిందా దుర్ఘటన. డయ్యర్ భారతీయుల మీద కాల్పులు జరపడానికి ముందు బయటకు వెళ్లడానికి అనుమతించిన చిన్న ద్వారాన్ని కూడా చూడవచ్చు. ఆ కాల్పుల్లో మరణించిన వారి స్మారక నిర్మాణం, అమర జ్యోతి చుట్టూ దేశం కోసం ప్రాణాలొడ్డిన వారి ముఖాల అమరిక అద్భుతంగా ఉంటుంది. వారిని చూస్తుంటే గుండె బరువెక్కుతుంది. ఆ ఘటనలో మరణించిన వారిలో 120 మంది మృత దేహాలు ఒక బావిలో లభించాయి. ఏడు ఎకరాల ప్రదేశంలో అడుగడుగునా స్వాతంత్ర్య పోరాటంలో చోటు చేసుకున్న మానరోదనకు ఆనవాలుగా కనిపిస్తుంది.

వాఘా- అట్టారి సరిహద్దు ద్వారం

భారత్- పాకిస్థాన్‌ల మధ్య సరిహద్దు ఇది. అమృత్ సర్‌నుంచి 30 కిలోమీటర్ల దూరాన ఉంది. వాఘా బోర్డర్ అని వాడుకలో అంటుంటాం. కానీ దీని పేరు వాఘా- అట్టారి బోర్డర్. వాఘా అనే గ్రామం భారత్- పాక్ సరిహద్దు రేఖ రెడ్‌క్లిఫ్ లైన్‌కు ఆవల ఆరు వందల మీటర్ల దూరాన ఉంది. భారత సరిహద్దు గ్రామం అట్టారికి మూడు కిలోమీటర్ల దూరం. రోజూ సాయంత్రం ఇక్కడ వాఘా- అట్టారి బోర్డర్ సెరిమనీ జరుగుతుంది. 1959 నుంచి రోజూ జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి వేలల్లో సందర్శకులు వస్తారు. ఇక్కడి నుంచి అర కిలోమీటరు దూరాన వాఘా రైల్వేస్టేషన్ ఉంది. భారత్- పాక్ మధ్య నడిచే రైలును చూడాలంటే వెళ్లవచ్చు.

3వ రోజు :

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్ చేసి జలంధర్‌కు ప్రయాణం. జంగ్ ఈ ఆజాదీ మెమోరియల్ సందర్శనం. మధ్యాహ్నం తర్వాత చండీగఢ్‌కు ప్రయాణం. రాక్ గార్డెన్ విజిట్ తర్వాత హోటల్ గదిలో చెక్ ఇన్, రాత్రి బస.


జంగ్ ఈ ఆజాది

సమర జ్ఞాపకం

జంగ్ ఈ ఆజాదీ అనే ప్రదేశాన్ని చరిత్ర పాఠంలో చదివి మర్చిపోయి ఉంటాం. ఇది స్వాతంత్ర్య సమరంలో కీలకపాత్ర పోషించిన ప్రదేశం. ఈ స్మారక భవనం పంజాబ్ రాష్ట్రం, జలంధర్ నగరానికి సమీపంలో కర్‌తార్‌పూర్ పట్టణంలో ఉంది. భారత స్వాతంత్ర్య సమరంలో పంజాబ్ వాసులు నిర్వహించిన పాత్ర, వారి ప్రాణత్యాగాలకు గౌరవ చిహ్నంగా పదేళ్ల కిందట నిర్మించారు. చరిత్రకారులు, పాత్రికేయులు, మేధావులు సమగ్రంగా అధ్యయనం చేసి దీనికి రూపకల్పన చేశారు.


రాక్ గార్డెన్

రాకింగ్ రాక్స్


వేస్ట్ మేనేజ్‌మెంట్ అవసరాన్ని తెలియచేసే ప్రదేశం ఇది. నలభై ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ గార్డెన్‌లో పరిశ్రమల వ్యర్థాలు, ఇంట్లో వాడి పారేసిన వస్తువులతో ఆకర్షణీయమైన కళారూపాలను తయారు చేశారు. ఇక్కడున్న వాటర్ ఫాల్స్ కూడా మానవ నిర్మితమే. సృజనాత్మకత, ఆచరణాత్మకత ఉంటే ఏ వస్తువూ వ్యర్థం కాదు, వృథాగా పారేయడం ఉండదు. అందమైన కళాఖండం అవుతుందనడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఇది. ఈ గార్డెన్ అంతా తిరిగి చూసి ఇంటికి వచ్చిన తరవాత ఇంట్లో వాడకుండా అటకమీద పెట్టిన వస్తువులకు ఒక రూపమిచ్చే ఆలోచనలు మెదడులో పూస్తాయి.

4వ రోజు :

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్ చేసి కురుక్షేత్రకు ప్రయాణం. శ్రీ కృష్ణ మ్యూజియం సందర్శనం. మధ్యాహ్నం తర్వాత ఢిల్లీకి ప్రయాణం. హోటల్‌లో చెక్ ఇన్ కావడం, రాత్రి బస ఢిల్లీలో.


శ్రీకృష్ణ మ్యూజియం


కురుక్షేత్రలోని ఓ కూడలి


షేక్ చిల్లీ టూంబ్

గీత బడి కురుక్షేత్రం

శ్రీకృష్ణుడు భగవద్గీత బోధించిన నేల ఇది. కురుక్షేత్ర అనగానే కురు- పాండవుల యుద్ధక్షేత్రంగానే గుర్తొస్తుంది. కురుక్షేత్రలో యుద్ధం జరిగిన ప్రదేశాన్ని స్థానికులు ధర్మక్షేత్రగా చెప్పుకుంటారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు గీత బోధించిన ప్రదేశంలో ప్రస్తుతం మ్యూజియం ఉంది. కురుక్షేత్ర పట్టణం హరియాణ రాష్ట్రంలో ఉంది. ఇక్కడ పర్యాటకులు చూడాల్సిన ప్రదేశాలు చాలానే ఉన్నాయి. బ్రహ్మ సరోవర్, జ్యోతిసర్, కురుక్షేత్ర పనోరమ అండ్ సైన్స్ సెంటర్, శ్రీకృష్ణ మ్యూజియం, స్థానేశ్వర్ మహాదేవ్ ఆలయం, భీష్మకుండ్, కర్ణ లేక్, కల్పనా చావ్లా ప్లానిటేరియమ్, సూఫీ సన్యాసి షేక్ చిల్లీ టూంబ్ ముఖ్యమైనవి. ఇతడు మొఘల్ పాలకుడు ఔరంగజేబు సోదరుడు దారాషుకో గురువు. తన ఆధ్మాత్మిక గురువు గౌరవార్థం దారాషుకో దీనిని నిర్మించాడు. ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను పోలిన నిర్మాణం కావడంతో దీనిని హరియాణా తాజ్‌మహల్ అంటారు.

5వ రోజు :

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత లోటస్ టెంపుల్, కుతుబ్‌మినార్ విజిట్. సాయంత్రం అక్షరధామ్ దర్శనం. రాత్రి బస ఢిల్లీలోనే.

లోటస్ టెంపుల్

నిశ్శబ్దంమైన ఆలయం ఇది. టెంపుల్ అంటే ఇక్కడ ఏ దేవతా విగ్రహమూ ఉండదు. ధ్యానం చేసుకోవడమే ప్రధానంగా రూపొందిన బహాయిూ ప్రార్థన మందిరం. సర్వమానవ సమానత్వం, మానవత్వమే మతం అనే గొప్ప ఆధ్యాత్మిక భావనతో ఏర్పడిన మతం ఇది. బహాఉలాహ్ అనే తత్వవేత్త ఇరాన్‌లో 19వ శతాబ్దంలో రూపొందించిన భావజాలం ఇది. అందుకే దీనికి బహాయి మతంగా పేరు వచ్చింది. అర విరిసిన కలువపువ్వును తలపిస్తుంది. కాబట్టి లోటస్ టెంపుల్‌గా వ్యవహారంలోకి వచ్చింది. ఇది ఒక నిర్మాణ అద్భుతం. 2500 సీటింగ్ కెపాసిటీ ఉన్న విశాలమైన నిర్మాణం. ఎక్కడా పిల్లర్ ఉండదు. మెయింటెనెన్స్ చాలా బాగుంటుంది. మతాలు, కులాలు, స్థాయీ బేధాలు లేకుండా అందరూ ఒకే వరుసలో వెళ్లాలి. ధ్యానం చేసుకుని బయటకు రావాలి. పర్యాటకులకు ధ్యానం చేసుకోగలిగినంత సమయం ఉండదు. కాబట్టి పది నిమిషాల సేపు కళ్లు మూసుకుని ఆ ఫీలింగ్‌ని ఎక్స్‌పీరియెన్స్ చేసి రావడమే జరుగుతుంది.

ఢిల్లీ పేరిలా వచ్చింది!

కుతుబ్ మినార్‌ను వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది యునెస్కో. ఢిల్లీ శివారులోని మెహ్రౌలీలో ఉంది. లాల్ కోట శిథిలాల మీద నిర్మించిన కట్టడం అని చెబుతారు. ఢిల్లీకి ఆ పేరు ఎలా వచ్చిందో చెప్పే ఆధారాలు స్పష్టంగా లేవు. కానీ కుతుబ్ మినార్ ఉన్న ప్రదేశంలో లాల్ కోట ఉండేదని, అది ధిల్లిక రాజ్య రాజధాని అని చెబుతారు. అదే దిల్లీగా వాడుకలోకి వచ్చింది. బ్రిటిష్ ఉచ్చారణలో డిల్లీగా మారింది. కుతుబ్‌మినార్ ప్రాంగణం అంతా తిరిగి చూస్తే ఒక భారీ కోట ఉండేదని నమ్మక తప్పదు. భారీ ప్రాకారాలు, గోడలు, వాటి నిర్మాణశైలి ప్రాచీనతకు అద్దం పడతాయి. కుతుబ్‌మినార్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న ఐరన్ పిల్లర్ చారిత్రక ప్రాధాన్యం కలిగినది మాత్రమే కాదు. మనదేశంలో ప్రాచీనకాలంలోనే లోహశాస్త్రం ఎంతగా అభివృద్ధి చెందిందో తెలియచేసే ప్రత్యక్ష ఉదాహరణ. శతాబ్దాల పాటు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉన్నప్పటికీ ఆ ఐరన్ పిల్లర్‌కి తుప్పు పట్టలేదు. పేరుకు ఐరన్ పిల్లరే కానీ అనేక లోహాల మిశ్రమం. ఏ లోహాన్ని ఎంత మోతాదులో మిశ్రమం చేశారనేది పరిశోధకులకు, శాస్త్రవేత్తలకు కూడా అంతు పట్టడం లేదింకా. గుప్తుల కాలం నాటిది ఈ ఐరన్ పిల్లర్.

అక్షరధామ్

ఇది స్వామి నారాయణ్ ఆలయం. నిర్మాణ అద్భుతాల్లో ఇది కూడా ఒకటి. మొత్తం తిరిగి చూడాలంటే కనీసం మూడు గంటలు పడుతుంది. అభిషేక మండపంలో నీటి చెంబులు వరుసగా ఉంటాయి. టికెట్ తీసుకున్న వాళ్లు వరుసలో వెళ్లి విగ్రహానికి అభిషేకం చేయవచ్చు. ఇది ఢిల్లీలో యమునా నది తీరాన పాండవ నగర్‌లో ఉంది. శిల్పసౌందర్యం చాలా గొప్పగా ఉంటుంది. ఇక్కడ ఇతర ధార్మిక క్రతువులేవీ ఉండవు. దర్శనం, ధ్యానం, ఉల్లాసంగా గడపడమే ప్రధానం. పిల్లలు ఊయలలూగుతూ ఆడుకోవడానికి ఆటస్థలం కూడా ఉంది. విస్తారమైన గార్డెన్‌లున్నాయి. భారత్ ఉపావన్‌లో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలున్నాయి. అక్షరధామ్‌లోపలకు స్మార్ట్‌ఫోన్‌లు, కెమెరాలను అనుమతించరు. అయితే బ్యాక్‌డ్రాప్‌లో ఆలయ గోపురం కనిపించేటట్లు ఫొటో పాయింట్ ఉంది. అక్కడ కెమెరామన్ ఉంటాడు. ఈ టూర్ జ్ఞాపకంగా ఒక ఫొటో తీయించుకోవడం మరిచిపోవద్దు.

6వ రోజు :

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్ చేసి మధురకు ప్రయాణం. శ్రీ కృష్ణ జన్మభూమి సందర్శనం తర్వాత బృందావన వీక్షణం. సాయంత్రం ఆగ్రాకు ప్రయాణం. హోటల్ గదిలో చెక్ ఇన్, రాత్రి బస ఆగ్రాలో.

హైదరాబాద్ నుంచి మొదలయ్యే ఈ ఏడు రోజుల టూర్ పేరు 'నేషనల్ హెరిటేజ్ ఆఫ్ నార్త్ ఇండియా', టూర్ కోడ్ ఎస్‌హెచ్‌ఏ 52. సెప్టెంబర్ 10వ తేదీన మొదలయ్యే ఈ పర్యటనలో అమృతసర్, చండీగఢ్, ఢిల్లీ, మధుర, ఆగ్రా కవర్ అవుతాయి. ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్ జోనల్ ఆఫీస్ కాంటాక్ట్ నంబరు: 91 97013 60701 ప్యాకేజ్ ఇలా: సింగిల్ ఆక్యుపెన్సీలో 52,850 రూపాయలు, డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 39,800 అవుతుంది. ట్రిపుల్ ఆక్యుపెన్సీలో 37,300 రూపాయలు.

మధుర మసీదు

మధుర ప్రయాణం ఆసక్తిగా సాగుతుంది. కానీ మధురకు చేరిన తర్వాత కృష్ణుడు పుట్టిన ప్రదేశాన్ని ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోలేదని, భక్తుల విశ్వాసాలకు తగినంత ప్రాధాన్యం పాలకులు ఇవ్వలేదనిపిస్తుంది. ఆలయం లోపల ఒక మందిరంలో రాధాకృష్ణుల పాలరాతి విగ్రహాలు ముచ్చటగా ఉంటాయి. దేవకీవసుదేవులను కంసుడు బంధించి ఉంచినట్లు చెప్పే చెరసాల కూడా ఇక్కడే ఉంది. భూగర్భంలో నిర్మించిన రాతి గోడల కట్టడంలోకి ఇరుకు మెట్లు దిగి లోపలికి వెళ్లాలి. కృష్ణుడు పుట్టిన ప్రదేశాన్ని కూడా చూడవచ్చు. క్రీస్తు పూర్వం నాటి నిర్మాణాలన్నీ ధ్వంసం అవుతూ, తవ్వకాల్లో బయటపడిన వస్తువులను నిక్షిప్తం చేసుకుంటూ పునర్నిర్మాణమవుతూ వచ్చింది. మొఘలు పాలకుడు ఔరంగజేబు శ్రీకృష్ణుడి జన్మస్థాన భవనాన్ని ఆనుకుని నిర్మించిన పెద్ద మసీదును కూడా చూడవచ్చు.

యమునాతటిలో నల్లనయ్య

బృందావనమది అందరిదీ! గోవిందుడు అందరివాడే... అని పాడుకోవడానికి ఆడుకోవడానికి అందమైన ప్రదేశం బృందావనం. గోవిందుడు సంచరించిన నేల మీద పర్యటన అనే భావనలోనే ఓ గొప్ప గిలిగింత ఉంటుంది. యమునానది తీరాన విస్తరించిన ఈ నేల మీద ఐదు వేల ఏళ్ల కిందట శ్రీకృష్ణుడు, బలరాముడు అనే పుణ్య పురుషుల బాల్యం గడిచిందని భక్తుల విశ్వాసం. ఇస్కాన్ నిర్మించిన భారీ ఆలయాలలో పౌరాణిక కథనాల్లో చోటుచేసుకున్న నాటి జ్ఞాపకాలకు నేటి రూపాలను మనం చూడగలుగుతున్నాం. మధుర నుంచి బృందావనానికి 15 కిమీల దూరం. మరో పది కిలోమీటర్ల దూరాన గోకులం ఉంది. విశ్రాంత జీవితంలో ప్రశాంతత కోసం ఇక్కడ కొంత కాలం నివసించవచ్చు. స్థానికులు మాట్లాడేది హిందీయే అయినా ఆ డైలెక్ట్ దక్షిణాది వాళ్లు పుస్తకాల్లో నేర్చుకున్న హిందీకి ఏ మాత్రం సరిపోలదు. మెల్లగా అలవాటు చేసుకోవాలి.


బృందావనంలోని ఓ టెంపుల్

7వ రోజు :

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ చెక్ అవుట్. తాజ్ వీక్షణం తర్వాత ఎయిర్‌పోర్ట్‌లో డ్రాప్ చేస్తారు. 16 తేదీ సాయంత్రం 4.40 గంటలకు 6ఈ 6478 విమానం ఆగ్రాలో బయలుదేరి 6. 45 గంటలకు హైదరాబాద్‌కు చేరడంతో టూర్ పూర్తవుతుంది.

భారతీయుల ప్రేమకు చిహ్నం

తాజ్‌మహల్ ను ఎన్నిసార్లు చూసినా మరోసారి చూడవచ్చనిపించే అద్భుతం. ఎంత చెప్పుకున్నా ఇంకా చెప్పుకోవడానికి కొన్ని వివరాలు మిగిలే ఉంటాయి. ఓ పాతికేళ్ల కిందట... 'తాజ్‌మహల్ గొప్ప నిర్మాణమే కానీ ఫొటోలో కనిపించినంత అందంగా డైరెక్ట్‌గా చూసినప్పుడు కనిపించదు' అనేవారు. అది నాటి మాట. యూపీలో యమునానది తీరాన ఫ్యాక్టరీలున్నప్పుడు వాటి కాలుష్యం కారణంగా తెల్లటి పాలరాయి పసుపు రంగులోకి మారింది. ఫ్యాక్టరీలను తొలగించిన తర్వాత ప్రమాదం తగ్గినప్పటికీ దశాబ్దంపాటు తాజ్‌మహల్ పసుపు వర్ణంలోనే ఉండింది. అలాగే ప్రపంచంలోని ఏడు అద్భుతాల్లో స్థానం పొందింది కూడా. యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ (తొలి దఫా) మనదేశంలో పర్యటించడానికి ముందు తాజ్‌మహల్ పాలరాయికి పాలిష్ పెట్టడం జరిగింది. అప్పటి నుంచి తాజ్ మహల్ తెల్లగా మెరుస్తోంది. తాజ్ మహల్ 42 ఎకరాల్లో విస్తరించి ఉంది. నాలుగు వైపులా ఉన్న తోటలను పరిశీలనగా చూస్తే చార్‌బాగ్ ఏర్పాటులో మొఘలులు ఎంత నిశితంగా ఉండేవారో అర్థమవుతుంది. మొక్కలు, గుబుర్ల వరుస స్కేలు పెట్టి గీచినట్లు ఉంటుంది. మనకు తాజ్‌మహల్ అంటే ఎంత ప్రేమంటే... 2007లో జరిగిన న్యూ సెవెన్ వండర్స్ ఆఫ్ ద వరల్డ్ పోటీలో తాజ్‌మహల్‌కు ఓట్లేసి గెలిపించుకున్నాం. ఇది షాజహాన్ ప్రేమకు మాత్రమే కాదు, ఇది భారతీయుల ప్రేమకు కూడా చిహ్నమే. ఇరవై ఏళ్ల పాటు సాగిన ఈ నిర్మాణంలో ప్రతి అంగుళమూ ఓ అద్భుతం. అన్నట్లు ఫొటోలు తీసుకునేటప్పుడు తాజ్ మహల్ ముందు మాత్రమే కాదు, వెనుక వైపు యమునా నది బ్యాక్‌డ్రాప్‌లో ఫొటోలు తీసుకోవడం మరువద్దు. తాజ్‌మహల్‌తోపాటు ఆగ్రాలో చూడాల్సిన ప్రదేశం రెడ్‌ఫోర్ట్. దీనిని ఆగ్రాఫోర్ట్ అంటారు. అక్బర్ ఎక్కువకాలం రాజ్యపాలన చేసింది ఈ ఎర్ర కోట నుంచే.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి


కుతుబ్ మినార్
తాజ్‌మహల్
అక్షరధామ్
లోటస్ టెంపుల్



పొదుపు ప్రారంభించారంటే విజయయాత్ర మొదలెట్టినట్లే..
- స్టీవ్ బర్కహోల్డర్, అమెరికన్ రచయిత, పర్సనల్ ఫైనాన్స్ నిపుణుడు

క్యూ1 జీడీపీపై కన్ను

- జీఎస్‌టీ సంస్కరణలకూ ప్రాధాన్యత
- ఈ వారం ట్రేడింగ్ 4 రోజులకే పరిమితం
- స్టాక్ మార్కెట్ల ట్రెండ్‌పై నిపుణుల అంచనాలు

యూఎస్ టారిఫ్‌ల అమలు కీలకం

వినాయక చవితి సందర్భంగా బుధవారం దేశీ స్టాక్ మార్కెట్లకు సెలవుకావడంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలు వెలువడనున్నాయి. మరోపక్క యూఎస్ ప్రెసిడెంట్ ప్రకటించిన అదనపు టారిఫ్‌లు అమలుకానుండగా.. కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ సంస్కరణలపై దృష్టి పెట్టడం ద్వారా ఇటీవల పలు రంగాలతోపాటు.. స్టాక్ మార్కెట్లకు జోష్‌నిచ్చింది. వివరాలు చూద్దాం...

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్(క్యూ1) కాలానికి దేశ ఆర్థిక వృద్ధి గణాంకాలు శుక్రవారం (29న) వెలువడనున్నాయి. రష్యా చమురు కొనుగోళ్లను వ్యతిరేకిస్తూ యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాలకు బుధవారం(27) నుంచి తెరలేవనుంది. జాక్సన్ హోల్ వద్ద యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వార్షికంగా నిర్వహించే సదస్సు సందర్భంగా గత వారాంతాన ప్రస్తుత చైర్మన్ జెరోమీ పావెల్ వడ్డీ రేట్ల కోతకు వీలున్నదంటూ సంకేతాలిచ్చారు. బుధవారం గణేశ్ చతుర్థి సందర్భంగా స్టాక్ మార్కెట్లు పనిచేయవు. దీంతో 4 రోజులకే పరిమితమైన ట్రేడింగ్‌లో ఈ వారం మార్కెట్ల సరళిపై విశ్లేషకులు పలు అంశాలు ప్రభావం చూపనున్నట్లు ప్రస్తావిస్తున్నారు.

జీడీపీపై అంచనాలు

ఈ ఏడాది క్యూ1లో దేశ ఆర్థిక వ్యవస్థ 6.7 శాతం వృద్ధి చూపగలదని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ వ్యయాలు పెరగడం, గ్రామీణ డిమాండ్ పుంజుకోవడం, సర్వీసుల రంగం పటిష్ట పురోగతి వంటి అంశాలు సహకరించనున్నట్లు భావిస్తున్నారు. గతేడాది(2024-25) చివరి త్రైమాసికం(జనవరి-మార్చి)లో దేశ జీడీపీ 7.4 శాతం బలపడింది. ఈ బాటలో జూలై పారిశ్రామికోత్పత్తి ఇండెక్స్(ఐఐపీ) వివరాలు గురువారం (28న) వెల్లడికానున్నాయి. జూన్‌లో ఐఐపీ 2024 ఆగస్ట్ తదుపరి కనిష్టంగా 1.5 శాతం పుంజుకుంది. జీడీజీ, ఐఐపీ గణాంకాలు బలపడితే.. మార్కెట్లు మరింత పుంజుకునే వీలున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. జీఎస్‌టీ శ్లాబులతోపాటు.. రేట్లను భారీగా తగ్గించనున్న వార్తలతో పలు రంగాలకు హుషారొచ్చినట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా తెలియజేశారు. వెరసి జీఎస్‌టీ సంస్కరణలపై అంచనాలు గత వారం దేశీ స్టాక్ మార్కెట్లకు బలాన్నిచ్చినట్లు పేర్కొన్నారు.

విదేశీ అంశాలు

యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్.. కొద్ది రోజులుగా రష్యా, ఉక్రెయిన్ మధ్య సయోధ్యకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో భారత్‌పై విధించిన 25 శాతం అదనపు టారిఫ్‌ల అమలు వాయిదా పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. ఇదికాకుండా యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడ్ చైర్మన్ పావెల్ భవిష్యత్‌లో వడ్డీ రేట్ల కోత సంకేతాలు ఇవ్వడం సెంటిమెంటుకు బలాన్నివ్వనున్నట్లు తెలియజేశారు. ఇది ఇటీవల దేశీ స్టాక్స్‌లో నిరంతర విక్రయాలకు పాల్పడుతున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు)ను యూటర్న్ తీసుకునేలా ప్రోత్సహించవచ్చని అభిప్రాయపడ్డారు. ఇక యూఎస్ హౌసింగ్ విక్రయాలు, ఫ్యాక్టరీ ఆర్డర్లు తదితర గణాంకాలు సైతం ఈ వారం వెలువడనున్నాయి. ఈ అంశాలన్నిటినీ ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు. ఫెడ్ వడ్డీ రేట్ల సంకేతాలతో గత వారాంతాన యూఎస్ మార్కెట్లు 2 శాతంవరకూ బలపడటాన్ని ఈ సందర్భంగా జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ ప్రస్తావించారు.



గత వారమిలా..

అంతర్జాతీయంగా రష్యా, యూఎస్ అధ్యక్షుల సమావేశం, దేశీయంగా జీఎస్‌టీ సంస్కరణల వార్తలు గత వారం (18-22) దేశీ స్టాక్ మార్కెట్లకు జోష్‌నిచ్చాయి. దీంతో ఆరు వారాల వరుస నష్టాల తదుపరి మార్కెట్లు లాభాలతో ముగిశాయి. ప్రామాణిక ఇండెక్స్ బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 709 పాయింట్లు(0.9) బలపడి 81,307 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ సైతం 239 పాయింట్లు(1 శాతం) పుంజుకుని 24,870 వద్ద స్థిరపడింది. ఈ బాటలో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు మరింత అధికంగా 2 శాతంపైగా ఎగశాయి.

డౌన్‌ట్రెండ్‌కు చెక్..

ఆరు రోజుల వరుస లాభాలకు బ్రేక్ వేస్తూ గత వారం చివర్లో భారీ అమ్మకాలు తలెత్తాయి. దీంతో దేశీ స్టాక్ మార్కెట్లు నికరంగా 1 శాతం లాభంతో ముగిశాయి. అయితే గత వారం ఆరు వారాల నష్టాలకు చెక్ పడింది. కాగా.. ఈ వారం పలు దేశ, విదేశీ అంశాలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీ కదలికలపై సాంకేతిక అంశాలతో ఇలా విశ్లేషించారు. వీటి ప్రకారం మార్కెట్లలో డౌన్‌ట్రెండ్‌కు కొంతమేర చెక్ పడింది. అంతేకాకుండా ట్రెండ్ రివర్సల్(బుల్లిష్)కు సంకేతాలు అందుతున్నాయి. ఎఫ్‌పీఐలు అమ్మకాలను వీడి కొనుగోళ్ల టర్న్ తీసుకుంటే మరింత బలపడే వీలుంది. వెరసి మార్కెట్లు బలహీనపడితే సెన్సెక్స్ 80,800-80,700 పాయింట్ల వద్ద మద్దతు తీసుకోవచ్చు. ఒకవేళ పుంజుకుంటే 82,200 వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు. తదుపరి 83,600-83,700 పాయింట్ల వరకూ బలపడే వీలుంది. నిఫ్టీకి 24,600 పాయింట్ల తొలి సపోర్ట్ లభించవచ్చు. 24,500 వద్ద మరోసారి మద్దతు కనిపించవచ్చు. బలపడితే.. తొలుత 25,200 పాయింట్ల వద్ద, ఆపై 25,500 వద్ద రెసిస్టెన్స్‌కు వీలుంది.

మొబైల్ ఫోన్లపై జీఎస్‌టీ 5 శాతానికి తగ్గించాలి

- డిజిటల్ సేవలకు నిత్యావసర వస్తువు
- కేంద్రానికి ఐసీఈఏ సూచన



హైదరాబాద్: అందరికీ నిత్యావసరంగా మారిన మొబైల్ ఫోన్లను 5 శాతం జీఎస్‌టీ శ్లాబు కిందకు తీసుకురావాలని ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) డిమాండ్ చేసింది. మొబైల్ ఫోన్ విడిభాగాలకూ 5 శాతం జీఎస్‌టీని వర్తింపజేయాలని కోరింది. ప్రస్తుతమున్న 18 శాతం జీఎస్‌టీ రేటును తిరోగమన చర్యగా పేర్కొంది. 90 కోట్ల మంది డిజిటల్ సేవలను పొందేందుకు వీలు కల్పిస్తున్న మొబైల్ ఫోన్లను నిత్యావసరాలుగా పరిగణించాలని కోరింది. జీఎస్‌టీ శ్లాబులను రెండింటికి తగ్గిస్తూ, కీలక సంస్కరణలను జీఎస్‌టీ కౌన్సిల్‌కు కేంద్రం నివేదించిన నేపథ్యంలో ఐసీఈఏ ఈ విధంగా కోరడం గమనార్హం. ''మొబైల్ ఫోన్ ఇకపై ఆకాంక్ష ఎంత మాత్రం కాదు. విద్య, ఆరోగ్యం, ఆర్థిక సేవల చేరువ, పరిపాలనకు అవసరమైన తప్పనిసరి డిజిటల్ సాధనం. కనుక ప్రధాని జీఎస్‌టీ సంస్కరణల అజెండా, 500 బిలియన్ ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్ లక్ష్యాలకు అనుగుణంగా దీన్ని 5 శాతం జీఎస్‌టీ కిందకు మార్చాలి''అని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మొహింద్రూ కోరారు. 2014-15 నాటికి దేశీయంగా మొబైల్ ఫోన్ల తయారీ విలువ రూ.18,900 కోట్లుగా ఉంటే, 2024-25 నాటికి రూ.5,45,000 కోట్లకు చేరుకోవడం గమనార్హం. ఇందులో ఎగుమతులు రూ.2,00,000 కోట్లుగా ఉన్నాయి. 2020లో మొబైల్ ఫోన్లపై జీఎస్‌టీని 18 శాతానికి పెంచిన తర్వాత దేశీ వినియోగం 30 కోట్ల యూనిట్ల నుంచి 22 కోట్ల యూనిట్లకు తగ్గినట్టు ఐసీఈఏ తెలిపింది.

జీవిత బీమాపై ఈ అపోహలొద్దు..



వికాస్ గుప్తా
చీఫ్ ప్రోడక్ట్ ఆఫీసర్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్

భవిష్యత్తులో ఆర్థిక భద్రతకు, దీర్ఘకాలిక పొదుపునకు, రిటైర్మెంట్ అనంతరం ఆదాయానికి హామీనిచ్చే సాధనంగా జీవిత బీమా అవసరంపై అవగాహన క్రమంగా పెరుగుతోంది. దీనితో పరిశ్రమ కూడా వృద్ధి చెందుతోంది. జీవిత బీమా సంస్థలు టెక్నాలజీని ఉపయోగించి కస్టమర్లకు సరళతరమైన సాధనాలను అందిస్తున్నాయి. అయినప్పటికీ జీవిత బీమాపై కొన్ని అపోహలు ఉంటున్నాయి. అందరికీ బీమా భద్రత లక్ష్యం సాకారం కావాలంటే వీటిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తమతో పాటు తమకెంతో ప్రియమైన వారికి ఆర్థిక భద్రత కల్పించనివ్వకుండా వెనక్కు లాగుతున్న అపోహల్లో కొన్నింటిని చూస్తే..

అపోహ 1: యువతకు లైఫ్ ఇన్సూరెన్స్ అవసరం లేదు

కొత్తగా ఆర్జన ప్రారంభించిన యువతలో చాలా మంది అప్పుడే తాము జీవిత బీమా తీసుకోవాల్సిన అవసరం లేదనుకుంటారు. కానీ వీలైనంత ముందుగా తీసుకోవడం వల్ల దీర్ఘకాలం కవరేజీ లభిస్తుంది. ప్రీమియంల భారం తక్కువగా ఉంటుంది. అలాగే భవిష్యత్తులో ఆర్థిక స్థిరత్వానికి కూడా పటిష్టమైన పునాది ఏర్పడుతుంది. అందుకే ఆర్థిక స్వాతంత్ర్యం సాధించి తొందరగా రిటైర్ అవ్వాలనుకునే కొత్త తరం యంగ్‌స్టర్స్ కోసం జీవిత బీమా సంస్థలు ప్రత్యేకంగా పలు సేవింగ్స్ ప్రోడక్టులను ప్రవేశపెట్టాయి. అత్యంత తక్కువగా నెలకు రూ. 1,000 నుంచి ప్రారంభమయ్యే ఇన్వెస్ట్‌మెంట్ ఆధారిత పథకాలను అందిస్తున్నాయి.

అపోహ 2: ఇది అర్థం కాని సంక్లిష్టమైన వ్యవహారం

మొబైల్ ఆధారిత ప్లాట్‌ఫాంలు, డిజిటల్ ప్రక్రియలు, అదే రోజున పాలసీ జారీ తదితర అంశాల దన్నుతో జీవిత బీమాను అర్థం చేసుకోవడం, కొనుగోలు చేయడం నేడు మరింత సులభతరంగా ఉంటోంది. ఒకప్పుడు సంక్లిష్టమైన వ్యవహారంగా అనిపించిన ఈ ప్రక్రియ ప్రస్తుతం భాష, పథకాలపరంగా కూడా చాలా సరళంగా మారింది.

అపోహ 3: క్లెయిమ్‌లు సెటిల్మెంట్ కష్టం

దేశీయంగా చాలా మటుకు జీవితబీమా సంస్థల క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తి స్థిరంగా 98 శాతం నుంచి 99 శాతం స్థాయిలో ఉంటోంది. కొన్ని సంస్థలు, నిబంధనలకు అనుగుణంగా ఉన్న క్లెయిమ్‌లను, అన్ని పత్రాలు అందిన మరుసటి రోజే సెటిల్ చేస్తున్నాయి.



అపోహ 4: ఇది చాలా ఖరీదైన, తాహతుకు మించిన వ్యవహారం

పొగ తాగని ఓ 30 ఏళ్ల వ్యక్తి రూ. 1 కోటి టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకుంటే, రోజుకు రూ. 30 కన్నా తక్కువే ప్రీమియం ఉంటుంది. ఇది కెఫేలో కాఫీ ఖరీదు కన్నా తక్కువే. అంతేగాకుండా ప్రీమియంలపై పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి. ముఖ్యంగా టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ అనేది, పాలసీదారుపై ఆధారపడిన వారికి ఆదాయ భర్తీ సాధనంగా కూడా ఉపయోగపడుతుంది. గృహ రుణంలాంటి ఆర్థిక రుణభారాలను క్లియర్ చేసుకునేందుకు తోడ్పడుతుంది.

అపోహ 5: మరణానంతరం మాత్రమే ఉపయోగకరం

కొత్త తరహా లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలు, పాలసీదార్లకు జీవితకాలంలోనే పలు ప్రయోజనాల అందించే విధంగా ఉంటున్నాయి. ఉదాహరణకు క్రిటికల్ ఇల్‌నెస్ బెనిఫిట్ తీసుకుంటే, నిర్దిష్ట అనారోగ్యాల చికిత్సకయ్యే ఖర్చులను చెల్లించేందుకు ఉపయోగపడుతుంది. తద్వారా కుటుంబ అవసరాల కోసం దాచిపెట్టే పొదుపు మొత్తాన్ని ముట్టుకోవాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుత పరిస్థితుల్లో జీవిత బీమా కేవలం భద్రతకే పరిమితం కాకుండా పలు భవిష్యత్ అవసరాలకు కూడా ఉపయోగపడే స్మార్ట్ సాధనంగా ఉంటోంది. దేశం ఆర్థిక సమ్మిళితత్వం వైపుగా వెళ్తున్న నేపథ్యంలో కాలం చెల్లిన అపోహల నుంచి బైటపడాల్సిన సమయమిది. ఈ క్రమంలోనే ప్రజలు ఆర్థికంగా సురక్షితమైన భవిష్యత్తును నిర్మించుకోవడంలో సహాయకరంగా ఉండే సరళమైన పథకాలను, ప్రక్రియలను అందించడంపై ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ మరింతగా దృష్టి పెడుతోంది.

అనిల్ అంబానీపై బీవోఐ 'ఫ్రాడ్' ముద్ర

- ఆర్‌కామ్ రుణ ఖాతాకూ ఇదే వర్తింపు
- నిబంధనలకు విరుద్ధంగా రుణాల మళ్లింపు
- ఎస్‌బీఐ ఫిర్యాదుతో ఇప్పటికే సీబీఐ కేసు



న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతా విషయంలో ఎస్‌బీఐ బాటలోనే బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) అడుగులు వేసింది. దివాలా చర్యలు ఎదుర్కొంటున్న ఆర్‌కామ్ రుణ ఖాతాను 'ఫ్రాడ్' (మోసకారి)గా వర్గీకరించింది. ఆ కంపెనీ మాజీ డైరెక్టర్ అనిల్ అంబానీ, మరో మాజీ డైరెక్టర్ మంజరి అశోక్ కాకర్‌పైనా ఇదే ముద్ర వేసింది. 2016లో ఇచ్చిన రుణాన్ని ఇతర అవసరాలకు మళ్లించారంటూ ఆరోపణలు చేసింది. ఈ వివరాలను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఆర్‌కామ్ వెల్లడించింది. దీని ప్రకారం.. 2016 ఆగస్ట్‌లో ఆర్‌కామ్‌కు రూ.700 కోట్ల రుణాన్ని బీవోఐ మంజూరు చేసింది. మూలధన, నిర్వహణ వ్యయాలు, అప్పటికి ఉన్న రుణ చెల్లింపులకు వీలుగా ఈ రుణాన్ని ఇచ్చింది. కానీ, నిబంధనలకు విరద్ధంగా రుణంలో సగాన్ని అదే ఏడాది అక్టోబర్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఆర్‌కామ్ ఇన్వెస్ట్ చేసింది. ఎస్‌బీఐ సైతం ఈ ఏడాది జూన్‌లో ఆర్‌కామ్ రుణ ఖాతాని ఫ్రాడ్‌గా వర్గీకరించడం గమనార్హం. రూ.2,929 కోట్ల రుణాన్ని దారి మళ్లించారంటూ ఎస్‌బీఐ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీబీఐ ఇప్పటికే కేసు దాఖలు చేసి చర్యలు మొదలు పెట్టడం గమనార్హం. ఇందులో భాగంగా గత శనివారం ఆర్‌కామ్ కార్యాలయం, అనిల్ అంబానీ నివాసాల్లో సోదాలు నిర్వహించింది. మరోవైపు తన సబ్సిడరీ అయిన రిలయన్స్ టెలికామ్ లిమిటెడ్ సైతం బీవోఐ నుంచి లేఖను అందుకున్నట్టు ఆర్‌కామ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. కంపెనీ రుణ ఖాతాను, మాజీ డైరెక్టర్ గ్రేస్ థామస్‌ను ఫ్రాడ్‌గా పేర్కొన్నట్టు వెల్లడించింది. 2017 జూన్ 30 నాటికి రూ.724.78 కోట్ల రుణ బాకీతో ఆర్‌కామ్ ఖాతా ఎన్‌పీఏగా మారినట్టు బీవోఐ తన లేఖలో ఆర్‌కామ్‌కు తెలియజేసింది.

అంబానీని లక్ష్యంగా చేసుకున్నారు..

అనిల్ అంబానీ అధికార ప్రతినిధి స్పందిస్తూ.. ఎస్‌బీఐ ఫిర్యాదు పదేళ్ల క్రితం నాటిదంటూ, నాడు అనిల్ అంబానీ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. కంపెనీ రోజువారీ కార్యకలాపాల్లో ఆయన పాత్ర లేదని స్పష్టం చేశారు. ఇదే కేసులో ఐదుగురు ఇతర నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లపై చర్యలను ఎస్‌బీఐ నిలిపివేసి, అంబానీని మాత్రం లక్ష్యంగా చేసుకున్నట్టు తెలిపారు. బీవోఐ చర్యలు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నట్టు చెప్పారు. వ్యక్తిగత విచారణకు బీవోఐ అవకాశం కల్పించలేదంటూ, ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా ఈ చర్యలు ఉన్నట్టు పేర్కొన్నారు. ''13 డైరెక్టర్లు, కీలక పదవుల్లోని వారికి జారీ చేసిన షోకాజు నోటీసులను బీవోఐ ఉపసంహరించుకుంది. కానీ, అనిల్ అంబానీపై మాత్రం అవే చర్యలను కొనసాగిస్తోంది''అని వివరించారు.

కంపేర్ చేసుకోండి.. కన్విన్స్ అవ్వండి..





కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

''పన్నెండు లక్షలు దాటకపోతే ట్యాక్స్ లేదన్నారు. రూ. 8 లక్షల ఆదాయానికే పన్ను కట్టమంటున్నారు'' అని విసుక్కున్నాడు వీరభద్రం తన కన్సల్టెంటు మీద. ''మనం కడుతున్నది 2025 మార్చి 31 నాటికి సంబంధించినది సార్'' అని కన్సల్టెంట్ చెప్పారు. ''అంటే?'' .. ఎదురు ప్రశ్న వేశాడు వీరభద్రం. పార్లమెంటులో ఆర్థిక మంత్రి ప్రసంగం, బిల్లు పాస్ అయిన వైనం 2026 మార్చి 31తో పూర్తయ్యే సంవత్సరానికి వర్తిస్తుందని ఎన్నో ఉదాహరణలతో చూపించిన తర్వాత, అశక్తుడై, ప్రతిఘటనతోనే ఒప్పుకున్నాడు వీరభద్రం. నికర ఆదాయంలో నుంచి బేసిక్ లిమిట్ తీసివేసి, మిగతా మొత్తంలో నుంచి మొదటి రూ. 3 లక్షలకు నిల్ అని లెక్క కట్టారు గోవిందరావుగారు. నా చేత ఎక్కువ పన్ను కట్టిస్తున్నారని వాపోయారు. ఎన్నో ఉదాహరణలను చూసిన తర్వాత కూడా ''ఇదంతా మాకు ఏం అర్థం అవుతుంది లెండి. మీరెంత అంటే అంతే'' అని మర్యాదగా వత్తాసు పలికారు.

''లాస్ట్ ఇయర్ ఇంత పన్ను కట్టలేదు. ఈసారి ఎక్కువ కడుతున్నాం'' అని హెచ్చరిక చేశాడు హరనాధం. ఆయన ఇచ్చిన ఫీజు రూ. 2,000కు మరో రెండు గంటలు వెచ్చించక తప్పదని నిర్ణయించుకున్నాడు కన్సల్టెంటు కామేశం గారు. గత ఆర్థిక సంవత్సరం, అంతక్రితం ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీతం, ఇంటద్దె, ఫిక్సిడ్ డిపాజిట్లపై వడ్డీ, సేవింగ్స్ అకౌంట్‌పై వడ్డీ, మ్యుచువల్ ఫండ్ వ్యవహారాలు, 80సీ సేవింగ్స్, 80డీ మెడిక్లెయిం, 80జీ డొనేషన్లు.. అన్నీ చెక్ చేసి, నికర ఆదాయం, పన్ను శ్లాబులు, పన్ను రేట్లు, పన్ను భారం, సెస్సు, సర్‌చార్జీ.. ఏదీ వదిలిపెట్టకుండా వివరించారు. చివరికి కన్విన్స్ అయ్యాడు హరనాధం. ''నాకు నమ్మకం ఉంది. మీరెందుకు తప్పు చేస్తారు'' అని ఓ కితాబిచ్చి కదిలాడు. వెళ్తూ.. వెళ్తూ.. ''మా బావమరిదికి నాకు ఆదాయం ఇంచుమించు సమానమే. వాడేమీ కట్టలేదన్నాడు. అందుకనే అడిగాను'' అంటూ సాగదీశాడు. ''కొత్త పద్ధతో, పాత పద్ధతో.. ఏది తక్కువైతే అది తగలెట్టండి'' అని వ్యంగ్యంగా అన్నాడు వామనరావు. ''అయ్యా ఏది తక్కువైతే అదే కట్టించండి'' అని వేడుకున్నాడు వెంకటేశం. ''పాఠక మహాశయులైన మిమ్మల్ని మేము వేడుకుంటున్నాం. కంపేర్ చేసి, కన్విన్స్ కండి''.. ఇది మా విన్నపం.

నిజమే మాస్టారు!! మీరు నైబర్‌తో, ఓనర్‌తో, మీ ఇంట్లో అద్దెకున్న వారితో, అన్నతో, తమ్ముడితో, వియ్యంకుడితో, మార్నింగ్ వాక్ ఫ్రెండుతో, యోగా కొలీగ్‌తో, మీ డాక్టర్‌గారి దగ్గరకొచ్చే పేషంటు ఫ్రెండుతో కంపేర్ చేసుకోవద్దండి. అందరి లెక్కలు ఒకలాగా ఉండవు. తేడాలుంటాయి. కాబట్టి, ఎంచక్కా మీరు మీ ఇన్‌కంతో మాత్రమే కంపేర్ చేసుకోండి.

- 2024 మార్చి 31కి సంబంధించిన ఆదాయం, అలాగే 2025 మార్చి 31కి వచ్చిన ఆదాయం
- డిడక్షన్లు.. అంశాలవారీగా
- టీడీఎస్ వివరాలు
- టీసీఎస్ వివరాలు
- అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు
- 2024 మార్చి 31కి ఏ పద్ధతిలో చెల్లించారు
- 2025 మార్చి 31కి ఏది ఫాలో అవుతున్నారు
- 2025 మార్చి 31 నాటికి రెండు పద్ధతుల్లోనూ పన్ను భారం లెక్కించి, కంపేర్ చేయండి.
- ఏ ఆదాయాన్నైనా మర్చిపోయారా
- గత సంవత్సరం వచ్చిన ఆదాయం ఏదైనా ఈ సంవత్సరంలో రాలేదా
- అలాగే డిడక్షన్లలో తేడాలు
- ఈ లెక్కలు కంపేర్ చేసి అప్పుడు కన్విన్స్ అవ్వండి.


ఇలా కంపేర్ చేయడానికి మీరు ఎవర్ని అడగనక్కర్లేదు. ఆధారపడక్కర్లేదు. మీరే చేసుకోవచ్చు. దాని ప్రకారం ఫాలో అవ్వండి. మీరే కన్విన్స్ అవుతారు. ఇంతలో పరుగెత్తుకుంటూ వచ్చాడు హరనాధం గారి బామ్మర్ది పరంధామయ్య. ''మా బావగారు నన్ను దెప్పి పొడుస్తున్నారు. మనం తప్పు చేశామా అని'' అంటూ. అప్పుడు కన్సల్టెంటు కామేశం తన వృత్తి రహస్యాలను చెప్పాడు. ''ఏమీ తప్పు చేయలేదండి. ఒక విషయం చెబుతా. ఇవన్నీ ప్రీఫిక్సిడ్ రిటర్నులు. మేము 26ఏఎస్ మొదలైన సమాచారాన్ని కరెక్టుగా ఎంటర్ చేస్తాం. ఆటోమేటిక్‌గా పోర్టల్ సమాచారాన్ని తీసుకుంటుంది. కొత్త పద్ధతా, పాత పద్ధతా అనేది చెబుతాం. పన్ను భారం లెక్కించబడుతుంది. ఎటువంటి తప్పులు జరగవు. ఆదాయం ఎంట్రీ, డిడక్షన్లు ఎంట్రీ, తప్పుగా రాస్తే తప్పు. లెక్కింపులో ఏ పొరపాటు జరగదు. చాలా కరెక్టుగా సాఫ్ట్‌వేర్ ఉంటుంది. అందుకని తప్పులు జరగవు. అయితే, మీలాంటివాళ్లు ఎక్సెల్ షీటులో మాన్యువల్‌గా చేసి, కంపేర్ చేసి, కన్విన్స్ అవ్వొచ్చు'' అని వివరించాడు. ఇది విని చిద్విలాసంగా బైల్దేరాడు పరంధామయ్య.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలానికి రాబడుల భరోసా!

బంధన్ స్మాల్‌క్యాప్ ఫండ్



ఒడిదుడుకులు ఉన్నా కానీ, దీర్ఘకాలంలో తమకు మెరుగైన రాబడులు కోరుకునే వారు తమ ఈక్విటీ పెట్టుబడుల్లో కొంత మొత్తాన్ని స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌కు తప్పకుండా కేటాయించుకోవాలి. కనీసం 15-20 ఏళ్ల కాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం వరకు స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవచ్చు. ఈ విభాగంలో బంధన్ స్మాల్‌క్యాప్ ఫండ్ మంచి పనితీరు ప్రదర్శిస్తోంది.

రాబడులు

గత ఏడాది కాలంలో ఈ పథకం 11.59 శాతం రాబడిని ఇచ్చింది. ఇదే కాలంలో బెంచ్ మార్క్ అయిన బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ టీఆర్ఐ పెరిగింది కేవలం 2.81 శాతమే. అంటే సూచీకి మించి పనితీరు చూపించింది. ఇదే కాలంలో స్మాల్‌క్యాప్ ఫండ్స్ విభాగం సగటు రాబడి సైతం 1.47 శాతంగానే ఉంది. గత మూడేళ్లలో ఏటా కాంపౌండెడ్ (సీఏజీఆర్) రాబడి 22.83 శాతం చొప్పున ఉంది. బెంచ్ మార్క్ రాబడి ఈ కాలంలో 15.23 శాతం చొప్పున ఉంది. ఐదేళ్లలో ఏటా 36.04 శాతం చొప్పున సీఏజీఆర్ రాబడి ఈ పథకంలో ఉంటే, బెంచ్ మార్క్ పెరిగింది 36.33 శాతంగా ఉంది. గత మూడు నెలల్లో బెంచ్ మార్క్ 17.26 శాతం నష్టపోగా, ఈ పథకంలో నష్టం 15.71 శాతంగా ఉంది. అంటే బెంచ్‌మార్క్‌తో పోల్చి చూస్తే అధిక రాబడితోపాటు.. నష్టాలను తక్కువకు పరిమితం చేయడాన్ని గమనించొచ్చు.



పెట్టుబడుల విధానం

మూడు నుంచి నాలుగేళ్ల కాలంలో రెట్టింపయ్యే వ్యాపారాలను ముందుగానే గుర్తించి ఇన్వెస్ట్ చేయడంలో ఫండ్ బృందానికి నైపుణ్యం ఉంది. ఉదాహరణకు 2023లో ఈ ఫండ్ పీఎస్‌యూలు, ఇంధన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టింది. సైక్లికల్ కంపెనీల వ్యాల్యూషన్లు పెరిగిపోవడంతో పెట్టుబడుల్లో మార్పులు చేసింది. ఆ తర్వాత ప్రభుత్వరంగ కంపెనీల్లో (పీఎస్‌యూ) పెట్టుబడులను క్రమంగా తగ్గించుకుంది. స్టాక్స్ వ్యాల్యుయేషన్లు ఖరీదుగా మారిపోవడంతో హెల్త్‌కేర్, టెలికం, ఇంటర్నెట్ తదితర రక్షణ అధికంగా ఉండే రంగాల్లో పెట్టుబడులు పెంచుకోవడాన్ని గమనించొచ్చు. రంగాల వారీ పెట్టుబడులను చురుగ్గా మారుస్తుండడాన్ని కూడా గుర్తించొచ్చు. దశాబ్దానికి పైగా అనుభవం ఉన్న మనీష్ గున్వానీ 2023లో ఈ ఫండ్ మేనేజర్‌గా వచ్చిన తర్వాత పనితీరు మరింత బలపడినట్టు తెలుస్తోంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.14,062 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 87 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 12.06 శాతం నగదు నిల్వలు కలిగి ఉంది. ఈక్విటీ కేటాయింపులను పరిశీలిస్తే స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 44 శాతం పెట్టుబడులు ఉండగా, మిడ్‌క్యాప్ కంపెనీల్లో 43.49 శాతం పెట్టుబడులు ఉన్నాయి. లార్జ్‌క్యాప్ కంపెనీల్లో 12.5 శాతం మేర ఇన్వెస్ట్ చేసింది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 199 స్టాక్స్ ఉన్నాయి. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో అత్యధికంగా 21.28 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. ఆ తర్వాత కన్జ్యూమర్ డిస్క్రిషినరీ కంపెనీలకు 13.64 శాతం, హెల్త్‌కేర్ కంపెనీలకు 11.89 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 10.69 శాతం, ఇండస్ట్రియల్స్ కంపెనీలకు 9.96 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
శోభ	3.37
ఎల్‌టీ ఫుడ్స్	2.36
సౌత్ ఇండియన్ బ్యాంక్	2.27
ఆర్ఈసీ	2.16
చోళమండలం ఫైనాన్షియల్	1.76
అపార్ ఇండస్ట్రీస్	1.59
పీసీబీఎల్	1.54
యథార్థ్ హాస్పిటల్	1.46
ఇన్ఫో ఎడ్జ్	1.34
అరవింద్	1.30

ఈసారీ పతకం వచ్చేనా!



నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

పారిస్: గత 10 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఏదో ఒక పతకంతో స్వదేశానికి తిరిగి వచ్చారు. వరుసగా 11వసారి కూడా ఈ మెగా ఈవెంట్ నుంచి పతకంతో తిరిగి రావాలనే లక్ష్యంతో... నేటి నుంచి పారిస్‌లో మొదలయ్యే ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు బరిలోకి దిగుతున్నారు. భారత్ నుంచి లక్ష్య సేన్, ప్రణయ్ (పురుషుల సింగిల్స్), పీవీ సింధు (మహిళల సింగిల్స్), సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి; హరిహరన్–రూబన్ (పురుషుల డబుల్స్), ప్రియ–శ్రుతి, రుతపర్ణ–శ్వేతాపర్ణ (మహిళల డబుల్స్), రోహన్–గద్దె రుత్విక శివాని; ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో (మిక్స్‌డ్ డబుల్స్) తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి పురుషుల సింగిల్స్‌లో ప్రకాశ్ పదుకొనే (1983; కాంస్యం), సాయిప్రణీత్ (2019; కాంస్యం), శ్రీకాంత్ (2021; రజతం), లక్ష్య సేన్ (2021; కాంస్యం), ప్రణయ్ (2023; కాంస్యం)... మహిళల సింగిల్స్‌లో సింధు (2013, 2014–కాంస్యం; 2017, 2018–రజతం; 2019–స్వర్ణం), సైనా (2015; రజతం)... పురుషుల డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ శెట్టి (2022; కాంస్యం)... మహిళల డబుల్స్‌లో గుత్తా జ్వాల–అశ్విని (2011; కాంస్యం) పతకాలు గెలిచారు.

సింగిల్స్ చాంప్స్ రౌనక్, శ్రియాంశి



సాక్షి, హైదరాబాద్: కొటక్ ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఐదు విభాగాల్లోనూ భారత క్రీడాకారులకే టైటిల్స్ లభించాయి. గచ్చిబౌలిలోని కొటక్ పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఆదివారం ఈ టోర్నీ ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో రౌనక్ చౌహాన్ (ఛత్తీస్‌గఢ్)... మహిళల సింగిల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రియాంశి వలిశెట్టి విజేతలుగా అవతరించారు. ఫైనల్స్‌లో శ్రియాంశి (తెలంగాణ) 21–12, 21–8తో ఐక్య శెట్టి (కర్ణాటక)పై, రౌనక్ 15–21, 21–13, 21–13తో తెలంగాణకు చెందిన జ్ఞానదత్తుపై విజయం సాధించారు. పురుషుల డబుల్స్ విభాగంలో నిరంజన్ నందకుమార్–పడిగెపాటి యుధజీత్ రెడ్డి (భారత్) జోడీ టైటిల్ సొంతం చేసుకుంది. ఫైనల్లో నిరంజన్ (తమిళనాడు)–యుధజీత్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్) ద్వయం 17–21, 21–14, 23–21తో భవ్య చాబ్రా (ఢిల్లీ)–లాల్‌రామ్‌సాంగా (మిజోరం) జంటను ఓడించింది. మహిళల డబుల్స్ టైటిల్ అదితి దీపక్‌రాజ్–వృద్ధి పొన్నమ్మ (భారత్) జోడీ దక్కించుకుంది. ఫైనల్లో అదితి–వృద్ధి (కర్ణాటక) ద్వయం 21–13, 21–17తో కీర్తి మంచాల (తెలంగాణ)–వర్ష ప్రభు ఆనంద్ (తమిళనాడు) జంటపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో వంశ్ దేవ్–శ్రావణి వాలేకర్ (భారత్) జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో వంశ్ దేవ్ (ఢిల్లీ)–శ్రావణి (మహారాష్ట్ర) ద్వయం 19–21, 21–16, 21–15తో మిథిలేశ్ కృష్ణన్ (పాండిచ్చేరి)–వర్ష ప్రభు ఆనంద్ (తమిళనాడు) జంటపై విజయం సాధించింది. భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వరనాథ్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

ముగ్గురు మొనగాళ్లు

హెడ్, మార్ష్, గ్రీన్ సెంచరీల మోత

- మూడో వన్డేలో ఆస్ట్రేలియా రికార్డు విజయం
- 276 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఓటమి
- 2–1తో సిరీస్ సఫారీల సొంతం



హెడ్



మార్ష్



గ్రీన్

మెకే (ఆస్ట్రేలియా): దక్షిణాఫ్రికా చేతిలో వన్డే సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా జట్టు... నామమాత్రమైన ఆఖరి మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. ఒకరిని మించి ఒకరు దంచికొట్టడంతో ఆసీస్ రికార్డు విజయం ఖాతాలో వేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన చివరి పోరులో ఆస్ట్రేలియా 276 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 431 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (103 బంతుల్లో 142; 17 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ మిచెల్ మార్ష్ (106 బంతుల్లో 100; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), కామెరూన్ గ్రీన్ (55 బంతుల్లో 118 నాటౌట్; 6 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. ఒకరి తర్వాత ఒకరు వంతులు వేసుకున్నట్లు వీరంగం ఆడటంతో... ఆస్ట్రేలియా తమ వన్డే చరిత్రలో రెండో అత్యధిక స్కోరు నమోదు చేసుకుంది. ఒకే జట్టుకు చెందిన ముగ్గురు ప్లేయర్లు సెంచరీలు కొట్టడం వన్డేల్లో ఇది రెండోసారి మాత్రమే. హెడ్, మార్ష్ తొలి వికెట్‌కు 250 పరుగులు జోడించగా... వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన గ్రీన్... సఫారీ బౌలర్లపై సునామీలా విరుచుకుపడ్డాడు. బంతి తన పరిధిలో ఉంటే చాలు దాని గమ్యస్థానం బౌండరీనే అన్న చందంగా చెలరేగిన గ్రీన్... ఆసీస్ తరఫున వేగవంతమైన సెంచరీ చేసిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు. వన్డేల్లో అతడికిదే తొలి శతకం కావడం విశేషం. అలెక్స్ కేరీ (37 బంతుల్లో 50 నాటౌట్; 7 ఫోర్లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. సఫారీ సీనియర్ పేసర్ కగిసో రబడ గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరం కాగా... ఇన్‌గిడికి ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతినిచ్చారు. దీంతో దక్షిణాఫ్రికా బౌలర్ల అనుభవ రాహిత్యాన్ని ఆసీస్ బ్యాటర్లు పూర్తిగా వినియోగించుకున్నారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. 24.5 ఓవర్లలో 155 పరుగులకే ఆలౌటైంది. డెవాల్డ్ బ్రెవిస్ (28 బంతుల్లో 49; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), టోనీ డి జోర్జి (33) కాస్త పోరాడగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. మార్క్‌రమ్ (2) రికెల్టన్ (11), బవుమా (19), స్టబ్స్ (1), ముల్డర్ (5) పెవిలియన్‌కు వరుస కట్టారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కూపర్ కొనోలి 22 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఘోర పరాజయం ఎదురైనా... తొలి రెండు వన్డేల్లో నెగ్గిన దక్షిణాఫ్రికా జట్టు 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది. హెడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కేశవ్ మహరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.



వన్డే సిరీస్ ట్రోఫీతో దక్షిణాఫ్రికా

431/2 వన్డేల్లో ఆస్ట్రేలియాకు ఇది రెండో అత్యధిక స్కోరు. 2006లో దక్షిణాఫ్రికాపై చేసిన 434/4 అగ్రస్థానంలో ఉంది.

47 సెంచరీ చేసేందుకు కామెరూన్ గ్రీన్‌కు అవసరమైన బంతులు. ఆసీస్ తరఫున ఇది రెండో వేగవంతమైన శతకం. మ్యాక్స్‌వెల్ (40 బంతుల్లో; 2023లో నెదర్లాండ్స్‌పై) అగ్రస్థానంలో ఉన్నాడు.

2 వన్డే మ్యాచ్‌లో ఒకే జట్టుకు చెందిన ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు చేయడం చరిత్రలో ఇది రెండోసారి. 2015లో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా తొలిసారి ఈ ఘనత నమోదు చేసుకుంది.

276 పరుగుల తేడా పరంగా వన్డేల్లో దక్షిణాఫ్రికాకు ఇదే అతిపెద్ద పరాజయం. 2023లో భారత్ చేతిలో ఎదురైన 243 పరుగుల ఓటమి రెండో స్థానానికి చేరింది. ఆస్ట్రేలియాకు ఇది రెండో అతిపెద్ద వన్డే విజయం. 2023లో ఆ జట్టు నెదర్లాండ్స్‌పై 309 పరుగుల తేడాతో నెగ్గింది.



రాడుకాను శుభారంభం

యూఎస్ ఓపెన్ టోర్నమెంట్

న్యూయార్క్: టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో మాజీ చాంపియన్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్) శుభారంభం చేసింది. ఆదివారం మొదలైన ఈ మెగా టోర్నీలో తొలి రౌండ్‌లో రాడుకాను 6–1, 6–2తో ఇనా షిబహారా (జపాన్)పై గెలుపొందింది. 62 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో 2021 చాంపియన్ రాడుకాను రెండు ఏస్‌లు సంధించింది. నెట్ వద్దకు ఏడుసార్లు దూసుకొచ్చిన ఆమె ఐదుసార్లు పాయింట్లు గెలిచింది. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని రాడుకాను ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు షిబహారా ఐదు డబుల్ ఫాల్ట్‌లతోపాటు 36 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది.

షెల్టన్ బోణీ

పురుషుల సింగిల్స్ విభాగంలో ఆరో సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా) గెలుపు బోణీ కొట్టాడు. ఇగ్నాసియో బుసె (పెరూ)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో షెల్టన్ 6–3, 6–2, 6–4తో విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. 2 గంటల 7 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో షెల్టన్ ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నెట్ వద్దకు 33 సార్లు దూసుకొచ్చి 26 సార్లు పాయింట్లు గెలిచాడు. 35 విన్నర్స్ కొట్టిన ఈ అమెరికా స్టార్ 32 అనవసర తప్పిదాలు చేశాడు. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని షెల్టన్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో 16వ సీడ్ జాకుబ్ మెన్సిక్ (చెక్ రిపబ్లిక్) 7–6 (7/5), 6–3, 6–4తో నికోలస్ జారీ (చిలీ)పై, 18వ సీడ్ డేవిడోవిచ్ ఫొకీనా (స్పెయిన్) 6–1, 6–1, 6–2తో అలెగ్జాండర్ షెవ్‌చెంకో (కజకిస్తాన్)పై నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.



మీరాబాయి మెరిసేనా!

నేటి నుంచి కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

అహ్మదాబాద్: ఏడాది విరామం తర్వాత భారత స్టార్ లిఫ్టర్, టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను పోటీల బరిలోకి దిగుతోంది. నేటి నుంచి ఇక్కడ జరిగే కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆమె స్టార్ ఆఫ్ అట్రాక్షన్ కానుంది. పారిస్ ఒలింపిక్స్‌లో కేవలం ఒక కిలోగ్రామ్ తేడాతో పోడియంలో నిలువలేకపోయిన మీరాబాయి తర్వాత గాయాల బారిన పడింది. దీంతో చాలా టోర్నీలకు ఆమె దూరం కావాల్సి వచ్చింది. ఇప్పుడు తాజాగా పతకం పట్టుపట్టేందుకు 32 ఏళ్ల మీరా 48 కేజీల కేటగిరీకి మారింది. లాస్ ఏంజెలిస్ 2028 ఒలింపిక్స్‌లో ఆమె రెగ్యులర్ కేటగిరీ కాకుండా 48 కేజీల కేటగిరీ ఉండటంతో ఇప్పటి నుంచే ఆ దిశగా కసరత్తు మొదలు పెట్టింది. వచ్చే ఏడాది గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ గేమ్స్‌కు ఈ తాజా చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ టోర్నీ కావడంతో మీరాబాయి సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆమెతో పాటు కామన్వెల్త్ క్రీడల రజత విజేత బింద్యారాణి దేవి, కాంస్య విజేతలు హర్జిందర్ కౌర్, లవ్‌ప్రీత్ సింగ్‌లు సహా భారత లిఫ్టర్లే ఈ టోర్నీలో ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు.

భారత జట్ల వివరాలు: మహిళలు: మీరాబాయి చాను (48 కేజీలు), స్నేహా సోరెన్ (53 కేజీలు), బింద్యారాణి (58 కేజీలు), నిరుపమా (63 కేజీలు), హర్జిందర్ కౌర్ (69 కేజీలు), హర్మన్‌ప్రీత్ కౌర్ (77 కేజీలు), వన్షిత (86 కేజీలు), మెహక్ (+86 కేజీలు). **పురుషులు:** రిషికాంత సింగ్ (60 కేజీలు), ఎం.రాజా (65 కేజీలు), నారాయణ అజిత్ (71 కేజీలు), వల్లూరి అజయ్ బాబు (79 కేజీలు), అజయ్ సింగ్ (88 కేజీలు), దిల్బాగ్ సింగ్ (94 కేజీలు), హర్‌చరణ్ సింగ్ (110 కేజీలు), లవ్‌ప్రీత్ సింగ్ (+110 కేజీలు).

హైదరాబాద్‌కు రెండో విజయం

రాణించిన తనయ్, రోహిత్, నితీశ్, అనికేత్



అనికేత్

చెన్నై: ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. జార్ఖండ్ జట్టుతో జరిగిన మూడు రోజుల మ్యాచ్‌లో హైదరాబాద్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. జార్ఖండ్ నిర్దేశించిన 84 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన హైదరాబాద్ 22.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసి నెగ్గింది. స్కోరు 83 వద్ద అనికేత్ రెడ్డి సిక్స్ కొట్టి హైదరాబాద్ విజయాన్ని ఖరారు చేశాడు. జార్ఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 283 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (4/75), రోహిత్ రాయుడు (4/69) రాణించారు. అనంతరం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 82.4 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటై 47 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. నితీశ్ రెడ్డి (106; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేయగా... రాహుల్ రాధేశ్ (70; 6 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ గౌడ్ (65; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 47 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన జార్ఖండ్ 25.3 ఓవర్లలో 130 పరుగులకు కుప్పకూలింది. హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (4/74), అనికేత్ రెడ్డి (3/25) ఆకట్టుకున్నారు. 84 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ ఒకదశలో 61 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది. అయితే రోహిత్ రాయుడు (31 బంతుల్లో 18 నాటౌట్; 1 సిక్స్), అనికేత్ రెడ్డి (13 బంతుల్లో 12 నాటౌట్; 1 సిక్స్) తొమ్మిదో వికెట్‌కు 28 పరుగులు జోడించి హైదరాబాద్‌ను విజయతీరానికి చేర్చారు.



మ్యాడీ డార్క్

భారత మహిళల 'ఎ' జట్టు ఓటమి

ఏకైక అనధికారిక టెస్టులో 6 వికెట్లతో ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టు విజయం

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టుతో జరిగిన ఏకైక అనధికారిక టెస్టులో భారత మహిళల 'ఎ' జట్టు 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. ఓవర్‌నైట్ స్కోరు 260/8తో చివరి రోజు ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత మహిళల 'ఎ' జట్టు 81.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. నాలుగో రోజు భారత జట్టు క్రితం రోజు స్కోరుకు 26 పరుగులు జోడించి మిగిలిన రెండు వికెట్లు కోల్పోయింది. ఆస్ట్రేలియా బౌలర్లలో అమీ ఎడ్గర్ 5 వికెట్లు పడగొట్టింది. అనంతరం 281 పరుగుల లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టు 85.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 283 పరుగులు చేసి విజయం సాధించింది. రాచెల్ ట్రెనామన్ (143 బంతుల్లో 64; 6 ఫోర్లు), మ్యాడీ డార్క్ (116 బంతుల్లో 68; 6 ఫోర్లు), అనికా లిరాయ్డ్ (125 బంతుల్లో 72; 9 ఫోర్లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. కెప్టెన్ తహిలా విల్సన్ (104 బంతుల్లో 46; 4 ఫోర్లు) సైతం రాణించింది. భారత మహిళల 'ఎ' జట్టు బౌలర్లలో సైమా ఠాకూర్ 2 వికెట్లు పడగొట్టింది. ఈ పర్యటనలో భాగంగా అంతకుముందు టి20 సిరీస్‌ను 0–3తో కోల్పోయిన భారత మహిళల 'ఎ' జట్టు... వన్డే సిరీస్‌ను 2–1తో చేజిక్కించుకుంది.

అనుష్క 'హ్యాట్రిక్'

థింపూ (భూటాన్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్–17 చాంపియన్‌షిప్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు వరుస విజయాలతో దూసుకెళుతోంది. ఆదివారం జరిగిన పోరులో భారత జట్టు 8–0తో భూటాన్‌పై ఏకపక్ష విజయం సాధించింది. స్ట్రయికర్ అనుష్క కుమారి 'హ్యాట్రిక్' గోల్స్‌తో అదరగొట్టింది. ఆమె 53వ, 61వ, 73వ నిమిషాల్లో అద్భుతంగా మూడు గోల్స్ చేసింది. ఆమెతో పాటు అభిస్తా బస్నెట్ (23వ, 89వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా, పర్ల్ ఫెర్నాండెజ్ (71వ నిమిషంలో), దివ్యాని (77వ నిమిషంలో), వలైనా (90+2 ఇంజ్యూరీ టైమ్)లో తలా ఒక గోల్ చేయడంతో భూటాన్ శిబిరం కకావికలమైంది. నిజానికి తొలి అర్ధభాగంలో భారత్ 1–0తో మాత్రమే ఆధిక్యంలో ఉంది. ఆరంభం నుంచే దాడులను ముమ్మరం చేసిన భారత స్ట్రయికర్లు పలుమార్లు ప్రత్యర్థి లక్ష్యంపై గురిపెట్టినప్పటికీ విఫలమయ్యారు. ఎట్టకేలకు అభిస్తా 23వ నిమిషంలో గోల్ చేయడంతో ఖాతా తెరిచింది. అయితే అసలు ఆట, భారత అమ్మాయిల జోరు ద్వితీయార్ధంలోనే మొదలైంది. తర్వాతి 45 నిమిషాల్లో భారత్ ఏకంగా 7 గోల్స్ చేయడం విశేషం.

చెరుగుతున్న చేతిరాత

టెక్స్టింగ్, టైపింగులదే రాజ్యం ● అలంకారప్రాయంగా మిగిలిన పెన్ను

ప్రస్తుతం అంతా డిజిటల్ యుగం. **చేతిరాత దాదాపుగా** చచ్చిపోతోంది. డిజిటల్ **అవకాశాలు చేతిరాత** అవసరాన్నే దాదాపుగా **తగ్గించేశాయి. రాత అవసర**మైన కెరీర్‌ను పక్కకు **పెట్టే అవకాశం వచ్చింది.** ఒకప్పుడు చొక్కా జేబులకు **హుందాగా వేలాడిన** పెన్ను ఇప్పుడు అలంకారప్రాయంగా **కూడా మిగలని** పరిస్థితి! కాలేజీ విద్యార్థులు **టైపింగ్, టెక్స్టింగ్** చేయడం లేదా వాయిస్ నోట్స్ పంపడం చేస్తున్నారు. స్క్రీన్లపై, వ్యాకరణ స్లిప్‌లు, అక్షర దోషాలు కూడా ఆటోకరెక్ట్ అవుతున్నాయి. ఇలాంటి డిజిటల్ యుగంలో ఇంకా విద్యార్థులకు 'చేతిరాత'శిక్షలు అవసరమా? ఇది ఇప్పుడు పాఠశాలలు ఆలోచించాలంటున్నారు నిపుణులు. 'పేలవమైన చేతివ్రాతను శిక్షించడం మానేయాలి. విద్యార్థి పనిని ప్రదర్శన కోసం కాకుండా కంటెంట్ కోసం అంచనా వేయాలి. ప్రత్యామ్నాయ మూల్యాంకన పద్ధతులను అన్వేషించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇద్దరూ పిల్లలకు వ్యక్తిగత రచన కోసం ప్రైవేట్ స్థలాన్ని ఇవ్వాలి. యువతకు రాయడానికి, విఫలమవడానికి, నేర్చుకోవడానికి అవకాశం ఇవ్వండి. వారిని శిక్షించే పద్ధతులను మార్చండి'అని సూచిస్తున్నారు. ఇలాంటి చిన్న చిన్న ఎత్తుగడలు చేతిరాత భయం యొక్క మూల కారణాలను తొలగిస్తాయి. రాయడం ముఖ్యమైన జీవిత నైపుణ్యమే. అలాంటి చోట పెన్ను ఒక సాధనంగా ఉండాలే తప్ప.. బెదిరింపు ఆయుధంగా మారకూడదని హెచ్చరిస్తున్నారు.



గ్రాఫో ఫోబియా

'ముత్యాల్లాంటి అక్షరాలు.. రాత చూస్తేనే మార్కులు పడిపోతాయి'అందమైన చేతిరాత ఉన్న విద్యార్థులకు ఉపాధ్యాయులిచ్చే కితాబు. 'ఏంట్రా ఈ కొంగలు తొక్కిన రాత.. ఇట్లా రాస్తే ఏం అర్థమవుతుంది?'... ఇవి రాత బాగలేని వారికి పడే చివాట్లు. ఇప్పటికీ మన దేశంలోని తరగతి గదుల్లో టీచర్స్ నోట వినబడే ముచ్చట్లు. అవును చేతిరాతలు ఒకప్పుడు తలరాతలను మార్చాయి. కొందరికి మాత్రం ఫోబియాను మిగిల్చాయి. ప్రస్తుత డిజిటల్ యుగంలో.. చేతిరాత కళపై చర్చ జరుగుతోంది. చేతిరాత అనగానే గుర్తొచ్చేది కాపీరైటింగ్ నోట్స్. తెలుగుకోసం డబల్ రూల్.. ఇంగ్లిష్ కోసం ఫోర్ రూల్ బుక్స్. రాత బాగుపడటం కోసం పదేపదే రాయించే టీచర్స్. రాత బాగోకపోతే టీచర్లతో పడే తిట్లు. బాగున్నందుకు అందే మెచ్చుకోళ్లు. పాఠశాలలో ఉండగా డైరీ ఎంట్రీలు.. యవ్వనంలో ప్రేమలేఖలు. అవి కొందరిని సృజనాత్మక రచనలోకి మారేలా చేస్తే.. రాత సరిగ్గా లేని కొందరినీ భయంలోకి నెట్టేశాయి. అందుకే.. చిన్న దరఖాస్తు.. అందులో రాయాల్సిందల్లా పేరు, చిరునామా, తేదీ మాత్రమే. అయినా సరే.. పెన్ను, పేపర్ తాకగానే ఓ బెరుకు.. అక్షరం ముందుకు కదలదు. అబ్బా ఆన్‌లైన్ ఫామ్ పెట్టొచ్చు కదా.. ఎంత వయసొచ్చినా సరే.. ఇప్పటికీ కొంతమందికి ఉండే ఫోబియా ఇది. చేతిరాత సరిగా లేక.. బాల్యంలో టీచర్ చేత తిన్న తిట్లు గుర్తుకు వచ్చి కలిగే భయం. దీనిని గ్రాఫోఫోబియా (చేతివ్రాత భయం), స్క్రిప్టోఫోబియా (బహిరంగంగా రాయడానికి భయం) అని పిలుస్తారు. బాల్యంలో చేతిరాత సరిగా లేకపోవడం వల్ల ఎంతో మందికి మిగిల్చిన చేదు జ్ఞాపకాలు.. ఆ తరువాత ఉన్నత విద్యను, ఆపైన కెరీర్‌ను కూడా ప్రభావితం చేశాయంటే అతిశయోక్తి కాదు.

శిక్షగా రాత!

భారత విద్యా వ్యవస్థలో నేటికీ చేతిరాతే ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇటీవల ముంబైలోని ఒక ట్యూషన్ టీచర్ చేతి రాత సరిగా లేదని ఎనిమిదేళ్ల బాలుడి చేతిని కొవ్వొత్తితో కాల్చిన విషయం తెలిసిందే. క్లాస్‌రూమ్‌లో చేసిన తప్పులకు శిక్షగా కూడా ఈ చేతిరాతనే ప్రయోగిస్తుంటారు ఉపాధ్యాయులు. క్లాసు జరుగుతుండగా మాట్లాడిన విద్యార్థితో 'నేను మళ్లీ తరగతిలో మాట్లాడను'అని 200 సార్లు రాయమని సూచించడం అందుకో ఉదాహరణ. చేతిరాతలో జెండర్ పాత్ర కూడా ఉంది. అమ్మాయివై ఉండి ఇట్లా రాస్తే ఎట్లా.. అని టీచర్లతో తిట్లుతిన్న అమ్మాయిలనేకం. ఆ ఒత్తిడి కొందరికి కాలిగ్రఫీ, స్టెనోగ్రఫీ లాంటివాటిపై ప్రేమను పెంచితే.. పదేపదే విమర్శలు మరికొందరికి అవమాన భారాన్ని మిగిల్చాయి. ఈ శిక్షలు రాయడాన్ని శిక్ష, అవమానంగా అలవాటు చేశాయి. పేలవమైన చేతిరాత భయంతో రాయడం మానేశామని 36.3% మంది విద్యార్థులు 2012 జరిగిన ఓ అధ్యయనంలో చెప్పారంటే.. తీవ్రత ఏపాటిదో అర్థమవుతుంది. ఇప్పుడంటే వాట్సాప్, మెసెంజర్, ఈమెయిల్.. వీటన్నింటికీ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో పాస్‌వర్డ్‌తో సంరక్షణ ఉంది కాబట్టి ఎవరో చూస్తారనే భయం లేదు. కానీ.. యువతకు గోప్యత అంటూ లేని కాలంలో.. తమ డైరీనో లేఖనో దొరికితే.. కలిగే అవమానం, శిక్ష.. చేతిరాతను జీవితాంతం ట్రామాగా మిగిల్చిన సందర్భాలూ ఉన్నాయి. ఇవన్నీ.. మెదడులోని హిప్పోకాంపస్, లింబిక్ వ్యవస్థలను ప్రభావితం చేస్తాయి. ఇది శ్రద్ధ, జ్ఞాపకశక్తి, భావోద్వేగాల నియంత్రణను దెబ్బతీస్తుంది. అందుకే రాయడానికి పెన్ను పట్టుకోగానే వారికి చేతిలో వణుకు, అరచేతులకు చెమటలు రావడం, గుండె వేగంగా కొట్టుకోవడం, వికారం, తిమ్మిర్లు రావడం, మణికట్టు నొప్పి వస్తాయి. ఇవన్నీ ఒకప్పుడు వారు ఎదుర్కొన్న అవమానాల తాలూకు మానసిక సంకేతాలు.

- సాక్షి, నేషనల్ డెస్క్



యుద్ధ ఖైదీల మార్పిడిలో భాగంగా ఆదివారం ఉక్రెయిన్ చెర నుంచి విడుదలై బెలారస్ నుంచి వస్తున్న రష్యా సైనికుల హర్షాతిరేకాలు (ఇన్‌సెట్‌లో)కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఓ జవాను




ఆదివారం బిహార్‌లోని అరారియాలో ఓటర్ అధికార్ యాత్ర సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఓ టీ దుకాణం యజమాని ఇంటికెళ్లి ముచ్చటించినప్పటి దృశ్యమిది

ప్రాణాలు పణంగా పెట్టి విధులకు..

హిమాచల్ ప్రదేశ్‌లో ఓ నర్స్ సాహసం..

మండి: తండాల్లో ఉన్న గిరిజనులకు వైద్యం అందించడానికి కొండ, కోనల్లో కిలోమీటర్లు నడిచిన నర్సులను తెలుగు రాష్ట్రాల్లో చూశాం. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఈ నర్సు... విధి నిర్వహణకోసం ఉప్పొంగి ప్రవహిస్తున్న నదిని సైతం లెక్క చేయడం లేదు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను చేరుకోవడానికి గర్జిస్తూ ప్రవహిస్తున్న వాగును దాటి వెళ్తున్నారు. మండి జిల్లాకు చెందిన నర్సు వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జిల్లాలోని టిక్కర్ గ్రామానికి చెందిన కమల పక్కనే ఉన్న గ్రామంలో నర్సుగా పనిచేస్తున్నారు. ఆమె విధులకు హాజరు కావడానికి ప్రతిరోజూ దాదాపు నాలుగు కిలోమీటర్లు ప్రయాణిస్తుంటారు. అయితే ఈ ప్రాంతాన్ని ప్రస్తుతం భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు కొట్టుకుపోయాయి. ఆమె రోజువారీ ప్రయాణం కష్టంగా మారింది. నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఆమె నదిలోని రాళ్లను దాటుతూ వెళ్తున్నారు. ఈక్రమంలో ఒక్క అడుగు తప్పుగా వేసినా.. నదిలో కొట్టుకు పోవాల్సిందే. అయినా.. ఏమాత్రం వెరవకుండా వెళ్తుండటం చూసేవాళ్లకు వణుకు పుట్టిస్తోంది. ఆకస్మిక వరదల కారణంగా వారాల్లో చౌహార్ లోయ విస్తృతంగా నష్టపోయింది. వంతెనలు, రోడ్లు కూలిపోయాయి. హిమాచల్ ప్రదేశ్ అంతటా 313 రోడ్లు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. వాటిలో 160 మండి జిల్లాలోనే ఉన్నాయి. దీంతో సిల్బుధాని, తర్స్వాన్ వంటి పంచాయతీలు ఇబ్బంది పడుతున్నాయి. కమల వంటి అనేక మంది ఉద్యోగులు, కార్మికులు, స్థానికులు తమ రోజువారీ కార్యకలాపాలకోసం ఇలాంటి కాలువలు, వాగుల మీద ప్రమాదకర క్రాసింగ్‌లపై ఆధారపడుతున్నారు.



ట్రక్కు డ్రైవర్‌కు క్షమాభిక్ష పెట్టాలని 15 లక్షల సంతకాలు

అమెరికన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత ● ఇమిగ్రేషన్ విధానాలపై చర్చ

ఫ్లోరిడా: అమెరికాలో ముగ్గురు మృతికి కారణమైన ట్రక్కు డ్రైవర్ హర్జిందర్ సింగ్ కేసు వివాదాస్పదమవుతోంది. అతనికి క్షమాభిక్ష కోసం వేసిన ఆన్‌లైన్ పిటిషన్ ఇప్పుడు వైరల్ అవుతోంది. హర్జిందర్ సింగ్‌కు మద్దతుగా 15 లక్షల మందికి పైగా సంతకాలు చేశారు. అయితే.. హత్యానేరం ఎదుర్కొంటున్న వ్యక్తికి క్షమాభిక్ష కోరడంపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది ఇమిగ్రేషన్ సంబంధింత విధానాలపై చర్చకు దారి తీసింది.

ఫ్లోరిడాలోని ఫోర్ట్ పియర్స్‌లో భారతీయ డ్రైవర్ 28 ఏళ్ల హర్జిందర్ సింగ్ తప్పుడు యూ–టర్న్ తీసుకోవడంతో అతను నడుపుతున్న ట్రక్కు.. మినీ వ్యాన్‌ను ఢీకొంది. దీంతో అందులో ఉన్న ముగ్గురు మరణించారు. ఆగస్టు 12న ఈ ప్రమాదం జరిగింది. సింగ్ 2018లో అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించి కాలిఫోర్నియాలో వాణిజ్య డ్రైవింగ్ లైసెన్స్ పొందాడని ఆరోపణలున్నాయి. అయితే ఈ ప్రమాదం కేసులో గతవారం అతన్ని కాలిఫోర్నియాలోని స్టాక్‌టన్‌లో అరెస్టు చేసి ఫ్లోరిడాకు తిరిగి అప్పగించారు. ఈ ప్రమాదం తరువాత పత్రాలు లేని వలసదారుల వల్ల ప్రమాదాల గురించి ఆందోళన తలెత్తింది. వాణిజ్య ట్రక్ డ్రైవర్లకు వర్కర్ వీసాలు జారీకి అమెరికా ప్రభుత్వం తాత్కాలిక విరామం ప్రకటించింది.

అయితే.. హర్జిందర్ సింగ్‌ను విడుదల చేయాలంటూ ఆన్‌లైన్‌లో పిటిషన్ వేశారు. అది ఒక విషాదకరమైన ప్రమాదమని, ఉద్దేశపూర్వకమైన చర్యకాదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో ఆ పిటిషన్‌కు ఎక్కడలేని ఆదరణ లభించింది. ఆయనకు క్షమాభిక్ష పెట్టాలంటూ 15లక్షల మందికి పైగా సంతకాలు చేశారు. దీనిపై స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. ముగ్గురు అమెరికన్ పౌరుల మరణానికి కారణమైన వ్యక్తిని విడుదల చేయాలని కోరుకుంటున్నవారి ఇమ్మిగ్రేషన్ స్థితిని తనిఖీ చేయాలంటూ డిమాండ్ మొదలైంది. ప్రమాదానికి కారణమైన వ్యక్తి తెల్లవాడైతే, చనిపోయిన వారు భారతీయులైతే వారు ఇలాంటి పిటిషన్‌పై సంతకం చేయరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురిని హత్య చేసిన వ్యక్తికి శిక్ష పడకూడదని కోరుకోవడం హాస్యాస్పదమంటున్నారు. అతనికి మద్దతు ఇస్తున్నవారిని బహిష్కరించాలని కోరుతూ మరో పిటిషన్ ప్రారంభించారు. అమెరికా ఇలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోదని, దానిని సమర్థించే వారికి ఆశ్రయం ఇవ్వబోదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

గాజాలో బాంబుల మోత

24 గంటల వ్యవధిలో 64 మంది మృతి ● భవనాలను పేల్చి వేస్తున్న ఇజ్రాయెల్ ఆర్మీ

గాజా సిటీ: ముందుగా ప్రకటించిన విధంగానే గాజాస్ట్రిప్‌లోని గాజా నగరాన్ని పూర్తిస్థాయిలో ఆక్రమించుకునే ఇజ్రాయెల్ బలగాలు ప్రయత్నాలను వేగవంతం చేశాయి. గాజా నగరానికి ఉత్తరాన ఉన్న జబాలియాలోని శరణార్థుల శిబిరాలపై రాత్రంతా దాడులు, పేలుళ్లు కొనసాగాయని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. రఫా మాదిరిగానే జబాలియాను శిథిలాల దిబ్బగా మార్చేందుకు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రయత్నిస్తోందని అన్నారు. జెయిటౌన్, షెజాయియా, సబ్రా ప్రాంతాలపైనా రాత్రంగా బాంబు దాడులు కొనసాగాయి. ఈ సైనిక చర్య కోసం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ 60 వేల రిజర్వు బలగాలను త్వరలోనే రంగంలోకి దించుతామని ప్రకటించడం తెల్సిందే. అందుకు వేదికను సిద్ధం చేసేందుకు గాజా నగరానికి సమీపంలోని జబాలియాలోని భవనాలను సైతం ఇజ్రాయెల్ బలగాలు పేల్చి వేస్తున్నాయి. ఇజ్రాయెల్ ఆర్మీ దాడుల్లో 24 గంటల వ్యవధిలో కనీసం 64 మంది చనిపోగా సుమారు 300 మంది గాయాలపాలయ్యారని హమాస్ ఆధ్వర్యంలో గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి హమాస్ లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో మరణించిన వారి సంఖ్య 62,686కు, క్షతగాత్రుల సంఖ్య 1.75 లక్షలు దాటిందని వివరించింది. ఇజ్రాయెల్ సైన్యం దాడులతో గాజా ప్రాంతంలోని ఇళ్లలో 90 శాతంపైగా నేలమట్టం కావడమో ధ్వంసమవడమో జరిగింది. అక్కడి ఆరోగ్య వ్యవస్థ దెబ్బతింది. మొత్తం 36 ఆస్పత్రులకు గాను 18 ఆస్పత్రులు, అదీ పాక్షికంగా పనిచేస్తున్నాయి. నీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది.



సహాయ కేంద్రాల వద్ద మరో నలుగురు మృతి

గాజా నగరంలో ఆదివారం ఆహార పంపిణీ కేంద్రం వద్దకు చేరుకున్న వారిపై ఇజ్రాయెల్ బలగాలు జరిపిన కాల్పుల్లో మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. నెట్‌జరిమ్ కారిడార్ వద్ద ఘటన చోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాల్పులతో భీతిల్లిన కొందరు పరుగులు తీయగా, గాయపడిన కొందరు నేలపై పడిపోయారన్నారు. ఐరాసతోపాటు ఇతర సంస్థలు ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఇప్పటి వరకు 2 వేల మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా 13,500 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. అదేవిధంగా, పోషకాహార లోపంతో మరో 8 మంది చనిపోగా ఇప్పటి వరకు ఇలా 281 మంది చనిపోయినట్లయిందని వివరించింది. వీరిలో చిన్నారులే 115 మంది వరకు ఉన్నట్లు తెలిపింది. ఇలా ఉండగా, జూలై 21వ తేదీ నుంచి గాజా నుంచి తీసుకెళ్లిన తమ సిబ్బందిని ఇజ్రాయెల్ ఆర్మీ ఆదివారం వదిలేసిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఇతర వివరాలను మాత్రం వెల్లడించలేదు.

'రష్యా చమురు'పై ట్రంప్ అభిప్రాయాన్ని సీరియస్‌గా తీసుకోండి

భారత్‌కు నిక్కీ హేలీ సూచన

న్యూయార్క్: రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళనలను తీవ్రంగా పరిగణించాలని భారత సంతతికి చెందిన రిపబ్లిక్ నాయకురాలు నిక్కీ హెలీ భారత్‌ను హెచ్చరించారు. ఈ సమస్య పరిష్కారం కోసం వైట్‌హౌస్‌తో కలిసి పనిచేయాలని ఆమె సూచించారు. నాలుగు రోజుల క్రితం న్యూస్‌వీక్‌లో రాసిన వ్యాసంలోని ఒక భాగాన్ని హేలీ తాజాగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రష్యా చమురుపై ట్రంప్ అభిప్రాయాన్ని భారత్ తీవ్రంగా పరిగణించాలి. పరిష్కారం కోసం వైట్‌హౌస్‌తో కలిసి పనిచేయాలి. అది ఎంత త్వరగా చేస్తే అంత మంచిది. దశాబ్దాల పాటు మంచి స్నేహం ఉన్న ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య ఉన్న వివాదాలపు పరిష్కరించడానికి బలమైన పునాది కల్పించేది ఈ చర్చలే. వాణిజ్య విబేధాలు, రష్యన్ చమురు దిగుమతులు వంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి సంప్రదింపులు అవసరం. చైనాను ఎదుర్కోవడం మన ఉమ్మడి లక్ష్యం అనే అత్యంత ముఖ్యమైన విషయాన్ని మర్చిపోకూడదు' అని ఆమె పోస్టులో పేర్కొన్నారు. భారత్–రష్యాల మధ్య ఇంధన సంబంధాలను అమెరికా విమర్శిస్తోంది. రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేయడం వల్ల మాస్కోకు ఉక్రెయిన్‌పై యుద్ధానికి నిధులు సమకూరుస్తున్నాయని అమెరికా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను భారతదేశం తీవ్రంగా తిరస్కరించింది. భారత వస్తువులపై సుంకాలను 50 శాతానికి రెట్టింపు చేయడంతో పాటు రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందుకు 25 శాతం అదనపు సుంకాలను విధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల తరువాత ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. రష్యా ముడి చమురుకు అతిపెద్ద దిగుమతిదారు అయిన చైనాను అమెరికా విమర్శించకపోవడం గమనార్హం.

ఢిల్లీ చేరుకున్న ఫిజీ ప్రధాని రబుకా

న్యూఢిల్లీ: భారత్‌లో మూడు రోజుల పర్యటనకు గాను ఫిజీ ప్రధానమంత్రి సిటివెని రబుకా ఆదివారం ఢిల్లీ చేరుకున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే ఆయన పర్యటన లక్ష్యం. రబుకాకు విమానాశ్రయంలో కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ స్వాగతం పలికారు. ఆయన వెంట ఆరోగ్యమంత్రి లలబలవు సహా పలువురు ఉన్నతాధికారులతో కూడిన బృందం కూడా ఉంది. సోమవారం రబుకాతో ప్రధాని మోదీ భేటీ అవుతారు. రబుకా గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు. పసిఫిక్ ద్వీప దేశమైన ఫిజి భారత్‌కు తీర సముద్ర రక్ష సంబంధాల్లో కీలకంగా ఉంది. రెండు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు బలంగా ఉన్నాయి. బ్రిటిష్ హయాంలో భారత కార్మికులను ఫిజీకి తరలించిన 1879 నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు కొనసాగుతున్నాయి. ఆదేశంలో భారతీయులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. గతేడాది రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిజీలో పర్యటించారు.

బిహార్ ఓటరు జాబితాలో ఇద్దరు పాకిస్తానీలు

భాగల్‌పూర్: బిహార్‌లోని భాగల్‌పూర్ జిల్లాలో ఓటరు జాబితాలో ఇద్దరు పాకిస్తాన్ జాతీయుల పేర్లు ఉండటంతో కలకలం రేగింది. వీసాలు గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలోనే ఉంటున్న విదేశీయులపై హోం శాఖ జరిపిన దర్యాప్తులో ఈ విషయం బయటపడింది. ఈ విషయంపై ఎన్నికల సంఘం, హోం శాఖ ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇబ్తుల్ హసన్ భార్య ఇమ్రానా ఖానం అలియాస్ ఇమ్రానా ఖాతూన్, మహ్మద్ తఫ్జీల్ అహ్మద్ భార్య ఫిర్దొసియా ఖానం పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయి. అయితే.. ఫిర్దొసియా 1956 జనవరి 19న మూడు నెలల వీసాపై, ఇమ్రానా మూడేళ్ల వీసాపై భారత్‌కు వచ్చారని హోం శాఖ తెలిపింది. 'ఇమ్రానా ఖానం గురించి ఆగస్టు 11న నాకు హోం శాఖ నుండి నోటీసు అందింది. ఆమె పాస్‌పోర్ట్ 1956 నాటిది. ఆమెకు 1958లో వీసా వచ్చింది. ఆమె పాకిస్తాన్‌కు చెందినది. వృద్ధురాలు, అనారోగ్యంతో ఉంది. ఆమె పేరును తొలగించే ప్రక్రియను ప్రారంభించాం' బూత్ లెవల్ ఆఫీసర్ ఫర్జానా ఖానం తెలిపారు.

క్షిపణి పరీక్షలను ప్రత్యక్షంగా వీక్షించిన కిమ్

సియోల్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ రెండు కొత్తరకం యాంటీ ఎయిర్ క్షిపణుల పరీక్షలను శనివారం ప్రత్యక్షంగా తిలకించారు. దక్షిణ కొరియా, అమెరికాలు ఉమ్మడి సైనిక విన్యాసాలను కొనసాగిస్తున్న వేళ పెరిగిన తన సైనిక సామర్థ్యాలను ప్రదర్శించుకోవడమే ఆయన లక్ష్యమని చెబుతున్నారు. డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులతో జరిగే దాడులను ఈ క్షిపణులు పక్కాగా అడ్డుకుంటాయని అధికార వార్తా సంస్థ తెలిపింది. ఆ క్షిపణులు ఏ రకానివి, పరీక్షలు ఏప్రాంతంలో జరిగాయి వంటి విషయాలను వెల్లడించలేదు. అణు, క్షిపణి కార్యక్రమాలను తగ్గించుకోవడమే లక్ష్యంగా నిలిచిన చర్చలను మరోసారి మొదలుపెడతామంటూ అమెరికా, దక్షిణ కొరియా ఇస్తున్న పిలుపును కిమ్ పారేస్తూ రష్యాతో సంబంధాలను మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా విధానాలను మార్చుకుంటున్నారు.

డ్రగ్ పెడ్లర్ల దాడిలో పోలీసులకు గాయాలు

ముంబై: ముంబైలో మాదక ద్రవ్యాల విక్రేతలు చెలరేగిపోయారు. పట్టుకోబోయిన పోలీసులపై పదునైన ఆయుధాలతో దాడికి దిగారు. ఘటనలో ఇద్దరు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన శనివారం రాత్రి డియోనార్ ప్రాంతంలో చోటుచేసుకుంది. గంజాయి తాగుతున్న నలుగురైదుగురి బృందాన్ని గుర్తించిన గస్తీ కానిస్టేబుళ్లు వారిని పట్టుకునేందుకు యత్నించారు. తిరగబడిన పెడ్లర్లు వారిపై దాడికి తెగబడ్డారు. ఘటనలో ఒక కానిస్టేబుల్‌కు పొట్ట, ఛాతీ భాగంలో , మరొకరికి చెవి వద్ద గాయమైంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఇద్దరినీ అరెస్ట్ చేసి, హత్యాయత్నం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

జార్ఖండ్ మాజీ సీఎం చంపయ్ సోరెన్ గృహ నిర్బంధం

రిమ్స్ ఆస్పత్రి స్థల సేకరణపై గిరిజన సంఘాల ఆందోళన

రాంచీ: జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రిమ్స్–2 ఆస్పత్రి ప్రాజెక్టు కోసం భూసేకరణను వ్యతిరేకిస్తూ గిరిజన సంఘాలు తలపెట్టిన ఆందోళనల నేపథ్యంలో మాజీ సీఎం, బీజేపీ నేత చంపయ్ సోరెన్‌ను అధికారులు గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రాజెక్టు ప్రతిపాదిత రాంచీలోని నగ్రి ప్రాంతంలో బైటాయించిన ఆందోళన కారులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడంతో పాటు లాఠీచార్జి చేశారు. అక్కడికి బయలుదేరిన చంపయ్ కుమారుడు బాబూలాల్ సహా పలువురు మద్దతుదారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగేందుకు అవకాశమున్నందునే చంపయ్ సోరెన్‌ను గృహ నిర్బంధంలో ఉంచామని రాంచీ నగర డిప్యూటీ ఎస్పీ కేవీ రమణ్ తెలిపారు. గిరిజనులకు, వారి ఆందోళనలకు మద్దతు తెలుపుతున్నందుకే తనను అడ్డుకుంటున్నారని, ఇది అప్రజాస్వామికమని చంపయ్ సోరెన్ ఆరోపించారు. గిరిజన సంఘాల ఆందోళనల నేపథ్యంలో రాంచీలోని కీలక ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న రూ.1,074 కోట్ల ఆస్పత్రి ప్రాజెక్టుకు 207 ఎకరాల స్థల సేకరణకు నిరసనగా 20కి పైగా గిరిజన సంఘాలు, రైతులు, భూముల యజమానులు ఆదివారం హల్ జోతో–రోపా రోపో (భూమిని దున్నండి–విత్తనాలు నాటండి) ఉద్యమానికి పిలుపునిచ్చాయి. పోలీసులు నగ్రి ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించారు. అటుగా వెళ్లే రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వాటిని లెక్కచేయకుండా జనం భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆస్పత్రి ప్రతిపాదిత స్థలాన్ని దున్ని, విత్తనాలను నాటామని ప్రకటించుకున్నారు.

అమెరికాతో పారదర్శక వాణిజ్య బంధం

భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా వెల్లడి

న్యూయార్క్: భారత్, అమెరికా మధ్య పారదర్శకమైన, సమతూకంతో కూడిన వాణిజ్య సంబంధాలు ఏర్పడాలన్నదే తమ లక్ష్యమని అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా చెప్పారు. ఇరుదేశాలకు ప్రయోజనం చేకూర్చే వాణిజ్య బంధం కోసం కృషి చేస్తున్నామని వివరించారు. ఆయన గత 24 గంటల్లో నలుగురు అమెరికా కాంగ్రెస్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ నెల 9వ తేదీ నుంచి ఇప్పటిదాకా 23 మందిని కలుసుకున్నారు. భారత ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం విధించిన టారిఫ్‌ల వ్యవహారంపై చర్చించారు. వ్యాపారం, వాణిజ్యంతోపాటు ఆర్థిక సహకారంపై భారత్ వైఖరిని అమెరికా చట్టసభ సభ్యులకు వివరించానని క్వాత్రా ఆదివారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వారితో నిర్మాణాత్మక చర్చలు జరిగాయని వివరించారు. భారత్–అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి అమెరికా కాంగ్రెస్ సభ్యులు మద్దతు ప్రకటించారని తెలిపారు. అమెరికా నుంచి హైడ్రోకార్బన్ కొనుగోళ్లు పెరుగుతున్నాయని క్వాత్రా తెలియజేశారు.

యెమెన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

కైరో: ఇరాన్ దన్నుతో చెలరేగుతున్న హౌతీ రెబల్స్ లక్ష్యంగా ఆదివారం ఇజ్రాయెల్ యెమెన్ రాజధాని సనాపై వైమానిక దాడులకు దిగింది. హౌతీలు శుక్రవారం రాత్రి తమపై క్లస్టర్ బాంబులతో కూడిన క్షిపణి దాడి చేసింది. ఇలాంటి దాడి జరగడం ఇదే మొదటిసారి. క్లస్టర్ బాంబుల దాడిని అడ్డుకునే సామర్థ్యం ఇజ్రాయెల్‌కు లేదు. ఇందుకు సరికొత్త టెక్నాలజీ అవసరముంటుంది. క్లస్టర బాంబుల తయారీ కూడా ఇరాన్ అందించిందేనని ఇజ్రాయెల్ ఆర్మీ ఆరోపిస్తోంది. ఇందుకు ప్రతిగానే సనాపై వైమానిక దాడులకు దిగింది. రెబల్స్ సారథ్యంలోని అల్ మసీరాహ్ చానెల్ ధ్రువీకరించింది.

బిహార్‌లో 98% ఓటర్ల నుంచి ధ్రువీకరణలు

న్యూఢిల్లీ: బిహార్‌లో ఇటీవల ముగిసిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పై ఎన్నికల కమిషన్ మరో కీలక ప్రకటన చేసింది. ఎస్ఐఆర్ సమయంలో 98.2 శాతానికి పైగా ఓటర్ల నుంచి సరైన ధ్రువీకరణ పత్రాలు అందాయని తెలిపింది. ముసాయిదా ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేయించుకునేందుకు, తప్పులను సరిదిద్దేందుకు మరో 8 రోజుల గడువు ఉందని గుర్తు చేసింది. ఎన్యుమరేషన్ ఫాంలను సమర్పించే సమయంలో అందజేయలేని ధ్రువీకరణ పత్రాలను ఇప్పుడు అందివ్వవచ్చని ఓటర్లకు తెలిపింది. ఇంకా కేవలం 1.8% మంది మాత్రమే గుర్తింపు ధ్రువీకరణలను ఇవ్వాల్సి ఉందంది.

పాయిగా జాగీరు భూములకు మరో పేరు ఏమిటి?

అసఫ్‌జాహీలు

నిజాం రాజ్య పాలకులు గతంలో మొగలులు, కుతుబ్‌షాహీలు అనుసరించిన భూమిశిస్తు విధానాలనే కొనసాగించారు. స్థానిక అవసరాల దృష్ట్యా కొన్ని మార్పులు చేశారు. హైదరాబాద్ రాజ్య విస్తీర్ణం 82,698 చదరపు మైళ్లు. దీనిలో 60 శాతం దివానీ భూమి, 30 శాతం భూమి జాగీర్దార్ల ఆధీనంలో ఉండేది. మిగిలిన 10 శాతం భూమిని నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించేవారు. ఆ భూములను సర్ఫ్-ఎ-ఖాస్ అనేవారు.

దివానీ భూమి శిస్తు విధానం

- రాజ్యానికి చెందిన భూమిని 'దివానీ లేదా ఖల్సా' భూములు అనేవారు. ఇందులో 60 శాతం ప్రభుత్వ ఆధీనంలో ఉండేది.
- దివానీ భూముల నుంచి వచ్చే పన్నులను ప్రభుత్వ నిర్వహణకు ఉపయోగించేవారు.
- 1875లో దివానీ పద్ధతిలో క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానం 1317 ఫసలీ చట్టం ద్వారా సాలార్‌జంగ్-1 ప్రవేశపెట్టాడు.
- 1948లో హైదరాబాద్ రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేనాటికి సంస్థానం దివానీ భూమిలో 13,816 గ్రామాలు ఉన్నాయి.
- కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువులకు మరమ్మతులు చేసి నీటిపారుదల సౌకర్యాలు మెరుగుపరిచారు. తెలంగాణలో ఎక్కువ శాతం వ్యవసాయం చెరువులు, వర్షం ఆధారంగా సాగయ్యేది.
- సాగు భూముల నుంచి వచ్చే ఆదాయం తక్కువ ఉండటం, సరైన మార్కెట్ వ్యవస్థ లేకపోవడం వల్ల గుత్తేదార్లు, దళారీలు రైతులను వీలైనంత ఎక్కువ దోచుకొనేవారు. ఫలితంగా 15 శాతం సాగు భూమి వృథాగా ఉండేది.
- నిజాం రాజ్యంలో రైత్వారీ విధానంతోపాటు ఇతర భూమి శిస్తు పద్ధతులు కూడా ఉండేవి. రైత్వారీ విధానం ఎక్కువ ప్రాచుర్యం పొందింది. నిజాం పాలకుల కింద అధిక భూభాగం ఈ విధానం కిందే ఉండేది. రాజ్యంలో రైత్వారీ పద్ధతితోపాటు సరబాస్తా, ఇజారా, పాన్‌మక్తా వంటి ఇతర పద్ధతుల కింద కూడా భూమి ఉండేది.

రైత్వారీ విధానం

ఈ విధానంలో భూమి దున్నే రైతులకు యాజమాన్య హక్కులు ఇచ్చారు. ఈ విధానంలో మధ్యవర్తులు ఉండేవారు కాదు. దాదాపు 200 మిలియన్ల ఎకరాలకు పైగా భూమి రైత్వారీ విధానం కింద ఉండేది.

- హైదరాబాద్ రెవెన్యూ కోడ్ (1879) కింద ప్రభుత్వం భూ యజమానులకు వాస్తవ హక్కులను కల్పించింది. ఈ కోడ్ ద్వారా రాజ్యంలో రైతును అసలైన యజమానిగా గుర్తించారు.
- భద్రత, సమర్థమైన పూర్తి హక్కులకు కోడ్ ప్రకారం రైతులకు అప్పగించారు. కొన్ని నియమ నిబంధనలతో రైతు ప్రభుత్వానికి క్రమం తప్పకుండా భూమి పన్ను కట్టాలి.
- రైత్వారీ విధానంలో పట్టాదారు తన భూమిని విక్రయించడానికి లేదా తనఖా పెట్టడానికి హక్కు ఉండేది.
- చట్టపరంగా సేద్య భూమిని వ్యక్తిగతంగా లేదా వ్యవసాయ కూలీల ద్వారా సేద్యం చేసేవారు. దీన్ని పట్టాదారు విధానం అనే వారు.
- ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ రైతులు సేద్యం ద్వారా ఉమ్మడిగా లేదా వాటాదారులుగానీ ఉత్పత్తి చేసిన దాంట్లో సమాన భాగస్వామ్యం కలిసి ఉన్న విధానమే 'పాఠ్ పట్టాదారీ'.

పాన్‌మక్తా:
ప్రభుత్వ భూములను కౌలుకు తీసుకొని స్థిరమైన శిస్తు చెల్లించే కౌలుదారీ విధానమే పాన్‌మక్తా. ఇందులో పన్ను పెరుగుదల ఉండేది కాదు.

ఇజారా పద్ధతి:
వ్యవసాయ క్షేత్రాలు బ్రిటిష్ ప్రాంత పరిపాలనలోకి వెళ్లకుండా, ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో గ్రామాలను పునర్జీవనం చేయడానికి, బీడు భూములను సాగులోకి తీసుకురావడానికి ఉద్దేశించిన పద్ధతే ఇజారా పద్ధతి. పరిపాలనలో అవినీతిని నిరోధించడానికి, గుత్తేదార్లు, భూస్వాముల నుంచి వ్యవసాయదారులను రక్షించడానికి సాలార్‌జంగ్ సంస్కరణల ఫలితంగా ఈ పద్ధతిని ప్రవేశపెట్టారు.

వతన్‌దారీ పద్ధతి:
ఇది చాలా ప్రాచీన భూమిశిస్తు పద్ధతి. రాజుకు సేవ చేసినందుకు ప్రభుత్వం ఈ భూములను ఇచ్చేది. వతన్ అంటే స్థానిక లేదా సొంత ప్రాంతం అని అర్థం.

- స్థానిక రెవెన్యూ అధికారులైన పటేల్, పట్వారీ, దేశ్‌ముఖ్, దేశ్‌పాండే, సర్దేశ్‌పాండేలు, గ్రామంలోని వృత్తి పనివాళ్లకు, గ్రామ సేవకులకు నగదు రూపంలో ఇచ్చే జీతాలకు బదులుగా ఈ భూములను ఇచ్చేవారు.

సర్ఫ్-ఎ-ఖాస్:
సర్ఫ్-ఎ-ఖాస్ పదాన్ని అరబిక్ భాష నుంచి గ్రహించారు. సర్ఫ్-ఎ- ఖాస్ అంటే వ్యక్తిగత వ్యయం అని అర్థం.



నిజాం హయాంలో
భూ పరిమితి కాలం, సాంఘిక వ్యవస్థ, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్, వెట్టి

- నిజాం రాజు సొంత ఖర్చుల నిమిత్తం కేటాయించిన భూమే సర్ఫ్-ఎ-ఖాస్ (సర్ఫేఖాస్). వీటి విస్తీర్ణం 10,000 చదరపు మైళ్లు.
- 1948లో హైదరాబాద్ సంస్థానం, భారత యూనియన్‌లో విలీనం అయ్యేంత వరకు సర్ఫేఖాస్ భూముల ఆదాయం, వనరులను రాజ కుటుంబానికి కేటాయించారు.
- రెండో నిజాం కాలంలో దార్-ఉల్-సిఫ్రా అనేది సర్ఫేఖాస్ భూముల కేంద్ర పరిపాలన విభాగం.
- నిజాంకు వ్యక్తిగత సైన్యం ఉండేది. దాన్ని సర్ఫేఖాస్ సైన్యం అని పిలిచేవారు.
- సర్ఫేఖాస్ ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో కలిపేవారు కాదు. ఈ భూముల్లో వసూలైన పన్నులను జిల్లా సర్ఫేఖాస్ ఖాతా నుంచి పర్యవేక్షకుడి ఖాతాలో చేరుతుంది. వీటిని ప్రభుత్వ ఆజ్ఞ ద్వారా సర్ఫేఖాస్ అధికారి పర్యవేక్షించేవాడు. ఖాతా ధనం మొత్తం సర్ఫేఖాస్ కార్యదర్శి ద్వారా సర్ఫేఖాస్ అధికారికి చేరుతుంది.
- సర్ఫేఖాస్ భూములను సర్దార్-ఉల్-మహమ్ అనే అధికారి పర్యవేక్షించేవాడు. ఇతడు ప్రత్యక్షంగా నిజాం ఆధీనంలో పనిచేసేవాడు.
- సర్ఫేఖాస్ భూములను ముఫ్‌వాజా(అప్ప గించిన భూములు), జేర్‌నిగరాని(పర్యవే క్షించే తాలూకాలు)గా విభజించారు.

జాగీర్దారీ పద్ధతి:
నిజాం నవాబుకు, ప్రభుత్వానికి సేవచేసిన వారికి ఇచ్చిన భూములను జాగీర్లు అనేవారు. జాగీరు పొందిన వ్యక్తి ఆ ప్రాంతం మీద పూర్తి హక్కులు పొందుతాడు. అలా పూర్తి హక్కులు పొందినవారినే జాగీర్దార్లు.

- ఈ జాగీర్దారీ విధానాన్ని కాకతీయుల కాలంలోని నాయంకర విధానం, విజయనగర కాలంలో అమర నాయక విధానం, మొగలుల కాలంలో మున్సబ్‌దారీ విధానాలతో పోల్చవచ్చు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

- జాగీర్దారీ విధానాన్ని మధ్యాసియా ప్రాంతం నుంచి ఢిల్లీ సుల్తాన్లు తీసుకువచ్చి భారతదేశంలో ప్రవేశపెట్టారు.
- జాగీర్దార్ అనే పదం రెండు పర్షియన్ పదాల కలయిక. జాగీరు అంటే భూమి, దార్ అంటే అధికారి. భూమి మీద హక్కులు ఉన్న అధికారి అని జాగీర్దార్ అర్థం.
- నిజాం రాజు మొత్తం భూభాగంలో 40 శాతం జాగీర్దార్లకు ఇచ్చారు.
- జాగీర్దారు తన జాగీరులో పన్నులు వసూలు చేసుకొని శాంతి భద్రతలు కాపాడుతూ, సైన్యాన్ని నిర్వహించేవారు. రాజుకు అవసరం ఉన్నప్పుడు సైన్యాన్ని పంపేవారు.

జాగీరు రకాలు

పాయిగా జాగీర్:
పాయిగా జాగీరు భూములకు మరో పేరు జాగిరత్-ఇ-నిగదిస్తు జామతి. ఇది ఒక సైనిక జాగీరు. పాయిగా జాగీరును నవాబ్ నిజాం అలీ ఖాన్ బహదూర్ నుంచి అబ్దుల్ ఖాహిర్ ఖాన్, నవాబ్ షంషుల్ ఉమ్రా, అమీర్-ఇ-కబీర్ గుర్రాల నిర్వహణ కోసం భూములను పొందారు. తర్వాత కాలంలో ఈ భూములను పాయిగా జాగీరుగా మార్చారు.

- పాయిగా అంటే స్థిరత్వం. ఈ జాగీరు మొత్తం విస్తీర్ణం 2000 చ.మైళ్లు. ఇందులో సుమారు 1000 గ్రామాలు ఉన్నాయి.

ఆల్‌తమ్‌గా జాగీర్:
ఆల్‌తమ్‌గా తుర్కీ భాషకు చెందిన పదం. ఆల్‌తమ్‌గా అంటే రాజు చిహ్నానికి ఉన్న రెండు గుర్తులు. ఇది భూమిశిస్తు లేని జాగీరు. ఈ జాగీరును రాజు తన ముద్ర ద్వారా కేటాయిస్తారు. ఈ జాగీరు శాశ్వతమైన వంశపారపర్యంగా పొందే హక్కు. దీన్ని విక్రయించే హక్కు లేదు. ఒకవేళ ఈ భూమిని ఎవరికైనా బహుమతిగా ఇవ్వాలంటే ముందుగా రాజు అనుమతి తీసుకోవాలి.

జాట్ జాగీర్లు:
నిజాం కాలంలో అతిపెద్ద భూ విస్తీర్ణం ఉన్న జాగీరు. జీవితాంతం నిజాం కోసం సేవ చేసే వారికి ఇచ్చే భూములే జాట్ జాగీరులు.

- ఈ జాగీరు పొందినవారు తమ జీవితాంతం ఆ భూమిని అనుభవించవచ్చు.
- ఈ జాగీరుకు మరో పేరు ఖాన్ కా జాగీరు. ఈ జాగీర్దారుకు తమకు వచ్చే ఆదాయం పై న్యాయపరమైన హక్కు ఉండేది.
- వీరికి ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, భూమి కొలతల శాఖ మొదలైన వాటిపై పొందిన భూమిపై అన్నిరకాల పన్నుల నుంచి మినహాయింపులు ఉండేవి. వీరు సమాజంలో అత్యంత గౌరవప్రదమైన హోదాను కలిగి ఉండేవారు.

ఉమ్రా-ఇ-అజమ్ జాగీరు:
వీరు కూడా నిజాం రాజు సేవకులే. పాయిగా జాగీరు తర్వాత స్థాయికి చెందినవారు. ఈ జాగీర్లను ఇలాఖాలు అని కూడా పిలిచేవారు. నిజాం రాజ్యంలో మొత్తం ఇలాఖాలు తొమ్మిది. ఇందులో ప్రధానమైనవి నాలుగు.

- ఈ నాలుగు ఇలాఖాలు అత్యంత పలుకుబడి ఉన్న అధికారుల ఆధీనంలో ఉండేవి. ఇవి నవాబ్ సాలార్‌జంగ్, మహారాజా శ్రీ కిషన్ ప్రసాద్, నవాబ్ ఖాని ఖానన్, నవాబ్ ఫఖుర్-ఉల్-ముల్క్ అనే ప్రధాన మంత్రులకు చెందినవి.
- ఈ ఇలాఖాల్లో మొత్తం 769 గ్రామాలు ఉండేవి. ఈ గ్రామాలను నాలుగు సంస్థానాలుగా విభజించారు.
- ఈ నాలుగు సంస్థానాల్లో సాలార్‌జంగ్‌కు చెందిన ఇలాఖా పెద్దది. ఇందులో 1126 చదరపు మైళ్ల విస్తీర్ణంతో 359 గ్రామాలుండేవి. ఇలాఖా నుంచి ఏడాదికి 20 లక్షల సిక్కాల ఆదాయం లభించేది.
- ఈ నాలుగు ఇలాఖాలు విడివిడిగా రెవెన్యూ, చట్ట నిర్వహణ చేసేవి.

మశ్రుతి జాగీర్లు:
రాజ్యంలో ప్రజల కోసం, సైనిక వ్యవస్థ కోసం, మతం కోసం పనిచేసిన వ్యక్తులకు ఇచ్చే జాగీర్లు. ఇది షరతులతో కూడిన జాగీరు.

జాగీరు భూముల్లో రెవెన్యూ పరిపాలన

అన్ని జాగీరుల భూముల విస్తీర్ణం, ఆదాయం ఒకే విధంగా ఉండేది కాదు. ఈ జాగీరు ప్రాంతాల్లో వివిధ రకాలైన పరిపాలన ఉంటుంది. కాబట్టి కౌలుదార్ల నుంచి జాగీర్దార్లు ఎక్కువ కౌలు వసూలు చేసేవారు. నిజాం కూడా పెద్ద జాగీరుల ఆగడాలను నిలువరించలేకపోయాడు. కొన్ని సందర్భాల్లో నిజాం దివానీ హక్కులను కూడా జాగీర్దార్లు ధిక్కరించారు. తొంభై శాతం జాగీర్దార్లు నిజాం రాజు ప్రవేశపెట్టిన రెవెన్యూ విధానం కాకుండా తమ స్వతంత్ర శిస్తు విధానాన్ని అమలు చేశారు.

ఇనాం భూములు:
ఇనాం అనేది బహుమతిగా ఇచ్చిన భూమి లేదా భూమిశిస్తు. పాలకులు పొందిన సేవలు లేదా భవిష్యత్తులో పొందే సేవలకు గాను సేవకులకు ఇనాం భూములు ఇచ్చారు.

అగ్రహారాలు:
అగ్రహారాలు నిజాం కాలంలో ప్రధాన హిందూ విద్యా కేంద్రాలుగా ఉండేవి. విద్య బోధించడానికి బ్రాహ్మణులకు అగ్రహార గ్రామాలను శిస్తులేకుండా ఇచ్చేవారు. ఈ అగ్రహార భూములు వంశపారంపర్యంగా వారసులకు లభించేవి. ఈ విద్యాకేంద్రాలపై ఎటువంటి అజమాయిషీ ఉండేది కాదు.

వెట్టి:
వెట్టి అంటే బలవంతంగా లేదా తప్పనిసరిగా దేశ్‌ముఖ్‌లకు, దొరలకు తక్కువ వేతనాలకు లేదా అసలు వేతనం లేకుండా పని చేయడం.

బాగేలా(వెట్టి చాకిరి) పద్ధతి:
నిజాం కాలంలో సమాజంలో భూమి లేని నిమ్న వర్గాలకు చెందినవారు బాగేలా పద్ధతిలో పనిచేసేవారు. తీసుకున్న అప్పు తీరే వరకు కుటుంబంలో ఒక వ్యక్తి దేశ్‌ముఖ్ లేదా దేశ్‌పాండే ఇంట్లో పని చేసేవారు. తనఖా ఉన్న బాగేలా జీతం చాలా తక్కువగా ఉండేది. బాగేలా చనిపోతే ఆ అప్పు తన కుమారుడికి వారసత్వంగా వెళ్లేది.

- చిలుకూరులో జరిగిన నిజాం ఆంధ్ర మహాసభ సమావేశంలో వెట్టిచాకిరి నిర్మూలన కోసం అవగాహన వారాలను నిర్వహించింది.
- 1944 భువనగిరి, 1945 మణికొండ నిజాం ఆంధ్ర మహాసభల్లో 'వెట్టిచాకిరిని రద్దు చేయాలి' అని తీర్మానం చేశారు.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

బ్రిటిష్ పాలనా కాలంలో ప్రధాన చట్టాలు

చట్టం	గవర్నర్ జనరల్	సం॥	అంశం
చార్టర్ చట్టం	లార్డ్ మింటో	1813	దేశంలో క్రిస్టియన్ మిషనరీలు ప్రచారం చేసుకోవటానికి అనుమతి ఇచ్చారు. అలాగే దేశంలో ఈస్టిండియా కంపెనీ ఏకస్వామ్యాన్ని రద్దు చేశారు. అన్ని బ్రిటిష్ కంపెనీలు వ్యాపారం చేసుకోవటానికి అనుమతి ఇచ్చారు. విద్యారంగానికి లక్ష రూపాయలు కేటాయించారు.
సతీసహగమన నిషేధ చట్టం	లార్డ్ విలియం బెంటిక్	1829	రాజారామ్మోహన్‌రాయ్ కృషి మేరకు సతీసహగమన దురాచారాన్ని రద్దు చేశారు.

బీటీ - కాటన్‌ను మొదట ఉత్పత్తి చేసిన విత్తన సంస్థ?

బయోటెక్నాలజీ

బయోటెక్నాలజీలో సస్య ప్రజననంతోపాటు కణజాల వర్ధనం, జెనెటిక్ ఇంజినీరింగ్, క్లోనింగ్, ఏకకణ ప్రోటీన్స్ లాంటివి అనేక అంశాల్లో వివిధ రీతుల్లో ఉపయోగపడుతున్నాయి.

జెనెటిక్ ఇంజినీరింగ్: దీంట్లో భాగంగా జన్యు పదార్థమైన డీఎన్ఏను ఉపయోగించి ఆధునిక విధానాల ద్వారా మొక్కల్లో, జంతువుల్లో శ్రేష్ఠమైన లక్షణాలను నిక్షిప్తం చేయడం, నూతన వంగడాలు, జంతు క్లోన్స్, వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేయడం, కలుషిత నీటిని, పరిసరాలను శుభ్రపరచడం మొదలైన అంశాలుంటాయి.

జెనెటిక్ ఇంజినీరింగ్ విధానంలో నాలుగు దశలుంటాయి.

1. వాంఛనీయ జన్యువును వేరు చేయడం.
2. జన్యువును వాహక డీఎన్ఏలోకి ప్రవేశపెట్టడం.
3. పునఃసంయోజక డీఎన్ఏ వాహకాన్ని అతిథేయి కణంలోకి బదిలీ చేయడం.
4. వాంఛనీయ జన్యువును కలిగిన అతిథేయి కణాలను వరణం ద్వారా ఎన్నుకోవడం.

వాంఛనీయమైన జన్యువును వేరు చేయడంలో డీఎన్ఏను ఖండితాలుగా చేయడానికి ఉపయోగించే ఎంజైమ్‌లను 'రిస్ట్రిక్టెడ్ ఎంజైమ్స్' అంటారు. వీటినే 'అణు కత్తెరలు' అని కూడా అంటారు. వీటిలో ఎండో న్యూక్లియేజ్ ఎంజైమ్‌లు ఉంటాయి. ఖండితాలైన డీఎన్ఏ ముక్కలను ఎలక్ట్రో ఫోరెసిస్, సదరన్ బ్లాటింగ్ పరీక్ష ద్వారా గుర్తించి ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియను ఇ.ఎం. సదరన్ కనుగొన్నాడు.

ఈ ప్రక్రియ అనంతరం వాహకంలో క్లోనింగ్ చేస్తారు. అంటే వేరు చేసిన డీఎన్ఏ ఖండితాల నకళ్లను తయారు చేస్తారు. వాహకంగా ఇ-కోలీ అనే బ్యాక్టీరియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

క్లోనింగ్ విధానంలో కనుగొన్న కొన్ని క్లోన్స్	
డాలి	- గొర్రె పిల్ల (మొదటి క్లోన్)
ప్రామేటి	- గుర్రం పిల్ల
టెట్రా	- రీసస్ కోతి
హంంబావో	- లేగ దూడ
పంపా	- ఆవు దూడ
ప్రిన్స్	- పంది పిల్ల
మటిల్డా	- గొర్రె
డ్యూయీ	- మగజింక
విటి-20	- కుందేలు
స్నాటి	- మచ్చల జింక
జియోజియో	- ఎలుక

» క్లోనింగ్ ద్వారా మానవ అవయవాలను కూడా అభివృద్ధి చేయవచ్చు. అయితే శరీర భాగాలను తయారు చేయడం ద్వారా సాంఘిక, సామాజిక పరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.
» జంతువుల్లో జీవ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సూపర్ ఒవ్యులేషన్ విధానం ద్వారా ఆవుల్లో, గేదెల్లో కృత్రిమ గర్భధారణ చేస్తున్నారు.
» జన్యు చికిత్స (Gene Therapy) ని అనువంశిక వ్యాధులను నయం చేయడంలో ఉపయోగిస్తారు.
» నేర నిర్ధారణ, రక్త సంబంధీకుల నిర్ధారణలో పాలిమరేజ్ చైన్ రియాక్షన్ (PCR) అనే ఆధునిక పరీక్ష ఎక్కువగా తోడ్పడుతోంది.

ప్లాస్మిడ్, కాస్మిడ్, బ్యాక్టీరియో ఫేజెస్ లాంటివాటిని కూడా వాహకాలుగా వినియోగిస్తున్నారు. వాహకంలో ఏర్పడిన డీఎన్ఏను r-డీఎన్ఏ లేదా కైమరిక్ డీఎన్ఏ అంటారు. P^{BR}–322 అనేది కృత్రిమ వాహకం.

r-డీఎన్ఏను బదిలీ చేసిన కణాలను మార్కర్ జన్యువుల ద్వారా గుర్తిస్తారు. ఎంపిక విధానంలో ముఖ్యంగా కాలనీ హైబ్రిడైజేషన్ పద్ధతిని ఉపయోగిస్తారు. కొన్నిసార్లు C-డీఎన్ఏను ఉపయోగించి కూడా అతిథి కణాలను ఎంపిక చేస్తారు. C-డీఎన్ఏను ఉపయోగించి డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ద్వారా నేర నిర్ధారణ జరుపుతారు. ఇది వివిధ వ్యాధులను,ఆహార కాలుష్యకాలను గుర్తించడానికి కూడా ఉపయోగపడుతుంది. మొక్కల్లో T_i ప్లాస్మిడ్‌ను కలిగిన ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్లను జన్యువుల బదిలీలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

వ్యవసాయం - బయోటెక్నాలజీ

నార్మన్ ఇ. బోర్లాగ్ 1960 ప్రాంతంలో అధిక దిగుబడినిచ్చే రకాలను కనుగొని హరిత విప్లవానికి కారకులయ్యారు. ఈయనను 'హరిత విప్లవ పితామహుడు' అంటారు. ఇండియాలో ఎం.ఎస్. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పేర్కొంటారు. మెరుగైన వంగడాలను వాడటం, రసాయన ఎరువులు, పెస్టిసైడ్స్, సేద్యపు నీటి పరిజ్ఞానం, భూ సంస్కరణలు, శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం తదితరాలు హరిత విప్లవంలో భాగంగా ఉంటాయి.

జన్యు మార్పిడి విధానం ద్వారా జన్యు పరివర్తిత మొక్కలను (GM–Plants) రూపొందిస్తున్నారు.

ఉదా: బీటీ కాటన్, గోల్డెన్ రైస్.

బీటి-పత్తిలో చీడల నిరోధకతను అభివృద్ధి పరిచారు. దీన్ని మొదట మోనిశాంటో అనే అమెరికా విత్తన సంస్థ రూపొందించింది. ప్రస్తుతం దీన్ని ఇండియాలో మహికో విత్తన సంస్థ రూపొందిస్తోంది.

బాసిల్లస్ థురెంజియన్సిస్ అనే బ్యాక్టీరియా లెపిడాప్టిరాన్స్, కోలియోప్టిరాన్స్, డిప్టిరాన్స్ లాంటి వాటి నుంచి రక్షించడానికి తోడ్పడుతుంది.

గోల్డెన్‌రైస్‌లో విటమిన్-ఎ ఉత్పత్తి జరిగే విధంగా రూపొందించారు.

గతంలో జంతువులను చంపి వాటి క్లోమం నుంచి ఇన్సులిన్‌ను నిష్కర్షణ చేసేవారు. 1983లో అమెరికాకు చెందిన ELiLilly అనే కంపెనీ ఇ-కోలీ బ్యాక్టీరియాను ఉపయోగించి హ్యుమ్యులిన్ అనే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి మార్కెట్‌లోకి విడుదల చేసింది.

జన్యుపరివర్తిత మొక్కల ఉపయోగాలు

- బొప్పాయిలో రింగ్ స్పాట్ వైరస్ నిరోధకతను సాధించగలిగాం.
- టమాటో పంటలో సూడోమోనాస్ అనే వ్యాధికారక బ్యాక్టీరియాకు నిరోధకతను రూపొందించారు.
- ఫలాలు ఆలస్యంగా పక్వతకు వచ్చే విధానాన్ని సృష్టించి రవాణాకు అనుకూలపరిచారు.
- బంగాళాదుంపలో ఫైటాప్తోరా అనే శిలీంధ్ర నిరోధకతను అభివృద్ధి పరిచారు.
- బాస్మతి వరి రకంలో జీవ, నిర్జీవ ప్రతి బలాలను తట్టుకునే నిరోధకతను రూపొందించారు.
- మొక్కలను జీవ పరిశ్రమలు (బయోరియాక్టర్)గా ఉపయోగించి వాణిజ్య ఉత్పత్తులు, ఔషధాలు, రసాయనాలను భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. దీన్నే 'అణు సేద్యం' అంటారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

జీవభద్రత, నైతిక సమస్యలు

జెనెటిక్ ఇంజినీరింగ్ విధానంలో అనేక లాభాలున్నప్పటికీ ప్రజల్లో కొంత అభద్రతా భావం ఉంది. దీనికి ప్రధాన కారణాలు..

1) మానవులు, జంతువుల్లో విష పదార్థాలు బదిలీ చెంది ఇతర కొత్త సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది.
2) కూరగాయల సహజత్వంలో మార్పు వచ్చే ఆస్కారం ఉంది.
3) జీవ వైవిధ్యానికి హాని ఏర్పడే ప్రమాదం ఉంది.
4) అసహజ కలుపు మొక్కలు వృద్ధి చెందే పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయి.

పైన పేర్కొన్నవాటితో పాటు బయోపైరసీ జరిగే ప్రమాదం కూడా ఉంది. రూపొందించిన వారి అనుమతికి సంబంధించిన అధికారిక పత్రం, నష్ట పరిహారం లేకుండా జీవ వనరులను ఉపయోగించడాన్ని బయోపైరసీ అంటారు.

క్లోనింగ్

ఈ విధానంలో స్టెమ్ (మూల) కణాలను ఉపయోగించి కృత్రిమంగా జంతువులను రూపొందిస్తారు. స్టెమ్‌సెల్స్‌కు ఉండే సామర్థ్యాన్ని 'ప్లూరో పొటెన్సీ' అంటారు. మొట్టమొదటగా ఈ ప్రక్రియలో 'డాలి' అనే గొర్రె పిల్లను సృష్టించారు. స్కాట్లాండ్ శాస్త్రవేత్త ఇయాన్ విల్మట్ దీన్ని రోసాలిన్ అనే పరిశోధనా సంస్థలో రూపొందించారు.

క్లోనింగ్ ఉపయోగాలు: జంతువుల్లో అవసరమైన లక్షణాలను అభివృద్ధి చేయవచ్చు.

ఉదా: తల్లిపాలలో ఉండే ప్రోటీన్లను ఆవుపాలలో ప్రవేశ పెట్టవచ్చు. అంతరించిపోయే ప్రమాదమున్న జంతుజాలాన్ని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. జన్యు పదార్థంగా దేన్ని పరిగణిస్తారు?
   1) C–DNA 2) r–DNA
   3) B–DNA 4) Z–DNA
2. జెనెటిక్ ఇంజినీరింగ్ విధానం ద్వారా ఉత్పత్తి చేసే మొక్కలను ఏమంటారు?
   1) జెనెటికల్ మొక్కలు
   2) అనువంశిక మొక్కలు
   3) జన్యు పరివర్తిత మొక్కలు
   4) ఉత్పరివర్తిత మొక్కలు
3. డీఎన్ఏను ఖండితాలుగా చేసేది?
   1) ఎండో న్యూక్లియేజ్ 2) లిగేజ్
   3) ఐసోమరేజ్ 4) ఏదీకాదు
4. బీటీ - కాటన్‌ను మొదట ఉత్పత్తి చేసిన విత్తన సంస్థ?
   1) పోయినీర్ 2) మోన్‌శాంటో
   3) ప్రీమియర్ 4) పైవన్నీ
5. గోల్డెన్‌రైస్‌లో ఏ అంశాన్ని ప్రవేశ పెట్టారు?
   1) హార్మోన్ 2) బయోపెస్టిసైడ్స్
   3) విటమిన్స్ 4) పిండి పదార్థం
6. డీఎన్ఏ టెక్నాలజీలో విరివిగా ఉపయోగిస్తున్న బ్యాక్టీరియా?
   1) స్ట్రెప్టోకోకస్ 2) బాసిల్లస్
   3) ఇ-కోలీ 4) స్పైరిల్లం
7. మొదటగా రూపొందించిన క్లోన్?
   1) స్నాటి 2) డాలి
   3) ప్రామేటి 4) స్వప్ని
8. మొదటగా రూపొందించిన టెస్ట్ ట్యూబ్ బేబీ?
   1) బేబీ హర్ష
   2) లూయిస్ జాయ్ బ్రౌన్
   3) డాలి 4) ఏదీకాదు
9. పెన్సిలిన్‌ను ఏ సంవత్సరంలో కను గొన్నారు?
   1) 1920 2) 1928
   3) 1935 4) 1919
10. భారతదేశంలో సాగు చేస్తున్న పుట్టగొడుగు రకం?
    1) అగారికస్ వైరోసా
    2) అమానిటా జాతులు
    3) అగారికస్ బైస్పోరస్
    4) పైవన్నీ
11. మష్రూమ్ అంటే అర్థం ఏమిటి?
    1) పుష్పం 2) స్పాంజీ
    3) గొడుగు 4) బూడిద
12. స్పైరులినా అనేది?
    1) ఏక కణ ప్రోటీన్‌గా ఉపయోగపడే శైవలం
    2) ఏకకణ ప్రోటీన్‌గా ఉపయోగపడే శిలీంధ్రం
    3) ఏకకణ ప్రోటీన్‌గా ఉపయోగపడే బ్యాక్టీరియా
    4) ఏదీకాదు
13. క్లోనింగ్‌లో ఉపయోగించే కణాలు?
    1) టూటి పోటెంట్ కణాలు
    2) ప్రోకేరియోటిక్ కణాలు
    3) మూలకణాలు (స్టెమ్ సెల్స్)
    4) పైవన్నీ
14. జెనెటిక్ ఇంజినీరింగ్ విధానం ద్వారా ఉత్పత్తి చేసిన ఇన్సులిన్?
    1) హ్యూమ్యులిన్ 2) హైరుడిన్
    3) రెన్నెట్ 4) ఏదీకాదు
15. టానరింగ్ (తోళ్ల శుద్ధి) విధానంలో ఉపయోగపడే బ్యాక్టీరియా?
    1) క్లాస్ట్రీడియం 2) అజటో బాక్టర్
    3) రైజోబియం 4) పైవన్నీ
16. ఫింగర్ ప్రింటింగ్ విధానంలో నేరస్థులను నిర్ధారణ చేసేందుకు ఉపయోగపడేది?
    1) r–DNA 2) C–DNA
    3) B–DNA 4) Z–DNA
17. లైంగిక నిర్ధారణలో ఉపయోగపడే క్రోమోజోములు?
    1) xx 2) xy 3) yy 4) 1, 2
18. ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్స్ అనేది?
    1) వైరస్ 2) బ్యాక్టీరియా
    3) విత్తన సంస్థ 4) ఏదీకాదు
19. టెస్ట్ ట్యూబ్ బేబీ అంటే?
    1) శిశువు పరీక్ష నాళికలో వృద్ధి చెందుతుంది
    2) ఫలదీకరణ పరీక్ష నాళికలో జరిగి శిశువు గర్భాశయంలో ఎదుగుతుంది
    3) ఫలదీకరణ ఫాలోపియన్ నాళంలో జరిగి శిశువు పరీక్ష నాళికలో ఎదుగుతుంది
    4) ఫలదీకరణ, శిశువు ఎదుగుదల పరీక్ష నాళికలో జరుగుతుంది
20. గోబర్ గ్యాస్ దేని నుంచి లభిస్తుంది?
    1) ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్స్
    2) బాసిల్లస్ థురెంజియన్సిస్
    3) మిథనో కోకస్
    4) పైవన్నీ

సమాధానాలు

1) 3; 2) 3; 3) 1; 4) 2; 5) 3;
6) 3; 7) 2; 8) 2; 9) 2; 10) 3;
11) 2; 12) 1; 13) 3; 14) 1; 15) 1;
16) 2; 17) 4; 18) 2; 19) 2; 20) 3.

భూమికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర?

శీతోష్ణస్థితి-వాతావరణ పొరలు-సూర్యపుటం

వాతావరణ సంఘటనం

భూమిని ఆవరించి సుమారు 1600 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉన్న గాలిపొరను 'వాతావరణం' అంటారు. వాతావరణ పొరలకు భూగురుత్వాకర్షణ శక్తి ఉండటం వల్ల అవి భూమిని ఆవరించి ఉంటాయి. భూమి ఆకర్షణ వల్ల వాతావరణం భూ ఉపరితలం వద్ద దట్టంగా, ఎత్తుకు వెళ్లే కొద్దీ పలుచగా ఉంటుంది. వాతావరణాన్ని అట్మాస్ఫియర్ అంటారు. అట్మాస్ అంటే ఆవిరి.

వాతావరణ స్థితి: ఒకరోజు లేదా కొన్ని గంటల్లో వాతావరణ అంశాల పరిస్థితిని తెలియజేస్తుంది. ఇది ప్రాంతాలను బట్టి మారుతుంది. తాత్కాలికమైంది, అస్థిరమైంది.

శీతోష్ణస్థితి: ఏదైనా ఒక ప్రాంతానికి సంబంధించి కొన్ని ఏళ్ల సగటు ఉష్ణోగ్రత, వాయుపీడనం, పవనాలు, వర్షపాతం తదితర భౌతికాంశాల పరిస్థితులను తెలుపుతుంది. ఇది వందల ఏళ్ల వాతావరణ పరిస్థితుల సంగ్రహం.

వాయువులు

జీవకోటి మనుగడకు ముఖ్యమైన వాయువు ఆక్సిజన్. మొత్తం వాతావరణంలో నీటిఆవిరి సుమారు 0.4 శాతం ఉంటుంది. దీనిలో అధిక భాగం భూమికి దగ్గరగా ఉంటుంది.

నైట్రోజన్	78.08 శాతం
ఆక్సిజన్	20.94 శాతం
ఆర్గాన్	0.93 శాతం
కార్బన్ డై ఆక్సైడ్	0.03 శాతం
ఇతర వాయువులు	0.02 శాతం
మొత్తం	100.00 శాతం

వాతావరణం - పొరలు

వివిధ పదార్థాల ఆధారంగా వాతావరణాన్ని రెండు ప్రధాన పొరలుగా విభజించారు. అవి..

1) సమరూప ఆవరణం (Homo sphere)
2) బహురూప ఆవరణం (Hetero sphere)



సమరూప ఆవరణం:
ఈ ఆవరణం 90 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉంటుంది. దీనిలో మూడు పొరలుంటాయి. అవి.. ట్రోపో ఆవరణం, స్ట్రాటో ఆవరణం, మెసో ఆవరణం. సమరూప ఆవరణం అంతటా నైట్రోజన్, ఆక్సిజన్, ఆర్గాన్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువుల నిష్పత్తి ఒకే రకంగా ఉంటుంది.

బహురూప ఆవరణం:
90 కి.మీ. కంటే పైన ఉన్న వాతావరణ పొరను బహురూప ఆవరణం అంటారు. దీనిలో వాయువుల నిష్పత్తి వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. దీనిలో థర్మో ఆవరణం, ఎక్సో ఆవరణం అనే రెండు పొరలు ఉన్నాయి.

ట్రోపో ఆవరణం:
ఇది వాతావరణంలో అన్నిటికంటే కింద ఉన్న పొర. ధ్రువాల వద్ద 8 కిలోమీటర్ల ఎత్తు వరకు, భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు వరకు ఇది విస్తరించి ఉంటుంది. ఈ పొర సగటు ఎత్తు 13 కిలోమీటర్లు.
భూమధ్యరేఖ వద్ద బలమైన సంవహన ప్రవాహాల వల్ల వేడిమి చాలా ఎత్తు వరకు వెళుతుంది. కాబట్టి ఇక్కడ ట్రోపో ఆవరణం ఎత్తు ఎక్కువగా ఉంటుంది. వాతావరణంలోని ధూళికణాలు, తేమ అంతా ఈ పొరలోనే ఉంటాయి. శీతోష్ణస్థితులు, వర్షపాతం లాంటి వాతావరణ అంశాలన్నీ ఈ ఆవరణంలోనే సంభవిస్తాయి. ఈ పొరలో పైకి వెళ్లే కొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీన్ని 'సాధారణ క్షీణతా క్రమం' అంటారు. నీటి బిందువులు ఘనీభవించటం, భాష్పీభవనం కావటం, ద్రవీభవనం, వర్షపాతం, తుపానులు వంటివన్నీ ఈ పొరలోనే జరుగుతాయి.

స్ట్రాటో ఆవరణం:
ఈ పొర 50 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది. ఇందులో మబ్బులు ఉండవు, కాబట్టి వర్షపాతం, తుపానులు వంటివి ఉండవు. దీంతో జెట్ విమానాలు ఎగరడానికి ఈ పొర చాలా అనువుగా ఉంటుంది. స్ట్రాటో ఆవరణంలో ఓజోన్ పొర ఉంటుంది. ఎత్తుకు వెళ్లే కొద్దీ ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

మెసో ఆవరణం: ఇది 80 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది. ఉల్కలు ఈ పొరలోకి ప్రవేశించగానే కాలిపోతాయి. ఎత్తు పెరిగే కొద్దీ ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

థర్మో ఆవరణం: ఇది 400 కి.మీ. వరకు ఉంటుంది. థర్మో ఆవరణంలో ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతాయి. ఈ పొరలో అయాన్లు అనే కణాలు ఉంటాయి. వీటికి విద్యుదావేశం ఉంటుంది. ఈ అయాన్ల వల్ల భూమి నుంచి ప్రసారితమయ్యే రేడియో తరంగాలు తిరిగి భూమికి పరావర్తనం చెందుతాయి. ఈ పొరని 'ఐనో ఆవరణం' అని కూడా అంటారు.

ఎక్సో ఆవరణం
ఇది వాతావరణంలో అన్నింటికంటే చివరి పై పొర.

సౌరశక్తి - సూర్యపుటం

సూర్యుడి నుంచి నిరంతరం విడుదలయ్యే శక్తిని సౌర వికిరణం అంటారు. సూర్యుడిలో నిరంతరం ఉష్ణం జనించే ప్రక్రియే అణు సంఘటనం. సూర్యుడి వ్యాసం, భూమి వ్యాసం కంటే 109 రెట్లు ఎక్కువ ఉంటుంది. భూమి గురుత్వాకర్షణ శక్తి కంటే సూర్యుడి గురుత్వాకర్షణ శక్తి 28 రెట్లు అధికం. సూర్యుడు భూమి కంటే 1.3 మిలియన్ రెట్లు పెద్దగా ఉంటాడు. సూర్యుడు విడుదల చేస్తున్న శక్తిలో భూమి గ్రహించే శక్తి (2 వేల మిలియన్లు) 2 వేల మిలియన్లలో ఒక వంతు.

సూర్యపుటం: భూమి వైపు నిరంతరం ప్రసరించే సూర్యుడి శక్తిని సూర్యపుటం అంటారు. సగటున భూమి ఒక చ.సెం.మీ. ఉపరితల విస్తీర్ణంలో నిమిషానికి 2 కేలరీల శక్తికి సమానమైన సూర్యపుటాన్ని గ్రహిస్తుంది. దీన్నే సౌర స్థిరాంకం అంటారు. భూమి గ్రహిస్తున్న శక్తిలో పరావర్తనం అవుతున్న శక్తి శాతాన్ని ఆల్బిడో అంటారు. భూమి ఆల్బిడో 35 యూనిట్లు.

సూర్యపుటం ప్రభావితం చేసే అంశాలు

సూర్యకిరణాలు భూమి మీద పడే కోణం:
సూర్య కిరణాల వాలు తక్కువగా ఉంటే సూర్యపుటం తీవ్రత ఎక్కువగా, వాలు ఎక్కువగా ఉంటే తీవ్రత తక్కువగా ఉంటుంది.
ఉదా: సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో కంటే మిట్ట మధ్యాహ్నం వేళ సూర్యపుటం ఎక్కువ.
ఉదా: సూర్యకిరణాలు లంబంగా ప్రసరించే ఉష్ణ మండల ప్రాంతాలు, సూర్యకిరణాలు ఏటవాలుగా ప్రసరించే ధ్రువ ప్రాంతాల కంటే ఎక్కువ సూర్యపుటాన్ని గ్రహిస్తాయి.

పగటి ప్రమాణం
పగటి ప్రమాణం ఎక్కువగా ఉండే వేసవి కాలాలు పగటి ప్రమాణం తక్కువగా ఉండే శీతాకాలాల కంటే అధిక సూర్య పుటాన్ని గ్రహిస్తాయి.
భూమధ్యరేఖ నుంచి దూరంగా వెళ్లే కొద్దీ వేసవి కాలం పగటి ప్రమాణం పెరుగుతుంది. శీతాకాలంలో రాత్రి ప్రమాణం పెరుగుతుంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
జాగ్రఫీ

ముఖ్యమైన పదాలు - అర్థాలు

- **సౌర వికిరణం:** సూర్యుడి నుంచి నిరంతరం విడుదయ్యే అపరిమితమైన శక్తి.
- **అణు సంఘటన:** సూర్యుడి నుంచి నిరంతరం ఉష్ణం జనించే ప్రక్రియ.
- **సూర్యపుటం:** భూమి వైపు నిరంతరం ప్రసరించే సూర్య శక్తి.
- **సౌర స్థిరాంకం:** ఒక చ.సెం.మీ. భూమి విస్తీర్ణం 1 నిమిషానికి 2 కేలరీల శక్తికి సమానమైన ఉష్ణాన్ని గ్రహించటం.
- **భూ వికిరణం:** భూమి గ్రహించిన శక్తిని దీర్ఘ తరంగాలుగా విశ్వంలోకి విడుదల చేయడం.
- **ఆల్బిడో:** భూమి గ్రహిస్తున్న శక్తిలో పరావర్తనం అవుతున్న శక్తి శాతం.
- **ఉష్ణ సమతుల్యం:** సూర్యపుటం ద్వారా భూమి ఎంత వేడెక్కుతుందో, భూ వికిరణం ద్వారా అంతగానే చల్లబడటం.

మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలోని పై పొరను ఏమని పిలుస్తారు?
   1) ట్రోపో స్ఫియర్ 2) స్ట్రాటో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) ఎక్సో స్ఫియర్
2. వాతావరణంలో అత్యధికంగా ఉండే జడ వాయువు?
   1) నియాన్ 2) ఆర్గాన్
   3) మోనాజటాన్ 4) ఏదీకాదు
3. వాతావరణంలోని ఏ పొర నుంచి రేడియో తరంగాలు ప్రసారమవుతాయి?
   1) ఐనో ఆవరణం 2) మెసో ఆవరణం
   3) స్ట్రాటో ఆవరణం
   4) ట్రోపో ఆవరణం
4. భూమికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర?
   1) ఎక్సో స్ఫియర్ 2) ఐనో స్ఫియర్
   3) ట్రోపో స్ఫియర్ 4) స్ట్రాటో స్ఫియర్
5. రాత్రివేళల్లో భూమి నుంచి సముద్రం వైపు వీచే గాలులను ఏమంటారు?
   1) సముద్ర మంద మారుతం
   2) భూమంద మారుతం
   3) చల్లని గాలి 4) రాత్రి గాలి
6. వాతావరణంలోని అత్యల్ప ఎత్తులో ఉన్న పొరను ఏమని పిలుస్తారు?
   1) స్ట్రాటో స్ఫియర్ 2) మెసో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) ట్రోపో స్ఫియర్
7. వాతావరణ మార్పులు ఎక్కువగా ఎక్కడ జరుగుతాయి?
   1) స్ట్రాటో స్ఫియర్ 2) ట్రోపో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) మెసో స్ఫియర్
8. భూమి మీద ఆక్సిజన్ భాగం?
   1) 27.72 శాతం 2) 46.5 శాతం
   3) 41.5 శాతం 4) 8.13 శాతం
9. ఓజోన్ ఆవరణం అని దేన్ని పిలుస్తారు?
   1) ట్రోపో 2) స్ట్రాటో
   3) మెసో 4) ఎక్సో
10. స్పేస్ స్టేషన్ ఏ ఆవరణంలో ఉంది?
   1) ట్రోపో 2) స్ట్రాటో
   3) థర్మో 4) ఎక్సో
11. వాతావరణ పొరలు వేటి మూలంగా వేడెక్కుతాయి?
   1) ఉష్ణ వికిరణం 2) భూ వికిరణం
   3) ఉష్ణ వాహకం 4) ఉష్ణ సంవహనం
12. భూమి సగటు ఆల్బిడో?
   1) 35 శాతం 2) 45 శాతం
   3) 37 శాతం 4) 38 శాతం
13. సముద్రమట్టం వద్ద సాధారణ వాతావరణ పీడనం (మిల్లీ బార్లలో)?
   1) 1083.3 2) 1019.3
   3) 870 4) 1013.2
14. అధిక ఉష్ణోగ్రతలు గ్రహించే నేలలు?
   1) ఎర్ర నేలలు 2) నల్లరేగడి నేలలు
   3) ఇసుక నేలలు
   4) ఒండ్రు నేలలు

సమాధానాలు
1) 4; 2) 2; 3) 1; 4) 3; 5) 2; 6) 4; 7) 2; 8) 1; 9) 2; 10) 3; 11) 2; 12) 1; 13) 4; 14) 2

The local residents may protest against..

BANK EXAMS
REASONING

MODEL QUESTIONS

Read the questions carefully and answer the following:

Directions (Q. No. 1-5): Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.
Mark (a) if only assumption I is implicit
Mark (b) if only assumption II is implicit
Mark (c) if either I or II is implicit
Mark (d) if neither I nor II is implicit
Mark (e) if both I and II are implicit

1. Statement:-
The government has decided to provide monetary relief to the farmers in the drought-hit areas.
Assumptions:
I. The farmers of the affected areas may accept the government relief.
II. The government machinery may be able to reach the affected farmers to provide relief.

2. Statement:-
All the students of a school were instructed by the Principal to reach school at least 15 minutes before the stipulated time for the coming month.
Assumptions:
I. The parents of the students of the school may protest against the Principal's instruction.
II. The parents may request the Principal to withdraw the instruction.

3. Statement:-
Railway authority has started Internet booking facility of long-distance trains and also delivering the tickets at the doorstep through courier service at a little extra cost.
Assumptions:
I. Many customers may now book their tickets through Internet, resulting into fewer crowds at ticket booking offices.
II. Most of the customers may still buy their railway tickets at the booking counters.

4. Statement:-
"If you have obtained 75 per cent or more marks in X Std examination, your admission to our coaching class for XII Std is guaranteed."_An advertisement.
Assumptions:
I. Bright students do not generally opt for attending coaching classes.
II. The coaching class has adequate capacity to accommodate all such students.

5. Statement:-
The municipal corporation has given permission for holding fun fairs in the local football ground during the holiday season.
Assumptions:
I. The local residents may protest against the corporation's decision.
II. Many people may not participate in the fun fair.

Directions (Q. No. 6-10): In making decisions about important questions, it is desirable to be able to distinguish between "strong" arguments and "weak" arguments in so far as they relate to the question. Strong arguments are those which are both important and directly related to the question. Weak arguments are those which are of minor importance and also may not be directly related to the question or may be related to a trivial aspect of the question.

Instructions: Each question below is followed by two arguments numbered I and II. You have to decide which of the arguments is a strong argument and which is a weak argument.
Give answer 1 if only argument I is strong
Give answer 2 if only argument II is strong
Give answer 3 if either I or II is strong
Give answer 4 if neither I nor II is strong and
Give answer 5 if both the arguments I and II are strong.



6. Should graduation be made minimum educational qualification for entry-level jobs in any public sector organization?
Arguments:-
I. Yes, graduates always perform better than non-graduates by virtue of their higher level of education.
II. No, there are quite a few people who cannot afford to remain unemployed till the completion of graduation and are capable of performing equally well as the graduate candidates.

7. Should the examination bodies for all university examinations permit the use of calculators?
Arguments:-
I. No, it is necessary for the students to know the methods of manual calculations.
II. Yes, manual calculations are no more required with extensive use of computers in all fields.

8. Should the knowledge of Hindi language be made compulsory for all the employees of public sector organizations?
Arguments:-
I. Yes, it is necessary for dealing with people from the educationally backward strata of the society.
II. No, it is not necessary for every employee to have the knowledge of Hindi language.

9. Should it be made compulsory for all the private sector organizations to reserve quota for society backward classes?
Arguments:-
I. No, the private sector should not be governed by the Government rules.
II. Yes, private sector organizations should also contribute in upliftment of socially backward classes.

10. Should the women be advised not to travel alone at night in view of the increasing incidences of rape and sexual abuse?
Arguments:-
I. No, instead the Government should take measures to control such incidences.
II. Yes, it is difficult even for the police department to control such cases.

Directions (Q. No. 11 - 13): Read the questions carefully and answer the following:

11. Cause:-
All the major rivers in the state have been flowing way over the danger level for the past few weeks. Which of the following is /are possible effect (s) of the above cause?
(A) Many villages situated near the riverbanks are submerged, forcing the residents to flee.
(B) Govt has decided to provide alternate shelter to all the affected villagers residing near the river banks.
(C) The entire state has been put on high flood alert.
(1) Only (A) (2) Only (A) and (B)
(3) Only (B) and (C)
(4) All (A), (B) and (C)
(5) None of these

12. Effect:-
This year majority of the final year students of the management institute have opted for finance specialization.
Which of the following can be a probable cause of the above effect?
(1) Last year most of the students with HR specialization got better job offers than other specializations.
(2) The management institute offers only finance specialization to its final year students.
(3) Last year the students with finance specialization bagged most of the lucrative offers vis-à-vis students with other specializations.
(4) The management institute has recently started its finance specialization in addition to Marketing and HR being offered earlier.
(5) None of these

13. Effect:-
Govt allowed all the airlines to charge additional amount as peak time congestion charges for the flights landing between 6.00 a.m. and 10.00 a.m.
Which of the following is a probable cause of the above effect?
(1) All the airline companies had threatened to suspend their services during peak hours.
(2) The Govt has increased its tax for peak time flights.
(3) The aircrafts are routinely put on hold over, causing extra fuel consumption.
(4) The airline companies can now charge unlimited additional charge for peak time flights.
(5) None of these

Solutions

1. When the government has decided to provide relief to the farmers, it must be assuming that the plan can be executed, and the farmers respond positively. Hence, both I and II are implicit. **Ans: 5**
2. If Principal is instructing students, he must be assuming that the students will abide by his instruction, and the parents will also accept it. Hence, both I and II are not implicit **Ans: 4**
3. The initiative taken by the railway authority has been aimed at providing better service-customer. Hence, I is implicit. II may nor may not be an assumption. Hence II is not implicit **Ans: 1**
4. From the advertisement, it is clear that the advertiser must be assuming II. Hence, II is implicit. Assumption I is rather contradicting the statement. Hence, I is not implicit. **Ans: 2**
5. Since assumptions I and II go against the spirit of the given statement, both I and II are not implicit. **Ans: 4**
6. Note "graduates ALWAYS perform". Hence, I is not necessarily true. Hence I is not strong. II deviates from the core issue. Hence, II is not strong. **Ans: 4**
7. I is a simple declaration. Hence, it is not strong. II is strong as it explains the reason behind it. **Ans: 2**
8. I is strong because it is true to a large extent. But II is simplistic and hence weak. **Ans: 1**
9. I is not the correct way of arguing. Hence, I is not strong. Upliftment of socially backward classes is necessary. Hence, II is strong. **Ans: 2**
10. **Ans:** 4.
11. All the three are the possible effects of the given cause. **Ans: 4**
12. Only (3) seems to be the probable cause. **Ans: 3**
13. As aircrafts incur extra fuel consumption charges, government allowed all the airlines to charge additional amount. **Ans: 3**